# మాతృదేవోభవ

## పాఠకుల అనుభూతులు



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 40

# ఇందులో...


| | |
|---|---|
| గరికపాటి నరసింహా రావు | 3 |
| చంద్రమోహన్ | 6 |
| డా.ఉమా ఇయ్యుణ్ణి | 9 |
| రాయప్రోలు శాంత | 11 |
| డా.వేమూరి వెంకటేశ్వరరావు | 12 |
| నిశాపతి | 18 |
| తటవర్తి జ్ఞాన ప్రసూన | 19 |
| డా.ఎస్.వి.రామారావు | 26 |
| వేదుల సుభద్ర | 31 |
| పెండ్యాల వెంకటేశ్వర రావు | 34 |
| బి.సుజాత | 37 |
| అయినాపురపు శ్రీనివాస రావు | 39 |
| వారణాసి నాగలక్ష్మి | 42 |
| శ్రీ రాం కుమార్ భాగవతుల | 46 |
| లలిత చిట్టే | 49 |
| అచ్యుత వల్లి | 55 |
| సుధ నాగళ్ళ | 58 |
| రమా శేషాద్రి | 60 |
| ప్రమీలా చంద్రమోహన్ | 62 |
| డా.దీప్తి కనుపర్తి | 64 |
| విజయ చావలి | 66 |
| ఆనందరావు పట్నాయక్ | 69 |
| శ్రీనివాస ఫణికుమార్ డొక్కా | 71 |
| డా.స్వర్ణబాల గంటి | 75 |



# మాతృదేవోభవ

## ప్రతి నెలా ఒక పాఠకుడి / పాఠకురాలి మాతృమూర్తికి వందనాలు హరిచందనాలు



*శ్రీ గరికిపాటి నరసింహారావు*

*మహాసహస్రావధాని, ధారణ బ్రహ్మ రాక్షస శ్రీ గరికిపాటి నరసింహారావు గారి గురించి 'కౌముది' పాఠకులకి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా పర్యటించి అవధాన ప్రక్రియకి అద్భుతమైన ప్రాచుర్యాన్ని కలిగించిన అవధాని గారు ఇటీవల భక్తి టి.వి. ఛానెళ్ళలో తరచూ కావ్యపఠనం చేస్తున్నారు. డిసెంబర్ 16 నుంచీ జనవరి 30 వరకూ ప్రతిరోజూ అరగంటసేపు 'ఆముక్తమాల్యద' గురించి ప్రసంగిస్తున్నారు. తెలుగు టి.వి. చరిత్రలో ఇదొక మహత్తర ప్రయోగం. శ్రీనరసింహారావు గారి ప్రతి కార్యక్రమమూ అమ్మని గురించిన ప్రార్ధనతో మొదలౌతుంది. 86 సంవత్సరాల వయసున్న వారి మాతృమూర్తి శ్రీమతి వేంకటరమణమ్మ గారికి 84 సంవత్సరాలు నిండి 'సహస్రచంద్ర దర్శనం' పూర్తయిన సందర్భంగా ఆయన 84 పద్యాలతో ఆమె గురించి ఒక గ్రంధాన్ని వ్రాసి అంకితమిచ్చారు. ఈ మాతృదేవోభవ శీర్షికని శ్రీ గరికిపాటి గారి జ్ఞాపకాలతో ప్రారంభించడం మా అదృష్టంగా భావిస్తున్నాం.*

చిన్నతనంలో అమ్మ ప్రభావం మనమీద ఉండటం చాలా సహజమైన విషయం. ఆ ప్రభావం చిన్నతంతోనే పోదు. నా దృష్టిలో అది జీవితాంతం కొనసాగుతూ ఉంటుంది. ప్రేమ అనేది సృష్టిలో చాలా సహజమైన మాటైనప్పటికి భగవంతుడు ఈ సృష్టిని సృష్టించడంలో కూడా ప్రేమే ప్రధాన కారణమని మహర్షులు, తత్వవేత్తలు చాలామంది చెప్పినప్పటికి ఆ ప్రేమ తల్లిలో కనిపించినంతగా మరే రకమైన జీవిత బంధంలోనూ మనకు కనిపించదు. మంచి స్నేహితులు మనకుండొచ్చు, ఎంత మంచి స్నేహితులైనా కొన్ని ఉపకారాలు, ప్రత్యుపకారాలు విషయాల్లో తేడా వస్తే విడిపోవడం మనం చూస్తున్నాం. ఇక భార్యా భర్తల విషయానికొస్తే అసలా బంధం జీవితం మధ్యలో మనకేర్పడింది. మధ్యలో ఏర్పడిన బంధం ఎంతకాలముటుంది అంటే మనం పోషించుకుని నిలబెట్టుకుంటూ ఉండాలి.

దాన్ని ఆకర్షణీయంగా వృద్ధి చేసుకుంటూ వుండాలి. చేసుకోకపోతే ఊరికే కలిసి ఉన్నంత మాత్రాన అదేమీ కాపురం కాదు. ఊరికే రెండు కిటికీలు, రెండు గోడలు ఓ ప్రక్కనుండటం ఎటువంటిదో అదీ అంతే. కలిసి మనసులు ఒక ఇంట్లో ఉండటం సమస్యకాదు, ఒకే వంట్లో ఉంటున్నట్లుగా ఆత్మీయంగా ఉన్నారా, ఒకరి కష్టసుఖాలు ఒకరు పంచుకుంటున్నారా అనేది చాలా ముఖ్యం. అలాగే భార్యాభర్తల బంధం ఇలా ఉంటే స్నేహితుల బంధం అలా ఉంటే, ఇహ ఉపాధ్యాయులు, విద్యార్థుల బంధాలు కూడా ఏదో ఒకటి వీరు ఆశిస్తారు, వారు ఆశిస్తారు. నా దృష్టిలో ఏమీ ఆశించనటువంటి బంధం కేవలం తల్లి మాత్రమే.



నాకు రెండు మూడు సంఘటనల విషయంలో చిన్నతనం నుంచీ తల్లి ప్రేమ యొక్క గొప్పదనం అర్థమయింది. బహుశా నేను అవధానాలు మొదలు పెట్టినప్పటి నుంచీ తల్లి గురించినటువంటి పద్యం చెప్పి సభ ప్రారంభించడం, ఏ ఉపన్యాసమిచ్చినా, ఏకార్యక్రమంలో ఉన్నా అమ్మ, అమ్మ అని ఆరాటపడటానికి బహుశా ఆ సంఘటనల ప్రభావం నా మీద చాలా ఉండి ఉండొచ్చు. నాకెందుకో, స్త్రీల ప్రేమ, పురుషుల ప్రేమ అందులో ప్రత్యేకించి, తండ్రి ప్రేమ, తల్లి ప్రేమ మధ్యలో చాలా తేడా ఉంటుందనిపిస్తుంది. ప్రేమ, బాధ్యత రెండే సంసారాన్ని నడిపిస్తాయి. తండ్రి బాధ్యతకు సంకేతమైతే, తల్లి ప్రేమకు సంకేతం.

ఒక ఉదాహరణ చెపుతాను. నేను ఆరేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు నేనేదో తప్పుచేస్తే మా నాన్నగారు నన్ను గదిలో బంధించారు. పైగా దిగంబరంగా బంధించారు, అదేదో సిగ్గుపడాలి అన్న ఉద్దేశ్యంలో. నేనొక్కడ్నీ, ఆరేళ్ళ వయస్సు ఆయన గదది, ఆయనుండే గది. ఆయన ప్రయివేటు గది. అందులోకి ఎవరూ వెళ్ళరు. దాన్ని పెద్ద గది అంటారు. మా ఇంట్లో ఉండే పెద్ద గదుల్లో పెద్దదేం కాదుగానీ బహుశా, పెద్దాయనుండే గదికాబట్టి పెద్దగది అనేవారేమో. ఆ పెద్ద గదిలో బంధించి బయట తాళం కూడా వేశారు. మా అమ్మ మొత్తుకుంటూనే ఉంది. "వాణ్ణి చిన్న కుర్రాణ్ణి అలా చేస్తున్నారని". మా ఇంట్లో తొమ్మిది మంది సంతానం. నేను తొమ్మిదో వాడిని. కడసారి వాడిని కాబట్టి అందరి ప్రేమా నా మీదుండేది. అమ్మ ప్రేమ మరీ ఎక్కువగా ఉండేది. ఆవిడ మొత్తుకుంటున్నా ఆయన తలుపు తియ్యలేదు. ఒక అరగంటైంది. నేను ఏడుస్తూ కూర్చున్నాను. నాకేమీ తోచటం లేదు ఒంటరితనమొకటి. విచిత్రంగా ఆ గదికి ఒకే ఒక కిటికీ ఉంది ఉత్తరం వైపున. ఆ కిటికీలోంచి మా పెద్దన్నయ్య చూశాడు నన్ను. మా పెద్దన్నయ్యకి నాకు వయోబేధం చాలా ఉంటుంది. ఆయన మొట్టమొదటి వాడు అంటే మా మొత్తం తొమ్మిది మందిలో రెండోవాడు. మా పెద్దక్కయ్య ఉండేది. నేను చిన్నవాణ్ణి. అతను చూసి, నేనేడుస్తుంటే 'ఏడవకు ఏడవకు.. ' అని చెప్పి మా నాన్నగారి పెట్టికేసి చూపించాడు. ఆయనకొక పెద్దరేకు పెట్టి ఉండేది.

దాంట్లో ఆయన సామాను లేవో ఉండేవి. చిత్రంగా ఆ పెట్టె తలుపు తీసుంది. ఏవుందో చూడమని చెప్పాడు. చూస్తే అందులో పెద్ద జిలేబీల పొట్లం కనిపించింది.మా నాన్నగారికి ఆయన (వైదిక బ్రాహ్మలు ఎక్కడో పల్లెటూళ్ళో ఉండే ఆయనకి చిరుతిళ్ళ మీద కాస్త కాంక్ష ఉండేది.) ఇంట్లో అన్ని సందర్భాల్లో చిరుతిళ్ళు చెయ్యడానికి వీలుండకపోవచ్చు కాబట్టి అవీ ఇవీ బయటి నుండీ తెప్పించుకుని తినేవారు. ఎప్పుడైనా మాకు పెట్టేవారేమో కానీ నిజానికి మొహమాటం లేకుండా చెప్పాలంటే ఆయన తినేవారంతే. అదో సరదా ఆయనకి. మాకు తింటే అరగవని ఆయనకో భావన. ఇక ఏడుపు మానేసి ఆ జిలేబీలు తినేయమని అన్నయ్య చెప్పాడు. ఏడుపు మానేసాను. పైగా జిలేబీలు దొరికాయి, పైగా నాన్నగారు దాచుకున్న జిలేబీలు, ఆయన మీద కోపం ఉంటుంది బంధించారని, దిగంబరంగా బంధించారని దాంతో కూర్చుని ఆశ్చర్యకరంగా సుమారు ఒక కేజీ ఉంటాయి ఇంచుమించుగా కేజీ తినేశాను మహా పట్టుదలగా, పద్ధతిగా తినేశాను. నేను ఏడుపాపేసరికి మా నాన్నగారికి అనుమానం వచ్చింది వీడేం చేస్తున్నాడు? ఏడుస్తుండాలి కదా! ఏడవడం కోసమే కదా బంధించింది అని ఆయనకి అనుమానమొచ్చి తలుపు తీస్తే నేను కేజీ జిలేబీలు తినేసి నాన్నగారికి తెలియకుండా కాగితం ఎక్కడ పారేయాలీ అనే ఆలోచనలో ఉన్నాను. ఆశ్చర్యంగా తలుపు తీసి నన్ను చూడగానే నాన్నగారికి నవ్వూ, కోపం కలిపి వచ్చాయి. వెధవ అని తిడుతూనే 'జిలేబీలన్నీ తినేశావా! ఇంకెప్పుడూ నిన్ను గదిలో పెట్టకూడదు నువ్వు నాకు నష్టం చేసావు, నాకు మొగుడిలా ఉన్నావు' అన్నారు. కొట్టలేదు గానీ ఒక ప్రక్క నవ్వుకుంటున్నారు, విచిత్రంగా, నా తెలివి తేటలకి.

అప్పుడు నేను గమనించాను జిలేబీలు తినేసానని ఆయన బాధపడుతున్నారు, ఆయన గదిలో ప్రవేశించడం, పెట్టె తియ్యడం, సాహసం చేశానని బాధపడుతున్నారు గానీ , మా అమ్మ వెంటనే వాణ్ణి 'అలా అంటారేమిటి వెఱ్ఱి వెధవ జిలేబీలు తినేశాడు, ఏమవుతుందో ఏమిటో ముందు డాక్టరుని పిలవండి అన్నారు.. అదొక్కసారి మనస్సు మీద ఆ మాట అనిపించిందంటే "బాగా వేసవి కాల వేడికి తపించిపోతున్న నేలమీద ఒక్కసారి చినుకులు పడకపోయినా గాని మబ్బులు బాగా మూగితే వెంటనే ముసురుకుంటే ఆ నేలకి ఎలా అనిపిస్తుందో కాసేపట్లో నా మీద వర్షం కురుస్తుందని" ఆ భావనకు లోనయ్యాను. నాకిప్పటికీ బాగా గుర్తు ఆ సంఘటన. తల్లి ప్రేమకీ, తండ్రి ప్రేమకీ ఇంత తేడా ఉంటుందా అని. నేను జిలేబీలు తిన్నాననీ, ఆయన సొమ్ము తిన్నాననీ, పైగా ఆయన పెట్టె తీసి సాహసం చేశానని తండ్రిగా బాధ్యతగా, అధికారిగా బాధపడుతున్నారు, కోప్పడుతున్నారు. ఆవిడలా కాదు బిడ్డ తినేశాడు, వాడికేమయిపోతుందో అని బెంగ. అది నిజమైనటువంటి ప్రేమంటే. తనబిడ్డకేమవుతుందో అనే ఆలోచన చేయాలి.

1971 లో నేను పదవతరగతి పాసయ్యాను 384 మార్కులు వచ్చాయి. అప్పట్లో అవి ఎక్కువ మార్కులు. మా నాన్నగారు నన్ను ఇంటర్‌లో బై.పి.సి గ్రూపులో చేర్పించే ప్రయత్నం చేశారు. మెడిసన్ చదవాలని ఆశ. తండ్రి కొడుకు బాగా సంపాదించుకోవలనుకుంటాడు కదా. కానీ నాకు అదిష్టముండేది కాదు. నాకు మొదటనుండీ చదువులో లెక్కలన్నా, ఇంగ్లీషన్నా భయం. సైన్సన్నా కూడా ఇష్టముండేది కాదు. శాస్త్రాలు బుర్రకెక్కేవి కావు. ఇంగ్లీషు అసలు వచ్చేది కాదు. తెలుగు, సంస్కృతం అంతో ఇంతో హిందీ. తేలికో సబ్జెక్ట్ అనో ఏమిటో గానీ ఇవన్నీ మనసుకు బాగా ఎక్కేవి అందులో సాహిత్యం అంటే ఇష్టం. ఈ పరిస్థితుల్లో నేను బై.పి.సి.లో చేరాల్సివచ్చింది., నేనైతే హెచ్.టి.సి.లో చేరతానన్నాను, (హిస్టరీ, తెలుగు, సివిక్స్ ) అందులో ఎవ్వరూ చేరరు. అది చాలా పనికి మాలిన గ్రూపు అని అందరూ అనుకునే వారు. ఆ రోజుల్లో ఎందులోను సీటు రానివాళ్ళు అందులో చేరేవారు. అందుకనే నాన్నగారు బలవంతంగా కోప్పడి బై.పి.సిలో చేర్పించారు. బై.పి.సిలో మొట్టమొదటి రోజునే ప్రాక్టికల్స్ చేయించేవారు. ఆ ప్రాక్టికల్స్ లో వానపాముని అక్కడ పెట్టి కొయ్యమన్నారు. అసలే సంప్రదాయ బ్రాహ్మల కుటుంబం అసలు హింసనేది తెలియదు. ఈ వ్యవహారం అలవాటు లేదు. కొయ్యడమంటే భయమొకటి.. పైగా పామొకటి. ఇవన్నీ కలగలిసి ఆ లేబరేటరీ లోంచి నేను పరిగెత్తుకొచ్చేసి ఎనిమిది మైళ్ళు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం నుంచీ బోడపాడు అగ్రహారం వరకు వేగంగా సైకిలు తొక్కుకుంటూ వెళ్ళి పోయి, సైకిలు మూల పారేసి నన్ను హెచ్.టి.సిలో చేర్పితే చేరతాను లేకపోతే వ్యవసాయం చేసుకుంటాను అని మొండికేశాను. అప్పుడు నాన్నగారు

'లేదు నువ్వు బై.పి.సి చెయ్యాలి. హెచ్.టి.సి చేసి ఏం చేస్తావు' అంటే నేను 'తెలుగు మాస్టారునవుతాను' అన్నాను. 'వెధవా! ప్రకృతి, వికృతులు చెప్పుకుని బ్రతుకుతావా! (ఆయనకి సంస్కృతం అంటే గౌరవం ఉండేది కానీ తెలుగంటే లోకువుగా ఉండేది) అందరికీ వచ్చేసిన సబ్జెక్టు నువ్వేమిటి చెపుతావు' అన్నట్టుండేది ఆయన అభిప్రాయం. అప్పుడు మా అమ్మ 'వాడికిష్టమైనది వాడిని చదువుకోనీయండి ఎందుకు వాడిని బాధపెడతారు' అంది. ఆవిడ కూడా నేను డాక్టరవకూడదని కాదు, తెలుగు మాస్టరు అయి తీరాలనీ కాదు. తల్లి ప్రేమెటువంటిదంటే 'వాడిష్టానికి ప్రాధాన్యత ఇవ్వండి. వాడు సుఖంగా ఉంటే చాలు' ఇది చాలాపవిత్రమైన విషయం. భార్య అయినా, భర్త అయినా, తల్లి అయినా, తండ్రి అయినా పిల్లలైనా ఆలోచించాల్సింది నిజంగా మనం ఒక మనిషిని ప్రేమిస్తున్నామంటే సంపూర్ణంగా వాళ్ళ క్షేమాన్ని కోరాలి. తండ్రి కూడా కోరుతున్నాడు. నేను సంపాదించాలనే కోరుకుంటాడు. కానీ ఆ సంపాదన కంటే కూడా నేను ఆరోగ్యంగా ఉండటం, నేను ఆనందంగా ఉండటం ముఖ్యమని తల్లి భావించింది. ఆ తల్లి ప్రేమలో ఇంత తేడా ఉంటుంది. నువ్వు సంపాదించినా, సంపాదించకపోయినా, పెళ్ళయినా, కాకపోయినా విడిచిపెట్టేసినా తల్లికేమనిపిస్తుందంటే మా వాడు క్షేమంగా ఉంటే చాలు, సుఖంగా ఉంటే చాలు, ఆరోగ్యం ఉంటే చాలనిపిస్తుంది. అది ప్రేమ. రెండోసారి బై.పి.సి వద్దని హెచ్.టి.సి కావాలని నేను మూడు రోజులు నిరాహారదీక్ష చేస్తే మానాన్నగారు కోప్పడ్డమే సరిపోయింది. ఇంట్లో ఎవరూ భోజనాలు మానలేదు కానీ ఇంచుమించు మూడు రోజులు అందరికీ వండిపెడుతూనే నాతో పాటు మా అమ్మకూడా అన్నం తినడం మానేసింది. ఆ రెండు సంఘటనలు నా మనస్సు మీద ఇప్పటికీ చెరగని ముద్ర వేసాయి. ప్రతి సభలోనూ అమ్మ గురించి చెబుతూ అమ్మని గుర్తు చేసుకుంటూ ఉంటాను కానీ ఈ సంఘటనలని మీతో పంచుకోవడం ఇదే మొదటిసారి.

# చంద్రమోహన్ (ప్రఖ్యాత సినీ నటుడు)





**అందరికీ అమ్మంటే ప్రేముంటుంది.** కానీ నాకు మా అమ్మతో ఉండే అనుబంధం వేరనిపిస్తుంది. అది నా ఒక్కడికే స్పెషల్ అనిపిస్తుంది. మా అమ్మకి పుట్టుచెముడు. ఆమెకి తల్లి లేదు. పిల్లలు లేని బాబాయి, పిన్ని చాలా ముద్దుగా పెంచారావిడని. అమ్మకి ఎన్ని రకాల నగలుండేవో.! చాలా అందగత్తె మా అమ్మ. బాల్యంలోనే వివాహం అయిన మా అమ్మకి పదహారు కాన్పులు. 30 ఏళ్ళకే అమ్మమ్మ అయిన మా అమ్మ ఆనాటి పల్లెటూరి ఆచారాలకు, అలవాట్లకు ఎంత బలయిపోయిందో అనిపిస్తుంది. నాలుగో క్లాసు కూడా చదవని మా అమ్మ రావటం మటుకు పండిత వంశం నుండే వచ్చింది. అందుకే దాదాపు 20 మందికి ప్రతిరోజూ చద్దన్నాల బంతుల దగ్గర్నుంచీ రాత్రి భోజనాల దాకా కట్టెల మీద, కమ్మల మీద వంటలు చేస్తూ, పూజలు

చేసుకుంటూ, సాయంత్రం గుడ్డి దీపపు వెలుతురులో ఏ మాత్రం సమయం చిక్కినా భారత భాగవతాలు, రామాయణం చదువుతుండేది. వినికిడి శక్తిలేని మా అమ్మ లయగా పద్యాలు, రాగాలుతో చదవటం చాలా ఆశ్చర్యం. అర్థాలు చెప్పటం మరింత గొప్ప. పెదవి కదపడం బట్టి, బాడీలాంగ్వేజ్ బట్టి కనిపెట్టేసేది.

అప్పుడప్పుడు అపార్థం చేసుకున్నా చాలా వరకు అర్థం చేసుకునేది. నేను ఆరుగురు ఆడపిల్లల తరువాత పుట్టిన మగబిడ్డని. అందుకని అక్కయ్యలు, అమ్మ నాకు దిష్టి తగులుతుందేమోనని నన్ను ఆడవేషంలోనే పెంచారు. అంతమంది మధ్య నన్ను ప్రత్యేకంగా చూస్తే దిష్టి తగులుతుందేమోనని మా అమ్మ నన్ను పట్టించుకోనట్లే కనపడేది. కానీ ఆవిడ నా వంక చూసే చూపు ఇప్పుడు తలచుకుంటే నిలువెత్తు ఆశీర్వచనంలా అనిపిస్తుంది.



నేను భయంకరమైన అల్లరి చేసేవాడిని. భరించలేని నాన్న కొడుతుంటే అమ్మ అడ్డం వచ్చి గుండెలకదుముకుని తను దెబ్బలు తినేది. అంత మాత్రం చేత నేను తప్పులు చేస్తే సహించేదికాదు. ఆవిడ వడ్డింపులు వడ్డింపులే. మాది పల్లెటూరు.. వైద్య సదుపాయముండేదికాదు. నా ఆరోగ్యం దెబ్బతింటే ఆమె గుండెల్లో మంటలు రేగిపోయేవి. ఎవరూ పట్టించుకోలేదని ఒక రోజు కుళ్ళుమోతుతనంతో మూడేళ్ళ బిడ్డని భుజం మీద వేసుకుని, ఆరుమైళ్ళ దూరంలో ఉన్న కపిలేశ్వరపురం మోసుకెళ్ళి, అక్కడ డాక్టరు గంగరాజుగారి కాళ్ళ మీద పడేసి, మెళ్ళో గొలుసు తీసి ఆయన చేతిలో పెట్టి, భోరుమందట మా అమ్మ. గంగరాజుగారు, ఆయన భార్య కరిగిపోయి ఆవిడని ఇంటి ఆడపడచులాగా ఆదరించి నా ఆరోగ్యం బాగు చేసి ఆవిడకిచ్చారు. ఈ లోపల మా నాన్న పాపం రానే వచ్చారు. ప్రతిరోజూ మా అమ్మ ''నా బిడ్డని బ్రతికించారు'' అని డాక్టరుగారిని, ఆయన కుటుంబాన్ని దీవించేది. ఆమెకి ఆభిజాత్యం ఎక్కువ. శుచి, శుభ్రత, మంచి వంట, చక్కటి అలంకరణ, హాయిగా నవ్వడం, పొగడినా, ఎగతాళిచేసినా, ఎవరినైనా సరే మనస్ఫూర్తిగానే ఉండేది. కుట్లు, అల్లికలు బ్రహ్మాండంగా చేసేది. కలర్ కాంబినేషన్స్ అన్నీ ఆవిడ ప్రత్యేకత. ఇవ్వాల్టికీ నా పూజగదిలో బి.ఎన్.రెడ్డి గారి ఫోటో ఉన్నట్లు, నా అవార్డుల మధ్య మా అమ్మ అల్లిన పర్సులు, ఆమె గంట, శంఖం.. పెట్టుకుని చూసుకుంటూ ఉంటాను నేను. ఆమెకి కావలసిన గుర్తింపు ఆమె జీవితంలో దొరకలేదు. చూడని కాంప్లెక్సు, పట్నం వాసం వాళ్ళంటే కోపం, తనని తక్కువ చేసి మాట్లాడుతున్నారనే అనుమానంతో అమ్మలో ఒక వీసమంత శాపాలు పెట్టేంత పిచ్చి కోపం ఉండేది. ఆమె ఆదరణ ఎంత గొప్పదో ఆమె కోపం అంత గట్టిది. కానీ వెంటనే ఆమె మరిచిపోయేది. కానీ చాలా మంది మనసులో పెట్టుకుని ఆ అనుభవంతో ఆమె గద్దరదనుకునేవారు. ఆమె అన్న మాటలు మరచిపోయేవారు కాదు. అమ్మ చాలా కాలం అంటే దాదాపు పదేళ్ళు శ్రీశైలంలో ఉండేది. ఆమె చేసిన అన్నదానం, వంట.. చాలామంది చెప్పుకుంటుంటారు. మా అమ్మ చేసిన వంట తిన్న తరువాత ఎవరు వంట చేసినా నాకు గొప్పగా అనిపించదు.

అమ్మని మొదటిసారి ఫ్లైట్‌లో తీసుకెళ్ళడం అదో వింత అనుభవం. ఎయిర్‌హోస్టస్ అందరినీ ''ఈ పిల్లలు అందంగా ఉన్నారు.. పాపం వీళ్ళకి పెళ్ళిళ్ళు ఎందుకు కాలేదురా'' అని దిగులు పడిపోయేది. ''ఇంతమందికి గాడి పొయ్యి లేకుండా భోజనాలెలా

వండిపెడతారురా" అని ఆశ్చర్యపోయింది. హాయిగా అమ్మ నవ్వే నవ్వు నాకు నిరంతరం చెవుల్లో రింగు రింగు మంటూనే ఉంటుంది. అమ్మ మిగతా కుటుంబ సభ్యులతో కలిసి జీవించడం అంత సులభమేమీ కాదు. అమ్మ డామినేషనువల్ల చాలామంది బాధ పడ్డా అమ్మని దూరం చేసుకోవాలనిపించేది కాదు. నాకు ఛాయిస్ ఉంటే మా అమ్మని అందరికీ దూరంగా తీసుకు వెళ్ళిపోయి ఆవిడకి సేవ చేస్తూ బతికుండేవాడినేమో!



సహజంగా నా భార్య జలంధర ఇలా మా అమ్మ తాలూకు పొసిసివ్‌నెస్‌కి చాలా నలిగిపోయేది. కానీ ఆవిడ ఒక కౌన్సిలరు, రైటరూ అవ్వడం వల్ల ఒక ఆడదానిలా కాకుండా అమ్మని అమ్మలా అర్థం చేసుకుంది. అందుకే నా జీవితంలో పెద్దగా రావల్సిన సమస్యలు మామూలుగా సమసిపోయాయి. జలంధరకు అమ్మ చిన్నప్పుడే పోవడం, తనకు కూడా తల్లి లేకపోవడం ఈ రెండింటివల్లా అమ్మకి కోపం వచ్చినప్పుడు, ఆవిడ యాగీ చేసినా.. నా భార్యకు జ్వరమొచ్చినప్పుడు, కాన్పులు జరిగినా కళ్ళల్లో పెట్టుకుని చూసేది, సేవ చేసేది, పత్యం వండిపెట్టి, పచ్చి పులుసు పెట్టి, బాలింతకి నలుగు పెట్టి "నా కోడలు రంగు చెదరకూడదు" అనే అమ్మ మాటలు.. ఆవిడ మాతృత్వపు వ్యక్తిత్వాన్ని చూసి మేమంతా కదిలిపోయేవాళ్ళం. అమ్మకి అంతమంది పిల్లల్లో నేను, నా ఆఖరి చెల్లెలు వరలక్ష్మి అంటే విపరీతమైన మమకారం ఉండేది. ఎప్పుడూ మా ఇద్దరి దగ్గరే ఉండేది. ఆఖరి నాలుగేళ్ళు అమ్మ మంచాన పడింది. కాన్సర్ వ్యాధిని కూడా తట్టుకుని పోరాడింది. కేవలం నా మీద ప్రేమతో ఆవిడ బతికింది. ఆఖరి రోజుల్లో నా దగ్గరే ఉంది. ఆ కళ్ళు నాకోసం ఎప్పుడూ ఎదురు చూసేవి. నేను ఊళ్ళో ఉంటే నా దగ్గరే కుర్చీలో కూర్చుని కబుర్లు చెపుతూ ఇద్దరం కలిసి భోజనం చేస్తూ, టీవీ చూస్తూ గడిపేవాళ్ళం. ఆఖరి రోజుల్లో మాటరాకపోతే నా చెయ్యి పట్టుకుని చూస్తూ కూర్చునేది. నా భార్య అన్నం కలిపి మా ఇద్దరికీ ముద్దలు పెట్టేది.

జలంధర తండ్రిగారు గాలి బాల సుందరరావు గారు నా ఒళ్ళో పోయారు. నా తల్లి జలంధర ఒళ్ళో పోయింది. ఆఖరి క్షణాల్లో నేను లేకపోయానన్న కొరత నేను జీవితంలో మరచిపోలేను. అమ్మకి పమిడిముక్కల్లో విడిగా ఇల్లు, పదెకరాల పొలం ఏర్పాటు చేయాలని చాలా తాపత్రయ పడ్డాను నేను. కొన్ని కారణాల వల్ల అది జరగలేదు. కానీ నాన్న తయారు చేసిన తోటలో నాన్న సమాధి ప్రక్కన అమ్మ సమాధి ప్రతిష్ఠించుకున్నాం నేనూ, నా తమ్ముడు దుర్గాప్రసాదు. నా జ్ఞాపకాల్లో అమ్మ నిరంతరం సజీవంగానే ఉంటుంది.

"కాశీ తాతా.. నేనే మీ అమ్మని" అని నా మనవరాలు అన్నప్పుడల్లా ఉలిక్కిపడతాను. నన్ను వదులుకోలేని అమ్మ అందుకే ఇలా పుట్టిందని తృప్తిపడతాను. తాతయ్య కళ్ళు ఎందుకు చెమరుస్తాయో అర్థం కాని నా మనుమరాలు చిన్మయి "ఎందుకు తాతయ్యా నేనున్నాను నీకు "అని బుల్లి చేతులతో కన్నీరు తుడుస్తుంటే అమ్మ ఎప్పుడూ నా దగ్గరే ఉంది అనిపిస్తుంది.

# డాక్టర్ ఉమా ఎయున్ని



**"జాగ్రత్తమ్మా, కాగిన నూనెలో ఏదైనా వేసినపుడు దూరంగా ఉండు, మీద చిందుతాయి కాలుతుంది"....** కూర పోపులో వేస్తుంటే అమ్మ మాటలు మనసులో మెదిలి చిన్న నవ్వుతో బాటు కళ్ళల్లో నీళ్ళు కూడా వచ్చాయి. ఇపుడెవరు కనుక్కుంటారు అలాగ? ఇవి అప్పుడే వంట నేర్చుకుంటున్న రోజుల్లో చెప్పిన మాటలు కావు, పెళ్ళై, నాలుగు సంవత్సరాల తరువాత, అమెరికాలో మమ్మల్ని చూడడానికి వచ్చినప్పుడు అన్న మాటలు. "ఏమిటమ్మా, నేనింకా చిన్నపిల్లనా? ఆ మాత్రం తెలియదా" అన్న నా మాటలు, ఇవ్వాళ, "see mom, I am not a child" అంటున్న నా కూతురి మాటలు కావు!

"అమ్మ"... ఈ లోకం వదిలి హాయిగా ఎక్కడికో వెళ్ళిపోయి ఎన్నో నెలలు, సంవత్సరాలు గడిచినా, మనసు కష్టపడినపుడల్లా, పక్కనే ఉండి వోదారుస్తున్నట్లు ఉంటుంది ఎందుకని? తన చదువు హైస్కూలుతో ఆగిపోయినా, ప్రతి ఆడపిల్లా తన కాళ్ళ మీద తను నిలబడగలిగే స్తోమత తెచ్చుకోవాలని, మా అయిదుగురు అక్కచెల్లెళ్ళనీ చదువు వచ్చినంత కాలము చదివించింది. మధ్యతరగతి కుటుంబాల్లో పుట్టిన సగటు ఆడపిల్లలకి లేని స్వతంత్రం, మనోధైర్యం, అయిదుగురి కూతుళ్ళకి నేర్పిన మా అమ్మ మాకు చాలా అపురూపం. తత్ఫలితంగా, ఇంటిలో ఇద్దరు గ్రాడ్యుయేట్స్, ఇద్దరు పోస్ట్‌గ్రాడ్యుయేట్స్, ఒక డాక్టర్. అందరు అమ్మాయిలు సమాజంలో ఎంతో ఆత్మవిశ్వాసంతో మెలుగుతున్నారు. ఆడపిల్లలకి చదువు ఎందుకు అనుకునే ఆప్పటి సమాజంలో, చెట్టంత కూతుళ్ళు ఎలా పెళ్ళిళ్ళు చేస్తారు అని కుతూహల పడే అమ్మలక్కల మధ్య పెంచగలిగిన వ్యక్తికి ఎంత మనోధైర్యము ఉండాలో ఊహించండి! ఈ తరంలో ఉన్న ఆర్థిక సమానత్వం కానీ, స్వతంత్రము కానీ లేని రోజుల్లో, నాన్నగారి దగ్గరనుంచీ ఒక్క మాట పడకూడదన్న స్వాభిమానంతో మమ్మల్ని పెంచింది మా అమ్మ.

నాకు బాగా జ్ఞాపకం. మెడికల్ కాలేజీలో చదువు వత్తిడి చాలా ఉండేది. ప్రొద్దున్నే కాలేజ్‌కి వెళ్ళిపోయి, అలిసి సాయంత్రం ఎప్పుడో ఇల్లుచేరుకుంటే, వెంటనే, వేడిగా అన్నం పెట్టేసి నిద్రపొమ్మనేది అమ్మ. ఒక రెండు గంటలు పడుకుని లేచాక, అప్పుడు చదువుకుని, మళ్ళీ తెల్లవారి ఏ రెండు గంటలకో పడుకునే దాన్ని. 5 గంటల కల్లా హార్లిక్స్ కలిపి నిద్ర లేపేది, అప్పుడు రిఫ్రిజిరేటర్స్ ఎక్కడ? అందుకని హార్లిక్స్ అయితే సులభమని, రోజూ పొద్దున్నే హార్లిక్స్ కలిపి ఇచ్చేది. ఆవిడ ఎప్పుడు నిద్రపోయేదో, ఎప్పుడు ఇంటి పనులు చేసేదో, అంత ఓర్పు ఎలా ఉండేదో తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది.

ఏ.సి కార్లో ఉద్యోగాలకి వెళ్ళి, వారంలో మూడురోజులే వంట చేసి అందరినీ ఉద్ధరించాను అనుకుంటాము, we are so busy అంటూ, మరి మన అమ్మలకి ఆదివారాలు ఉండేవి కావుగా!

అమ్మ మాటలు అస్తమానం చెవిలో రింగవుతాయి ఏమిటో తెలుసా? "మనకి లేదని ఏడిస్తే ఒక కన్ను, ఇంకోళ్ళకి ఉందని ఏడిస్తే రెండో కన్నూ, రెండూ పోయి గుడ్డివాళ్ళము అవుతాము" అనేది, మా ఇంటిలో అందరూ కూడా మననం చేసుకుని ఆచరించే పరమ సత్యం ఇది. ఎప్పుడైనా అయ్యో మనకి అనుకున్నట్లు జరగలేదే, అని మనసు చివుక్కుమంటే, వెంటనే ఈ మాటలు జ్ఞాపకం వస్తాయి.

ఎన్నో సంఘటనలు అమ్మలోని హాస్యాన్ని కూడా గుర్తుచేస్తాయి. అమెరికా వలస వచ్చేసిన పెద్దమనవడు పలకరింపుగా, "అమ్మమ్మా, ఊళ్ళు ఎలా ఉంది?" అని అడిగితే, ఆవిడ ఫక్కుమని నవ్వి, "నాయనా, నీదయవల్ల బాగేనే ఉంది" అని తెలుగు ఎన్ని రకాలుగా వినొచ్చు ఇక్కడ అని ఆశ్చర్యపోయింది. అలాగే, నా పెళ్ళి జరిగిన కొత్తల్లో మా అత్తగారు వాళ్ళు ఉమ బాగా వంట చేస్తుంది

అంటే, కిసుక్కున నవ్వి, పాపం వీళ్ళకి ఆ మాత్రం వంట కూడా రాదేమో, మనమ్మాయిని మెచ్చుకుంటున్నారు అని అక్కలతో అనడం ఇప్పటికీ నవ్వుతెప్పిస్తుంది. ఇంకా చాలా సరదా మూడ్‌లో ఉన్నప్పుడు నాన్నగారి గురించి, ఆయన కన్నా నన్ను చదివించి ఉంటే మావాళ్ళు ఈ పాటికి 3 ఎం.బి.బిఎస్‌లు చదివేసే దాన్ని అనేది, పెళ్ళితో చదువు ఆపవలసి వచ్చిన మా అమ్మ.

కలిగిన ఇంటిలో పుట్టి, మెట్టిన ఇంటిలో పెదవి కదపకుండా సద్దుకుని, మళ్ళీ ఆడపిల్లేనా? అని అయిదు సార్లు అనిపించుకుని చివరిగా ఇద్దరు కొడుకులని కని అమ్మయ్య అనుకున్న అమ్మ, ఏ పని చేసినా శ్రద్ధగా పూర్తి చెయ్యాలన్న క్రమశిక్షణ నేర్పిన అమ్మ, ఒక్కరోజు కూడా బాధ కనిపించకుండా, మూడు పూటలు ఇంటిల్లపాదికీ, వచ్చే చుట్టాలకీ వండి పెట్టి, వచ్చే జన్మలో ఇండియాలోనే పుడితే, మగాడై పుట్టాలి అని జోక్ చేసే అమ్మ, చివరి రోజుల్లో అమెరికా వలస వచ్చింది. ఆవిడ 80వ పుట్టినరోజుకి, నా కవితా సంకలనం "తుహిన కణాలు" అంకితమిస్తే, ఒకటి రెండు కవితలు చదివి "ఫరవాలేదు బాగా రాశావమ్మా" అన్న అమ్మ, ఎప్పటికీ చిరంజీవి. అమ్మగా, అమ్మమ్మగా, ముత్తమ్మమ్మగా కూడా 81 సంవత్సరాలు కన్నీళ్ళు, కలతలు నవ్వుల్లో దాచేసి మమ్మల్నందరినీ ప్రయోజకులని చేసిన అమ్మకి "మాతృదేవోభవ" అని వందనం చెయ్యడం, ఈ అనుభూతులను అందరితో పంచుకోవడం నా అదృష్టం కదూ!!



*డాక్టర్ ఉమా ఎయున్ని గారు వృత్తి రీత్యా వైద్యురాలైనా సంగీత, సాహిత్యాల్లో విశేషమైన కృషి చేశారు..చేస్తున్నారు. వీరి లలిత గీతాలు అనేకం సి.డి.ల రూపంలో విడుదలయ్యాయి. మరిన్ని విశేషాల్ని వీరి వెబ్‌సైట్ **www.pranavamusic.com** లో చూడొచ్చు.*



# రాయప్రోలు శాంత

అమ్మ ఎంత కమ్మనైన పదం, నిర్వచనం ఇది అని నిర్ణయించలేని అపూర్వమైన పదం. అమ్మంటే అలుపెరుగని అల, అర్థమయినట్టే అనిపిస్తూ అడుగడుగునా ఆశ్చర్యపరిచే అద్భుత వ్యక్తి, మన కష్ట సుఖాలను తనవిగా భావించే నేస్తం, పలుకుల ఉలితో పసివాణ్ణి పరిపూర్ణవ్యక్తిగా మలిచే శిల్పి, ఇలా రాస్తూ పోతే ఎన్నయినా రాయవచ్చు.

మనకి మహాభారతం పంచమ వేదమయితే నాకు మా అమ్మే పంచమ వేదం, ఆమె జీవన విధానమే కావ్యం, ఆవిడ వ్యక్తిత్వమే కొలమానం, ఆమె నిరాడంబరతే ఒక ఉదాహరణ. అమ్మ గురించి రాయాలంటే ఏమని రాయను నేను ముందంటే నేను ముందని జ్ఞాపకాలు తరుముతున్నాయి.

మా అమ్మ పేరు కమలమ్మ ఆ పేరుకి తగ్గట్టే ఎప్పుడు చూసినా చూడగానే గౌరవభావం కలిగించేలా ఉండేది అమ్మ. హైస్కూలు చదువు కూడా పూర్తి చేయలేదు కానీ వ్యక్తిత్వ వికాసానికి చదువే కొలమానం కాదని అమ్మను చూశాకే నాకు అర్థమయ్యింది.

ఉన్నంతలో తృప్తిగా ఉండటం, అందరినీ అభిమానించించటం, ఎవరికి ఏ కష్టమొచ్చినా చేతనయిన సహాయం చేయడం, అమ్మలో నాకు కనిపించిన, నేను గమనించిన సుగుణాలు, తెలియనివి ఎన్నుండేవో! ఏ వేళప్పుడు, ఎవరు వచ్చినా, ఆప్యాయంగా పలకరించేది. ఉపచారాలు చేసి ఉపాహారాలు అందించేది. ఆ సుగుణం తాలూకు సౌరభం కాస్త అంటిందేమో మా ఇంటికి ఎవరు వచ్చినా, ఏదో ఒకటి వండిపెట్టనిదే నాకు తోచదు.

అమ్మకు ప్రథమ కోపం ఎక్కువే కానీ దాని పర్యవసానం తీయగా ఉండేది. అడిగింది లేదనకుండా కోరింది కాదనకుండా జరిగేది. అందుకే ఆ కోపాన్ని భరించడానికి సిద్ధపడే వాళ్ళం నేను, తమ్ముడు, చెల్లాయి కూడా.

అమ్మలో నాకు నచ్చిన, నేను వారసత్వంగా తెచ్చుకున్న మరోగుణం వ్యవహారదక్షత, వేలకు వేలు డొనేషన్లు అడుగుతున్న ఆరోజుల్లో ఎవరిని కలిసిందో, ఏం మాట్లాడిందో పైసా ఖర్చులేకుండా నాకు ప్రైవేటు కాలేజీలో సీటు ఇప్పించింది.

నేను ఇష్టపడిన వ్యక్తితో పెళ్ళి జరిపించడానికి తాను ఎంత కష్టపడిందో, చుట్టాలందరితో ఎన్ని మాటలు పడిందో పెళ్ళయిన చాలా ఏళ్ళకు గానీ నాకు తెలియలేదు, అమ్మా చెప్పలేదు. సంతోషమే తప్ప, దుఃఖం పంచడం అమ్మకు తెలియదు మరి.

మా అమ్మాయికి స్కూలు ప్రాజెక్టు పనికి కాస్త సాయం చేసినందుకు అలసిపోయాననుకునే నాకు 'ముగ్గుల పోటీలో పాల్గొనాలి ముగ్గు పిండి కావాల'ని పంతం పడితే, పాలరాయిని దంచి పిండి చేసి ముగ్గులు వేయడానికి పంపిన అమ్మ గుర్తొస్తే సిగ్గనిపిస్తుంది.

"కాస్త కాఫీ కలపవే ఎందుకో నీరసంగ ఉంది ఈవేళ" అంటే "పో అమ్మా నేను చేయను" అని విసుక్కున్న నేను, ఎప్పుడు పడుకుంటుందో, రాత్రి తెల్లవారు ఝామునే లేపి వేడి కాఫీ ఇచ్చి చదువుకొమ్మనే అమ్మ! ఏది సామ్యం? ప్రతిఫలం ఆశించని ప్రేమ అమ్మంటే! కాదంటారా?

నేను దుబాయిలో నాలుగేళ్ళు మా వారి ఉద్యోగరీత్యా ఉన్నాను. అప్పుడు అమ్మకి చీరకొనుక్కోమని పంపిన డబ్బులు, నా పేరు మీదే గుడికి దానం చేసిన అమ్మ నిరాడంబరత్వం గుర్తొస్తే ఇప్పటికీ ఆశ్చర్యపడుతుంటాను.

నాకు తెలిసి మా అమ్మకి రెండో మూడో పట్టు చీరలు మాత్రమే ఉండేవి. పెళ్ళయినా , పేరంటమయినా, పండుగైనా, పబ్బమైనా అవే చీరలు. కానీ ఏనాడూ, మా అమ్మ మొహంలో అసంతృప్తిగానీ న్యూన్యతా భావం కానీ కదలాడేదికాదు. ఆ సింప్లిసిటీ నాకెందుకు అలవడలేదో అర్థంకాదు.

అమ్మ ఎప్పుడూ సంతోషంగా నిండుకుండలా ఉండేది. ఇదిలేదని, అది కావాలని మా నాన్నను సాధించడంగానీ కించపరచడం గానీ నేనెప్పుడూ చూడలేదు. భార్యాభర్తలు ఒకరికొకరు గౌరవించుకోవడం మాటల్లో కాక చేతల్లో చూపించడం ఎలాగో నేను ఇప్పటికీ నేర్చుకుంటూనే ఉన్నాను.

ఇలా రాస్తూపోతే ఎన్నయినా ఉన్నాయి. ఈ రోజున నా ప్రవర్తనలో, వ్యక్తిత్వంలో ఏవయినా మంచి లక్షణాలు ఉన్నాయంటే అవి మా అమ్మద్వారా సంక్రమించినవే! ఈ లోకాన తాను లేకున్నా, పూవునంటి ఉండే తావిలా ఆమె వ్యక్తిత్వం నన్ను అంటిపెట్టుకుని ఉండాలని ఆశిస్తూ మా అమ్మకి "మాతృదేవో భవ" అంటూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.



ఫ్లొరిడా నివాసి ఐన శాంత గారు పది సంవత్సరాలనుండీ అమెరికాలో ఉంటున్నారు. సాహిత్యమంటే అభిమానం. స్టూడెంట్‌గా ఉన్నప్పుడు యువవాణికి కథానికలు రాసేవారు. ఆంధ్ర మహిళాసభకి 81 - 82 ప్రాంతాల్లో కల్చరల్ సెక్రటరీగా ఉండేవారు.



## డాక్టర్. వేమూరి వేంకటేశ్వరరావు



"నివ్వరి ధాన్యపు ముల్లువలె, సూక్ష్మమై, పచ్చని చాయ కలిగి, అణుప్రమాణంలో మన హృదయకమలాలలో ఉన్న అగ్నిశిఖ మధ్యలో పరమాత్మ ఉంటాడు" అంటుంది, మంత్రపుష్పం.

"ఇందూ లేడు, అందూ లేడు, ఎందెందు వెదకినా ఎక్కడా కానారాడు" అనే అర్థం స్ఫురించే భాషలో మదర్ తెరెసా రాసుకున్న ఉత్తరాలు ఆమె తదనంతరం కనిపించేయి. దేవుడు ఎక్కడో మేఘాల అవతల లేడని ఆమె ఎప్పుడో గ్రహించింది. దేవుడంటూ ఎవ్వరైనా ఎక్కడైనా ఉంటే వాడు (ఆమె) మంత్రపుష్పం చెప్పినట్లు మనలోనే ఉన్నాడు - మనకి జన్మనిచ్చిన వారిలో ఉన్నాడు.

రామకృష్ణ వివేకానందుడికి దేవుణ్ణి చూపించేడటారు. ఎవ్వరూ చూపించకుండానే నేను దేవుణ్ణి చూసాను – మా అమ్మ కళ్ళల్లో!

అమ్మ ఈ భౌతిక ప్రపంచం నుండి నిష్క్రమించి దరిదాపు నాలుగు దశాబ్దాలు అయింది. అయినా అమ్మ నాకు రోజూ కనిపిస్తూనే ఉంటుంది. మా అమ్మాయిలు సీత, మైథిలి ముఖాలలోకి చూసినా, నా అప్పచెల్లెళ్ళు సుందరం, భానుమతి ముఖాలలోకి చూసినా, వారి హృదయకమలాలలో తిష్ట వేసుకుని కూర్చున్న మా అమ్మ స్వరూపం వాళ్ళ కళ్ళల్లోకి ప్రతిబింబించి నాకు కనిపిస్తూనే ఉంటుంది. అమ్మ గుణాలు కొందరిలో, చేష్టలు కొందరిలో, పోలికలు కొందరిలో!

ఎవరి తల్లి వారికి గొప్పగా కనిపించటంలో వింతా, విడ్డూరం ఏముంటుంది? కనుక మా అమ్మని ఇతరుల కళ్ళగుండా మీకు చూపిస్తాను. చూడండి.



తెన్నేటి విశ్వనాథం గారు మా అమ్మకి వేలు విడచిన మేనమామ అవుతారు. ఆయన చిన్నప్పుడు పెద్దలెవ్వరితోటీ చెప్పకుండా రంగం (రంగూన్) వెళ్ళిపోయేరు – ఒక్క మా అమ్మకి మాత్రం చెప్పేరుట, తను ఊరు దాటే వరకూ ఎవ్వరితోటీ చెప్పొదని. ఆయన రహశ్యాన్ని బట్టబయలు చెయ్యకుండా దాచినందుకో, మరెందుకో, మా అమ్మ అంటే ఆయనకి మంచి అభిమానం ఉండేది. – ఆయన మా ఊరు గుండా రైల్లో ఎప్పుడు వెళ్ళినా మా అమ్మకి తెలియబరచే వారు. ఇంటి దగ్గర – ఆయనకి భోజన సదుపాయాలు చేసి, కేరియర్‌లో పెట్టి మా చేత స్టేషన్‌కి పంపేది. మేం పట్టికెళ్ళి ఇచ్చే వాళ్ళం. ఆయన కారులో వెళితే తప్పకుండా మా ఇంటి దగ్గర ఆగేవారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు కూడ "నేను సీతమ్మ కొడుకుని" అని చీటీ రాసి పంపిస్తే లోపలికి పిలచేవారని అన్నయ్య చెప్పేడు.

మా మేనత్త కొడుకుకి, రవణ బావకి, బోదకాలు వచ్చింది. మోకాలునుండి, పాదం వరకు వికృతంగా వాచి పోయి, పొక్కులు, రసితో చూడటానికే అసహ్యంగా తయారయింది కాలు. కాలుకి ఆకులు, పసర్లు, పిండికట్లు వేస్తే తగ్గుతుందేమోనన్న ఆశ బావకి ఉంది కాని ఇంటిదగ్గర కాలు ముట్టుకుందుకే భయపడి తప్పించుకు తిరిగేవారట అంతా! అప్పుడు తన దగ్గరకి వస్తే తను సంరక్షణ చేస్తానంటే బావ మా ఊరు వచ్చేడు. మేము ఊళ్ళో పొలాలగట్ల వెంబడి తిరిగి, కలబంద ఆకు, బలురక్కెస మట్టలు, వగైరా సామగ్రి పట్టుకొస్తే వాటిని నూరి, తన చేత్తో కాలికి పట్టించి, కట్లు కట్టేది. ఏ మందులు వేసినా కాలు నయం కాలేదనుకోండి. "ఒరేయ్ బావా, రోజూ చూస్తూ ఉంటే నీకు తెలియక పోవచ్చు కాని అత్తయ్య దేవతరా!" అనేవాడు రవణ బావ.

మా పెద్దమావయ్య గారి కొడుకు, శాస్త్రి బావ, కరైకుడిలో ఇంజనీరింగు చదివేవాడు. సెలవలకి మెయిలు బండి తుని మీదుగానే వెళ్ళాలి కదా. అనకాపల్లి వరకు టికెట్టు కొనుక్కున్న పెద్ద మనిషి తుని స్టేషన్ రాగానే రైలు దిగి ఇంటికి వచ్చేసేవాడు. ప్రతి వేసంగికీ ఇదే తంతు. "ఏమిరా శాస్త్రీ, నువ్వు ఇంటికి వెళ్ళి అమ్మా, నాన్నల దగ్గర గడపకుండా ఇక్కడే ఉండిపోతే ఎలాగరా?" అంటే,

"నాకు అత్తయ్య దగ్గర ఉంటేనే బాగుంటుంది" అని తిరిగి కరైకుడి వెళ్ళిపోయే లోగా ఒక వారం రోజుల పాటు చోడవరం వెళ్ళి వచ్చేవాడు. "ఒరేయ్! వెంకటేశం! నువ్వు ఎంచక్కా 'సీతమ్మ మాయమ్మ' అంటూ పాట పాడుకోవచ్చు, నేనయితే 'సీతమ్మ నా అత్త' అని సరిపుచ్చుకోవాలి కదా " అని, "అత్తయ్యా! నేను కూడా నిన్ను అమ్మా! అని పిలిచెస్తాను" అనేవాడు.

మాకు ఆస్తులు, ఆభరణాలు లేవు. మేడలు, మిద్దెలు అంతకంటె లేవు. మా నాన్నగారిది చిన్న ఉద్యోగం. ఇంటినిండా ఇంటెడు మనుష్యులు. నాన్నగారికి రెండేళ్ళ వయస్సప్పుడే మా తాతగారు పోవటం వల్ల మా మామ్మ నాన్నగారి దగ్గరే ఉండేది. పైపెచ్చు బాల్యంలోనే వైధవ్యం ప్రాప్తించి, నా అన్న వాళ్ళంతా వదిలేస్తే దిక్కులేకుండా పోయిన ఒక వితంతువుని, వెంకమ్మ పిన్ని గారిని, చేరదీసి తన చెల్లెలుగా చూసుకుంటానని హామీ ఇచ్చి ఇంట్లో పెట్టుకుంది! వీరందరినీ పోషించటానికి నాన్నగారికి కష్టంగానే ఉండేది. అయినా సరే, మా ఇంట ఎల్లప్పుడూ ఏదో ఒక వారాల కుర్రాడు భోజనం చేసి వెళ్ళేవాడు: మొదట సన్యాసిరాజు, తర్వాత నరసింహ మూర్తి నాకు జ్ఞాపకం ఉన్నవాళ్ళు. "నా పిల్లలతోపాటే చారూ అన్నమో, నీళ్ళూ అన్నమో (అంటే తరవాణీ అన్నం అనుకుంటాను) వాళ్ళూ తింటారు" అని లేదనకుండా పెట్టేది. పెట్టినప్పుడు మాత్రం తన పిల్లలతో సమానంగా చూసేది తప్ప వారిని చులకన చేసేది కాదు. డొక్కా సీతమ్మ గారి సంగతి ఏమో కాని, వేమూరి సీతమ్మ గారిని తునిలో ఇప్పటికీ చాలమంది మరచిపోలేదు.

తునిలో, మా వీధిలో, మాకు ఆరిళ్ళకి అవతల, సూర్యారావు గారి ఇల్లుండేది. ఆయనకున్న ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడ పిల్లతో పాటు విధవరాలైన అప్పచెల్లెలు, మేనల్లుడు అప్పాజీ ఇంట్లో ఉండేవారు. 'అత్తగారి సొమ్ము అల్లుడు ధారపోసేడు' అన్న నానుడికి విరుద్ధంగా ఇక్కడ ఆస్తి అప్పాజీది, అనుభవించింది మావయ్యగారి పిల్లలూను. సూర్రావుగారి పిల్లడొకడు ఛార్టర్డ్ ఎకౌంటెన్సీ చేసేడు, మరొకడు ఇంజనీరింగు చదివేడు, కాని అప్పాజీ చదువు (B.Sc) తో ఆగిపోయింది. ఏమాటకామాటే చెప్పుకోవాలి. సూర్రావు మేష్టారు మేనల్లుడిని పూర్తిగా మరచిపోలేదు - తన కూతురుని ఇచ్చి పెళ్ళి చేసేరు. అప్పాజీ తల్లి పెద్ద వ్యవహార దక్షత తెలిసిన మనిషి కాకపోవటం వల్ల అన్న ఎంతంటే అంతే. కనుక మరో మనిషి సలహా కావలసినప్పుడల్లా అమ్మ దగ్గరకి వచ్చి కష్ట సుఖాలు చెప్పుకునేవాడు, అప్పాజీ. అమ్మ కీళ్ళ నొప్పులతో బాధ పడేది. ఎప్పుడూ పాదాలు నొప్పి అంటూంటే పిల్లలు వాటాలు వేసుకుని కాళ్ళు పట్టటం, పాదాలు రుద్దటం చేస్తే నొప్పి ఉపశమించేది. అప్పుడప్పుడు అప్పాజీ కూడ అమ్మకి కాళ్ళు పట్టి, పరిచర్యలూ చేసేవాడు - ఎంత ఒద్దన్నా వినకుండా. అప్పాజీ తన తల్లికి కూడా కాళ్ళు పట్టటం నేను చూడలేదు. "మీ ఏడుగురు కొడుకులతోపాటు నేను ఎనిమిదోవాణ్ణి అనుకొండి," అనేవాడు!

సూర్రావుగారింటికి ఎదురుగా పేరిందేవి మామ్మ గారి ఇల్లు. ఆమెకి ఒకే ఒక కొడుకు - ప్రసాదరావు మామయ్య గారు. కోడలు, రామం అత్తయ్య. వరసలు తప్ప బంధుత్వం లేదు. నాన్నగారు తుని వెళ్ళిన కొత్తలో ప్రసాదరావు ఉద్యోగం, సద్యోగం లేక ఇంటి దగ్గర ఉండేవారు. 'మూలుగులు మునపట్లాగా, భోజనాలెప్పట్లాగా' అనేది మామ్మగారు నిత్యం జపించే మంత్రం. ఆమెకి ఏదైనా హోమియోపతీ మందు ఇస్తారేమోనని మావయ్య గారు మా ఇంటికి వచ్చిన సందర్భంలో నాన్నగారు ఆయన జాతకం చూసి, "భయపడకోయ్. నువ్వు ఆర్. డి. ఓ. గా రిటైరవుతావు" అని జోస్యం చెప్పేరు. దరిమిలా ఆయనకి కలక్టరాఫీసులో ఉద్యోగం దొరికింది. డిపార్ట్‌మెంట్ పరీక్షలన్నీ పేసయి ఆయన పెద్దాపురంలో రెవెన్యు డివిజనల్ ఆఫీసరు (డిప్యూటి కలక్టర్ స్థాయి) చేసి రిటైరయారు.

పేరిందేవమ్మ గారికీ , మావయ్య గారికీ పడేది కాదు. మామ్మ గారు పోయినప్పుడు ఆవిడకి కర్మ చెయ్యనని ఈయన మొరాయించేరు. విషయం తెలిసి అమ్మ, వారింటికి పరిగెత్తుకు వెళ్ళి, ఆయనకి ఆయన కర్తవ్యం బోధించి, అప్పటికీ వినకపోతే రామం అత్తయ్య దగ్గరకి వెళ్ళి, "అమ్మాయీ, ఇప్పుడు నువ్వు కిమ్మనకుండా ఊరుకున్నావంటే తప్పు నీది కాకపోయినా లోకులు నువ్వే ఈ పని చెప్పి చేయించేవని నిన్ను అంటారు. ప్రసాదరావుతో మాట్లాడి కర్మ సరిగ్గా చేయించే బాధ్యత నీది. చేసే పని, ఏదో అయిందనిపించకుండా, మనస్ఫూర్తిగా చెయ్యాలి. సూర్యాస్తమయం అయేలోగా శవం లేవాలి," అని చెప్పి ఇద్దరినీ బుజ్జగించి, తను దగ్గరుండి కర్మ చేయిపించింది. ఆవేశంలో చెయ్యబోయిన పొరపాటుని జరగకుండా ఆపిందని మావయ్యగారికీ, అత్తయ్యకీ అమ్మంటే అప్పటికే ఉన్న గౌరవం ఇనుమడించింది. నేను అమెరికా వచ్చేటప్పుడు పెద్దాపురం వెళ్ళి ఈ మావయ్య గారి సహాయంతోటే కావలసిన కాగితాలు సమకూర్చుకున్నాను.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చెప్పుకోవచ్చు. అత్తా కోడళ్ళు తగువులాడుకుని విడివిడిగా ఇద్దరూ అమ్మ దగ్గరకే వచ్చేవారు – సలహా కోసం. ఏ పని చెయ్యనని కోడలు మొరాయించేదో ఆ పనినే కోడలు సంతోషంతో చేసేది. కొడుకునీ, కోడలినీ తిట్టిపోసుకుంటూ వచ్చిన అత్తగారి చేత కోడలికి అనుకూలంగా ప్రవర్తింపజేసేది. మా పేటలో ఏ శుభకార్యం జరిగినా అమ్మ వెళ్ళి పసుపు దంచటం లాంటి ప్రారంభోత్సవం చెయ్యకుండా పని జరిగేది కాదు. "సీతయ్యమ్మ గారూ, మీరు రావాలె" అని ఒకరూ, "అమ్మన్న గారూ, మీరొచ్చి అక్షతలు జల్లి వెళ్ళండి" అని మరొకరు. నడవలేనంటే బండి కాని, రిక్షా కాని పంపేవారు.

నేనిలా చెబుతూ ఉంటే, "మీ అమ్మగారు డియర్ ఏబీ, మాలతీ చందూర్ లాంటి మనిషై ఉంటారు" అని విశ్లేషించి పారేస్తారు – కొందరు. కావచ్చు. కానీ, అమ్మకి ఊళ్ళో ఇంత పరపతి పెరగటానికి మరొక కారణం లేకపోలేదు. మా అమ్మ కన్న పదకొండు మంది పిల్లలూ, బాలారిష్టాలన్నీ దాటుకుని, సురక్షితంగా పెరిగి పెద్దవారయేరు. ఒక తల్లి కడుపున ఇంతమంది పుట్టి, అందరూ బతికేరంటే అది 'మిరకిల్' రోజులలో. "అమ్మా, మీ కడుపు చలవ, మీ చేతి చలవ మమ్మల్ని కూడా రక్షించేటట్లు చూడు తల్లీ!" అని వేడుకునేవారు, మా పేటలో ప్రజలు.

అమ్మ చిన్నతనంలో, ఏదో రైలు స్టేషన్‌లో, ఒక సన్యాసి కనిపించి, ముఖం చూసి "అమ్మా! గర్భశోకం అంటే ఏమిటో తెలియకుండా నువ్వు పసుపు కుంకుమలతో పోతావు" అని జోస్యం చెప్పేడుట. అప్పట్లో మాటలని అంతగా పట్టించుకోలేదు కాని క్రమేపీ, అతని మాటలు నిజమేనేమో అని అమ్మ కూడ నమ్మింది. కాని, తనని పట్టించుకోకుండా అమ్మ చుట్టూ ప్రజలంతా ఇలా తిరుగుతూ ఉంటే దేవుడికి కన్ను కుట్టింది. చెట్టంత ఎదిగిన చిన్నక్కని పొట్టని పెట్టుకున్నాడు. ఆ దుఃఖంతోటే ఆరు నెలలు తిరగకుండా అమ్మ, అరవై ఏళ్ళయినా నిండకుండా, అక్క దగ్గరకి వెళ్ళి పోయింది. ఆ ఏట నుండీ నాన్నగారి జీవితం చీకటిమయం అయిపోవటం కేవలం కాకతాళీయం కాదేమో!

మాకు మిగిలిందల్లా అమ్మ జ్ఞాపకాలు. అమ్మ చెప్పిన మాటలు, నేర్పిన విలువలు. మధ్య గదిలో ఉన్న ఉయ్యాల బల్ల మీద కూర్చుని కథల రూపంలో చెప్పేది. వాటిలో ఒక కథ, కొన్ని విలువలు మీకు చెబుతాను. ఒక సంసారంలో ఆడదాని పాత్ర ఏమిటి అన్న ప్రశ్నకి సమాధానం దొరకొచ్చు ఈ కథలో. ఇంట్లో ఆడదాని ప్రాపకం లేకుండా ఎంత మొనగాడైన మగాడైనా సరే రాణించలేడన్నది ఈ కథ సారాంశం.

అనగా అనగా ఒక రాజు. వీరాధివీరులైన రాజులెందరినో తన సామంతులుగా చేసుకున్న ఈ మహారాజు, తన వీర పరాక్రమాలని చూసుకుని, మురిసిపోయి, తన భార్య దగ్గరే ప్రగల్భాలు పలికేవాడట. "సత్యభామలా విల్లమ్ములు ధరించి కదనరంగంలోకి దూకక పోయినా విజయం సాధించిన ప్రతి మగాడికీ ఆడదాని సారథ్యం లేకపోతే మగాడు చేసిన పని రాణించదు" అన్నారుట రాణీ వారు. భుజబలంతో సరితూగే బుద్ధిబలం లోపించబట్టి రాణీ వారి ఆంతర్యం గ్రహించలేక, "ఏదీ! నువ్వేమి చేసేవు? యుద్ధాలు చేసింది నేను. విజయాలు సాధించినది నేను. ఇక్కడ ఆడదాని ప్రమేయం ఏముంది?" అని నిలదీసి అడిగేరుట.

"ఆడది తలుచుకుంటే మగాడి పరువు ప్రతిష్టలు మంట కలిపెయ్యనూ గలదు, లేదా బంగారానికి తావి అబ్బించినట్లు పేరు ప్రతిష్టలని ఇనుమడింప చేయనూ గలదు," అని రాణీ వారు తిరుగు సమాధానం చెప్పేరుట. ఈ ఘర్షణ యుద్ధరంగంలో ఇతర రాజులని ఓడించినంత తేలికగా తెమల లేదు! "సందర్భం వచ్చినప్పుడు రుజువు చేసి చూపిస్తాను, రాజా!" అని అప్పటికి ఆయనని శాంత పరచిందిట, మహారాణీ వారు.

అనుకూలమైన సందర్భం రానే వచ్చింది. ప్రతి ఏటా మహారాజా వారు సామంతులని పిలచి పెద్ద ఎత్తున దర్బారు జరిపి, దానికి సరితూగే విధంగా ఇంకా పెద్ద ఎత్తున విందు ఏర్పాటు చేసి ఆ విందులో తన అధికారాన్ని పునఃస్థాపన చేసుకునేవారట. ఆ ఏడూ దర్బారు జరుగుతోంది. ఆ సందర్భంలో రాణివాసపు భృత్యుడొకడు పేరోలగంలోకి వచ్చి, "మహారాణీవారు విందులో దీపాలకి కొరత వచ్చింది, ఏమిటి చెయ్యమంటారని అడగమన్నారు!" అని అడిగేడు.

సామంతరాజులు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. "దీపానికి కూడా రాణీవారు రాజావారిని అడగాలా? ఇదా ఈ దేశపు అంతస్తు? ఈ రాజుకా మనం శిరస్సు వంచి అభివందనం చేసేది?" అన్న భావన వారి మనోఫలకాలమీద నిలచింది.

నలుగురిలో నగుబాటయిన మహారాజు తల తీసేసినంతగా పరాభవం పొందేడు. కోపంతో అంతఃపురంలో ప్రవేశించి జరిగిన పరాభవానికి సంజాయిషీ అడిగేడు.

"చూస్తారుగా! విందు భోజనానికి ఏర్పాట్లన్నీ సవ్యంగానే జరుగుతున్నాయి" అని సమాధానం చెప్పి, వాగ్వాదాలకి చోటివ్వకుండా అక్కడనుండి తప్పుకున్నారు మహారాణివారు.

సాయంకాలం విందు వేళ అయింది.

సామంతరాజులు ఒకరూ ఒకరూ చావడిలో ప్రవేశించేరు. దేదీప్యమానంగా వెలిగిపోతూందా చావడి. బారులు తీర్చిన బల్లల మీద పట్టు తాపితాలు. వాటి మీద పానీయాలతో నిండిన సువర్ణ కలశాలు. బంగారు పళ్ళెరాలలో భోజన సామగ్రులతో దాసదాసీ జనాలు. చావడి చుట్టూ తోరణాలలా ఊగుతూన్న బంగారు ప్రమిదలలో కర్పూర దీపాలు. వెలుగుని నలుదిశలా విరజిమ్మే విధంగా అమర్చబడ్డ స్పటిక మాలలు! ఈ వైభవం చూసిన సామంతరాజులకి నోట మాట రాలేదు. "ఇంత ఆర్భాటంగా చేసిన దీపాలంకరణని,

ఎంత రాణీ అయినా, రాణీవారు ఒక్కరూ ఎలా చెయ్యగలరు? ఎక్కడో, ఏదో కొరత వచ్చి అలా కబురంపి ఉంటారు" అనుకుంటూ అంతా సంజాయిషీ చెప్పుకున్నారు.

విందు అయింది. రాజా వారు అంతఃపురంలో ప్రవేశించి మహారాణీవారిని అభినందించకుండా ఉండలేక పోయారు.

"రాజా! దీపానికి లేదని నిండు సభలోకి కబురంపి మీ ప్రతిష్టకి మచ్చ తెచ్చినదీ నేనే! నా కబురులోని అంతరార్ధం గ్రహించిన సామంతుల ముందు మీ గౌరవం కాపాడిందీ నేనే!!" అని సగర్వంగా మహారాణీ అన్నారు, రాజా వారిని క్రీగంట చూస్తూ.

ఈ కథ ద్వారా ఒక సంసారంలో స్త్రీ పాత్ర ఎంత ముఖ్యమో మాకు తెలిసొచ్చింది.

అమ్మ నమ్మిన విలువలు, వాటిని సామెతల మాదిరి ఉటంకించిన విధానము చెబుతాను. వినండి.

- ఆడిన మాట తప్పకు.
- నోటితో లేదనకు, చేత్తో లేదను.
- నోరు మంచయితే ఊరు మంచవుతుంది.
- కాలు జారితే తీసుకోవచ్చు కాని, నోరు జారితే తీసుకోలేము.
- ఏ వేలి మీద కురుపేసినా శరీరం అంతా బాధ పడుతుంది. (ఒక సంఘంలో ఏ ఒక్కరు బాగుపడకపోయినా అది సంఘానికే మచ్చ అని అన్వయించుకోండి)
- తన డబ్బుపెట్టి ఒక సిగరెట్టు కొని నీ స్నేహితుడు నిన్ను పొగతాగమని ప్రోత్సహిస్తే నీకు జీవితాంతం సిగరెట్లు సరఫరా చేస్తాడేమో కనుక్కో!

ఈ మహా మనీషి, తను బతికున్న రోజులలో పిల్లలందరినీ చేరదీసి,. "వెంకమ్మగారు పోయినప్పుడు ఆమెకి శాస్త్రోక్తంగా నా పిల్లల చేత కర్మ చేయిస్తానని మాట ఇచ్చేను. నేను అప్పటికి ఉన్నా లేకపోయినా నా మాట నిలబెట్టండేం!" అంటూ ఒక రహస్యం చెప్పింది. అమ్మ లేని లోటు తీర్చటానికి వెంకమ్మ పిన్ని గారు సర్వవిధాలా ప్రయత్నించేరు. పండిన వయస్సులో ఆమె రాలిపోతే అమ్మ మాట నిలబెడుతూ పెద్దక్క కొడుకు ఆమెకి అంత్యక్రియలు జరిపించేడు. కనుక వెంకమ్మ గారు మాకు మరొక అమ్మ!

అమ్మా! నువ్వెక్కడున్నా మమ్మల్నీ, మేము చేసే పనులనీ చూస్తూ ఉంటావని తెలుసు. ఏదీ - రవణ బావా, శాస్త్రి బావా, అప్పాజీ, రామం అత్తయ్యా - అందరూ గొంతు కలపండి. వసంత రాగం. ఆరోహణ - స, గ, మ, ద, ని, స. అవరోహణ - స, ని, ద, మ, గ, రి, స. రూపక తాళం. సీతమ్మ మాయమ్మ... వెంకమ్మ పిన్ని గారూ, మీరు కూడా. సీ...తం...మ్మ...మా...యం...మ్మ...

****

# 'నిశాపతి'

మా అమ్మ పేరు ఉదయలక్ష్మమ్మ. మా నాన్నగారు మా ఊరు కరణంగా ఉండేవారు. మాది వ్యవసాయ బ్రాహ్మణ కుటుంబం.

మా నాన్నగారంటే మాకు భయం, గౌరవం. అమ్మ దగ్గరే చనువు. అలా అని మా నాన్నకి తెలియకుండా ఏమైనా కావాలని ఆమెను అడిగినట్లు గానీ, ఆమె మమ్మల్ని వెనకేసుకొచ్చి అది సాధించి పెట్టినట్లుగానీ ఏమీ జ్ఞాపకాలు లేవు. అన్నీ వేళకి అమరిపోతూ ఉండేవి. పెద్దగా గారాబాలు ప్రకటించడాలు ఉండేవి కావు. ప్రేమలు అంతర్వాహినిగా ఉండేవి. విశ్వనాథ్ సినిమాల్లోలా మా ఇంట్లో ఎమోషన్స్ అండర్ప్లే అవుతూ ఉండేవి.

మా నాన్నగారికి కాస్త మడీ, ఆచారం ఎక్కువ. అందుకని రోజూ మడి కట్టుకుని వంట చేసేది మా అమ్మ. వానాకాలం బట్టలు ఆరకపోతే తడిగుడ్డలు అయినా కట్టుకుని చెయ్యాల్సిందే! దానివల్ల ఆమె ఆరోగ్యం పాడవుతుందేమో అని అనుకుంటున్నట్లు ఎవరూ కనిపించేవారు కాదు, మా అమ్మతో సహా! దానికి తోడు కట్టెపొయ్యిల మీద వంట. వానాకాలం ఆ కట్టెలు తడిసి పొయ్యేవి. తడిబట్టలతో, తడి కట్టెలతో అదేదో చాలా మామూలు విషయమన్నట్లు ఆమె చిరునవ్వుతో వండి వడ్డించేది. పెద్దయ్యాక ఆలోచించుకుంటే అసలు ఇదంతా ఎలా సాధ్యమా అనిపిస్తుంది! స్త్రీవాదులు దాన్ని అణిచివేత అనొచ్చు. బహుశా నిజమేనేమో గూడా! కానీ ఆమె సహనం, కుటుంబం పట్ల ప్రేమ మాత్రం ఆమెకి సహజసిద్ధమైనవి. అందులో ఏ మాత్రం సందేహం లేదు. అందుకే పెద్దయ్యే కొద్దీ ఆమె మీద ప్రేమా, దాన్ని మించిన గౌరవం ఎక్కువ కావడం మొదలయ్యాయి.

అందుకే ఆమెని స్మరించుకుంటూ నేను రాసిన 'తల్లీ నిన్ను దలంచి' అనే పుస్తకంలో తల్లిని గురించి ఇలా అనుకున్నాను.

*అమ్మయనేటి మాట రసనాగ్రమునందు నటించినంతనే*
*కమ్మని మంచి గంధపు సుగంధము గాలిని నిండిపోవు స్వా*
*ర్థమ్మునెరుగనట్టి మమతామయ దైవత మూర్తి పాదు లో*
*కమ్ము నివాసయోగ్యముగ కన్పడు టామె చరించుటన్ గదా!*

అన్నట్లు మాది ఉమ్మడి కుటుంబం కూడా. చాలాకాలం మేమూ, మా బాబాయిలూ, వాళ్ళ పిల్లలూ అందరం కలిసి ఉండేవాళ్ళం. 60, 70 ఎకరాల పొలం ఉండేది. రెండు గాండ్ల స్వంత వ్యవసాయం. రెండు గేదెలు. అట్టహాసంగా ఉండేది. ఇద్దరు జీతగాళ్ళు. వాళ్ళకి వేరే మైలతో వండాలి. ఇంట్లో వాళ్ళకి మడితో వండాలి.

మా అమ్మ ఎప్పుడూ ఖాళీగా ఉన్న గుర్తులేదు. మా అక్కయ్యా వాళ్ళతో పోటీ పడుతూ కొత్త రకం జడలు అల్లుతూనో, కొత్త కొత్త ముగ్గులు పెడుతూనో వంచిన నడుం ఎత్తకుండా ఉండేది. ఆఖరికి వంట చేసేటప్పుడు కూడా ఏవో దేవుడి స్తోత్రాలు అనర్గళంగా. స్వచ్ఛంగా చదువుతూ ఉండేది. ఆమె అసలు బడికి వెళ్ళలేదు కానీ తెలుగు శుభ్రంగా చదివేది.

అంతేకాదు అంత పనిలో ఉన్నా ఎప్పుడూ మమ్మల్ని కసురుకున్న గుర్తులేదు. మంచినీళ్ళ బిందె పక్కనే ఉన్నా, 'అమ్మా! మంచినీళ్ళే!', అంటే 'వస్తున్నానాయనా!' అనేదే గానీ, 'ముంచుకుని తాగు' అని ఒక్కసారి కూడా అన్న గుర్తులేదు. అసలు ఆమె ఎప్పుడు ఎవర్నీ కోప్పడడం అనేది మేం ఎరగం.

ఊళ్ళోకి పరదేశీ బ్రాహ్మణులెవరొచ్చినా, మా ఇంట్లోనే భోజనం. మా నాన్నగారు నోటీస్ లేకుండా అతిధుల్ని ఆహ్వానించేవారు. అమ్మ ఎప్పుడూ చాటుగా కూడా విసుక్కోలేదు.

పేరుకి పెద్ద కమతం అయినా, సుమారు ఓ పదెకరాలు తప్ప మిగతాదంత మెట్ట భూమి. ఓ సంవత్సరం పండితే ఓ సంవత్సరం ఎండేది (నాగార్జు సాగర్ వచ్చేవరకు). మా అమ్మ వంటి మీద పుట్టింటి వాళ్ళు పెట్టిన బంగారం చాలా ఉండేది. అదంతా మా ఉమ్మడి కుటుంబపు 'బ్రాహ్మణ వ్యవసాయం'లో కరిగి పోయినా ఆమె ఏనాడు మాట వరసకైనా అనుకోలేదు.

ఆమె పోయి పదేళ్ళు దాటింది. పోయే ముందు ఆమె కాళ్ళు, చేతులు పాక్షికంగా స్వాధీనం తప్పాయి. డాక్టర్లు దానికి ఏదో పేరు పెట్టారు. చాలా అవస్థ పడేది. అది గుర్తుచేసుకుంటూ ఇలా అనుకున్నాను

మల్లెపూవుల వేళ పిల్లలందరకును / పూలజడలు వేయు కేలు నేడు
సంక్రాతి ప్రొద్దుల చలి, వయస్సు మరచి / సిరి ముగ్గులను వెట్టు చేయి నేడు
రెండెడ్లబండిపై కొండకేగగ బువ్వ/ కలిపి ముద్దల వేయు కరము నేడు
ఒడలు కొంచెము వెచ్చబడినంత అడలి, ది / ష్టిని తీసివైచు పిడికిలి నేడు
ముడుచుకొనదాయె చూడగా దీనమాయె
చిత్రమగు వ్యాధి చేతిలో చిక్కినట్టి
అమ్మ దుస్థితి చూడంగ అశ్రులాయె

ఐతే కాలం ఆగదు. ఒక కార్తీక సోమవారం నాడు ఆమె బాధలు తీర్చుకుని ప్రశాంతంగా కన్నుమూసింది.

చేతులు జాపుమంచు అరచేతుల బెట్టితి వెన్నముద్ద లీ
చేతులతోనె బెట్టితి నిసీ! కొరవిన్ దయమాలి నీతలన్
ఆతరువాయిగన్ మిగిలి నట్టిది గుప్పెడు జ్ఞాపకమ్ము, కృ
ష్ణాతటి లోగొనెన్, తుదకు శాశ్వతమాయె స్మృతుల్ తలంపులన్

ఆమె అద్భుత వ్యక్తిత్వం మాత్రం మా గుండెల్లో మిగిలిపోయింది.

✡✡✡

## తటవర్తి జ్ఞాన ప్రసూన

**అమృతం అనే మాట 'అ'తొనే మొదలవుతుంది.** అద్భుతం అనే మాటా 'అ'తోనే మొదలవుతుంది. అక్షరమాలలో మొదటి అక్షరం 'అ'.. నేర్చుకునే మొదటి మాట 'అమ్మా'. పసికందుకు ప్రపంచం అంతా ఒక వైపు, అమ్మ ఒక వైపు. తన స్పర్శ స్వర్గాన్నీ, తీపినీ, తృప్తినీ, భరోసానీ అందిస్తుంది అమ్మ. ఎవరికి వారికే 'మా అమ్మలాంటి వాళ్ళు ఎక్కడా ఉండరు' అని భావించేలా చేస్తుంది అమ్మ. పదినెలలు మోసి, కని లాలించీ ఆడించి, పెంచి నెమ్మది నెమ్మదిగా ప్రజలలోకి పంపుతుంది అమ్మ.

మా అమ్మ దేవత కాదని ఎవరనగలరు? మా అమ్మ పేరు సువర్చల. మా అమ్మమ్మకి మా అమ్మ రెండో సంతానం. మొదటి కానుపు కొంచెం కష్టం కావడంతో అమ్మమ్మని పురుటికి తణుకు పంపించారట మా తాతగారు. అక్కడ మా అమ్మ మేనత్త భర్త వైద్యుడు. మా అమ్మ వాళ్ళింట్లో పుట్టింది. వాళ్ళ వాళ్ళ పిల్లలందరికీ 'సు' అనే అక్షరం మొదట వచ్చేలా పేర్లు పెట్టుకున్నారు. మా అమ్మ అక్కడ

పుట్టింది కనుక అమ్మకి కూడా వాళ్ళు 'సు' అనే అక్షరం ముందు వచ్చేలాగా "సువర్చల" అని పెట్టారట. మా అమ్మ పేరుకి తగ్గట్టు మంచి బంగారు ఛాయ కలిగి ఉండేది. మా అమ్మ శారీరకంగా, మానసికంగా సున్నితంగా ఉండేది. మానసికంగా సున్నితంగా ఉంటే ఒడిదుడుకులు భరించలేరు, శారీరకంగా సున్నితంగా ఉంటే శ్రమకి ఓర్చుకోలేరు. మా అమ్మ రెండువిధాలా నాజూకుమంతురాలే!

ఆ రోజుల్లో ఆడపిల్లలు బయటికి వెళ్ళేవారు కారు. బడి, చదువు అసలే లేవు. కానీ మాతృభాష వ్రాయటం. చదవడం అందరికీ వచ్చేవి. "ఆ ఆడపిల్లకి చదువెందుకు? చాకలి పద్దు వ్రాయగలిగితే చాలు అనేవారట. పద్దెనిమిదేళ్ళ లోపు పిల్లలకి వివాహం చేయకూడదు అని నిషేదిస్తూ శారదా యాక్టు పెట్టారు. యాక్టుకి సాంఘికాచారాలకి ఎప్పుడూ ఘర్షణేకదా? మా అమ్మకి 14 ఏళ్ళ వయసులో ఒక పల్లెటూరుకి తీసుకు వెళ్ళి గప్‌చిప్‌గా పెళ్ళిచేసారట. మా నాన్నగారి తండ్రి వెళ్ళి పిల్లను చూసి పెళ్ళి నిశ్చయించారు. పెళ్ళి విషయం మా నాన్నగారితో చెపితే "నేను చూస్తాను నాన్నగారు అన్నారు". "పిల్లని చూస్తావా? పరువు తక్కువ బడుద్దాయ్" అని కేకలేసారట. మా నాన్నగారు అప్పుడప్పుడూ మా అమ్మని ఎగతాళి చేస్తుండేవారు, పెళ్ళికి ముందు చూడలేదు కనుక చేసుకున్నాగానీ, చూస్తే చేసుకునేవాణ్ణా? అని.

మా నాన్నగారికి మా అమ్మకు పదిహేను ఏళ్ళు తేడా ఎత్తులోనూ అంతే, మా నాన్నగారు బాగా పొడుగు, అమ్మ పొట్టి. నాన్న పక్కన అమ్మ పొట్టిగా చిన్న పిల్లలా ఉండేది. మా అమ్మ పుట్టింటివారు శాంత స్వభావులు. మాట్లాడేవారు కాదు. మాట్లాడినా మూడోవారికి వినిపించేదంటే, ఆ మాట మర్యాదగా, మధురంగా ఉండేది. నాన్నగారి వైపు తీవ్ర స్వభావులు. అమ్మ అమాయకురాలు, అత్తింటి హడావుడికి తట్టుకోలేకపోయేది. కానీ నోరు విప్పేది కాదట. వెంటనే నేను పుట్టాను. కాన్పు సమయంలో గర్భకోశం మడతపడి తరువాత పిల్లలు పుట్టలేదు. పెద్ద ఆపరేషను చేస్తే మళ్ళీ పిల్లలు పుడతారని డాక్టరు చెపితే ఒప్పుకోలేదు.

అమ్మకి ఇంజెక్షన్ అంటేనే భయం. నాకు చెవులు కుట్టించడానికి తీసుకువెళ్ళి తను వెళ్ళి రోడ్డు చివర నుంచుంది. "నాకు ఇంకా పిల్లలు లేకపోయినా ఫరవాలేదు, ఉన్న ఒక్క పిల్ల చాలు, అదే అమ్మాయి, అదే అబ్బాయి" అంది. అమ్మకి ధ్రుఢమైన అభిప్రాయాలుండేవి. నే పుట్టిన రెండేళ్ళకి కాబోలు అమ్మకి సుస్తీ చేసి రాజమండ్రి దగ్గర ఆస్పత్రిలో చేర్చారు. (మా నాన్నగారి తండ్రి) తాతయ్య అమ్మకి కాపలా. రోజూ కొండెక్కి అమ్మను చూసి వచ్చేవారట. పెద్ద ఉప్పెన వచ్చిందప్పుడు. తాతయ్య బందరులో పిల్లల్ని చూడ్డానికి అమ్మకి చెప్పకుండా వెళ్ళిపోయారు కాలినడకన. నాలుగోరోజున తిరిగి వచ్చారట. ముసలాయన ఏమయిపోయారోనని అమ్మ గుండెలు అవిసిపోయాయి. అమ్మ అన్నీ భరించేది.

నాన్న బందరులో కృష్ణాపత్రికలో పనిచేసేవారు, నేను మా బామ్మ దుగ్గర ఉన్నాను. తల్లి మీద బెంగ పెట్టుకుంటానని భయంతో బామ్మ నన్ను నలుగురు తల్లులు చేసినంత గారాబం చేసింది. మా బామ్మలో అమ్మని చూసుకున్నాను. ఆవిడతో బాగా ఆడుకునేదాన్ని. ఆవిడకున్న నాలుగు పాయల జుట్టును ఆరు జడలు వేసేదాన్ని, స్నోలు, పౌడర్లు మొఖానికి పట్టించేదాన్ని. బామ్మ బందరు వస్తే బామ్మ దగ్గర పడుకునేదాన్ని. మా అమ్మ ముఖం నాకు బాగా గుర్తుంది, రెండవ ప్రపంచ యుద్ధం వచ్చినప్పుడు. బందరు ఓడరేవుకనుక బందరు మీద బాంబులు వేస్తారని వణికిపోయారు. పెద్ద పెద్ద గాడిపొయ్యిలాంటి గోతులు తవ్వి వాటిలో ఇసుక బస్తాలు పడేసి ఉంచేవారు దాక్కోటానికి. సైరను మోగుతుంది, అందరూ వెళ్ళి దాక్కోవాలి అని చెప్పేవారు. చాలా మంది పిల్లా పాపలతో ఊరు విడిచి వెళ్ళిపోయారు. మా నాన్నగారు మా అమ్మని నన్ను మా పెద్దనాన్నగారింటికి వడ్లమన్నాడు వెళ్ళమన్నారు. అమ్మ వెళ్ళనంది మీరు కూడా వస్తేనే వెళతాము, లేకపోతే మీరు జైలుకి వెళ్తారు అంది. నాన్న బండి తెప్పించి వాకిట్లో పెట్టారు. ఆ ఇల్లు ఎత్తుగా ఉండేదనుకుంటాను. మా అమ్మా నేను కింద ఉన్నాము, నాన్నగారు మెట్లపై నిలబడి బయలుదేరండి అని చెయ్యి ఊపుతున్నారు. అమ్మ నన్ను ఎత్తుకుని ఏడుస్తోంది. అమ్మ ఏడవటం చూసి నేను ఏడ్చాను. నాన్నగారు అమ్మకి ధైర్యం చెప్పి జైలుకి వెళ్ళనని వాగ్దానం చేసారు. ఆయనకి ఆ టైములో పత్రికను వదిలి వెళ్ళడం ఇష్టం లేదు. తమాషా ఏమిటంటే ఇప్పటికీ ఆ దృశ్యం నా కళ్ళకి కట్టినట్లు కనిపిస్తుంది. మా అమ్మ

నాన్నగార్ల రూపం గుర్తు అదే మొదటిది. మనసులో ఒక కెమారే ఉందేమో? చిన్నతనంలో అది తీసిన చిత్రాలు అలానే ఉండిపోతాయి. కొన్ని అసలు మాసిపోవు. మనం తీసిన ఫొటోలా అనిపిస్తుంది, కానీ మనము అందులో ఉంటాము.

అమ్మకి సుస్తీ చేసి తగ్గినప్పటినుంచీ ఇంకా బలహీనమైపోయింది. తరువాత మేము ఖొజ్జిలిపేట ఇంటికి వెళ్ళాము మా ఇంటికి ఎడమవైపు ఆంధ్రాబ్యాంక్, మ్రిపాటి హనుమంతరావుగారి ఇల్లు, కంచి వాసుదేవరావుగారు, మోహనరావుగారు, విజయలక్ష్మిగార్ల ఇల్లు ఉండేది. అప్పుడు కాంగ్రెసు పార్టీ, ఖద్దరు ప్రచారం, హిందీ భాష వ్యాప్తి ఎక్కువగా ఉండేవి. గాంధీగారిని దేవుడిలా కొలిచేవారు. అందరి ఇళ్ళల్లో రాట్నాలు వడుకుతూ ఉండేవారు. మా ఇంట్లో చేతిరుమాలుతో సహా అన్నీ ఖద్దరు బట్టలే. మా అమ్మ ఖద్దరు చీరలో మునిగిపోయి, అణిగిపోయేది. మోగంటి మాణిక్యాంబగారని ఆవిడ ఆడవాళ్ళందరినీ పోగు చేసి హిందీ నేర్పించి పరిక్షలకి కట్టించేది. ఝంఝూ మారుతంలాలాంటి మనిషి. సుమిత్రా నందన్ పంథ్, నిరాలా, మహాదేవి వర్మ, దినకర్, మైథిలీ శరణ్ గుప్తాందరి కవితలు గడగడా వినిపిస్తూ ఉండేది. మా పక్క భాగంలో రాజమ్మ టీచరుగారుండేవారు. వారి హాలులో హిందీ క్లాసులు జరుగుతుండేవి. మా భాగంలోని గది తలుపు వాళ్ళ హాలులోకి ఉండేది. ఆ తలుపు తీసి మా అమ్మ నన్ను అక్కడ కూర్చో పెట్టేది. అమ్మతోపాటు నా చెవుల్లో హిందీ పడింది. అలా చిన్నప్పుడు నా చెవుల్లో పడ్డ హిందీ పెద్దయ్యాక కంచంలో అన్నం పెట్టింది మాణిక్యాంబ గారి చలవనుకుంటాను... అమ్మ అప్పుడు రాష్ట్ర భాష దాకా పరిక్షలు పాసయ్యింది. మాణిక్యాంబగారు పాలవాణ్ణి, కూరలవాణ్ణికూడా హిందీ మాట్లాడమని ప్రోత్సహించేది. హిందీ చదివే శిష్యురాళ్ళందరూ హిందీలో మాట్లాడాల్సిందే!

అమ్మ ఎప్పుడూ విసుక్కునేది కాదు, కోపం తెచ్చుకునేది కాదు, ఎన్నడూ నా వంటిమీద దెబ్బ వెయ్యలేదు. పరమ శాంతమూర్తి. ఒకసారి హిందీ చదివే వాళ్ళతో కలిసి అమ్మ మినర్వా హాలులో సినిమా చూడటానికి వెళ్ళింది. నన్నూ తీసుకెళ్ళింది. అమ్మ ఎప్పుడూ ఇల్లు కదిలేది కాదు. వాళ్ళతో సరదాగా బయలుదేరింది. అదికూడా మాణిక్యాంబగారి ప్రోత్సాహమే! సినిమా మొదలు పెట్టగానే తెరమీద ఒకావిడ పొయ్యిలో కాలుపెట్టి వంట చేసింది. నేను ఒకటే ఏడుపు, "ఆవిడని పొయ్యిలోంచీ కాలు తియ్యమనవేమ్మా!" అని. మా అమ్మ ఏదో సర్ది చెప్పింది. ఇంకో నిముషానికి మామిడి పళ్ళ బుట్టలోంచీ పెద్ద పడగతో పాము బుస్సుమంటూ పైకి లేచింది. ఇంకేముంది? కళ్ళు గట్టిగా మూసుకుని సినిమా చూడను, కళ్ళు తెరవనూ అని ఏడ్చాను. చేసేదేమీ లేక అప్పుడు మాత్రం అమ్మ విసుక్కుని ఇంటికి తీసుకు వచ్చి రాజమ్మ టీచర్ గారింట్లో వదిలి వెళ్ళింది. అప్పటికి సినిమా చాలా అయిపోయిఉంటుంది. ఆ సినిమా పేరు బాలనాగమ్మ అని తరవాత అమ్మ చెప్పింది.

ఆ ఇంటి నుంచీ చెమ్మనగరి పేట ఇంటికి వెళ్ళాము. ఆ ఇల్లు పెద్ద హాలుతో, రెండు వైపులా అంత పొడుగు వరండాలతో ఒక గది ఉండేది. అవి చూసి నాన్నగారు అడ్వాన్సు ఇచ్చి వచ్చారు. ప్రొద్దునా, సాయంత్రం వ్రాసుకునేందుకు రెండు వరండాలు, అతిధులని కూర్చోపెట్టటానికి హాలు ఉన్నాయి, అవి చాలనుకున్నారు నాన్న. అమ్మ, నేను వెళ్ళి చూసి ఆశ్చర్యపడిపోయాము. ఇదేమిటి వంటిల్లు ఏదీ అంది అమ్మ. అప్పుడు ఇంటివారిని అడిగితే వరండాకి తడికెలు కట్టించి ఇచ్చారు. అక్కడ అల్మారా లేదు. సామాన్లన్నీ హాలులో అలమారాలో పెట్టుకుని రోజూ తీసుకెళ్ళి వంట చెయాల్సి వచ్చేది. వేరే వాళ్ళయితే ఆ ఇంట్లో దిగే వాళ్ళేకారు. అమ్మ ఏమీ మాట్లాడలేదు. అక్కడ అమ్మ చాలా కష్టపడింది. మేడమీద కాపురం, నీళ్ళు పైకి వచ్చేవికావు. చుట్టాల బెడద, అనారోగ్యం, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. నాన్నగారికి 'కృష్ణాపత్రిక'ంటే ఆరోప్రాణం. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ, లేక వ్రాసుకుంటూ ఉండేవారు. ఇంటి అవసరలు, సమస్యలు ఆయనతో చెబితే ఆయన ఆలోచనలకి భంగం కలుగుతుందని అమ్మ తనే అన్నీ సర్దుకునేది.

ఆరోజుల్లో బందరులో కృష్ణా పత్రిక ఆఫీసు ఒక దేవాలయంగా ఉండేది. చూడవలసిన స్థలంగా ఉండేది. అన్ని రంగాల ప్రముఖులు పత్రికాఫీసు మెట్లు ఎక్కితే చాలు పునీతులమయిపోతాము అనుకునేవారు. అక్కడికి వచ్చిన వారినందరిని నాన్నగారు ఇంటికి ఆహ్వానించేవారు. మధ్యాహ్నం పదకొండున్నరకి ఆఫీసు బంట్రోతు చిన్న తాటాకు బుట్ట తెచ్చేవాడు. అది వస్తే అతిథులు వస్తున్నట్లు లెక్క.

అందులో లేత వంకాయలు, దోసకాయలు, తోటకూర, పచ్చిమిర్చి, కొత్తిమీరతో పాటు, ఫలానా ప్రముఖ వ్యక్తి, మరో ఇద్దరూ భోజనానికి వస్తున్నారు అని నాన్న చేతి వ్రాతతో చిన్న చీటీ ఉండేది. ఆకుకూరలని, అన్నాన్ని వండి వడ్డించేసరికి మా అమ్మకి పరీక్ష అయిపోయేది. ఎందుకంటే చేతిలో డబ్బులు ఉండేవి, ఎదురుగా దుకాణాలు ఉండేవి.. వెళ్ళి సరుకులు తెచ్చేందుకు ఒక మగ బుడతడు ఇంట్లో లేడు కదా?

బందరులో మా ఇంటి ఎదురుగుండా మూడు పచారీ దుకాణాలు, ఒక ఇస్త్రీ చేసేవాడు ఉండేవారు. దుకాణంలో సరుకుల్లో వేరుశెనగపప్పు ఉండలు, కొబ్బరిలౌజు ఉండలు, కోవాబిళ్ళలు, పిప్పరమెంట్లు, అప్పడాలపిండి ఉండలు, శనగపప్పు ఉండలు సీసాల్లో ఎదురుగా పెట్టి అమ్మేవారు. కాణీకి మూడు దమ్మిడీలుండేవి. దమ్మిడీకి ఒక ఉండ ఏదైనా సరే కొనుక్కోవచ్చు. ఒక కానీ పెట్టి మూడు ఉండలు కొనుక్కు తింటే ఇంకేముంది? ఆనందో బ్రహ్మ. పదేళ్ళు వచ్చేదాకా నేనే అన్నీ తెచ్చేదాన్ని. అమ్మ ఏదైనా తెమ్మని డబ్బులిస్తే దానిలో కొంచెం డబ్బులు పెట్టి కొనుక్కు తిని ఇంటికి వచ్చేదాన్ని. ఇవే వచ్చాయా? అనేది అమ్మ. ఆ కొట్టువాడు అంతే ఇచ్చాడు నేనేం చెయ్యనూ? అనేదాన్ని. అమ్మ కోప్పడేది కాదు. నే చేసిన పని ఆవిడకు తెలుసు. పెద్దయ్యాక తప్పు చేసినందుకు మా అమ్మని క్షమాపణ వేడుకున్నాను.

ముట్నూరు కృష్ణారావుగారు స్వర్గస్తులైయాక మా నాన్నగారు సినిమా రచయితగా మద్రాసు వెళ్ళారు. కాపురం మద్రాసుకి తరలింది. తలనొప్పి కూడా ఎరగని నేను ఆ ఊరు వెళ్ళగానే నెలరోజులు ఆటలమ్మ వచ్చి మంచం పట్టాను. వెంటనే నాన్నగారు సుస్తీ పడ్డారు. ఆయనకి ఆగకుండా ఎక్కిళ్ళు వచ్చి మందుకూడా దిగేది కాదు. ఊరు కొత్త, భాష రాదు, అమ్మ నేను హడలిపోయాము. మూడు నెలలకి తగ్గింది. అమ్మ అహోరాత్రులు నాన్నగారి సేవ చేసి డొక్కులా అయిపోయింది. నాన్నగారు లేచి ఫైల్ పుచ్చుకు బయటకి వెళ్ళడం ప్రారంభించారు. అమ్మ మంచం పట్టింది. అత్యధిక శ్రమ వల్ల ఊపిరితిత్తులు రెండూ అతుక్కుపోయాయి. ఇంత అశ్రద్ధ ఎందుకు చేశారని డాక్టర్ నాన్నగారిని చివాట్లు పెట్టాడు. ఆరునెలలు కుంపటి దగ్గరికి వెళ్ళకుండా పూర్తి రెస్ట్ తీసుకుంటే బాగవుతుందేమో అన్నాడు. మందులకి పత్యానికీ అమ్మ ఏమీ సతాయించేది కాదు. ఆరునెలలు సేవ చేసాక తేరుకుంది.

ఒళ్ళు వచ్చి మిసమిసలాడుతూ మంచిరంగు వచ్చింది అమ్మకి. వెంటనే ఆ ఇల్లు మార్చేసి కృష్ణారావ్‌నాయుడు స్ట్రీట్‌కి మారిపోయాము. మా నాన్నగారి చిరకాల మిత్రుడు, అన్నపూర్ణా పిక్చర్స్ అధినేత దుక్కిపాటి మధుసూధనరావుగారు మేడమీద ఉండేవారు. నాన్న పనిలో పడిపోయారు. అమ్మకి ఆరోగ్యం బాగుంది. కొన్నాళ్ళు సంతోషంగా గడిపాము. ఏవో కలతలు, చికాకులు. అమ్మ ఖచ్చితంగా ఉండక పోవడం వల్ల ఇలా జరుగుతుందన్నాను. "నాన్నగారు అన్న ప్రతిదానికీ ఇలా తలూపితే ఎలాగమ్మా" అన్నాను. "నీకిప్పుడు తెలియదమ్మా! నీకూ పెళ్ళయాక తెలుస్తుంది" అంది శాంతంగా. నిజమే పెళ్ళయ్యాక బాగా తెలిసింది. ఆ మాట ఈనాటికీ నా చెవులలో ఉంది. నోరు విప్పి ఏదైనా మాట్లాడితే అది జరుగుతుందన్న నమ్మకం లేనప్పుడు మాట్లాడి ఏమి ప్రయోజనం? అని అమ్మ సిద్ధాంతం. ఎట్టి పరిస్థితులలోనైనా నాన్నగారి మాటక్కాదనకుండా గడపడమే సుఖజీవనానికి మార్గం అని అమ్మ నమ్మింది.

మా అమ్మ దగ్గిర లేందే మా నాన్నగారికి ఒక్క అక్షరం కాగితం మీద పడేది కాదు, ఒక్క క్షణం గడిచేది కాదు. ఆయన 'కాఫీగత ప్రాణి'. ఆరగారగా కాఫీ తాగుతూ ఉండేవారు. అరకప్పులో సగం ఇవ్వు చాలు అనేవారు, అరకప్పులో సగం ఇచ్చినా, చెంచాడు ఇచ్చినా కుంపటి అంటించక తప్పదుకదా? గాస్ స్టౌవ్వులు లేవు. రాత్రివేళ లేచి రాసుకోవాలనిపిస్తే అమ్మని నిద్రలేపి కాఫీ అడిగేవారు. ఒక్కరోజూ అమ్మ లేవలేను అనలేదు. వేసవి కాలంలో పాలు నిలువ ఉండేవి కావు. ఒక గిన్నెలో పాలుపోసి, ఒక గిన్నెలో నీళ్ళు పోసి ఆ నీళ్ళ గిన్నెలో ఈ పాలగిన్నె పెట్టేది. అయినా ఒకొకసారి పాలు విరిగిపోయావి. నాన్న చాలా విసుక్కునేవారు. నాన్నగారు చైన్‌స్మోకర్, ఆయన దగ్గర అగ్గిపెట్టె వంటింట్లోకి తీసుకువెళ్ళి కుంపటి వెలిగించి తెచ్చేలోపున అగ్గిపెట్టెలేని విరహం భరించలేకపోయేవారు. వేరే అగ్గిపెట్టె వంటింట్లో ఉంచేది అమ్మ. మరుపు మానవ సహజంకదా?

అగ్గిపెట్టి, సిగిరెట్లు కూడా ఎప్పటికప్పుడు రెడీగా ఉంచాల్సిన బాధ్యత అమ్మదే! పనికి వచ్చే వ్యాసాలు, వార్తలు సేకరించిన కాగితాలు, ఇంటినిండా ఉండేవి. ఫలానా విషయంపై చిన్న కాగితం ఉండాలి వెతకమనేవారు, అమ్మ నేను పనులు ఆపేసి వెదికి ఇచ్చేవారం. తను ఒక మనిషి, తనకిది కావాలి, తనకోసం ఇది చేయాలి అని అమ్మ ఎప్పుడూ అనుకునేది కాదు. నాకిది ఇష్టం అని చెప్పేది కాదు. గులాబీ పువ్వంటే మాత్రం మహా ఇష్టం. అందమైన గులాబీ తెచ్చి ఇస్తే ఆవిడ మనస్సులో ఆనంద తరంగాలు ఉవ్వెత్తున లేచి, ముఖంలోని పల్చటి చర్మం వెనక కదలాడి, కళ్ళలో మెరుపు నింపి, నిశ్శబ్ద హాసమై బయటికి ప్రసరించేవి.

మా అమ్మమ్మ చనిపోయిందనే విషాద వార్త మోసుకొచ్చింది పోస్ట్‌కార్డ్. అప్పుడు మా చిన్న మేనమామ మద్రాస్‌కి అవతల నైవేలీలో ఇంజినీరుగా ఉండేవారు. మా అమ్మమ్మ అక్కడే చనిపోయింది. అమ్మ బాగా ఏడ్చింది. అమ్మ అప్పచెల్లెళ్ళిద్దరూ 'మేము బయలుదేరి వెడుతున్నాము, నువ్వు బెజవాడ స్టేషన్‌కి వచ్చి కలుసుకో' అని వ్రాసారు. మేము హైదరాబాదులో ఉన్నాము. కానీ నాన్నగారు అమ్మని పంపలేదు. అమ్మ వెళ్ళాలని మొరపెట్టుకుంది. "నువ్వు వెళ్ళిపోతే నాకెలాగడుస్తుంది? " అన్నారంతే.. అమ్మ ఇక మాట్లాడలేదు. మాతృ వియోగపు దుఃఖం మనసులో ఇగిరి ఇగిరి గడ్డ కట్టుకుపోయింది. ఆత్మీయులుని గతించినప్పుడు - వారిని కడసారిగా ఒకసారి చూసి అక్కడున్న బంధువులతో తోబుట్టువులతో కల్సి రోదిస్తే బాధ ఉపశమిస్తుంది. అలా కాకపోతే ఆ దుఃఅఖం మనిషిని కృంగదీస్తుంది. భర్త ఎంత పూజనీయుడైనా, ఆరాధకుడైనా తల్లిలాంటివాడు కాదుకదా? దాంతో ఒకరోజు అమ్మకి ప్రాణం మీదకి వచ్చింది. డాక్టర్ వచ్చి చూచాడు. అరికాళ్ళు చల్లబడిపోయాయి. పసుపు నూనె కలిపి అమ్మ అరికాళ్ళకి రాసి నేను వరండాలోకి వెళ్ళి ఏడుస్తూ కూర్చున్నాను. ఏ భగవంతుడో చక్రం తిప్పాడు. అమ్మ తిప్పుకుంది. "పక్షవాతం రావల్సింది, కొంచెంలో తప్పింది నాకే ఆశ్చర్యంగా ఉంది. ఆరునెలలదాకా ఆవిణ్ణి అరచేతులలో పెంచాలి" అన్నాడు డాక్టర్. అలాగే సేవ చేసాను. అమ్మ లేచి తిరిగింది. అది మా అదృష్టం. మళ్ళీ మానాన్నగారి సేవ నిరాఘాటంగా సాగింది. ఒక ప్రముఖ రచయిత అన్నారు, "రావుగారు ఇంత బాగా ఎలా వ్రాస్తారా? అనుకునేవాణ్ణి. ఇప్పుడు తెలిసింది, ఆ మహాపతివ్రత ఆరగారగా ఇచ్చే కాఫీలోంచీ వచ్చిన అమృత ధుళికలవి అందుకే అంత బాగుంటాయి' అని.

మా పెద్దబ్బాయి సుదర్శన్ అంటే మా అమ్మా, నాన్నగార్లకు ఆరోప్రాణంగా ఉండేది. వాణ్ణి 'కేర్'మని అననిచ్చేవారు కారు - వెంటనే బుజాన వేసుకునేవారు నాన్నగారు. "ఎందుకు నాన్నగారూ అస్తమానమూ వాణ్ణి అలా మోస్తారూ' అంటే 'ఇరవై ఏళ్ళకి ఇంట్లో పసివాడు వెలిసాడే! ఇన్నాళ్ళూ ఈ భుజం ఖాళీగా పడిఉంది, ఇప్పుడిక అలా ఉంచనూ' అనేవారు. అమ్మ అయితే గుండెలకత్తుకునే వాణ్ణి పెంచింది.

మా నాన్నగారు చనిపోయాక పుస్తకాలన్నీ కొన్ని పంచిపెట్టి, కొన్ని బెజవాడలో బాబూరావుగారి షాపులో ఇచ్చి అమ్మని ఢిల్లీ తీసుకుని వెళ్ళిపోయాము. నవంబర్ వచ్చింది. మొదటి వింటర్. భజనకి విఠల్ బాబుగారింటికి వెళ్ళి వస్తూ అమ్మ రోడ్డుపై అటూ ఇటూ తూలిందట. పక్కనే ఉన్న మా పెద్దకోడలు జయ ఎదురుగా ఉన్న డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్ళి మందులు వ్రాయించుకు వచ్చింది. అప్పుడు జ్వరం అమ్మకి ఆరువారాలైనా తగ్గలేదు. టైఫాయిడ్ అన్నారు. పారాటైఫాయిడ్ అన్నారు ఇదేమిటి అని డాక్టర్‌ని అడిగితే ఎక్స్‌రే తీయించుకురమ్మన్నాడు. తీయించి మర్నాడు నేను, మా ఆయన డాక్టరుకి చూపించాము. ఆయన పెదవి విరిచి మూడు నెలలు టైము అన్నాడు. నా గుండె పగిలింది. నాన్నగారు పోయి నాలుగునెలలయింది. అమ్మకూడా విడిచి వెళ్ళిపోతుందా? భోరుమన్నాను. "అదేమిటి? మిసెస్ రావ్! నువ్వు చాలా ధైర్యవంతురాలివని చెప్పాను - ఇలా బేలవయిపోతావంటే చెప్పకపోయేవాణ్ణి" అన్నాడు. ఇంటికి వచ్చేసరికి నా మొహం చూసి వ్యవహారం ఏదో బాగాలేదని మా అమ్మ పసికట్టింది. "చాలా నీరసంగా ఉన్నావన్నారమ్మా! బాగా రెస్ట్‌కావాలి" అన్నాను.

బందరు డాక్టరుగారు రావుగారని పెద్దాయన ఉండేవారు. ఆయన ఇండియాలోకల్లా పెద్ద టీబి స్పెషలిస్ట్. మా పెద్దబ్బాయిని పంపి ఆయన్ని ఇంటికి పిలిపించారు. ఆయన రేపు ఆస్పత్రికి తీసుకురామ్మా! టెస్టు చేసి చూద్దాం అన్నారు. మర్నాడు అమ్మని తీసుకువెళ్ళి అన్ని టెస్టులు చేయించాము. రిపోర్టు వచ్చాక డాక్టరుగారు ఇంటికి వచ్చి 'ఆమెకేమీ ప్రాణభయం లేదమ్మా! ఆమెకి జబ్బు పేరు చెప్పకుండా

నవ్వుతూ వేళకి మందు,పథ్యం - పానం ఇచ్చి సేవ చేయాలి' అన్నారు. అలాగే అన్నాను. మందులు వ్రాసి ఇచ్చారు. మా ఆయనతో అన్నాను'ఇదేమిటండీ! ఈయన నా ముఖం చూసి ఇలా చెపుతున్నారా?' అని. 'నాతోనూ అలాగే అన్నారు. నువ్వు ఏడుపుమాని మీ అమ్మ సంగతి జాగ్రత్తగా చూసుకో' అన్నారు.

అప్పుడు మా పెద్ద మనుమడు నెలలవాడు. కొన్నాళ్ళు పెద్దబ్బాయిని వేరే కాపురం పెట్టమనండి.వాళ్ళు వేరే వెళ్ళారు. రోజా నేనూ మా ఆయనా వాకింగ్‌కి వెళ్ళి చంటివాణ్ణి చూసి వచ్చేవాళ్ళం. అమ్మకి ఒక ప్లేటు, గ్లాసు విడిగా పెట్టాము. ఆవిడ గదివేరు. అమ్మ గ్రహించుకుంది. అమ్మ స్థితప్రజ్ఞురాలు. తను కంగారుపడి, మమ్మల్ని కంగారు పెట్టకుండా రోజులు గడిపింది. కోర్స్ ప్రారంభించాము. ఏమీ తినకుండా పరగడుపున మందువేసుకోవాలి. అలా వేసుకుంటే కడుపులో జ్వాలలు లేచేవి. రెండువారాలు భరించడం కష్టమయిపోయింది. తరువాత కాస్త తగ్గి అన్నం మీద ధ్యాస వచ్చింది. మెత్తగా అన్నం వండి, రెండుజీలకర్ర పాచలు పోపువేసి బీరకాయ కూర చేసిపెట్టవే అనేది. చేసి ప్లేటులో పెడితే కూర నోటికిరాసుకుని బాగోలేదే తీసెయ్యి అనేది. అలా అన్నప్రాసన అయిన నాలుగునెలలకి అమ్మ ఒక ముద్ద తిని మంచం మీద కూర్చోగలిగింది. తేరుకున్నాక ప్రతి సంవత్సరమూ ఆంధ్రా వెళ్ళి సంక్రాంతి అయ్యాక వచ్చేది. నూజివీడులో, విజయవాడలో సంక్రాంతి సంబరాలు, భోగిపళ్ళు, ముగ్గులు చూసి ఆనందించేది. ఒక్కరోజుమాత్రం సుస్తీచేసినందుకు బాధపడింది, 'ఢిల్లీ వెళుతున్నానంటే ఎంతో పొంగిపోయానే! మీ నాన్నగారు ఎక్కడికీ కదలనిచ్చేవారు కాదు, ఇక్కడెన్నో చూద్దామనుకున్నాను, ఈ జబ్బు వచ్చి నన్ను నాలుగుగోడల మధ్య బంధించిందే! ' అని.

ఒకసారి డెహ్రాడూన్ ప్రయాణం పెట్టుకున్నాము. అమ్మకి ఓపికలేదు. అయినా సరే వస్తాను గంగ స్నానం చేస్తాను అని పట్టుపట్టింది. వాను వెనక ఖాళీ చేసి పరుపు వేసి పడుకోబెట్టి తీసుకువెళ్ళాము. గంగ స్నానం చేసింది మహదానందంగా. పేరంటమో, పార్టీయో, భజనలు పూజలు ఏదైనా సరే అతిథులు వచ్చే సమయానికి అరగంట ముందు చక్కని జరీచీర కట్టుకుని తయారయి హాలులో కూర్చుని వచ్చి వాళ్ళ క్షేమసమాచారాలడిగి సరదాగా కబుర్లు చెప్పేది. నేను గబగబా కనిపించిన చీర ఏదో కట్టుకోబోతుంటే అదిబాగోలేదు, ఫలానాది కట్టుకో అని ఆదేశించేది. మా ఇంటికి వచ్చి వెడుతూ ఎవరైనా మాపిల్లలకి డబ్బులు చేతిలో పెడితే వాళ్ళు అవి అమ్మ దగ్గర దాచుకునేవాళ్ళు. నాచేతికిస్తే మళ్ళీ ఇవ్వనని అపనమ్మకం. డబ్బులే కాదు, పెన్సిళ్ళు, రబ్బర్లు, పెన్నులు, ఆటాడే బంతులు, చాక్‌లెట్లు, బాక్సింగ్ చేసేవాళ్ళ బొమ్మలు అన్నీ దాచుకునేవారు. వాళ్ళ డబ్బులు వాళ్ళకిచ్చేటప్పుడుఆపై మరికొంచెం డబ్బులు వేసి ఇచ్చేది. అమ్మమ్మా! ఎక్కువ ఇచ్చావు అంటే అదేన్రా చాలా రోజులు ఉంచారుగా! రూపాయలకి పాపాయిలు పుట్టాయి అనేది. నిద్రపోతుండగా లేపి అడిగినా ఎవరి వస్తువు వారికిచ్చేది. ఒకళ్ళు దాచుకున్న వస్తువు గురించి మరొకరికి తెలియనిచ్చేది కాదు.

పెద్దకోడలికి పురిటిరోజులు రాగానే తను మా అబ్బాయితో సహా మా వియ్యాలవారింటికి వెళ్ళిపోయింది. నెమ్మదిగా వెళ్ళొచ్చు కదే అంటే నా ముని మనవణ్ణి ముందుగా నేనే చూడాలి అని. మా పెద్దమనుమడు సమీర్ చాలాముద్దుగా, జనరంజకంగా ఉండేవాడు. నెమ్మదిగా, మృదువుగా, మధురంగా చిలుకపలుకులు పలుకుతుండేవాడు. వాణ్ణి పక్కన పడుకోపెట్టుకుని తెలుగు అంకెలు అన్నీ నేర్పింది పదిదాకా. ఒకరోజు హఠాత్తుగా హిందీలో పదిదాకా అంకెలు చెప్పాడు. ఎవరు నేర్పారురా నీకు అంటే 'తాతమ్మ' అన్నాడు. మేము వంటపనిలో ఉన్నప్పుడు వాణ్ణి వాకిటి వరండాలో కూర్చోపెట్టుకొని ఆడించేది. ఆ ఆట ఏమిటో తెలుసా? పాత పేపరు తీసుకుని ఒక్కొక్క ముక్క తుంపి వాడికిచ్చేది. వాడుతీసుకుని కింద పడేసేవాడు. అన్నీ అయిపోయాక మళ్ళీ ముక్కలన్నీ తీసుకుని ఒక్కొక్కటే వాడికిచ్చేది. వాడు కిందకి విసిరేసేవాడు. ఓపిక ఉన్నప్పుడు వాడిని తీసుకుని రెండు సందులు తిరిగి వచ్చేది. ఒకరోజు నేనూ వాడు షికారుకెళ్ళాము. ఏదో కబుర్లు చెపుతూచెబుతూ నేను తారురోడ్డు మీదకి అడుగు వేసాను. వెంటనే వాడు 'బామ్మా! ఆ నల్లదానిమీద నడవకూడదు. ఎర్రదారిలోనే నడవాలీ అన్నాడు. ఎందుకని? అన్నా. నల్లరోడ్డు మీద బస్సులు, కార్లు, సైకిళ్ళు వస్తాయి. ఎర్రరోడ్డు మీద రావు అన్నాడు. ఎవరు చెప్పారురా నీకు అంటే తాతమ్మ చెప్పింది అన్నాడు.

మా అమ్మ ఉండగానే మా పెద్దబ్బాయి భార్యా పిల్లవాడితో సహా కెనడా వెళ్ళాడు లోలోపల చాలా బెంగపడింది. నన్ను వదిలిపెట్టి ఎలా వెడతావురా? అని అడిగింది. వాకిట్లో పై అంతస్తుకు వెళ్ళే మెట్లు ఉన్నాయి. సమీర్ గబగబా నాలుగు మెట్లు ఎక్కినిలబడి చెయ్యి ఊపుతూ "తాతమ్మా! ఏరోప్లేన్ ఎక్కి ఇలా టాటా చెప్పి వెళతా" అన్నాడు. అమ్మ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎప్పుడూ ఆ దృశ్యమే తలుచుకునేది. మా అబ్బాయి వెళ్ళి మూడు సంవత్సరాలదాకా రాలేదు. మా అమ్మా నేను చాలా బెంగ పడిపోయాము. అమ్మకి మళ్ళీ సుస్తీ వేసింది. వాళ్ళ వాళ్ళని ఎవరినైనా చూడాలని ఉందేమో రమ్మని వ్రాయనా అమ్మా! అన్నాను. పిచ్చిదానా! ఎవరొచ్చి ఏమిచేస్తారే! నా జబ్బు తీసిపారేస్తారా అంది. నీ పెద్దమనుమణ్ణి రమ్మని ఫోన్ చెయ్యనా! అన్నాను. అది అడగాలటే రమ్మను అంది. వాడొచ్చి అమ్మ దగ్గరే కాలక్షేపం చేసాడు. ఆఫీసు పనికాదు అమ్మమ్మా! నీకోసమే నాడబ్బుతో టిక్కెట్టు కొనుక్కుని వచ్చాను అన్నాడు. మంచి పని చేసావు నాయనా! డబ్బు చాలా సంపాదిస్తావులే అమ్మమ్మని మళ్ళీ చూడలేవు అంది. వాడు తిరిగి వెళ్ళిన నెలరోజులకే అమ్మ కన్నుమూసింది.

పోయేముందు ఒక తమాషా చేసింది. ఆరోజుల్లో అత్తలు అల్లుడికి కనిపించేవారు కాదు. అమ్మకి అసలే బిడియం. మా వారికంట పడేది కాదు. ప్రమాదవశాత్తు ఎప్పుడైనా కంటపడితే తప్పు చేసినట్టు ఏ తలుపు చాటుకో పారిపోయేది. "ఏమిటోయ్! మీ అమ్మగారలా వెళ్ళిపోతారు నేనంత చూడకూడని వాణ్ణా అనేవారు" మా ఆయన. ఆయన పొద్దున్నే ముఖం కడుక్కుని తన గదిలోకి తను వెళ్ళిపోతే మా వారు ఆఫీసుకి వెళ్ళేదాకా బయటికి వచ్చేదికాదు. ఆ గదిలో కూర్చుని కూరతరిగి పెట్టేది, బియ్యం ఏరిపెట్టేది, దేవుడికి పారిజాతాలు మాలకట్టి పెట్టేది. ఈయన నోట్లోంచి జ్ఞాన అని పిలుపు వస్తే చాలు, చూడు మీఆయన పిలుస్తున్నాడు, వెళ్ళి ఏమికావాలో కనుక్కో అని ఊదర కొట్టేది. అలాంటి మనిషి మరో పదిరోజులకి పోతుందనగా ఒకరోజు అమ్మదగ్గర కూర్చున్నాను. ఈయన పక్కనే కారిడార్లో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. "రామేశ్వర రావుని పిలువు" అంది. నాకు నోటమాట రాలా! తెప్పరిల్లి ఏమండీ అమ్మ పిలుస్తోంది అంటే ఆయన నమ్మశక్యంగాక నావంక అలా చూస్తుండిపోయారు. అమ్మ మళ్ళీ మీ ఆయన్ని ఇలా పిలు అంది. ఆయన గదిలోకి రెండడుగులు వేశారు. మా అమ్మ తన కుడి చేయి ముందుకు జాపింది. మాకిద్దరికీ ఏమీ అర్థంకాలా! అప్పుడు అమ్మ రామేశ్వరావు అంది. దగ్గరికి రండి అన్నాను. ఆయన అమ్మ మంచం దగ్గరికి వచ్చారు. అమ్మ ఆయన చేతిని తన చేతిలోకి తీసుకుని షేక్‌హ్యాండ్ ఇచ్చింది. మా ఇద్దరికీ మాటలు లేవు. మూగవాళ్ళలాగా నిలబడ్డాము. "మీరు నన్ను చాలా బాగా చూసుకున్నారు. కొడుకులా ఆదరించారు. నాకేమీ కోరికలు లేవు నేను చాలా సంతోషంగా వెళ్ళిపోతున్నాను థాంక్స్" అంది. నా వంక తిరిగి - "తల్లి అనేది ఎన్ని ఏళ్ళు బతికుంటే తనివి తీరుతుందమ్మా! నువ్వు ఎంతో అదృష్టవంతురాలివి, నేను ఇప్పటికీ నీతోఉన్నాను. భూమిమీదపడగానే తల్లిని పోగొట్టుకున్న అభాగ్యులు ఎంతమందిలేరు. నువ్వు నాకు ఎంతో సేవ చేసావు ఇంత చేయగలవని నేను అనుకోలేదు. అమ్మ పోయిందని బెంగపెట్టుకుని ఆరోగ్యం పాడుచేసుకోకు. పిల్లలు, సంసారం జాగ్రత్త" అంది. పిల్లలకి అమ్మ మాట వినమని, అమ్మని సంతోషపెట్టమని చెప్పింది. చివరి రోజుల్లో నా చేయి పట్టుకునే ఉండేది. "నీ చెయ్యి వదిలితే చచ్చిపోతానేమో అనిపిస్తోందమ్మా" అనేది. తెలియకుండానే లిప్తపాటులో మా చేతులు వేరయాయి. అమ్మ ప్రాణం పంచభూతాలలో కలిసిపోయింది. నాకు చాలా ఏళ్ళదాకా అమ్మ పోయిందని నమ్మకం కలిగేదికాదు. ఏ సంగతి జరిగినా అమ్మతో చెప్పాలనిపించేది. ఏమూలనుంచో "సచితా" అని పిలిచినట్లుండేది. మా అమ్మా,నాన్నగారు నన్ను ఆ పేరుతోనే పిలిచేవారు.

పసుపు పచ్చగా విచ్చిన గులాబీపూవు గాలిలో కదిలినప్పుడు, తియ్యటి రుచి నోటికి తగిలినప్పుడు, కొండమీదనుంచీ స్వచ్ఛమైన సెలయేరు ప్రవహించినప్పుడు అమ్మ కళ్ళెదుటకొస్తుంది. అమ్మే మనకి ఇంతచేసింది అని తెలిసేసరికి ఒకవంతు జీవితం అయిపోతుంది. తల్లి పిల్లలకింతలా చాకిరీ చేసి పెంచాలా! అని తెలిసేసరికి మరో వంతు గడిచిపోతుంది, అమ్మ రుణం ఎలా తీర్చుకోవాలి! అని ప్రశ్నించుకుని రుణం తీర్చుకోవాలనుకునేసరికి అమ్మ కనుమరుగయిపోతుంది. క్షణక్షణం అమ్మ గుర్తులు ఎదలో కదులుతూనే ఉంటాయి. అమ్మకి జోహారులు బాధల్ని అవమానాల్ని లోట్లని గరళంలా గొంతులో దాచుకుని బ్రతికే స్త్రీలెంతమందో ఉన్నారు. శివుడు విషం మిగాడని

కంఠం నీలంగా మారింది కనుక మనమంతా గుర్తిస్తాము కానీ ఆ గుర్తుకూడా కనిపించకుండా ఈ స్త్రీలు జాగ్రత్తపడ్డారు. వారికి మిగిలింది పతివ్రత ముద్ర ఒకటే!



జ్ఞానప్రసూన గారు అలనాటి ప్రముఖ పాత్రికేయులు స్వర్గీయ రావూరు వెంకట సత్యనారాయణ రావు గారి కుమార్తె. తెలుగులో బి.ఎ. చదివిన వీరు కథలూ, కవితలూ వ్రాస్తారు. హిందీ, ఇంగ్లీషు భాషల నుంచీ తెలుగులోకి అనువాదాలు కూడా చేసారు.

## ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పద్మశ్రీ డా. ఎస్.వి. రామారావు

**నే పుట్టింది కృష్ణాజిల్లా గుడివాడ.** చాలా కాలం క్రితం. ఆరోజుల మధుర స్మృతులు మరువలేనివి. జ్ఞాపకాలు బలమైనవి. కుటుంబ బాంధవ్యాలు లోతైనవి. వీధి బడి దగ్గర, బయట రోడ్డు ప్రక్క పిల్లల కోసం తట్టల్లో పెట్టుకుని జీడీలు అమ్మేవాళ్ళు. అద్దిన నువ్వులతో ఉన్న జీడీలను చాలా సేపు నోట్లో నానపెట్టుకుని ఉంచుకునే వాళ్ళం. కానీ అర్ధణాలకు జీడీలు అమ్మేవాళ్ళు. ఎన్నోగాని చాలానే వచ్చాయి. నేను జీడీలు ఇచ్చి బలపాలు తీసికొనేవాణ్ణి తోటి స్నేహితుల దగ్గర. ఆ రోజుల్లో పలకాబలపాలే ఉండేవి బళ్ళో మా అందరికీ. చాలా బలపాలు పోగుచేసేవాణ్ణి. రంగుల బలపాలు ఉండేవి ఆ రోజుల్లో. అవి ఎన్ని ఎక్కువ వుంటే అంత గొప్పగా భావించే వాళ్ళం కుర్రాళ్ళం. అలాగే సిగరెట్టు ఖాళీ పెట్టెలపై ఉన్న బొమ్మలు, అగ్గిపెట్టెల పైన ఉన్న బొమ్మలు తీసుకునే వాడిని రంగుల బలపాలిచ్చి, జీళ్ళూ ఇచ్చి. ఈ బొమ్మల సిగరెట్టు పెట్టెల్ని 'బచ్చా' ఆటలకు వాడేవాళ్ళం. కర్రా,బిళ్ళా గాజుగోళీ ఆటలు కూడా ఇడేవాళ్ళం. ఈ విలువైన ఆట సామాగ్రి అంతా దాచుకునేవాణ్ణి - ఎవరికీ కనపడని చోట పెట్టి. ఇవన్నీ మగపిల్లల ఆట సామాగ్రి.

మా అమ్మకు మాత్రమే ఇవన్నీ కనిపించేవి. నేను ఎక్కడ దాచినా కనిపించేవి. ఆవిడవి ఎక్స్‌రే కళ్ళు మా నాన్నకు కంప్లైంట్ చేసేది "వీడికి కర్రా బిళ్ళా, గోళీలు, బచ్చాలు ఆడటం తప్ప ఇంకో ధ్యాస లేదు. బడికి వెళ్ళేది చదువుకోసం కాదు. రోడ్లంట. వీధుల వెంట పడిపోయి చెడిపోవటానికి. వీడికి డబ్బు ఇచ్చి పాడు చేసేది మీరే. మాష్టారుగారితో చెప్పి గోడ కుర్చీలు వేయించండి. అప్పుడైనా బుద్ధి వస్తుందేమో."

"వాడు ఇంకా చిన్నవాడే కదా" అంటూ సర్ది చెప్పేవారు నాన్న. మా నాన్నకు, అమ్మకు చదువు లేదు. వ్రాయడం, చదవడం తెలియదు. మాది కలప వ్యాపారం. అడితి అనేవారు దాన్ని... "కలప అడితి". గుడివాడలో పెద్ద పెద్ద ఇళ్ళు కట్టింది మా నాన్నగారే. చాలా మంది వడ్రంగులు మా కింద పనిచేస్తూ ఉండేవారు . కంట్రాక్టులు తీసుకుని, పెద్ద ఎత్తున వ్యాపారం చేసేవారు నాన్నగారు.

చిన్నప్పుడు, చద్ది అన్నం తిని బడికి వెళ్ళే వాణ్ణి. క్రితం రాత్రి వండిన కూరలు కలుపుకుని అన్నం తినేవాణ్ణి. చల్లటి మీగడ పెరుగు అన్నం, "చదువుతో బుర్ర వేడెక్కిపోతుంది కదా! అందుకని మెదడుకు, చలవ కోసరం ఇలా తినాలి" అనేది అమ్మ. కిళ్ళీలు వేసుకోనిచ్చేది కాదు. కిళ్ళీలు వేసుకుంటే నాలుక బండ పడి చదువు రాకుండా పోతుంది అనేది. మిడిల్ స్కూల్లో నే చేరేసరికి ఇడ్లీలు, పెసరట్లు, ఉప్మాలు చేస్తుండేది. చద్దన్నం తినడం బాధ తప్పింది. మా నాన్నతో కాఫీ హోటల్‌కు వెళ్ళేవాణ్ణి, శని ఆదివారాల్లో. కాఫీ

హోటల్ సర్వర్ కాఫీ చల్లార్చడం ఆశ్చర్యంగా ఉండేది. రెండు చేతులు బారచాపి, కాఫీ ఒక కప్పులో నుంచీ మరొక గ్లాసులో పోస్తూ చల్లార్చడం. ఒక్క చుక్క కూడా క్రింద పడేది కాదు. కాఫీ అరగజం ఎంత? గజం అయితే ఎంత? అని క్యాషియర్‌ను అడిగేవాళ్ళం కుర్రాళ్ళం సరదాగా.

అమ్మ తల్లితండ్రులది బెజవాడ. ఆరుగురు ఆడపిల్లల్లో మా అమ్మ లక్షమ్మ పెద్ద కూతురు. నేనే పెద్ద మనవణ్ణి. మా తాతగారికి. తరచుగా నేనూ, అమ్మా వీలున్నప్పుడు మా నాన్నగారూ అందరం రైల్లో గుడివాడ నుంచీ విజయవాడ వెళ్ళేవాళ్ళం. నాకు బాగా జ్ఞాపకం. ఎప్పుడు వెళ్ళినా రైల్లో మరచెంబు వెంట తీసుకుని వచ్చేది. కంచు మరచెంబు బూడిదతో రాచి కడిగింది, బంగారంలా మెరుస్తూ ఎంతో అందంగా ఉండేది. రెండు ఊళ్ళ మధ్య ఆరు లేక ఏడు స్టేషన్స్ ఉండేవి.

అన్ని స్టేషన్లలో రైలు ఆగేది. ఇందుపల్లి లేకపోతే తరిగొప్పుల స్టేషన్‌లో గానీ రైలు ఆగితే "అరె రాముడూ! వెళ్ళి మరచెంబు నిండా మంచి నీళ్ళు పట్రా" అనేది. అక్కడ బోరింగు పంపు ఉండేది. ఒకచేత్తో పంపు కొడుతూ, రెండవ చేతిలో చెంబు పట్టుకుని నీళ్ళు పట్టేవాణ్ణి. అందరూ ఒక్కసారి గుమికూడేవారు పంపు దగ్గర. రైలు బండిలో ఉన్న వారందరూ ఒక్కసారే నన్ను చూచి వచ్చారేమో అనిపించేది. ఒకప్రక్క రైలు కదిలి వెళ్ళిపోతుందేమో అని భయం. రైలు వంక చూస్తూ, త్రోసే జనం మధ్య నీళ్ళు పట్టేవాణ్ణి. రైలు కూత వేసేది. వెంటనే వెళ్ళేది కాదు రైలు. వార్నింగ్ లాగ వేసేది కూత. గార్డుగారు ప్లాట్‌ఫాం మీద ఒక్క చేత్తో ఆకుపచ్చని జెండా ఊపుతూ, ‘విజిల్‘ ఊదేవారు. భయం వేసేది నాకు రైలు ఎక్కడ కదిలిపోతుందేమో అని. నెమ్మది, నెమ్మదిగా, ఝుక్, ఝుక్ అంటూ సౌండు చేస్తూ కదులుతుండేది రైలు. నేను గబగబా నీళ్ళ చెంబుతో పరుగెత్తుతూ రైలు ఎక్కేవాడిని. తలప్రాణం తోకకు వచ్చేది. బయలుదేరినా ఎవర్నీ వదిలి పెట్టి వెళ్ళేది కాదు రైలు. అందరు ప్యాసింజర్లు రైలు ఎక్కేవారు తాపీగానే.

నాకు కోపం వచ్చేది మా అమ్మ మీద "ఎందుకమ్మా! ఎప్పుడూ స్టేషన్లోనే నీళ్ళు తెమ్మంటావ్? ఇంటి నుంచీ తెచ్చుకోవచ్చు కదా!" అని విసుక్కునేవాణ్ణి. "రైలు స్టేషన్‌లో నీళ్ళు బావుంటాయిరా. ఈ నీటి తీపే వేరు. మన ఊరి చెరువు నీళ్ళలాగా ఉంటాయి" అనేది. అది నిజంగానే ఆ నీటి రుచేవేరు. ఎంతో తియ్యగా ఉండేవి త్రాగుతుంటే మంచి నీరు. నాకూ బాగా నచ్చేవి ఆ నీళ్ళు.

నాకు అంటు పులుసులు అంటే భలే ఇష్టం. ఎప్పుడూ ఏదో అంటుపులుసు ఉండేది. రోజూ అమ్మ నాకోసరం చేసేది. మామూలు స్వీట్సు చేసేది. పూర్ణాలు, అరిసెలు, కజ్జికాయలు, బెల్లంతో చేసిన వేరుశనగ ఉండలు లాంటివి. చక్రాలు పెసర పునుగులు, గారెలు, పకోడీలు చేసేది. చిరుతిండి వెరైటీలు బహు కొద్ది మాత్రమే తెలుసు. "మైసూర్ పాకం, హల్వాలు, ఖాజాలు చేయగూడదామ్మా!" అనేవాణ్ణి ఉడికించడానికి.

"అరే! అవన్నీమిఠాయి షాపులో దొరుకుతాయిరా. అయినా నాకు నాజూకు స్వీట్లు చేయడం చేతకావురా. మీ ఆవిడ వచ్చాక చేయించుకుందువులే. ఈ తరం వారికే అన్నీ చేయడం తెలుసు. నేను పాతకాలపుదాన్ని" అనేది.

ఆ ఆశ ఇప్పటికీ తీరలేదు. నా భార్య సుగుణ విశాఖపట్నంలో కాన్వెంటులో చదివింది కాలేజీ వరకు. తర్వాత డాక్టరు గిరి చేసి అమెరికాకు వచ్చింది. తనకు ఇవన్నీ చేసేందుకు టైము ఎక్కడ? మా అమ్మ అన్నట్లు దొరుకుతున్నాయి, నాకు కావలసిన నాజూకు స్వీట్లన్నీ అమెరికాలో భారతీయ మిఠాయి దుకాణాల్లో.

ఆ పాతకాలపు తత్వంతోనే నా తరువాత పుట్టిన చెల్లెల్ని సెకండ్ ఫారంతో చదువు ముగించేశారు అమ్మా నాన్న. "ఎంత చదువుకావాలి ఆడపిల్లకి? నేనేం చదువుకున్నాను? నాన్న మాత్రం.? ఏమంత ఇబ్బంది అయింది మాకు?" అని జవాబు చెప్పింది అమ్మ. నా రెండో చెల్లెల్ని మాత్రం నేను పట్టుబట్టి చదివించేట్లు చేశాను. బి.ఎస్.సి, బి.ఇడి. చదివింది సుశీల.

1950లో స్కూలు ఫైనల్, ఎస్.ఎస్.ఎల్.సి ప్యాసయ్యాను. ఆర్టిస్ట్ అవ్వాలని నిర్ణయించుకున్నాను. ఇప్పటికే ఆంధ్రప్రదేశంలో G.D(ART) అనే డిగ్రీ నాలుగేళ్ళు మా హైస్కూలు మాష్టారు గారి వద్ద చదువుకుని తెచ్చుకున్నాను. నేను ఆర్టిస్ట్ అవ్వడం మా నాన్నకు

ఇష్టం లేదు. ససేమిరా అన్నారు. దాంతో రగడ ఇంట్లో. మా అమ్మ ఏమీ అనలేకపోయేది. సాత్వికురాలు. పెత్తనం, నిర్ణయాలు తీసుకోవడం అంతా మా నాన్నగారే ఇంట్లో. నా తర్వాత ఇద్దరు చెల్లెళ్ళు, తర్వాత కొంత కాలానికి తమ్ముడు పుట్టాడు. పెద్ద కొడుకుని. ఇంటికి, బాధ్యతలు ఉంటాయి కనక ఎందుకూ పనికిరాని 'ఆర్ట్' చదువు వద్దన్నారు. బ్రతుకు అంతా పాడయిపోతుంది. ఆర్టిస్ట్ అయితే ఉద్యోగాలు దొరకవని, డ్రాయింగ్ మాష్టారు ఉద్యోగమే జీవితం అంతా చెయ్యాల్సి చెప్పారు అందరూ.

మా నాన్నలాగానే నేనూ చాలా పట్టుదల మనిషిని.

మరువలేని సంఘటన. జీవితంలో నా జీవిత పంథాను మార్చిన ఘటన.

కోపంతో ఉన్నాను. పంతంతో ఉన్నాను. ఒకరోజు సాయంత్రం బెజవాడ వచ్చి టిక్కెట్టు కొనుక్కున్నాను. కలకత్తాలో ఉన్న శాంతి నికేతనం వెళ్ళేందుకు, గేటులో టిక్కెట్టు కలెక్టర్ ప్రక్కనే ఒక ఆవిడ, మా అమ్మ అంత వయసులో ఉన్న ఆవిడ కొంగుతో కండ్లు అద్దుకుంటూ ఏడుస్తున్నది. అది చూశాక నాలో ఏదో ముద్రపడింది. చటుక్కున నాలో కలిగిన భావం "నే వెళ్ళిపోతే అమ్మ అలా ఏడుస్తోంది కాబోలు" అని. సరే బండి ఎక్కాను. రైలు బయలుదేరింది. నా మనసులో ఆ ఏడుస్తున్న ఆవిడే, పదే పదే వస్తున్నది. నిడదవోలుకు అనుకుంటాను వచ్చింది రైలు. ఇక ముందుకు వెళ్ళలేక పోయాను. దిగిపోయాను స్టేషన్‌లో. తిరిగి వెళ్ళేందుకు టిక్కెట్టు కొనుక్కునేందుకు డబ్బులు లేవు. స్టేషన్‌లో బయట ఉన్న బెంచీపై చీకట్లో కూర్చున్నాను. ఏదో తిరుగు రైలు వచ్చింది, రెండు మూడు గంటల తర్వాత, భయంతో రైలు ఎక్కాను. టిక్కెట్టు కలెక్టరు రాకుండా చేయమని భగవంతుణ్ణి ప్రార్థించాను. అలాగే టిక్కెట్టు కలెక్టరు రాలేదు. బ్రతికి పోయాను. బెజవాడ వచ్చాక ప్లాటు ఫారం మీద సత్యన్నారాయణ పురం వైపుకు నడచిపోయాను. కొంత దూరం వచ్చాక మనిషి దూరేంత ఖాళీ ఉన్న "ఫెన్స్" కనిపించింది. అందులో దూరి బయటకు వచ్చాను. రోడ్డు మీదకు వచ్చాను. అమ్మా అనుకుని భయం తీర్చుకున్నాను. మా కలప అడితీలో పనిచేసిన ఒకరు - చిన్న పంతులుగారు ఉన్నారు దగ్గర్లో. ఆయన ఎకౌంట్స్ చూశేవారు అడితిలో. వారిల్లు తెలుసు నాకు. వారింటికి వెళ్ళాను. అదృష్టవశాత్తు ఇంట్లో ఉన్నారు ఆయన. జరిగినదంతా చెప్పాను. "ఎందుకు అలా చేశావు? అర్థం లేనిపని. ఎక్కడకు వెళ్దామని, ఏం చేద్దామని, ఎలా చదువుదామని? బుద్ధిలేని పని చేశావ్" అని చివాట్లు వేశారు. వెంటనే గుడివాడకు మా ఇంటికి తీసుకెళతానని అన్నారు. తిరిగి వెళ్ళదలచుకోలేదు. చాలా గాబరా పడతారు అమ్మా నాన్న అని చెప్పినా వినలేదు నేను. మొండికేశాను. మూడురోజులు వారింట్లో ఉన్నాక, నచ్చ చెప్పి నన్ను వెంట పెట్టుకుని మా ఇంటికి తీసుకుని వెళ్ళారు. ఇంటికి వెళ్ళేప్పటికి మసక మసక చీకటిగా ఉంది. వరండాలో నులక మంచంపై పడుకుని ఉన్నారు నాన్నగారు. మేము రాగానే లేచి కూర్చున్నారు. నన్ను చూసి మాట్లాడలేదు. నేనూ నేనూ మాట్లాడలేదు. "ఏమమ్మా లక్షమమ్మగారూ! ఎలా ఉన్నారు?" అని పంతులుగారు పలకరించారు గట్టిగా. అమ్మ ఇంటిలో నుంచీ వచ్చింది బయటకు. నన్ను చూసి దగ్గరకు వచ్చింది. నా తలపై చేయి వేసి నిమిరింది. "రెక్కలు వచ్చాయి గనక నువ్వు ఎగిరిపోయావ్. మరి చెల్లెళ్ళను ఎవరు చూస్తారు? ముసలి వాళ్ళ మీద బాధ్యత వేసి వెళ్ళిపోయావ్. మాకు తప్పుతుందా బాధ్యత" అన్నది. ఇంకేమీ అనలేదు. బల్లెంతో గ్రుచ్చుకున్నాయి ఆ మాటలు. ఏడ్పు ఆపుకోలేక, ఎందుకేడుస్తున్నానో తెలియక ఏడ్చాను. అమ్మ నన్ను ఇంట్లోకి తీసుకు వెళ్ళింది. మా నాన్న మాట్లాడలేదు. అమ్మ మాటలు ఈనాటికీ నా చెవుల్లో రింగు రింగున మ్రోగుతున్నాయి.

"కనీసం కాలేజీ డిగ్రీ తీసుకోవాలి. ఆ తర్వాత నీ ఇష్టమైన ఆర్ట్ నేర్చుకోవచ్చు. ఎవరి ఖర్మకు ఎవరు కర్తలు" అన్నారు నాన్న. అలా అని అమ్మే ఒప్పించింది నాన్నను. అది వారిద్దరి మధ్య ఒడంబడిక. ఆ ఏడ్చే ఆవిడను స్టేషన్‌లో చూసి ఉండకపోతే నా జీవితం ఎలా ఉండేదో ఊహించలేను. ఏడ్చిన ఆవిడలో అమ్మ ఉండి నా జీవితాన్ని మరో మార్గంలో పెట్టింది, అని ఈనాటికీ నమ్ముతాను. ఆ టిక్కెట్టు ఇప్పటికీ భద్రంగా దాచి ఉంచాను. నా దగ్గరే ఉంది పదిలంగా. తర్వాత మద్రాసులో చిత్రకళ నేర్చుకుంటున్నప్పుడు ఓ పదిమంది ఆర్ట్ స్టూడెంట్స్‌తో శాంతినికేతనం వెళ్ళాను. అలా వెళ్ళింది శాంతినికేతను చూట్టానికే. అప్పుడే వెళ్ళి ఉంటే శాంతినికేతనంలో ఆర్ట్ నేర్చుకుంటానికి వెళ్ళేవాడిని.

కాలేజీలో చదివే రోజులవి. రాత్రిపూట అమ్మ తాను నిద్రపోయే ముందు పాదాలకు ఆముదం వ్రాయమనేది. రెండు పాదాలకు వ్రాసి మర్దన చేసేవాణ్ణి. అలాగే మా నాన్నగారు "అరే రాముడూ! వచ్చి కాళ్ళు పిసకరా" అనేవారు.

చచ్చానా ఈయన నిద్రపోయే వరకు కాళ్ళు పిసకాలి అని అనుకునేవాణ్ణి. ఆయన నిద్రపోయే వరకు కాళ్ళు పిసికేవాడిని. ఎదురు జవాబు లేదు. ఆయన చెప్పింది చేయడమే నాకు గుర్తు.

ఈ సందర్భంలో నా కూతురు జ్ఞాపకం వస్తోంది. చెప్పక తప్పదు. మా అమ్మాయి పద్మావతికి ఆరేళ్ళ వయసు. అమెరికాలో ఆ రోజుల్లో ఉన్న మా టీ.వీ.కి రిమోట్ లేదు. చేత్తోనే నాబ్స్ తిప్పాలి ఛానల్స్ మార్చాలంటే. నేను కుర్చీలో కూర్చుని మాగ్జైన్ ఏదో చూస్తున్నాను. నాకు కొంత దూరంగా వెనుకగా కూర్చుని మా అమ్మాయి టాయ్స్‌తో ఆడుకుంటున్నది. "అమ్మా! వెళ్ళి మరొక ఛానల్ మార్చు" అన్నాను.

"డాడీ! నేను టీ.వీకి దూరంగా కూర్చుని ఉన్నాను. నువ్వు టీ.వీకి దగ్గరగా కూర్చుని ఉన్నావు. నువ్వే లేచి ఛానల్ మార్చుకోగూడదూ. అది ఈజీ కదా" అన్నది. నా తరం వారికి, తర్వాతి తరం వారికీ తేడా అది. లాజిక్, రీజనింగూ మాకు తెలిసిన పెద్దలపై ఉన్న గౌరవ భావానికి ప్రాధాన్యత నిచ్చేవాళ్ళం. ఇప్పటి తరం వారికి లాజిక్ ముఖ్యం అనిపిస్తుంది. బహుశా ఉమ్మడి కుటుంబ ప్రభావం మా మీద ఉన్నదేమో, వివరంగా చెప్పలేను కారణాలు.

మా అమ్మ నేను డాక్టరునవ్వాలని అనుకునేది. మా కుటుంబానికి ఉన్న డాక్టరు పింగళి శేషగిరిరావు గారు. వారిదే గుడివాడలో కల్లా అందమైన మేడ. ఇంటి ముందు వాటర్ ఫౌంటెన్ ఉండేది. మేడమీద రెండు వైపులా పెద్దగా ఛత్రపతి శివాజీ, కృష్ణదేవరాయలు విగ్రహాలు ఉండేవి. చక్కటి రంగుల్లో ఎండలో మెరుస్తూ అందరినీ ఆకర్షించేవి. అలా గుడివాడలో ఎవరి ఇల్లూ లేదు. ఆ ఇల్లు మా నాన్నగారే డిజైన్ చేసి కట్టారు. దానితోనే చాలా పెద్ద పేరు వచ్చింది మా నాన్నగారికి. ఇల్లు కట్టించుకుంటే గంగయ్య గారితోనే ఇల్లు కట్టించుకోవాలి అనేవారు గుడివాడలో. డాక్టరు అయితే అంత డబ్బు సంపాదించవచ్చు అనుకునేది అమ్మ. నాన్నగారు మాత్రం నేను ఇంజనీరు అవ్వాలని ఆశించారు. చూడండి ఎలా జరిగిందో. నా భార్య డాక్టరు అయింది. నేను ఆర్టిస్ట్ అయ్యాను. ఇంజినీరు కాలేదు. అమ్మ చాలా సంతోషించింది కోడల్ని చూసి. ఆవిడ కోడలు డాక్టర్ అని అందరూ చెప్పుకుంటుంటే బంధువుల్లో ఆ రోజుల్లో చాలా గర్వపడేది. కానీ ఏమి మాట్లాడాలో తెలియదు. నా భార్యతో ఏమి మాట్లాడితే ఏమి తప్పు అనుకుంటుందో కోడలు అని చాలా తక్కువ మాట్లాడేది. తలచుకుంటే అంతా కండ్లముందు కనిపిస్తుంది అమ్మ తడబాటు.

నాకు ఒక్క గుణం మాత్రం అబ్బింది అమ్మది. మా అమ్మ డబ్బుల్ని ఎన్నో చోట్ల దాచేది. "అరే! ఒక చోట డబ్బుపోతే మరోచోటైనా ఉంటుంది కదా. అంతా ఒకచోట ఉంచితే, దొంగలు పడితే అంతా పోతుంది కదా. అలా జాగ్రత్త పడాలి" అనేది. నేనూ అంతే అన్ని జేబుల్లో డబ్బు ఉంచుకుంటాను. కారులో కొంత ఉంచుతాను. అలాగ ఎన్నో చోట్ల ఉంచుతాను డబ్బు. ఒకచోట పోతే మరో చోట కనిపిస్తుంది. అమ్మ ఇచ్చిన ఈ గుణాన్ని నేను ఎంతో మెచ్చుకుంటాను.

1962లో లండన్ వెళ్ళాను. 1969లో లండన్ నుంచీ అమెరికా వచ్చాను. ఇంకా ఇక్కడే ఉంటున్నాము. 1984లో అనుకుంటాను అమ్మ నిన్ను చూడాలని ఉంది రమ్మని చెల్లెలితో ఉత్తరం రాయించింది. అప్పటి వరకు అది కావాలి, ఇదికావాలి అని ఏనాడూ కోరలేదు. ఇండియాకు రమ్మని అడగలేదు. ఎందుకు వాళ్ళని బాధపెట్టడం అని తలచే తల్లిదండ్రుల తత్వం అది. రమ్మని అడిగినందుకు నాలో భయం కలిగింది. నేను, నా భార్య, కూతురు ఇండియాకి వచ్చాం. మమ్మల్ని చూసి చాలా సంతోషించింది. అప్పుడు అమ్మకు 82 ఏళ్ళనుకుంటాను. ఆరోగ్యం అంత బాగుండలేదు. అయినా సరదాగా ఉంది. కానీ అమ్మ అనారోగ్యం నా కండ్లలో స్థిరనివాసం చేసుకుంది. ప్రక్క గదిలోకి వెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చాను. చెల్లెలు నన్ను చూసి తాను కూడా ఏడ్చింది. నాకు ఏడుపు ఆపుకోలేనంత వచ్చింది. చాలాసేపు ఏడ్చాను. నేను ఆవిడ దగ్గర చాలా కాలం ఉండలేకపోతున్నానని బాధ, గిల్టీ ఫీలింగ్ వేధించింది. బ్రతకటానికి పరాయి దేశాలకు వెళ్ళిన

వాళ్ళం. అక్కడ ఉద్యోగాలు వదులుకుని ఇక్కడ ఉండలేం కదా! అది తీరని బాధ. మనో వ్యధ. అమ్మ అనారోగ్యం బాగా లేదని మనసులో తీరని దుఃఖం. అమ్మని ఎంతో జాగ్రత్తగా చూసుకున్న చిన్న చెల్లెలు సుశీల, కంటికి రెప్పలా చూసుకున్న బావమరిది శ్రీ హనుమంతరావు గారిని నా మనసులో తలచుకున్నప్పుడు వయస్సులో వారిద్దరికంటే పెద్దవాడినైనా వారిద్దరికీ నమస్కారాలు పెడతాను. నేను తీర్చుకోలేని ఋణం వారిద్దరూ తీర్చుకున్నారు. ధన్యులు. మూడు వారాలు ఇండియాలో ఉండి నేనూ నా కుటుంబం అమెరికాకు తిరిగి వెళ్ళాం. మరో నాలుగు నెలల్లో మా అమ్మగారు చనిపోయారని వార్త వచ్చింది.

చెల్లెలు సుశీల చెప్పింది. అమ్మ చనిపోయే ముందు అన్నదట. "అమ్మా సుశీలా! నేను మూడురోజుల్లో చనిపోతాను అని."

"అలా అనవద్దమ్మా! నాకు భయం వేస్తుంది - నువ్వు అలా మాట్లాడితే, ఇప్పుడేమయింది? ఉన్న అనారోగ్యం అలాగే ఉంది. ఏమీ ఇబ్బంది కలిగించడం లేదు. అంతా బాగానే ఉంది మీ ఆరోగ్యం. ప్రమాదం ఏమీ లేదు" అందట సుశీల.

"అదికాదు నేనొచ్చిన పని అయిపోయింది కదా. అందుకని ఇక వెళ్ళిపోతాను మూడు రోజుల్లో" అన్నదట అమ్మ.

అన్నట్టుగానే మూడో రోజునే చనిపోయింది. ఆవేళ భీష్మ ఏకాదశి.

అమ్మ గురించి రాసినప్పుడు అమ్మ జీవితపు ముగింపుతో కాక అమ్మను జ్ఞాపకం ఉంచుకునే దానితో ముగిస్తాను.

బి.కాం చదువైపోయింది నాకు. ఆ రోజుల్లో మాది గుడివాడ కాలేజీ. తర్వాత అది ఏ.ఎన్నార్ కాలేజీ అయింది. మా నాన్న తెలివిగా నన్ను సినిమా రంగంలో అసిస్టెంట్ డైరెక్టరుగా ఉండేందుకు ఏర్పాటు చేసి పంపారు మద్రాసుకు. నేను ఆర్టిస్టునవుతాను అని పట్టుబట్టాను కదా లోగడ. అలాగేనని డిగ్రీ తెచ్చుకోక ముందు అన్నారు నాన్న. తీరా డిగ్రీ తెచ్చుకున్నాక తెలివిగా సినిమా రంగంలోకి ఉద్యోగ విధంగా మలిచారు. మద్రాసు వచ్చి కొన్ని రోజులు మాత్రమే అసిస్టెంట్ డైరెక్టరుగా చేశాను. తర్వాత కీ.శే. మాధవపెద్ది గోఖలే గారి ప్రేరణ, అనురాగాల వల్ల మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో చేరాను. నేను మద్రాసు వెళ్ళేటప్పటికే మా ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగుండలేదు. తెలిసిన స్నేహితులు మోసం చేయడం వల్ల కలప వ్యాపారంలో నష్టం వచ్చింది. తట్టుకోలేనంతగా. మా నాన్నగారిని ఆ ఆర్థిక ఇబ్బంది చాలా కృంగదీసింది. నేను మద్రాసు వెళుతుంటే మా అమ్మ తన మెళ్ళోని బంగారు చంద్రహారం గొలుసు తీసి ఇచ్చింది. "నాయనా పెద్ద ఊరు వెళుతున్నావు చేతిలో డబ్బు ఉంటే మంచిది. ఎందుకైనా అవసరానికి పనికి వస్తుంది ఈ నగ ఉంచుకో" అన్నది.

ఆవిడే నా అమ్మ. శాంతమూర్తి అమ్మ. నా హృదయంలో పిలవగానే పలికే, పదిలంగా ఉన్న అమ్మని ఎన్నటికీ మరిచిపోను.

**(దాదాపు దశాబ్దం క్రిందట ఆంధ్రజ్యోతి వారపత్రికలో వచ్చిన వ్యాసం ఇది. ఈ శీర్షికకి సరిపోతుందని శ్రీ ఎస్వీ రామారావు గారిని అడగ్గానే 'అయ్యో..ఇంత మాత్రానికి అడగాలా..? నిరభ్యంతరంగా వేసుకోండి..' అని అనుమతినిచ్చారు. వారి మాతృమూర్తి జ్ఞాపకాలని 'కౌముది' పాఠకులకి పరిచయం చేయడం ఇదొక అరుదైన అవకాశంగా భావిస్తున్నాం)**

***




పద్మశ్రీ డా.ఎస్వీ. రామారావు పేరుతెలీని వాళ్ళు, ముఖ్యంగా చిత్రకళారంగంలో ఎవరూ ఉండరనడంలో అతిశయోక్తి లేదు. ఆయన అంతర్జాతీయంగా పేరు గడించిన గొప్ప చిత్రకారులు. ప్రాచ్య, పాశ్చాత్య చిత్రకళారీతుల్ని అధ్యయనం చేసి వాటిని నవనవోన్మేషంగా చిత్రించిన ప్రముఖులు. కేవలం చిత్రకారునిగానే కాక కవిగా, రచయితగా కూడా మంచి పేరు తెచ్చుకున్నారు.

# వేదుల సుభద్ర

అమ్మ అనే మాట లోని కమ్మదనాన్ని గురించి కానీ, అమ్మ అనే వ్యక్తి గొప్పతనాన్ని గురించి కానీ ఎవరు ఎంత చెప్పినా తక్కువే కదా! మాతృదేవోభవ! లో అమ్మగురించి రాయడం తేలికే కదా! అనుకున్నానే గానీ ఎక్కడ నుంచి మొదలు పెట్టి, ఎంతవరకూ రాస్తే అమ్మని గురించి సరిగ్గా చెప్పగలను? అన్నదే పెద్ద ప్రశ్న అయింది. అనంతమైనదీ, ఏ స్కేలు కొలతలకీ అందనిదే కదా, అమ్మ ప్రేమ అంటే. కాకి పిల్ల కాకికి ముద్దు అన్న సామెత రాసినవారెవరో కానీ, ఆ పిల్ల అమ్మ, కాకి పిల్లకి గొప్ప అని ఎందుకు రాయలేదో మరి? ఎందుకంటే ఈ మాట నిజంగా నిజం. అమ్మ ప్రేమనీ, చేతి వంటనీ, ఆ మనసు ఒలికే మమతనీ తలుచుకుని మురిసిపోని పిల్లలుంటారా?? నేనూ, చెల్లి, తమ్ముడూ మాత్రం ఈ భావనలకి అతీతులం ఎలా అవుతాము? అందుకే మా ముగ్గురి తరపునా ఇది మా అమ్మ కోసం.



తూర్పు గోదావరి జిల్లా లోనే అతి పచ్చనిదీ, సారవంతమైనదీ గా ప్రసిద్ధి గాంచిన కోనసీమ రాజధాని అమలాపురానికి దాదాపు 2-3 కి.మీ దూరంలో ఉన్న పేరమ్మ అగ్రహారం మా అమ్మగారి ఊరు. అమ్మ పేరు సుందరి. 'గంటి రాముడు గారు' గా ప్రముఖులైన 'గంటి సుందరరామయ్య' గారు అమ్మ తాతగారు. వారి పెద్ద కొడుకు ' సోమయాజులు' గారి అమ్మాయే మా అమ్మ. డాడీ వాళ్ళ సొంత ఊరు, అక్కడ కి దగ్గరలోనే ఉన్న సాకూరు గర్వు. 'వేదుల బుల్లివిస్సన్నగారు' గా పేరు పొందిన 'వేదుల విశ్వనాథం' గారి రెండో అబ్బాయి, 'వేదుల వెంకట రామం' మా నాన్నగారు. వాళ్ళ వివాహమయిన కొత్తలో కొంతకాలం సాకూరు లోనే ఉన్న అమ్మా, నాన్నా, తరవాత డాడీ ఉద్యోగరీత్యా దగ్గరలో ఉన్న పెద్దాపురం, కాకినాడల నించీ, దూరాన ఉన్న ముంబై దాకా చాలా ప్రదేశాలు తిరిగారు.

ముగ్గురు పిల్లలూ, అతిధులూ, బంధువుల తోనూ, చుట్టుపక్కలవాళ్ళతోనూ, కుటుంబ సభ్యులతోనూ ఒకే రీతిలో కలిసిపోయి, అందరికీ తలలో నాలికలా ఉండే అమ్మ వయసు అప్పుడు గట్టిగా మాట్లాడితే పాతిక కూడా ఉండవు అనుకుంటే నాకిప్పటికీ ఆశ్చర్యమే!. మొదటి నుంచీ పల్లెటూరిలో పెరిగినా, చదువు విలువ, దాని వల్ల మనిషికి వచ్చే గౌరవం మా అమ్మకి బాగా తెలుసు. పదమూడో ఏట జరిగిన పెళ్ళివల్ల కుంటుపడిన తన చదువు మాతో కొనసాగాలని అనుకునేది అమ్మ. అమ్మ చెప్పిన ఎన్నో మంచి మాటల్లో ముఖ్యమైనవి , 'చదువులో మనకంటే ఎక్కువ వున్నవారితో పోల్చుకుని ఇంకా ఎదిగే ప్రయత్నం చెయ్యాలి. సంపదలో, మనకు ఉన్నదానితో మొదట తృప్తి చెందిన తరవాతే ఇంకా కావాలని ఆశ పడాలి. లేదు అనుకుని గడిపే జీవితంలో ఎప్పుడూ తృప్తి లేదు' అని. ఏనాడూ 'మనకి ఇది లేదు', అని అమ్మ అనుకున్నట్టు నాకు గుర్తు లేదు.

చదువు విషయంలో మాత్రం రాజీ పడకూడదు అనేది. ఎప్పుడైనా ఒకసారి, మేము 'మా క్లాస్ లో చాలా మందికి నా కంటే తక్కువ మార్కులు వచ్చాయమ్మా! ' అంటే, ఎక్కువ వచ్చిన వాళ్ళు ఉంటే వాళ్ళగురించి చెప్పమనేది. వాళ్ళతో పోల్చుకుని ఎక్కడ మెరుగు పర్చుకోవాలో తెలుసుకోమని చెప్పేది.. 'మనకు లేనప్పుడే దేని విలువ అయినా బాగా తెలుస్తుంది, నేను చదువుకోలేకపోయాను, మీరు మాత్రం బాగా చదువుకుని గొప్పవాళ్ళు కావాలి' అనేది. ఎవరైనా పొరపాటున 'మీ ఆడపిల్లలకి పెళ్ళి చెయ్యవా? ' అని అడిగితే, 'కనీసం డిగ్రీ అయినా చదివితే కాని ఏమీ లేదు' అని ఖచ్చితంగా చెప్పేసేది. చదువు తోటే మంచి సంస్కారం, సత్ ప్రవర్తన వస్తాయని తనకి గట్టి నమ్మకం. తన కోరిక తీరడానికి నేను డిగ్రీ చదివేటప్పుడే తను కూడా వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీ వారి 'కరస్పాండెన్స్

కోర్స్‘ లో బి.ఏ లో చేరి మొదటి రెండేళ్ళు పూర్తి చేసింది. పాపం ఆఖరి సంవత్సరంలో డాడీకి విజయవాడ బదిలీ అయిపోవడంతో, ఆ ప్రయత్నం ముందుకు సాగలేదు. విజయవాడ ‘నాగార్జునా యూనివర్సిటీ‘ పరిధిలోకి వస్తుంది కనక అక్కడి చదువు ఇక్కడ పనిచెయ్యదు మరి. ‘కాన్‌టాక్ట్ క్లాస్‘ లకి వెళ్ళి వచ్చి, ‘నిజంగా కాలేజ్‌కి వెళ్ళి వచ్చినట్టే ఉంది‘ అని ఎంతో సంతోషపడేది.

చదువుతో పాటుగా, ఆట పాటల్లోనూ, వివిధ రకాలైన పోటీలలోనూ ముందు ఉండాలని మమ్మల్ని ఎప్పుడూ ప్రోత్సహించేది. ‘బహుమతి ముఖ్యం కాదు, పాల్గొన్నామా, లేదా! అన్నది ముఖ్యం‘ అంటూనే, ‘ పదిమందిలో ఫలానా అమ్మాయి లేదా అబ్బాయి అని పిలిచి చిన్న పెన్సిల్ ముక్క ఇచ్చినా గొప్పే! ‘అని చెప్పేది. అప్పుడప్పుడూ తెల్ల కాగితాలని నలుపు చేసి ఏదో రాసేసాను, అనుకునే ‘నన్ను నిజంగానే బాగా రాసావు! ఎదైనా పత్రికకి పంపుదాం‘ అని ఉత్సాహపరచేది. ఇప్పటికీ పరుస్తూనే ఉంటుంది. చెల్లెలూ, నేనూ వ్యాసరచనలూ, వక్తృత్వాలూ ఇలాంటి పోటీలలో రాణించినా, తమ్ముడు ఆటలు, క్విజ్ లూ మొదలైన వాటిల్లో బహుమతులు పొందినా, అన్నింటిలోనూ అమ్మ పాత్ర చాలా ఉంది. మేము గ్రీటింగ్ కార్డులు ఇంట్లోనే తయారు చెయ్యాలని అర్ధరాత్రివరకూ, పెయింటింగ్ అదీ చేస్తూ కూర్చున్నా, పాత చీరలు అవీ చింపి ఇంటికోసం కర్టెన్లు, సోఫా కవర్లు ఇలాంటివి కుడుతున్నా కూడా, తను కూడా మాతోపాటే మేలుకుని కూర్చునేది. 'మీ అమ్మగారెంత సరదాగా ఉంటారో! ఇంచక్కా మీతో అన్ని ఆటలూ ఆడతారు', పొటాటో రేస్, తొక్కుడుబిళ్ళ ఇలాంటివి మాతో ఆడే అమ్మని చూసి మా ఫ్రెండ్స్ అనేవారు. మాకు ఇష్టమైనవి వండిపెట్టడంలోనే కాదు, వండినవి మాకు ఇష్టం లేనివైనా, ఆరోగ్యానికి మంచివైతే నాలుగు మంచివో, మాయవో మాటలు చెప్పి తినిపించెయ్యడంలోనూ అమ్మ దిట్టే.

అమ్మలో ఉన్న మరో మంచి సుగుణం అల్పసంతోషత్వం. ‘ నూలు చీర నూరేళ్ళు కడతామా? మనమీద ఎంత అభిమానం ఉంటే పెడతారు? ‘ అంటూ, ఎవ్వరు ఎలాంటి చీర పెట్టినా సరే మనసారా కట్టుకుంటుంది. కొన్నది ఎంత చిన్న వస్తువైనా సరే, అమ్మ వెలిబుచ్చే సంతోషం చాలా పెద్దది. పాత చీరలు ఇచ్చి స్టీలు గిన్నె కొన్నా సరే, దానిని నాలుగు కోణాలలో అమర్చి, నాలుగు రోజులపాటు నాలుగు రకాలుగా వాడితేనే అమ్మకి తృప్తి. ఎప్పుడైనా జ్వరమో, తలనొప్పో వచ్చి ఒక పూట పడుకుంటే, దగ్గరగా కూర్చుని అమృతాంజనం రాస్తే, అ చిన్న పరిచర్యకే తడి కళ్ళతో, ‘అందుకే అంటారు, ముతకో, సన్నమో మూడు చీరలూ, నలుపో తెలుపో నలుగురు పిల్లలు ఉండాలి’ అని అనే అమ్మ నిజంగా అల్ప సంతోషి!

‘పాడ్యమీ, సంవత్సరాది పాడ్యమీ, విదియ- భాను విదియా ‘అంటూ, తిథీ వారాలతో పాటు సుప్రభాతాలు, అష్టకాలూ, ఇలా ఎన్నో నేర్పించింది. తెల్లవారు ఝామునే గోంగూర పచ్చడీ, ఉల్లిపాయల పులుసుతో తిని తరవాత ఉపవాసముండి, ఉయ్యాలలూగే ఉట్టివెన్నముద్దల అట్లతద్ది నుంచీ, ఉసిరికాయ దీపాల క్షీరాబ్ది ద్వాదశి వరకూ, అన్ని పండగల ప్రాశస్త్యాన్నీ వివరంగా చెప్పేది. ‘వరలక్ష్మీ వ్రతం నాడు మనం కూడా ప్రదక్షిణలు చేసాము కదా, చారుమతీ దేవికి వచ్చినట్టు మనకి నగలు రావేం?‘ అని మేము అడిగితే మమ్మల్ని చూసి నవ్వి, ‘నాకు మీ నాన్నా, మీరు దొరికారు కదా!‘ అనేది. ‘చెప్పకపోతే ఎలా తెలుస్తాయి?‘ అంటూ అన్ని చుట్టరికాలగురించీ కూడా ఓపికగా చెప్పేది. అందుకే బొత్తిగా అమ్మమ్మా, నాన్నమ్మా తప్ప మిగతవారెవరూ పెద్దగా తెలియనీ ఈకాలపు పిల్లలం కాలేదు మరి మేము.

అమ్మ మాకు నేర్పిన మరో మంచి విషయం- జాగ్రత్త. ఖర్చు పెట్టేది రూపాయి అయినా సరే అలోచించి ఖర్చు పెట్టాలనేది దాని ప్రాథమిక సూత్రం. నెల ఖర్చు మమ్మల్నే నిర్వహించమని డబ్బు మాకిచ్చి, మేము అందులోంచి కొంత మిగిల్చి, ఓ రెండు కుర్చీలో, హాట్ పాక్ లో కొంటే, ‘ఏమండీ! చూసారా? పిల్లలు భలే కొన్నారు, నా కంటే జాగ్రత్త గా ఖర్చు పెట్టారు. ‘అని సంతోషించేది. ఎప్పుడైనా మేము కొట్టుకుంటే సమయానికి తగినట్టుగా నచ్చచెప్పి మమ్మల్ని సమాధాన పరచడమే గాని, మమ్మల్ని ఎప్పుడూ ఒక్క దెబ్బ వేసి ఎరగదు అమ్మ. పైగా ‘మా పిల్లలు ఎప్పుడూ అల్లరే చెయ్యలేదు, అసలు ఎలా పెంచామో కూడా గుర్తు లేదు, ఈ కాలం పిల్లల్లా కాదు బాబూ! మా వాళ్ళు,‘ అంటూ, ‘ఏవండీ! కదండీ?‘ అని డాడీని సాక్ష్యం అడుగుతుంది.

కథలలోనూ, సినిమాలలోనూ అమ్మ లాంటి వదినలూ, అక్కలూ ఇలాంటి పాత్రలు చాలా చూపిస్తారు. కాని ఎవరికైన అక్క లాంటి అమ్మఉంటే అది మా అమ్మ లాగే ఉంటుందేమో. ఎప్పుడూ అమ్మలా పెద్దరికంగా ఉండే అమ్మ అంతలోనే చిన్నపిల్లలా మాతో సమానంగా ఆడుతూ, పాడుతూ, పోట్లాడుతూ ఉంటే అలాగే అనిపిస్తుంది మాకు. 'ఏం! నేను ఎప్పుడైనా డాడీని వదిలి ఏదైనా ఊరు వెళితే, ఒక్కరే ఉన్నారు డాడీ! అని పూటకొకసారి ఫోను చేస్తారు ఆడపిల్లలిద్దరూ, అదే ఆయన ఊరెళ్ళితే మాత్రం రెండు రోజులైనా ఫోనే చెయ్యరు' అంటుంది. 'సెల్ నుంచి సెల్ కి చెయ్యడం తేలిక కదమ్మా! 'అని నచ్చచెప్పాలి నేనూ, చెల్లి. 'ఎన్ని చెప్పినా మీరందరూ మీ నాన్న పిల్లలే! ' అని వెక్కిరిస్తుంది మమ్మల్ని.



క్రమశిక్షణ అంటే ఊపిరి ఆడని కట్టుదిట్టాలు కావనీ, ఇచ్చిన స్వేచ్ఛని సరిగ్గా వాడుకోవడమనీ, పద్ధతి ప్రకారం నడుచుకోవడమనీ చెప్పారు అమ్మా, డాడీ. మా ముగ్గురికీ కూడా డాడీ దగ్గర ఎంత గారమో అంత గౌరవం. అందుకే ఎప్పుడైనా సినిమాకి వెళ్ళాలన్నా,ఫ్రెండ్స్ తో కలిసి ఎక్కడకైనా వెళ్ళాలన్నా అమ్మ సిఫార్స్ ఉండాల్సిందే కదా.

చక్కని విద్య, మంచి నడవడిక, వినయం, ఎంత ఎదిగినా ఒదిగే ఉండాలనే గుణం, జీవితంలో ఎంత ఎదిగినా కళ్ళూ, కాళ్ళూ నేలమీదే ఉండాలనే సత్యం, ఇవే పిల్లలకి తల్లితండ్రులు ఇచ్చే నిజమైన ఆస్థి నా అభిప్రాయంలో. ఈ రకంగా చూసినా మమ్మల్ని సుసంపన్నులుగా తీర్చి దిద్దారు మా అమ్మా నాన్నా. దానితో పాటే, చిన్న చిన్న ఆశలు, అందమైన ఊహలు, అల్లిబిల్లిగా అల్లుకుపోయిన చిలిపితనాల కలనేత లాంటి బంగారు బాల్యాన్నీ, . భావి జీవితానికి నాందిగా అందించారు. ఎంత చెప్పుకున్నా సరిరాని, సరిపోని ఆ మమతానురాగాలకీ, వెన్నలాంటి ఆ మనసులకి వెన్నెలంటి ఈ పత్రికాముఖంగా శుభ, చిన్ని, బాబు చెప్పుకుంటున్న ప్రేమ పూర్వక కృతజ్ఞతలు.

సుభద్రగారు బెంగుళూరులో బయోటెక్నాలజీ కంపెనీలో పనిచేస్తున్నారు. తెలుగు కథలు చదవడంతో బాటు అప్పుడప్పుడూ వ్రాసుకోవడం ఇష్టం.



# పెండ్యాల వెంకటేశ్వరరావు



"బూవిన బుట్టగూడని మహన్నబావురాలు" మా అమ్మ నారాయణమ్మ

ఆంధ్రదేశానికి ధాన్యాగారమైన పశ్చిమగోదావరి జిల్లా తణుకుని ఆనుకుని ఉన్న మండపాక గ్రామం మాది. పెత్తందారుగారు మనవరాలిగా అంతర్వేది నరశింహస్వామిని పూజిస్తే విడివాడ వెంకన్న, అచ్చమ్మ దంపతులకు పుట్టిన గారాల తల్లి మా అమ్మ. ఎలిమెంటరీ స్కూలు చదువు తక్కువే అయినా జీవితాన్ని మాత్రం ఎక్కువగానే చదివింది. ఓ పెద్దింట్లో, కలవారింట్లో అపురూపంగా పెరిగిన అమ్మకి ఆర్థిక క్రమశిక్షణలేని అత్తారిల్లు కష్టాన్నే ఎక్కువ చూపించింది.



పెళ్ళయిన అయిదేళ్ళలో ముగ్గుర్నీ కొడుకుల్నే కన్న అమ్మకి, కూతురు కావాలన్న కోరిక తీరనే లేదు. అమ్మ మమ్మల్ని ప్రత్యేకంగా పెంచాలని ప్రయత్నించేది. ముగ్గురుకీ ఒకే రకం బట్టలు కుట్టించేది. ఏడాదికి ఒక బస్తా ధాన్యం ట్యూషన్ మాష్టారు చంద్రశేఖరంగారికి మా నాన్న ఇస్తే, ప్రొద్దున్నే ముస్తాబు చేసి పంపించడం చూసి మమ్మల్ని ఇంగ్లీష్ బాయ్‌లనే వారు ఊరంతా (ఎల్.కె.జి, యు.కెజి వరకు ఇంగ్లీషు మీడియం వెలగబెట్టడం వల్లకూడా అనుకోండి). మా వీధిలో సుంకర చిట్టెయ్య పారిపోయి టెలిగ్రాములిస్తుండేవాడు, డబ్బులు పంపమని వాళ్ళమ్మకి. అవి నేను మాత్రమే చదవగలిగేవాణ్ణి. అది చూసి మా అమ్మ ఎంత పొంగిపొయేదో...

మేనబావనే కావాలని కోరుకుని మరీ పెళ్ళిచేసుకున్న మా అమ్మ "మీ నాన్న ఎన్.టి.రామారావులా ఉంటారు కదరా" అని నన్ను ఒప్పించటానికి ప్రయత్నించడం నాకింకా గుర్తు. అందగాడే కానీ అంతకాదులే అని నా భావన (ఇది మా నాన్న చదవరని నాధీమా).

మా అమ్మలో నాకు బాగా నచ్చే గుణం ఏమిటంటే గంట మాట్లాడితే అరగంట నవ్వు ఉంటుంది అందులో.. పాజిటివ్‌గా ఆలోచించడం, బ్రతకడం మా అమ్మ దగ్గరే నేర్చుకోవాలి. ఓ కష్టం కలిగిన సమయంలో నాతో చిన్నప్పుడు మా అమ్మ అన్న మాటలు తనకు గుర్తున్నాయో లేదో కానీ నాకు మాత్రం బాగా గుర్తు. "కాని కష్టమొస్తే చచ్చిపోవాలా ఏం? ఎదుటివాడి సంతోషం చూసైనా మనం ఆనందించవచ్చు కదా!" అంటూండేది. అందమైన ప్రపంచం ముందుంది ఆనందించమన్న భావార్థంలో... ఓపిక్కి ఓ రూపం ఇస్తే అది మా అమ్మే!

ప్రతీరోజు ప్రొద్దున్నే పదిచెంబులు పట్టే రాగిబిందెలో నీళ్ళు మరక్కాచి చన్నీళ్ళు పొదుపుతూ, వరుసగా ముగ్గురం బోసి మొలలతో నుంచుంటే స్నానం చేయించడం నాకింకా స్పష్టంగా కనిపిస్తోంది. మా అమ్మ ఎంత పొదపరో దీన్నిబట్టి తెలియాలి మీకు.

అమ్మ కొన్ని పాటలు కూడా పాడేది అప్పట్లో. నాకు బాగా నచ్చింది, కదిలించింది "ఆవు-పులి" పాట. ఇది కథగా అందరికి తెలుసేమోగానీ పాటగా మాత్రం మా అమ్మనోటినుంచే విన్నాను. అమ్మ ఒళ్ళో పడుకుని ఆ పాట విన్నప్పుడల్లా చివర్లో ఏడ్చేవాడిని మా అమ్మకి తెలియకుండా, దూడని వదలి ఆవు పులికి ఆహారంగా వెళ్ళిపోయినందుకు, ఆ తర్వాత పార్వతీ పరమేశ్వరులు స్వర్గానికి ఆవుని మాత్రమే తీసుకెళ్ళారని, దూడని వదిలేశారనిన్నూను ఆ బాధంతా. మచ్చుకి కొంచెం ఇక్కడ...

ఆడవికి మేతకెళ్ళిన ఆవు ఎంతకీ తిరిగిరాకపోయేసరికి, తిరిగొస్తున్న ఇతర ఆవుల్ని దూడ అడుగుతుందిలా...

"ముందును వచ్చేటి ముసలి గోవుల్లారా! మీరందరొచ్చారు మా అమ్మ ఏది?

మీ అమ్మ పులితోను బాసలందింది....

వెనుకను వచ్చేటి ఎర్రగోవుల్లారా! మీరందరొచ్చారు మా అమ్మ ఏది?

మీ అమ్మ పులితోను బాసలందింది"

కాస్సేపటికి "దూడను చూసి తిరిగి నీకు ఆహారంగా వస్తానని" పులికి ప్రమాణం చేసి వచ్చిన ఆవు పాలిస్తూ చెప్పే జాగ్రత్తలు ఇలా పాడుతుండేది.

"నూతి ఒడ్డున చేరి మేయబోకుర చిన్ని బసవా!

తెనుకు వారింటికేసి పోకుర చిన్ని బసవా!

కళ్ళగంతలు గట్టి గానుగాడేదు

కాపువారింటికేసి పోకుర చిన్ని బసవా

ఎద్దు మంచీదని వన్నెలడిగేరు"

రారా చిన్ని బసవా! రారా శనగల బసవా! మురిపాలు త్రాగిపోదువుగాని అంటే,

విన్న దూడ ఇలా అంటుంది.

"ఇన్ని బుద్దులు చెప్పి నువ్వెక్కడికెళతావు" అంటే

మీ అమ్మ పులితోను బాసలందింది.

అలా అని ఆవు దూడని వదిలి వెళ్ళిపోవడం.. నా కళ్ళల్లో నీళ్ళు రావడం... మా అమ్మ చీరకే తెలిసిన రహస్యం. ఇదే కథ మా పిల్లలకి చెప్పినప్పుడు మాత్రం నేను ఆవుని, దూడని కలిపే స్వర్గానికి పంపించాను. నా బాధ వాళ్ళు పడకూడదని.

విశేషమేమిటంటే ఈ పాట మాత్రం నాకు గుర్తుంది కానీ మా అమ్మకి మాత్రం కష్టం, కాలం వరదలో కొట్టుకుపోయింది.

నేనంటే ఎంతో నమ్మకముండే పిచ్చి తల్లిని రెండుసార్లు మోసం చేశాను. ఒకసారి ఫ్రెండుకు ఒంట్లో బాలేదని ద్రాక్షపళ్ళు పట్టుకెళ్ళి చూసొస్తానని 2 రూపాయలు తీసుకుని గాంధీగారి సావిట్లో హనుమంతుగాడు, జగం గాడితో ఫూల్ గేమ్ ఆడిపోగొట్టాను. ఇంకోసారి అమ్మ ఊళ్ళో లేనప్పుడు ఓ మిత్రుడి పనికిమాలిన అవసరానికి (అది ఇప్పుడనిపిస్తుంది) అరడజను ఇత్తడి గ్లాసులమ్మేసిన విషయం ఇప్పటికీ మా అమ్మకీ, మా ఆవిడకీ తెలియదు మీకు తప్ప.

మొట్ట మొదట ఉద్యోగంతో అమ్మకి క్రిష్టల్ నల్లపూసలు (అప్పట్లో అదో ఫ్యాషన్ అవి) ఆగ్రా నుంచి తెస్తే ఆమె కళ్ళల్లో తడి, ఆమె మిత్రురాళ్ళకి చెప్పి మురిసిన హడావిడి ఓ సుందర దృశ్యం. అల్ప సంతోషి మా అమ్మ.

చిన్నప్పటినుంచీ మమ్మల్ని గారాంగా పెంచింది అమ్మ. అర్ధరాత్రి తణుకు నుంచీ సెకండ్ షో సినిమా చూసి మిరపకాయ బజ్జీలు తినివచ్చి మంచమెక్కాక దాహమేస్తే.." అమ్మా మంచినీళ్ళని" గట్టిగా అరిస్తే కూడా విసుక్కోకుండా, అప్పటికీ రోజంతా ఇంటి చాకిరితో అలసిన అమ్మ ప్రక్క గదిలోనుంచీ లేచి వచ్చి వేరే గదిలో కుండలోని నీళ్ళు తెచ్చిచ్చిన సంగతి గుర్తొస్తే అమ్మకి పదే పదే క్షమాపణలు చెప్పాలనిపిస్తుంది.

అత్తమామలు పక్షవాతాన మంచాన పడితే చేసిన సేవకి, ఆ ఓపికకు ఊరంతా, బంధువులంత ఒకే మాటగా మెచ్చడం ఆమె గొప్పతనం. చూడవచ్చిన చుట్టాలకి వండివార్చడం, సపర్యలు చేయడం, అప్పుడే ఆర్ధిక ఇబ్బందులు అవి ఒకప్రక్క తట్టుకోవడం ఇవన్నీ చూస్తే భూదేవంత సహనం మా అమ్మకిచ్చి దేవుడన్యాయం చేశాడనిపిస్తుంది. కసురుకుని విసుక్కుంటే పనులు పంచుకునేవారుగా మిగిలినవాళ్ళు అని కూడా తెలియని వెర్రిబాగుల్ది నా కన్నతల్లి. ఆడపిల్లలు లేని మా తల్లికి ఆసరా బొత్తిగా లేదు ఎప్పుడన్నా మా చిన్న తమ్ముడు తప్ప. ఉంటానికి ఇద్దరు పాలేర్లున్నా కూడా.

ఎప్పుడూ మాకు ఏపనీ చెప్పి ఎరుగరు మా తల్లిదండ్రులు ఇంటర్ వరకు, అది ఎందుకు మంచిదికాదో మా ఆవిడనడిగితే చెబుతుంది కానీ తన పిల్లల్ని అలానే పెంచుతున్నానని తెలియదు తనకి పాపం.

నేను కేశవస్వామి గుడిగోపురం కలశాల వరకు పైకెక్కిన విషయం కాంతమ్మ చెబితే, నాన్న చితక్కొడితే నాకన్నా ఎక్కువ ఏడ్చింది మా అమ్మ ఆ దెబ్బల్ని చూసి. నీళ్ళల్లో నానకండిరా! దెబ్బలు తిన్కండిరా! అబ్బరాల బిడ్డలు అంటూండేది మా అమ్మ.

మా అమ్మ వండే మినపదిబ్బరొట్టె, పూరీ విత్ పెసరపప్పు కూర, ఉలవచారు నాకేకాకుండా మా పిల్లలకు బాగా ఇష్టం... చాలా చాలా ఇష్టం....

నోరూరుతే మాత్రం మీరెవరైనా రావచ్చు ఒకరోజు టైమిచ్చి... నే చెప్పిందాంట్లో రుచి ఎంతో తెలియాలంటే మరి... స్వాగతం...

**గలగలా నవ్వే మా అమ్మ ...**

**తల్లి గంగమ్మ...పెండ్యాల నారాయణమ్మ**

**మా అమ్మ రుణం తీర్చుకోవాలంటే**

**"రెంటాల" వారన్నట్లు**

**" చచ్చి మరొకసారి అమ్మకి అమ్మై జన్మిచాలంతే."**



*సివిల్ ఇంజినీరింగ్ బొమ్మలేసుకుంటూ ఉద్యోగం ప్రారంభించి, సహధర్మచారిణి సాంగత్యంలో, పుత్ర రత్నాలు జెశ్వంత్, శ్రీచరణ్ బాబుల ఆటపాటలను వినోదిస్తూ, తెలుగుకళా సమితి - కువైట్‌కి సేవ చేసుకుంటూ, సాహితీ వ్యవసాయం చెయ్యాలని ప్రయత్నిస్తూ, అప్పుడప్పుడు తెలుగు గజళ్ళు గానం చేసి ఆప్తమిత్రుల్ని శత్రువులుగా మలచుకుంటూ, కువైట్ అనే ఒకానొక ఎడారి దేశంలో* **AMEC** *అనే ఆంగ్లేయుల కంపెనీకై చమురు వృద్ధి, శుద్ధి చేసే కర్మాగారానికి వివిధ దేశాల నుండీ వచ్చే ఇంజినీరింగ్ డాక్యుమెంట్లను కంట్రోల్ చేసే ఓ ఐదు పుంజీల ఉద్యోగులున్న విభాగానికి మార్గదర్శకుడిగా ఉద్యోగం వెలగబెడుతూ... మనసు మాత్రం ఊళ్ళో ఒదిలేసి వచ్చినవచ్చిన ఈ నారాయణమ్మ నడిపోడి పేరు పెండ్యాల వెంకటేశ్వరరావ్...ఉరఫ్ పి.వి.రావ్*

## బి. సుజాత



అమ్మ గురించి ఎంతని రాయగలం?

అమ్మ ఊపే ఉయ్యాల నుంచి అమ్మ తినిపించిన గోరు ముద్దలవరకూ,

అమ్మ పాడిన జోల పాటల నుంచి,

అమ్మ నేర్పిన అడుగుల వరకూ,

అమ్మ చేయించిన హోం వర్కుల నుంచి పెద్దయ్యాక మనం చదువుకునేటపుడు తనూ టీ తాగి మనకు తోడుగా కూచోడం వరకు,

చిన్నప్పుడు పడిపోకుండా అందించిన అమ్మ చేయి నుంచి, అత్తవారింటికి వెళ్ళేప్పుడు అమ్మ తడి కళ్ళు చెప్పే జాగ్రత్తల వరకూ... ఎంతని రాయగలం?

ఇవన్నీ ప్రతి అమ్మలోనూ ఉండే లక్షణాలే!

అందుకే అమ్మ గురించి రాయాలనగానే నాకు ఏమి రాయాలో అర్థం కాలేదు. ఏం రాసినా అది "అవును, మా అమ్మ కూడా ఇంతే" అని ప్రతి ఒక్కరూ అనుకుంటారు మరి!

అందుకే నేను అమ్మ గురించి కాక మా అమ్మ తర్వాత నేను అమ్మగా భావించే మావారి అమ్మ గురించి... అదే మా అత్తగారి గురించి రాస్తున్నాను. అత్తలో అమ్మను చూడాలని ప్రతికోడలూ అనుకుంటుందేమో కానీ, కోడల్లో కూతురిని చూసుకోవాలని ప్రతి అత్తా అనుకోదని మాత్రం రూఢీగా చెప్పగలను. కాకతాళీయమైన విషయం మా అమ్మ పేరు, అత్తగారి పేరు కూడా ఒకటే కావడం! ఇద్దరి పేరూ పద్మావతే! పెళ్ళై తొమ్మిదిన్నరేళ్ళు గడిచినా ఇంతవరకూ మా అత్తగారు నాకెప్పుడూ అత్తలాగా కనపడలేదు. అలా కనపడే అవకాశం ఆమె నాకెప్పుడూ ఇవ్వలేదు.

నిజం చెప్పాలంటే మా అమ్మగారి దగ్గర లేని స్వేచ్ఛ నాకు మా అత్తగారి దగ్గర దొరుకుతుంది. నేను మా వారిని పేరుతో పిలవడం, ఏకవచనంలో సంబోధించడం అమ్మకు నచ్చదు. (ఆమె పెరిగిన, మమ్మల్ని పెంచిన సంప్రదాయాల నేపథ్యంలో) నేను పేరుతో అతన్ని పిలవడం, విని అమ్మ నాకు ప్రైవేటు చెప్పేసింది. "ఇలా మీ అత్తగారి ముందు పిలిచావంటే ఆవిడ ఏమనుకుంటారు?" అని చీవాట్లేసింది.

అందువల్ల నేను మా వారిని "ఏవండీ" అని చాలా కృతకంగా పిలుస్తుంటే అది వినలేక మా అత్తగారు నన్ను పిలిచి "గౌరవం, ప్రేమ మనసులో ఉండాలి తప్పించి పిలిచే పిలుపులో కాదు! నువ్వు వాడిని పేరుతో పిలిస్తే నాకేం అభ్యంతరం లేదు" అని చెప్పారు. ఎక్కడో బయటి నుంచి తమ ఇంటికి వచ్చిన అమ్మాయి అభిప్రాయలకు ఇంత విలువ ఇవ్వాలనుకున్న ఆమె సంస్కారానికి ముగ్ధురాలినయ్యాను.

మాది పెద్దలను ఒప్పించి చేసుకున్న ప్రేమ వివాహం! నావైపు నుంచి తప్ప అటువేపు నుంచి అభ్యంతరాలు ఎదురు కాలేదు. మా పెళ్ళి అయ్యాక ఒకరోజు జంకుతూనే ఆవిడను అడడిగాను. "మా ప్రేమ విషయం తెలిసే సమయానికి మీరు తనకు సంబంధాలు చూస్తున్నారు కదా! తను నన్ను చేసుకుంటానని చెపితే మీకు కోపం రాలేదా?" అని!

దానికి ఆవిడ ఇలా చెప్పారు.

"వాడు ఇలా సడన్‌గా చెప్పేసరికి కొంచెం బాధ వేసింది. కానీ కొంచెం సేపు ఆలోచించాక తేలిగ్గా తీసుకోగలిగాను. సరే! నేనొప్పుకోలేదనుకో మీ పెళ్ళికి! వాడు కూడా నన్ను కాదనలేక నేను చెప్పిన అమ్మాయినే చేసుకుంటాడు. అప్పుడు నా కొరిగేదేమిటి? 'అమ్మ కూడా నన్ను అర్థం చేసుకోలేదు' అని వాడు బాధపడటం, మీ ఎడబాటు, మరో పిల్ల గొంతు కోత! ఇదేగా జరిగేది? ఒకవేళ మీరిద్దరూ మమ్మల్ని ధిక్కరించి పెళ్ళి చేసుకున్నా, మా మీద నీకెప్పటికీ గౌరవం ఉండదు. మనం కలిసున్నా సరే! మానసికంగా దూరంగానే ఉంటారు. నాకు వాడు, వాడి సంతోషం ముఖ్యం! వాడి ఎంపిక మీద నాకు నమ్మకం కూడా ఉంది" ఇంత వివరణ విన్నాక వాళ్ళింట్లో రిలేషన్స్ ఎలా ఉంటాయో అర్థమైంది.

మా అత్తగారిది కూడా ప్రేమ వివాహం కావడం కూడా మా వివాహానికి గ్రీన్ సిగ్నల్ రావడానికి ఒక కారణం! వివాహం అయిన తర్వాత హైదరాబాదులో వెంటనే ఇల్లు దొరకకపోవటంతో నేను మా అత్తవారింట్లో (పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పక్కన ఒక పల్లెటూరు) ఒక నెల రోజులు ఉన్నాను. ఈ నెల రోజుల్లో నేను మా అత్తగారు మరింత దగ్గరై స్నేహితులుగా మారాము. ముఖ్యంగా మా ఇద్దరి ఉమ్మడి అభిరుచి క్రాస్ వర్డ్ పజిల్స్ పూర్తి చేయడం కావడంతో అదంత పెద్ద కష్టం కాలేదు. అప్పట్లో ఆంధ్రప్రభ వారపత్రికలో శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు అరుణమణి పేరుతో గళ్ళనుడికట్టు ఇస్తుండేవారు. అవి చాలా కష్టంగా ఉండేవి. అవే కాకుండా, రచన మాసపత్రికలో సత్యం మందపాటి గారు, ఎన్.సురేంద్రగారు ఇచ్చే పజిల్స్ కూడా కష్టపడి పూరిస్తుండే వాళ్ళం! ఇప్పటికీ కష్టమైన పజిళ్ళకు సొల్యూషన్ ఇస్తే దాని కింద సరిగా పూరించిన వారి పేర్లలో బి.పద్మావతిగారి పేరు తప్పక ఉంటుంది.

ఆ నెలరోజుల్లోనే నేను మా వారికిష్టమైన పశ్చిమగోదావరి వంటలన్నీ ఆవిడ వద్ద నేర్చుకున్నాను. పద్మావతిగారు నరసాపురంలో హైస్కూలు హెడ్‌మిస్ట్రెస్‌గా రిటైర్ అయ్యారు. ఉద్యోగ బాధ్యతల రీత్యా ఎంత బిజీగా ఉన్నా, పిల్లలు ముగ్గురినీ ఎంత క్రమశిక్షణతో పెంచారంటే ఎంత కోపం తెప్పించే విషయాన్నైనా చాలా పాజిటివ్ గా తీసుకుంటారు వాళ్ళు. నా వల్లైతేకాదనిపిస్తుంది. రిటైర్ అయ్యాక పిల్లలకోసం పాటలు, పద్యాలు రాసి పత్రికలకు పంపుతుండేవారు.

ఆమె సత్సంగీ! (దయాల్బాగ్, ఆగ్రా) కేంద్రంగా అందించే రాధాస్వామి సత్సంగంలో ఆవిడ చిన్నప్పటి నుంచీ సభ్యురాలు. దానిలో మడి పూజలు తప్పని సరికాదు. మామగారు పరమ నిష్ఠాగరిష్ఠులు. ఈవిడకు పూజ, మడి ఆచారాలు పాటించే అలవాటు లేకపోయినా ఆయన పూజకు అన్నీ సిద్ధం చేసి ఉంచుతారు. ఒకరి ఆధ్యాత్మిక చింతనను ఒకరు విమర్శించుకోరు. ఎవరి స్పేస్ వాళ్ళకుండటం అంటే ఇదేనోమో అనిపిస్తుంది.

రెండువేపులా డబ్బునో, అలకపానుపు దగ్గరో, మనుగుడుపుల దగరో చిన్న చిన్న విషయాలు మనసులో పెట్టుకుని కోడళ్ళని జీవితాంతం సాధించిన (సాధించడం అంటే తిట్టడం, కొట్టడం కాదు, వ్యంగ్యంగా ఒక మాట విసిరితే చాలదూ) అతగార్లను బోలెడు మందిని చూశాను నేను. మా ఇంట్లో కట్నానికే చోటు లేదు, ఇక లాంఛనాల సంగతి చెప్పాలా? ఒకవేళ మా వారు నా మీద ఫోన్లో ఏమైనా ఫిర్యాదులు చేసినా నాకేం భయం లేదు. అటువైపు నుంచీ మా అత్తగారు "తన సంగతి నాకు తెలుసు గానీ నువ్వు మూసెయ్" అంటారని నాకు ముందే తెలుసు.

"మా ఇంట్లో పద్ధతులివీ, నువ్విలాగే ఉండాలి"అని నాకెవ్వరూ చెప్పలేదు.

ఆవిడతో కొద్దిరోజులు కలిసి గడిపితే జీవితం గురించి ఎన్నో విషయాలు తెలుస్తాయి. ప్రతి ఆలోచనా సమగ్రంగా ఉంటుంది. అవగాహన కలిగిస్తుంది. ఆవిడతో కలిసి గడపడానికి నేను ఇష్టపడే మరోకారణం ఆమె హాస్య స్ఫోరకంగా మాట్లాడగలరు. బహుశా అది ఆమె జీన్స్‌లోనే ఉందేమో! పాత తరం హాస్య నట చక్రవర్తి కస్తూరి శివరావుకి ఆవిడ స్వయానా అన్న కూతురు. ఇంట్లో అందరూ ఇదే ధోరణిలో ఉండటం వల్లనేమో ఎప్పుడూ విట్లూ, జోకులే తప్ప మొహాలు మాడ్చుకోడాలు, మనసులు కష్టపెట్టడాలు ఉండనే ఉండవు ఆ ఇంట్లో!

మా అత్తగారొస్తే నాకు చిన్ననాటి స్నేహితురాలొచ్చినట్టు ఉంటుంది. చెప్పుకోటానికి బోలెడు కబుర్లు వస్తాయి. పూరించాల్సిన పజిళ్ళొస్తాయి. ఇద్దరం కలిసి పుస్తకాల గురించి చర్చించుకుంటూ ఇంట్లోవాళ్ళని పట్టించుకోవడం మానేస్తాము! వయసులో తేడా లేకపోతే మమ్మల్ని ఎవరైనా స్నేహితులనుకుంటారు తప్పించి అత్తాకోడళ్ళనుకోరు. ఈ విషయం మాత్రం రూఢీగా చెప్పగలను. అవడానికి మామూలు ఆడవాళ్ళే అయినా కోడళ్ళ విషయంలో హెడ్ మిస్ట్రెస్సులా ఉండే వాళ్ళకి వ్యతిరేకంగా నిజజీవితంలో హెడ్ మిస్ట్రెస్ అయినా కోడలితో స్నేహితురాలిగా ఉండేది ఒక్క పద్మావతి గారేనోమో! కోడలిలో కూతురిని చూడగలిగిన "మా వారి అమ్మ" కథ ఇది!

*సుజాత గారు పుట్టి, పెరిగింది, చదువుకుంది గుంటూరు జిల్లాలోని నరసరావు పేట. ప్రస్తుతం హైదరాబాదులో ఉంటున్నారు.కొన్ని రోజులు జర్నలిస్ట్‌గా పనిచేసారు. కథలు రాస్తుంటారు. తన మనసులోని భావాలను 'మనసులో మాట' బ్లాగ్‌లో పొందుపరుస్తుంటారు. వాస్తవిక అంశాలపై స్పందించి వాటిని హాస్యధోరణిలో చెప్పగల ప్రజ్ఞాశాలి, మంచి సాహిత్యాభిలాషి. సోషల్ సర్వీస్ కూడా చేస్తుంటారు.*

## అయినాపురపు శ్రీనివాసరావు



**రామాయణం,** భారతంలాంటి గ్రంథాలు కొన్ని అధ్యాయాల అనంతరం ముగుస్తాయి. అమ్మగురించి అడిగితే అది ఎంత చెప్పినా ఎంతో కొంత మిగిలే ఉంటుంది. ఎన్నిసార్లు చెప్పినా మళ్ళీ మళ్ళీ చెప్పాలనే ఉంటుంది. ఎందుకంటే అది ప్రేమ పరిపక్వమైన, కనులముందు కదలాడే రూపం కనుక. భాగవత కథలు అందుకే అందరినీ అలరిస్తాయి - అవి హరి కథల రూపంలో చెప్పినా, బుర్ర కథల రూపంలో చెప్పినా, చెక్క భజనల రూపంలో చెప్పినా లేదా నేడు చూస్తున్న బుల్లి తెర సినిమాగానైనా వెండి తెర చిత్రంగానైనా సరే.

భగవంతుడే ఈ ఇలా తలానికి వేంచేసినా అమ్మ ప్రేమను అందించలేడు. అందుకే అమ్మను సృష్టించాడు. త్రేతాయుగంలో రామునిగా కౌసల్య, సుమిత్ర, కైకేయిల ప్రేమను పొందాడు. ద్వాపరంలో కృష్ణునిగా అవతారం దాల్చినప్పుడు యశోద, దేవకి దేవిల ముద్దుల పట్టిగా వారి ప్రేమను రుచిచూసాడు. అందుకే మనం మన భాషని, పుట్టిన ఊరిని మాతృభాష, మాతృభూమి అని వ్యవహరిస్తూ అమ్మను ప్రస్తుతిస్తున్నాం. అంతెందుకు? ఏదైనా గట్టి దెబ్బతగిలితే "అమ్మా!" అని ఉచ్చరించడం మనకు తెలిసిందేకదా! ఆ ప్రేమ నిర్మలమైన, ప్రతిఫలం ఏమీ ఆశించని ప్రేమ. అందుకే MOM గురించి చెపుతూ WOW! అని అనడం సమంజసం. జన్మనెత్తిన ప్రతివారికి తల్లి ప్రథమ గురువు, దైవం. ఆ తరువాతే తండ్రి, గురువు దైవం. అందుకే మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అన్నారు.

మా అమ్మగారు శ్రీమతి అయినాపురపు అచ్యుత రామలక్ష్మిగారు - మా తాతగారైన శ్రీ ఏలూరి అచ్యుత రామారావుగారు, అమ్మమ్మగారు శ్రీమతి సత్యవతి గారి ద్వితీయ సంతానం. ముందుతరాలనుండి ఆమె పుణికి పుచ్చుకున్న మానవత్వ విలువలను, సహనం, ప్రేమ తత్వాల్ని మాకు పంచి, మా ఈ నాటి స్థితికి పునాది వేసారన్నది వాస్తవం. మా అమ్మగారు పుట్టినది వేపాడ అనే ఊరు. కానీ పెరిగింది విశాఖపట్నం జిల్లాలోని బోయపాలెం అనే గ్రామం. మా నాన్నగారు తెలుగు పండితులుగా విశాఖపట్నం ఏ.వి.ఎన్.సి హైస్కూలులో పనిచేసేవారు. నాన్నగారితో పనిచేసిన స్కూలు టీచర్లు సంవత్సరానికి ఒక్కసారి మా ఊరికి పిక్నిక్ పేరుతో వచ్చేవారు. మా ఊరి దగ్గరలో ఒక రిజర్వాయర్ (గంభీరం రిజర్వాయరు) ఉంది. దాని దగ్గర వారంతా బసచేసి ఉంటే వారికి పులిహోర, పరమాన్నాలు ఒంటి చేత్తో చేసి, వాటితో పాటు మా తోటలో పండిన అరటి గెలను కూడా పంపేవారు. రుచికరమైన ఆ వంటలను పంచభక్ష్య పరమాన్నాలుగా ప్రస్తుతిస్తూ, టీచర్లు ఎంతో మెచ్చుకునేవారు. ఏదైనా పని చెయ్యాలి అని సంకల్పిస్తే, దానిని సాధించేవరకూ అకుంఠిత దీక్షతో కృషి చెయ్యడం ఆమె మనస్తత్వం.

మా చిన్నతనంలోనే మా నాన్నగారు పరమపదించడం, మా మామ్మగారి, మా సోదరి, మా ముగ్గురు అన్నదమ్ముల బాధ్యత అంతా అమ్మ మీదే పడటం, ఆమె ఆ బాధ్యతను ఎంత చక్కగా నిర్వర్తించారో మమ్మలను చూసినవారికి అవగతమౌతుంది. మాకున్న స్థలంలో కొంత భాగం అరటి తోటలు ఉండేవి. మిగిలిన భాగంలో వేరు శనగ, వరి మొదలైన పంటలు పండించేవాళ్ళం. అరటి తోటలో మధ్య మధ్యన వంకాయ, చిక్కుడు, బెండ, టొమేటో, కొత్తిమీర వంటి మొక్కలు వేసి, మాకు కావలసిన కూరగాయలు స్వయంగా పండించుకునేవాళ్ళం. మా పెరటిలో కూడా బీర, కాకర, ఆనప, గుమ్మడి వంటి పాదులను పెంచేవాళ్ళం. ఇలా ఇంటిలోకి అవసరమైన ఆకు కూరలు, కూరగాయలు పండించడంలో ఆమె ప్రణాళికను ప్రతి ఇంటిలోనూ అనుసరిస్తే 'గరీబీ హటావో' అన్న ఇందిర కలలు ఫలించడం సాధ్యమైయ్యేదని నా దృఢమైన విశ్వాసం.

మేం ఆర్థికంగా ఎలా ఉన్నా, ఎవరైనా ఆకలి అని చేయి జాపితే, వారికి లేదనకుండా కడుపునిండా భోజనం పెట్టి పంపే మనస్తత్వం అమ్మది. అవధాని గరికపాటి నరసింహారావుగారు అన్నట్లు "అమ్మ చేసే అవధానం ముందు మేము చేసే అవధానం దిగదుడుపే" అన్నది నిజమని తోస్తుంది. ఎవరి అవసరాలు ఏమిటి అనేది గుర్తించి, వాటిని తీర్చడంలో తన సుఖాన్ని త్యాగం చెయ్యడమనేది ఒక్క తల్లికే చెల్లుతుంది. అందుకే ఆమెను భూదేవితో పోలుస్తారు. వరి విత్తనం నాటితే జొన్నలు వస్తాయా? అలాగే మాలో నాటుకున్న ఆ జ్ఞాపకాలు నేటికీ పదిలంగా ఉన్నాయి. మా నాన్నగారు లేనిలోటు చాలాసార్లు కనిపించినా, అమ్మ తానే అయ్యి - కష్టాన్నైనా సుఖాన్నైనా ఒకే విధంగా స్వీకరించి, స్థితప్రజ్ఞత కనబరచి, మాకు ఆదర్శంగా నిలిచారు. ఆమె వద్ద నేర్చుకున్న ఏకాగ్రత ఎలాంటిదంటే, ఒక్కొక్కసారి చదువులో పడి తినడం కూడా మరిచిపోవడం జరిగేది.

ఒకసారి వేసవిలో ఆడుకుంటూ ఉండగా ఒక సంఘటన జరిగింది. నేను చూస్తుండగా ఒక తేలు పొట్టలోంచి బోలెడు తేలు పిల్లలు రావడం గమనించాను. దాన్ని తట్టుకోలేక, తల్లిని చంపి వెళ్ళిపోతున్నాయని అనుకుని ఆ తేలు పిల్లలని దగ్గరలోనే ఉన్న చెప్పుతో కొట్టి చంపడం ప్రారంభించాను. అది చూసిన అమ్మ కంగారు పడి నన్ను దూరంగా తీసుకుని వెళితే, ఏడుస్తూ "చూడమ్మా! అవి వాళ్ళమ్మను చంపేసాయి" అని అమాయకత్వంతో చెప్పిన సందర్భం ఇప్పటికీ సజీవంగా నా మనసులో ఉంది. మేము చిన్నప్పుడు ఆర్థికంగా ఇబ్బంది పడినపుడు "ఈ రోజుల్ని ఎన్నడూ మరువరాదని, ఆర్థికంగా ఉన్నవారికి చేయూతనివ్వాలని" మాకు తెలియచేసి, నేడు ఆ కార్యక్రమం చేపట్టడానికి ఆనాడే బీజం వేసారు. నేడు 'సొంతలాభం కొంతమానుకుని పొరుగువారికి తోడుపడవోయ్' అన్న గురజాడగారి జాడలో పయనిస్తున్న పిల్లలను చూసి ఆమె పొందే ఆనందం అనిర్వచనీయం.

చిన్నప్పుడు ఎన్ని రకాలైన ఆటుపోట్లకు గురయినా, మొక్కవోని ఆత్మవిశ్వాసాన్ని మాలో నింపి, నమ్మకాన్ని మించిన బలం లేదని వేదాంత రహస్యాన్ని మాకు సులభమైన మార్గంలో నేర్పారు మా అమ్మగారు. గతంలో ఒకసారి కాలిఫోర్నియాలో ఉన్నప్పుడు, మాతో

గడిపిన మూడు నెలల కాలంలో ఆమె పొందిన ఆనందాన్ని వర్ణించడానికి సరిపడే పదాలు నాకు తెలియవు. ఆమెపై అమితమైన అభిమానం ఉండేది. ఆమెకు నా స్నేహితులను పరిచయం చేసినపుడు ‘నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది’ అని ఆమె నేర్పిన సూత్రాన్ని చక్కగా మననం చేసుకుని, ఆచరిస్తున్నానని ఆమె పొందిన ఆనందానికి - ఓ గురువు తను చెప్పిన పాఠం శ్రద్ధగా చదివి, ఆచరణలో పెట్టిన శిష్యుని చూసి పొందే సంతోషానికి ఎంతో సారూప్యముంది.

ఆ. శ్రీనివాసుడంద్రు సన్నిహితులు నన్ను
రామలక్ష్మి సూర్యరామసుతుడ
నేటి నా యునికికి నావారి దీవెనల్
ప్రేమసహన ధైర్యఫలము నిజము.



సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ గా గత 16 సంవత్సరాలుగా పనిచేస్తున్న శ్రీనివాసరావు గారు, తీరిక సమయాల్లో ‘సంఘమిత్ర’ త్రైమాసిక పత్రిక **(www.sanghamitra.org)** ని వెలువరిస్తున్నారు. వేదగణిత పద్ధతులను నేర్చుకుంటూ వాటిని అమెరికాలో పుట్టి పెరిగిన పిల్లలకి ఒక ఉద్యమంలాగా నేర్పిస్తున్నారు. భార్య సురేఖ, కూతుళ్ళు శ్రావ్య, శృతిలతో సెయింట్ లూయిస్ లో నివాసం.



# వారణాసి నాగలక్ష్మి



"అమ్మంటే ఎవరో తెలుసా?"

అంటూ ఒక ఆర్ద్ర గీతపు పల్లవిలో ప్రశ్న వేసి చరణంలో 'తన సుఖాన్ని విడనాడి తరుణి తల్లి అవుతుంది సంతానం కోసం బ్రతుకంత ధారపోస్తుంది'

అంటూ సమాధానమిచ్చారు జ్ఞానపీఠాన్నందుకున్న కవిశ్రేష్ఠులు డా. నారాయణరెడ్డిగారు! సృష్టిలో ఏది అసత్యమైనా కావచ్చు గానీ బిడ్డకు జన్మనిచ్చే తల్లి పడే యాతన మాత్రం నిజం. పుట్టిన బిడ్డను అమ్మమ్మో, నాయనమ్మో, తండ్రో, తాతో పెంచిన సందర్భాలుండవచ్చును గాని, నవమోసాలూ మోసి, పురిటి నిప్పులు భరించి పాపాయిని కనేది మాత్రం కేవలం తల్లే! తల్లికి బిడ్డతో అనుబంధం పాపాయి పుట్టడానికి తొమ్మిది నెలల ముందునుంచే ఉన్నా బిడ్డ తల్లిని గుర్తించేది ఆ పసికందుకి జ్ఞానం వచ్చాకే. నా జ్ఞాపకాల పుటల్లో మా అమ్మ గురించిన తొలి జ్ఞాపకం పదిమంది పిల్లలని చుట్టూ కూర్చోపెట్టుకుని అన్నం కలిపి పెడుతున్న అన్నపూర్ణగానే.

అమ్మ పేరు పార్వతి. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఏలేశ్వరపు జోగినాధంగారు, లక్ష్మీదేవమ్మలకి నాల్గవ సంతానంగా పుట్టిన అమ్మ వివాహం నాన్నగారు రామకృష్ణశాస్త్రిగారితో 1957లో జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తాతగారు, తన కొడుకు స్వతంత్ర భారతాన్ని అన్నపూర్ణగా తయారు చేసే యజ్ఞంలో భాగం పంచుకోవాలని వందెకరాల అడవిని కొన్నారు. అప్పటికి అగ్రికల్చర్ డిమానిస్ట్రేటర్‌గా అనుభవం పొందిన నాన్నగారు వివాహమైన కొత్తల్లోనే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వ్యవసాయంలోకి ప్రవేశించారు.

పెట్టుబడి లేదు.. రాయీ, రప్పా, ముళ్ళపొదలతో నిండిన అడవి... వర్షాధారపు ... కనుచూపు మేరలో మరో ఇల్లే లేని పరిసరాలు! విశాలమైన మండువా లోగిలిలో ధనవంతులుగా చెప్పుకోతగ్గ వారి అమ్మాయిగా పుట్టి పెరిగిన అమ్మ ఆ అడివినీ, ఏవసతులూ లేని తాటాకుల ఇంటిని చూసి బెంగపడినా సర్దుకుని ఆ ఇంటిలో భాగమైపోయింది. అత్తమామలు, ముగ్గురాడపడుచులు, ముగ్గురు మరుదులు, వితంతువైన మామగారి చెల్లెలు, వారి కుటుంబం, అత్తగారి అక్కలు, వారి పిల్లలు, ఇంకా పెదమామగారి మనవలు.. స్నేహితుల పిల్లలు.. ఇలా ఆ వనంలోని పర్ణశాలలో ఎప్పుడు బంధు వాహిని ప్రవహిస్తూ ఉండేది. ముఖ్యంగా ప్రతి వేసవిలోను ఆ తోటలో.... అడవిలో పారే సెలయేరులా, దూకే జలపాతంలా పాతికమంది పిల్లల హోరు ప్రతిధ్వనించేది! ఇంతమందికీ విసుగన్నది లేకుండా మామ్మ వెనకే అమ్మ చిరునవ్వుతో అన్న పానాలు ఏర్పాటు చేసేది. ఆత్మీయంగా, నిష్కల్మషంగా ఆదరించేది. వచ్చిన పిల్లలంతా ఆటపాటల వయసువారు కావడం, వెంట వచ్చిన తల్లులు కొద్దిరోజులుండి వెళ్ళిపోవడంతో పనిభారమంతా అమ్మ మీద పడేది. అయినా ఏనాడూ అమ్మ విసుక్కోగా నేను చూడలేదు! ఇంతమంది పిల్లలకీ కట్టెపుల్లల పొయి మీద వండి వార్చడం, వడ్డించి, భోజనాలయ్యాక ఆ గిన్నెలన్నీ తోముకోవడం, ఇల్లూ వాకిలీ శుభ్రపరచుకోవడం... ఇలా ఎడతెరిపి లేని పని ఉండేది. వెనక్కి తిరిగి గుర్తుచేసుకుంటే ఆ ఇల్లు కూడా బంధుమిత్రుల రాకకోసం, వారితో కలిసి కొంతకాలం గడపడానికి వీలుగా ఉండేలా కట్టినట్టు ఉండేది... ముందు పొడవాటి

వరండా, మధ్యలో పెద్దహాలు, అటూ ఇటూ రెండు వసారలు, వెనక విశాలమైన వంట గది... ఇంతే. బెడ్రూం అనదగ్గ గదే లేదు ఆ ఇంట్లో!

పొద్దున్నే రేడియోలో వందేమాతరం వస్తుంటే ఎవరూ నిద్రలో ఉండడానికి వీల్లేదు. క్షణంలో లేచి అటెన్షన్లో నిలబడాల్సిందే! స్వాతంత్ర్యం కోసం జైలు కెళ్ళి వచ్చిన తాతగారి శాసనం అది! పిల్లల బద్ధకం చిటికెలో వదిలించేందుకు అమా, నాన్నగారూ ఈ శాసనాన్ని రోజూ వాడేవారు! పక్షుల కిలకిలా రావాల నేపథ్యంలో పెద్దవాళ్ళయిన మా కజిన్స్ సాయంతో అమ్మ వాకిట్లో కళ్ళాపి జల్లి ముగ్గులు తీర్చేది. మెల్లగా మేమూ నేర్చుకున్నాం. ఆవులూ, గేదెల పాలు పితికి మా అందరికీ పాలూ, కాఫీలు అందించేది. అమ్మ కలిపే కాఫీ చాలా బావుండేది. ఆ రుచి కాలేజీ కొచ్చే వరకూ మాకు తెలియలేదు. ఒకసారి రుచి చూసాక పొద్దుటి కాఫీ, అలా ప్రశాంతంగా కబుర్లు చెప్పుకుంటూ ఆ పానీయం తాగడం, తర్వాత చకచకా తయారై అన్నం తిని కాలేజీకి వెళ్ళడం అది ఇంకో దశ... కౌమార దశ... అంతకు ముందు దశ అయిన బాల్యావస్థలో మాత్రం సెలవలు వచ్చాయంటే మాత్రం పిల్లలందరికీ రాత్రి మిగిలిన చద్దెన్నంలో కొత్తావకాయో,మాగాయో వేసి కలిపి ఏకంగా పది, పదిహేనుమందికీ,ఒక్కోసారి పాతిక మందికీ పెద్ద పెద్ద ముద్దలు చేసి పెట్టేది అమ్మ. ఒక్కోసారి ఆ పని మా ఆఖరి మేనత్త ఉంటే ఆవిడ అందుకునేది. అప్పట్లో అంతమంది పిల్లలతో కలిసి అమ్మ చుట్టూ గుండ్రంగా కూర్చుని అరచేతి నిండా బత్తాయి పండంత ముద్దని మళ్ళీ నా వంతు వచ్చేదాకా మెల్లగా తినడం ఎంతో గొప్ప అనుభూతి! ఒక్కోసారి పాపులర్ డిమాండ్ మీద అదే మరోసారీ, మళ్ళీసారి కలిపేది. ఆఖర్న పెరుగన్నం! అలా తింటున్నంతసేపు మాకన్నా పెద్దవాళ్ళూ, నగర జీవితం గడుపుతున్న వాళ్ళూ అయిన పిల్లలు చెప్పే వింత విషయాలూ జోకులూ కళ్ళు విప్పార్చుకుని వినేవాళ్ళం మా అన్నలూ, నేనూ, మా చెల్లెలు. ఈ సిటీ కోళ్ళు (నాన్నగారు వాళ్ళనలా పిలిచేవారు) ఎవరో ఒకరిని సరదాగా 'బకరా' ని చేసి అంతా నవ్వేవారు, కొంచెం పెద్దవాళ్ళూ, ఆడపడుచుల పిల్లలూ అయిన వాళ్ళని అమ్మ ఏమీ అనలేక నవ్వుతూ ఊరుకోవడం.... ఈ 'బకరాలూ' అమ్మ దగ్గర మొరపెట్టుకోవడం.... ఇదంతా ఎప్పుడైనా నాన్నగారో, తాతగారో వినడం తటస్థిస్తే వాళ్ళని చివాట్లు పెట్టడం జరిగేది. అందరిలోకీ ఎక్కువ అల్లరి చేసే వ్యక్తి భవిష్యత్తులో నా భార్త కాబోతున్నాడని అప్పట్లో నాకు తెలియదు. పసివాళ్ళ పట్లా, మూగజీవాలూ, మొక్కల పట్లా జాలెక్కువ ఉండే నేను అతని అపోజిషన్ పార్టీలో ఉండి 'నాన్‌కో ఆపరేషన్' ద్వారా నా అసమ్మతిని తెలిపేదాన్ని. అదంతా వేరే విషయం అనుకోండి!



ఆ అల్లర్లూ, గిల్లికజ్జాలు, ఆ సహజీవనం... అదొక అద్భుత లోకం! మా పసితనపు అద్భుత జీవనం నాన్నగారి కృషే అయినా, అమ్మ సంపూర్ణ సహకారం లేనట్లయితే అది ఇంత సజీవంగా మా మనసుల్లో నిలిచేది కాదు!



పదిహేనేళ్ళకే పెళ్ళయి వ్యవసాయదారుల ఇంటికి కోడలిగా వచ్చిన అమ్మ ఎక్కువ చదువుకోలేదు. రోజులో ఎక్కువ భాగం ఇంటి చాకిరీలోనే సరిపోయేది ఆవిడకి. అయినా మధ్యాహ్నభోజనాల తర్వాత దొరికే గంటా, గంటన్నర సమయంలో ఏదయినా చదవని పుస్తకం చేతికి దొరికితే బావుండని వెతుక్కునేది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఆవిడకోసం నాన్నగారు ఒకటో రెండో పత్రికలు తెప్పించేవారు పోస్ట్‌లో. ఒకసారి పోస్ట్ మాన్ పత్రిక తెచ్చి ఇచ్చేసరికి నేను పరిగెడుతూ వెళ్ళి అందుకున్నాను. స్కూలు సెలవులు కావడంతో అపుడు పిల్లలం

అంతా ఇంట్లో ఉన్నాం. అప్పటి రూల్ ప్రకారం ఎవరు ముందు పుస్తకం అందుకుంటే వాళ్ళు చదివిచ్చేదాకా మిగిలిన వాళ్ళు వేచి ఉండాల్సిందే!

ఆ రూల్ పిల్లలం 'చందమామ' చదవడం మొదలు పెట్టినప్పటి నుంచి అమలులో ఉంది. సరే..పుస్తకం నా చేతికందిన పదినిముషాలకి అమ్మ విశ్రాంతి సమయమయింది. "ఏద్రా వీక్లీ" అంటూ వచ్చింది. ఎంతో కుతూహలంగా సీరియల్ చదివేస్తున్న నేను మా రూల్ సంగతి గుర్తుచేశాను! వెంటనే చిన్నబోయిన మొహంతో "నీకు రోజంతా బోలెడు టైముంటుంది చదివేందుకు. నాకు ఈ కాసేపటి తర్వాత వరుసగా పనుంటుంది" అంది. ఆ వదనం, ఆ కంఠం, వెంటనే పత్రిక ఇచ్చేసిన ఆ సంఘటనా ఇప్పటికీ గుర్తే! అలాగే మరోసారి పిల్లలందరం డాబా మీద (తరువాత కట్టారు) పడుకోబోతూ పెరటి వైపు తొంగి చూస్తే అమ్మ ఒక్కర్తీ బండెడు గిన్నెలు తోముకుంటూ కనిపించడం, చిన్నపిల్లగా నాకది సహజంగా అనిపించడం, నా వెంట ఉన్న మా అక్కయ్య (కజిన్) ఎంతో బాధపడి "దా! మనం కూడా వెళ్ళి సాయం చేద్దాం" అనడం గుర్తొస్తే అప్పట్లో అమ్మా, నాన్నగారూ (ఆయన కూడా రాత్రీ, పగలూ అన్నది లేకుండా తోటలో పనిచేసేవారు) ఎంత నిరాడంబరజీవులో అర్ధమై గర్వంగా, వ్యవసాయదారుల శ్రమకు ఫలితం దక్కని మన వ్యవస్థ పట్ల కొంత విచారంగా అనిపిస్తుంది. ఎంత పంట పండినా పెట్టుబడి చేతికి రాని సేద్యం, ఆయేటి కాయేడు పెరిగిపోతున్న బ్యాంకు లోను చూసి 'ఆడపిల్లల పెళ్ళిళ్ళు ఎలా చేస్తామా' అని అమ్మ బెంగపడేదనుకుంటా. దానికి తోడు మా దొడ్డమ్మలిద్దరూ "ఇంకా ఎపుడు చూస్తారే సంబంధాలూ? ఇలా అయితే ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేసినట్టే!" అని అమ్మని కంగారు పెట్టేసేవారు. నేను బి.ఎస్సీ మొదటి సంవత్సరంలో ఉండగా ఏదో పెళ్ళి సంబంధం కోసం జాతక చక్రం వేయించారు. ఏడవ తరగతి నుంచీ నేషనల్ స్కాలర్ షిప్ తెచ్చుకుంటూ, చదువులో చురుగ్గా ఉంటూ, బాగా చదువుకోవాలనీ, యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోవాలనీ ఒక దృఢ సంకల్పంతో ఉన్న నాకు ఈ ప్రయత్నంతో చాలా నిరాశకలిగింది.

చివరికి జాతకాలు కలవలేదని తెలిసి తేలికపడ్డ మనసుతో హాయిగా నవ్వేస్తే, అమ్మ ఉక్రోషంతో "నీ ఏడుపువల్లే ఇలా అయింది.. చక్కటి సంబంధం తప్పిపోయింది" అని బాధపడింది. ఆ తర్వాత మళ్ళీ బిఎస్సీ పూర్తి అయ్యేదాకా అలాంటి ప్రయత్నాలు తలపెట్టలేదు. యూనివర్శిటీ ఫస్ట్ రావాలన్న నా సంకల్పమూ నెరవేరింది. ఏ ప్రయత్నాలూ లేకుండానే పెళ్ళి నిశ్చయమయింది. పెళ్ళికి ఇంకా సంవత్సరం గడువు ఉండడంతో సెంట్రల్ యూనివర్శిటీలో ఎమ్మెస్సీకి ఎంట్రెన్స్ రాస్తానన్నాను. ఎంత పనయినా అవలీలగా చేసే అమ్మకి అప్పుడే కాలి లిగమెంట్ రప్చర్ అవడంతో నడవలేని పరిస్థితి ఏర్పడింది. అమ్మ నన్ను హైదరాబాద్ వెళ్ళద్దనీ, ఎలాగూ పెళ్ళి కుదిరింది కనుక ఆ ఒక్క సంవత్సరమూ తన దగ్గర తోడుగా ఉండమని అడిగింది. సందిగ్ధంలో పడ్డ నేను 'పరీక్ష ఒక్కటీ రాసి వస్తాననీ, సీటు వచ్చినా చదవడానికి వెళ్ళననీ' అన్నాను.



"నువ్వు పరీక్ష రాస్తే సీటు రాకుండా ఉండదు, సీటు వస్తే మీ నాన్నగారు పంపకుండా ఉండరు" అని అసలు వెళ్ళనే వద్దని అడిగింది. నాన్నగారు అమ్మకి నచ్చ చెప్పి నన్ను పంపించారు. వారం తర్వాత సీటు తెచ్చుకుని నూజివీడు ప్రయాణమైన నాకు కొంచమైనా ఆనందం కలిగిందో లేదో గుర్తులేదు కాని, మనసులో చాలా మధన పడ్డం మాత్రం నిజం. పెద్దదయిపోయినా మామ్మ తోడూ, నాకన్న కొంచెం చిన్నదైన చెల్లెలు విమల సాయమూ ఉంటాయని నాన్నగారూ, 'ఈ అవకాశం వదులుకోవద్ద'ని బంధువులూ చెప్పడంతో అమ్మ నన్ను వెళ్ళి చదువుకోమంది. అపుడు నా చదువుకి కొంత ఆర్ధికసహాయం చేసిన మా ఆఖరి మేనత్తకి ఈ సందర్భంగా మరోసారి కృతజ్ఞత చెప్పుకోవాలి.

చదువు కోసం మంచం మీద నుంచీ లేవలేని స్థితిలో ఉన్న అమ్మని వదిలి వెళుతూ చాలా బాధ పడ్డాను. తర్వాత అమ్మ హైదరాబాద్‌లో చికిత్స పొంది మామూలు స్థితికి చేరుకుంది గాని మొదటి సంవత్సరం పూర్తై సెలవులకి ఇంటికి వచ్చిన నేను డిస్క్ ప్రొలాప్స్ వల్ల చాలా అస్వస్థతకి లోనయ్యాను. అంతవరకు ఆసుపత్రి ఎలా ఉంటుందో ఎరగని నాకు నెలల తరబడి నిమ్స్‌లో ఉండాల్సి రావడం, యూనివర్సిటీ ఫస్ట్‌ర్యాంక్ కోసం కృషి చేస్తున్న సమయంలో చదువుకి అంతరాయం ఏర్పడ్డం తీవ్రమైన ఆశాభంగాన్ని కలుగజేశాయి. దానికి తోడు వైద్యం ఇంతగా అభివృద్ధి చెందని రోజులు, ఆర్థిక ఇబ్బందుల వల్ల ప్రభుత్వాసుపత్రిలో అరకొర సదుపాయాల మధ్య సర్జరీ జరగడంతో తీవ్రమైన శారీరక బాధ... వీటన్నిటి మధ్య నన్ను చూసి అమ్మ ఎంత బాధ పడిందో బాధకి తట్టుకోవడం, చిరునవ్వు చెదరకుండా చదువుకోసం వెళ్ళిన నాకు, దగ్గరుండి ఆ సమయంలో సపర్యలు చేసింది అమ్మే. జనరల్ వార్డులోనూ, క్యూబికల్‌లోనూ కాసేపైనా నడుం వాల్చుకునే వీలు లేని పరిసరాల్లో తను నాకు సేవ చేసింది. తన ఇంట్లో ఎన్నాళ్ళు ఎందరికి ఆశ్రయం ఇచ్చి, ఆదరణ అందించినా, నాకోసం బంధువుల ఇళ్ళలో ఉండాల్సి వచ్చినప్పుడు మానసికంగానూ, శారీరకంగానూ ఎన్నో విధాల సర్దుకోవల్సి వచ్చింది.

ఆ తర్వాత కోలుకుని, పెళ్ళి చేసుకుని డాక్టర్ భార్యగా అతనితో బెంగుళూరు వెళ్ళి, శ్రద్ధగా ఆసుపత్రిలో చెప్పిన ఎక్సర్ సైజులు కర్మం తప్పకుండా చేసి త్వరలోనే మామూలు స్థితికి చేరుకునేవరకూ అమ్మి స్థిమిత పడలేదు. ఆ తర్వాత కూడా మా పిల్లలిద్దరూ పుట్టినప్పుడూ, ఇతర సమస్యలెదురైనపుడూ, వైద్యుడిగా నా భర్త రాత్రింబగళ్ళు తన వృత్తిలో నిమగ్నమైపోవలసి, ఇంకెవరి సహాయమూ అందని పరిస్థితుల్లోనూ, నా వెంట ఉండి ఆదుకున్నది మా అమ్మే.

నా మొదటి పెయింటింగ్ సేల్ అయినపుడు ఆ సంపాదనతో అమ్మకి బంగారు గాజులు కొనిపెడితే, "అక్కని చదువులోగాని, చిత్రలేఖనంలో గాని నేనేనాడూ ప్రోత్సహించలేదు. ఇపుడిలా నాకు అది బహుమానం పంపించింది "అంటూ తన దగ్గర కళ్ళనీళ్ళు పెట్టుకుందని మా చెల్లెలు చెప్పింది. ఆవిడ తన అత్త మామలకీ, నాకూ, మా చెల్లెలికీ, కోడళ్ళకే కాక అత్తగారి అక్కలకీ, అత్తగారి ఆడపడచుకీ కూడా ఎంతో సేవ చేసి వారి మనఃపూర్వకమైన దీవెనలు పొందింది. మామగారిని చివరివరకూ శ్రద్ధగా చూసుకుంది. ఆడపడుచుకి పురుడు పోసి, ఆవిడ ఉద్యోగంలో ఒడిదుడుకులు ఎదురైనపుడు చంటిపిల్లలిద్దరిని తన పిల్లలకన్నా ఎక్కువగా సాకింది. ప్రతి వేసవిలోనూ వచ్చే పిల్లలందరినీ ఆపేక్షగా ఆదరించడమేకాక, వాళ్ళలో ఎవరైనా ఆటపాటల్లో అలిగి, తినకుండా తోటలోకి పోతే అన్నం కలిపి తోటలోకి తీసుకెళ్ళి వాళ్ళని బ్రతిమాలి తినిపించేది. చిన్నపిల్లగా అత్తింటికి వచ్చిన ఆవిడ వ్యక్తిత్వం ఇలా వికసించడంలో ఆవిడపై నిరాడంబర ప్రేమ మూర్తి అయిన మా మామ్మగారి ప్రభావం, పశువుల్నీ, ప్రకృతినీ ప్రేమించి; మట్టినీ మానవతనీ పూజించే నాన్నగారి సాహచర్యం ముఖ్య పాత్ర పోషించాయని చెప్పక తప్పదు. ఏదేమైనా మా అమ్మ తన పిల్లలకే కాక ఎందరికో మాతృత్వాన్ని పంచింది. ఈనాడు ఆత్మీయుల ఇంటికైనా సరే వెళ్ళి రెండూ రోజులుండాలంటే, ఆ గృహస్తు మనసారా ఆహ్వానించినా, గృహిణికి ఆమోదమో కాదో అనే శంకతో వెళ్ళి ఉండలేని పరిస్థితి! ఆ రోజుల్లో నాన్నగారి ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఆత్మీయులకీ, అవసరంలో ఉన్న వాళ్ళకీ ఆయన తోటలో సేద తీరే చోటు దొరికేదంటే దానికి దోహద పడింది మా అమ్మ నిర్మల స్వభావమే, నిస్వార్థ గుణమే ఆవిడలోని అన్నపూర్ణాదేవి అంశమే.

**అందుకే అంటాను.... మాతృదేవోభవ!!!**



**వారణాసి నాగలక్ష్మి గారు** కృష్ణాజిల్లా నూజివీడులో పుట్టి పెరిగారు.
హైదరాబాదు సెంట్రల్‌యూనివర్శిటీలో కెమిస్ట్రీలో ఎం.ఫిల్ చేశారు. పుస్తకాలు చదవడం, పెయింటింగులు వేయడం,పాటలు వ్రాయడం, అప్పుడప్పుడు కథలు వ్రాయడం హాబీలు. స్వీయగీత సంకలనాలు పుస్తకరూపంలో వెలువడ్డాయి.

# శ్రీరాం కుమార్ భాగవతుల



అమ్మ... నీవు లేవు అనే నిజం నన్ను వెంటాడుతున్న నీవు చూపిన ప్రేమ, ఆత్మీయత మరియు అనురాగాల ప్రతిరూపాలు నాతోనే ఉన్నాయి అనడం సందేహం లేదు. మరణం అనే చిన్న చేదు నా నుండి నిన్ను వేరు చేసినా, నీవు పంచి ఇచ్చి నా ప్రేమ, అనురాగం, వాత్సల్యం అనుక్షణం నాతోనే ఉంది అని చెప్పటానికి నేను చేయబోయే ప్రయత్నమే ఈ "మాతృదేవోభవ" శీర్షిక.

"I remember my mother's prayers and they have always followed me.
They have clung to me all my life." – Abraham Lincoln (1809 – 1865)

"సృష్టికర్త ఒక బ్రహ్మ. అతనిని సృష్టించినది ఒక అమ్మ...." అని ఎంతో మంది కవులు, గాయకులు వర్ణించి, గానం చేసారు, అమ్మలోని మాధుర్యాన్ని తెలియపరిచారు. కడుపు కోతను మధురగాయంగా, అనుక్షణం తాను అలసిపోతున్నా తన ఒడిలో ఉన్న పసిపాపకు కొండంత ప్రేమని ఇవ్వాలనే తపన కేవలం తల్లికి మాత్రమే ఉంది అని చెప్పటంలో అతిశయోక్తి లేదు.

తల్లి ప్రేమకి, తండ్రి బాధ్యతకి రూపాలంటారు. కానీ మా నాన్నగారు ఉద్యోగరీత్యా పలు ఊర్లు తిరగటం వలన ఆ బాధ్యతని కూడా తన భార్య, అంటే మా అమ్మ భుజస్కందాలపై విడిచారు. నాకు తెలిసినంతవరకూ ఆకలి అన్నవారికి అన్నం, కష్టాల్లో ఉన్న వారికి సహాయం, శత్రువుకైన జాలి కలిగే అమాయకత్వం ఉన్న రూపమే మా అమ్మ.

అమ్మ పేరు "సోమేశ్వరి". విశాఖ జిల్లాలో అప్పలనరసయ్య, లక్ష్మీకాంతం దంపతులకు మూడవ సంతానంగా జన్మించింది. మధ్యతరగతి కుటుంబం వలన చిన్న వయసులోనే తల్లితో ఇంటిపని, వంట పనిలో ముఖ్యపాత్ర వహిస్తూ బాధ్యతని పరిచయం చేసుకుంది. పెళ్ళి కాక ముందే తానూ ఎంతగానో అభిమానించే అన్న ఒక విషాద సంఘటనలో మరణించటంతో అమ్మకు బాధ్యతతోపాటు కన్నీళ్ళు కూడా పరిచయమయ్యాయి. అమ్మకు తన అన్న అంటే ఎంతో అభిమానం అందుకే అతని పేరు తన కొడుకుకి పెట్టుకుంది. (శ్రీరామా - ఇదే నా పేరు).

1974లో భాగవతుల నరసింహమూర్తి, సూర్యకాంతమ్మల మొదటి సంతానం అయిన నారాయణరావు గారిని వివాహం చేసుకుని, అరకు దగ్గర ఉన్న పాడువా అను ఊరిలో కుటుంబ బాధ్యతలు స్వీకరించింది. మా నాన్నగారికి ఇద్దరు తమ్ముళ్ళు, ఒక చెల్లి. పల్లెటూరిలో పెరిగి ఎవరైనా పట్టణంలో ఉండాలి అనుకుంటారు. కానీ అమ్మ వివాహ జీవితంతో అందుకు విరుద్ధంగా జరిగింది. చేసుకున్న సంబంధం దగ్గర కావటంతో అత్తవారింట్లో కొత్తమనుషులతో ఇబ్బంది అనే మాట అవకాశం దొరకలేదు. కాని మా తాతగారు, నాన్నగారు రైల్వేలో ఉద్యోగం కావటం వలన పెద్ద కోడలి హోదాలో ఉన్న మా అమ్మగారికి కుటుంబ బాధ్యతలు అప్పగించారు. అది ఒక కొండ ప్రాంతం, చలిప్రాంతం కావటం వలన వెలుతురుకన్నా చీకటినే ఎక్కువసార్లు పరిచయం చేసుకుంది. అమ్మ పెళ్ళినాటికి ఇంట్లో బాబాయిలకి, అత్తకి వివాహం జరగలేదు. ఎప్పుడూ వచ్చిపోయే చుట్టాలు, అత్తగారి అక్కా, చెల్లెళ్ళు, వారి పిల్లలతో జనసందోహంతో ఇల్లు ఉండేది. ఇది కేవలం చలి ముసిరిన



సమయంలో. ఇంక వేసవికాలం వస్తే వర్ణనాతీతం. చుట్టాలు, స్నేహితులు సరదాగా గడపటానికి వచ్చేవారు. అమ్మ ఆవకాయ పెట్టటంలో నేర్పరి. అందువలన తయారు చేసుకోవటానికి ఆ ఇంటినే ఎంచుకునేవారు. అంతమందికి అమ్మ వండిపెట్టి, వచ్చిన వారితో కబుర్లు చెపుతూ అందరి అభిమానాన్ని పొందుతూనే ఉండేది. ఎక్కడ ఉన్నా మనకంటూ స్నేహితులని సంపాదించాలి అనేదే అమ్మ సిద్ధాంతం. ఆ కొండ ప్రాంతంలో కూడా చుట్టూ ఉన్న వాళ్ళతో స్నేహంగా ఉంటూ అందరికీ సహాయం చేసేది. సోంపాప (అమ్మ ముద్దు పేరు) అంటే ఆ చుట్టు పక్కవాళ్ళకి ఎంతో అభిమానం. ఆడపడుచుకి మరియు మొదటి మరిదికి వివాహం చెయ్యటంలో ముఖ్యపాత్రను పోషించింది. ఒక ఆడపిల్లని,మగపిల్లవాడికి (అక్క, నేను) జన్మనిచ్చి మాతృమూర్తిగా అవతారం దాల్చింది. తాతగారు పదవీ విరమణ అవటం, ఉద్యోగరీత్యా నాన్నగారు ఇరాక్ దేశం వెళ్ళటం వలన, అదే సమయంలో పిల్లలకి (నేను, అక్క) మంచి విద్యాభ్యాసం కోసం, నాన్నగారు అమ్మ పుట్టిన విశాఖ జిల్లాకు కుటుంబాన్ని మార్చివేసారు. నాన్నగారు అమ్మని, అక్కని, నన్ను ఒక ఇంట్లో ఉంచి విదేశి పయనం అయ్యారు. ఆ క్షణం నుంచి నిరంతరం ఒక యంత్రంలా కుటుంబం కోసం శ్రమించసాగింది. నాన్నగారి కుటుంబంలో అందరు ఉద్యోగాలతో, ఆ తరువాత పెళ్ళిళ్ళతో స్థిరపడిపోయారు. అయినా వేసవిలో చుట్టాల రాకపోకలతో మా ఇల్లు ఎప్పుడు కళకళలాడుతువుండేది. ఆరోజుల్లో బాబాయిలు (నాన్నగారి కజిన్స్), మామయ్యలు వైజాగ్‌లో ఉద్యోగం సంపాదించటం కోసం వచ్చేవారు, అందుకు మా ఇంటినే ఎంచుకుని అమ్మ దగ్గర ఉండి ఉద్యోగ ప్రయత్నం చేసేవారు. నాకు తెలిసిన అమ్మ ఎప్పుడు వద్దు, అవ్వదు అనే మాటలు చెప్పటం వినలేదు.

కష్టాలు ఎన్ని ఉన్నా పైకి నవ్వుతూ, ఉన్నదానిలో సంసారం నడిపేది. ఇరాక్ నుంచీ నాన్నగారు వచ్చి వైజాగ్ రైల్వేలో స్థిరపడిపోయారు. నాన్నగారి చిన్న జీతం అయినా అమ్మ మాత్రం మా విషయంలో ఏ రోజూ రాజీ పడనివ్వలేదు. కాన్వెంటు చదువులు, ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం, పుట్టినరోజు పండగలు, ఇలా ఎన్నో విషయాల్లో లోటు లేకుండా పిల్లలని పెంచింది. నాన్నగారు ఏ రోజూ దేనికీ లెక్కకానీ, ఇంటి విషయాలు కానీ అడిగేవారు కాదు. ఒక విధంగా నాన్నగారికి అమ్మ అంటే నమ్మకం, గౌరవం. ఇలా ఇంట్లో భర్తా, పిల్లల విషయంలోనే కాదు అందరికీ సహాయం చెయ్యటంలో తను సాటిలేదనిపించుకునేది. ఏ ఇంట్లో పండగ ఐనా అమ్మ చేతి వంట ఉండవలసిందే. అలసట లేకుండా విశ్రాంతి తీసుకోకుండా ఒక పనికి ఇంకో పని చేసేది. అందరి పిల్లలను తన పిల్లలుగా ప్రేమించేది. కష్టాలు వస్తే, తాను ఎటువంటి పరిస్థితిలో ఉన్నా సహాయం చెయ్యటానికి సిద్ధంగా ఉండేది. పద్ధతిగా, శుభ్రంగా ఉండటం అమ్మ నీడలోనే నేర్చుకున్నాము. ఈ విషయంలో ఏ మాత్రం తేడా వచ్చినా అమ్మ చేత తిట్ల వర్షం, అది నాన్నగారు అయినా మేము అయినా.



ఆ రోజు మరువలేను.... నేను ఇంటర్ చదివేటప్పుడు కాలేజీకి వెళ్ళకుండా సినిమాలు చూసేవాడిని. అది తెలిసి అమ్మ చాలా బాధపడి ఒక్క మాట నాతో చెప్పింది. "బాబూ రామా (నా ముద్దు పేరు) మేము నీకు ఆస్తిపాస్తులు ఇవ్వలేము ఏదో మీనాన్నగారి కడిగిన జీతపు రాళ్ళే. తల తాకట్టు పెట్టైనా నిన్ను చదివిస్తాము, నీకు చదువు ఇష్టము లేకపోతే ఇప్పుడే చెప్పు. ఏది ఇష్టమో అదే చేయిస్తాను కానీ ఇలా నువ్వు ఇబ్బంది పడకు". ఆ రోజు నుంచి నేను ఈ రోజు వరకు అమ్మ దగ్గర ఏమీ దాచలేదు. దండించవలసిన అమ్మ దయ చూపించేసరికి మార్పు నన్ను చేరింది. దయ చూపించే గుణం ఎవరికీ ఉంటుంది ఒక్క తల్లికి తప్ప.

ఇలా ఎన్నో విషయాల్లో తాను రాజీ పడుతూ తమ పిల్లల భవిష్యత్తు కోసం పాటుపడేది. అందరికి సొంత ఇల్లు ఉన్నా తాను బ్రతికినంతకాలం అద్దె ఇంట్లోనే జీవించింది. అందుకు కారణం ఆస్తికన్నా పిల్లల చదువు ముఖ్యం అని నమ్మటం వలన. అందుకు నాన్నగారు కూడా ఏకీభవించేవారు. మగపిల్లవాడితో సమానంగా ఆడపిల్లని కూడా చదివించాలని అక్కని కూడా B.SC,B.E.D

చదివించింది. పిల్లలు ఏమి చదువుతున్నారు అని నాన్నగారు అడగకపోయినా సమయం వచ్చినప్పుడల్లా ఇంటి విషయాలతో సహా లెక్కలు అన్ని వివరించేది. నాకు ఊహ వచ్చినప్పటినుంచీ బాధ్యతను చెప్పి నేర్పించింది.

మా అమ్మ మాటలు "నోరు మంచిది ఐతే ఊరు మంచిది అవుతుంది", "ఓర్చి నమ్మకు తేట నీళ్ళు..." ఇలా ఎన్నో సూక్తులు....

ఇంక వయసుకి వచ్చిన కొడుకు, కూతురితో ఎలా ఉండాలో అమ్మ ద్వారా తెలుసుకోవచ్చు. కనీసం మెట్రిక్ కూడా పాస్ అవ్వని అమ్మకి ఈ జనరేషన్‌లో ఎలా ఉండాలో పిల్లలతో, ఎలా ప్రవర్తించాలో తెలియటం ఆశ్చర్యకరం. నాకు తెలిసి నా స్నేహితులు (ఆడ, మగ) ఎవ్వరు మా అమ్మ అభిమానాన్ని పొందకుండా ఉండలేదు. నేను నేను డిగ్రీ చదివే రోజుల్లో మా ఇల్లు ఒక మీటింగ్ పాయింట్. వాళ్ళకి టీ, కాఫీలూ ఇస్తూ మాతో జోక్స్ పంచుకుంటూ, మరోపక్క నాన్నగారి క్యారేజికి వంట చేసేది. మాకు కోపం వచ్చి అన్నం తినని రోజు దేవుళ్ళకు పండగే. మాకోసం కోసం వాళ్ళకి మొక్కలు మొక్కేది. చదవండి అనే ఎన్నడూ చెప్పకుండానే తన ప్రేమతో మాకు బాధ్యతని, భయాన్ని పరిచయం చేసేది.

ఆమె ఏరోజు తన కోసం ఏమీ ఆలోచించలేదు, ఎప్పుడూ తన పిల్లలు బాగుండాలి, భర్త సంతోషంగా ఉండాలి అని ఎన్నో దేవుళ్ళకు మొక్కేది. కాని 2003 లో నాన్నగారి హఠాత్ మరణం (డ్యూటీలో ఉండగా గుండెపోటుతో) మాకు విషాదం మిగిలిస్తే అమ్మకి వర్ణించరాని బాధని చేర్చింది. అపటికి నేను ఎం.ఎస్సి చదువుతున్నాను. కేవలం మమ్మలని చూసి గుండె హితువు చేసుకుని బాధని దిగమింగుకుని తండ్రి నిర్వర్తించవలసిన బాధ్యతని కూడా తనపై వేసుకుని మాకు నీడగా నిలిచింది. ఆ క్షణం అమ్మ అండగా లేకపోతే ఏమిటి మా పరిస్థితి అని తలుచుకోని క్షణం లేదు. అప్పటికే నేను M.Sc. ఆఖరి సంవత్సరం చదువుతున్నాను. ఎట్టి పరిస్థితుల్లో నా చదువు ఆపవద్దు అని నాకు అండగా నిలిచి నా చేతికి ఒక డిగ్రీని సంపాదించి పెట్టింది. ఇంకో విషయం ఏమిటంటే మా అమ్మగారికి హిందీ అంటే చాలా మక్కువ అందుకే ఆమె సహాయ సహకారాలతో M.A హిందీ కూడా సంపాదించాను. ఆ తరువాత అమ్మ ఆశీర్వాదంతో నేను కూడా రైల్వే ఉద్యోగంలో చేరాను. కాని తన కొడుకుని ఉన్నత స్థితిలో చూడాలని డాక్టరేట్ చెయ్యాలని మా నాన్నగారి కోరిక. కాని ఈ పరిస్థితిలో అది సాధ్యము కాదు అని నాకు తెలుసు, కాని అమ్మ అందుకు ఒప్పుకోలేదు ఎన్నో ప్రయత్నాలు చేయమని, ఇలా రైల్వేలో చిన్న ఉద్యోగంతో కష్టాలు పడవద్దు అని ప్రతిక్షణం నన్ను ప్రోత్సహించింది. అందుకు నేను ఎన్నో ప్రయత్నాలు చేసి విసుగు చెందాను. కాని ఏరోజు ఇది వద్దు అని చెప్పలేదు, మనకి ఇంతే ప్రాప్తం అని విసుగు చెందనివ్వలేదు. ఎప్పుడు నా ఆశలకి తోడుగా అమ్మ నిరంతరం శ్రమించేది అందుకు అండగా నిలిచేది. ఒకవేళ నేను మళ్ళీ చదువు మొదలిపెడితే ఆదాయం ఉండదు అని నేను అనుకున్న వెంటనే అమ్మ చెప్పిన మాట ఇప్పటికి మరువలేను. "బాబు రామా నీవు ఉద్యోగం మానేసి చదువుకుంటాను అంటే అంతకన్నా ఇంక ఏమికావాలి. నాకు వచ్చే ఫ్యామిలీ పెన్షన్‌తో సర్దుకుందాము, నీకు తోడుగా ఉంటాను". అలా నన్ను ప్రేరేపించి నాలో కొత్త జీవితానికి శ్రీకారం చుట్టింది. అలా మూడు సంవత్సరాలు ప్రయత్నాలు, అమ్మ పెన్షన్ డబ్బులు కర్చుపెట్టగా 2006లో నాకు ఆస్ట్రియాలో P.H.D సీటు లభించింది. వెంటనే వీసాకి ప్రయత్నాలు చేయించి 2007 లో తన కన్నీళ్ళు దిగమింగుకుని ఆస్ట్రియాకు పంపింది. ఆ రోజు ఒంటరిగా నా తల్లిని వదిలి వెళ్ళినప్పుడు ఎయిర్‌పోర్ట్‌లో అమ్మ నాకు ధైర్యం చెప్పిన సంఘటన నేను ఇప్పటికి మరువలేను.

ఒక స్నేహితురాలిగా అమ్మతో అన్ని పంచుకునేవాడిని, చివరికి నా ఇష్టాలు కూడా మొదట అమ్మతోనే చెప్పేవాడిని. ఆస్ట్రియాకి వెళ్ళిన ప్రతిరోజు అమ్మతో ముచ్చట్లు, సరదా కబుర్లు ఎంతో ఆనందాన్ని పంచేవి. అమ్మ ఎప్పుడు అనేది నీవు డిగ్రీ తీసుకున్నప్పుడు నేను ఆస్ట్రియా వస్తాను ఆ వైభవం చూస్తాను అని. కాని మంచివాళ్ళను దేవుడు ఎంతో కాలం ఉంచడు. 2008 జూన్ నెలలో అమ్మ ఆరోగ్య పరిస్థితి బాగోలేదు అని డాక్టర్ ద్వారా తెలిసి నేను ఇండియా వెళ్ళాను. అప్పటికే తన కొడుకు కోసం ఎదురు చూస్తూ ఉన్న అమ్మని చూసాను. ఆ చివరి క్షణంలో కూడా తనను పలకరించటానికి వచ్చి వారికిమర్యాదలు అందాయా లేవా అని అడిగే అమ్మను చూసి

ఆశ్చర్యపోయాను. జులై 1, 2008 మధ్యాహ్నం 1.30కి అమ్మ మమ్మల్ని విడిచి వెళ్ళిన క్షణం. ఆ ముందు రోజు చదువు ఆపవద్దు అని చెప్పటం నిజంగా అమ్మ నాకు ఇచ్చిన వరం. చివరి రోజులు అమ్మతో ఉండి సేవచేసే భాగ్యం కలిగింది అని సమాధానపడ్డాను.

తాను కరిగిపోతూ మా జీవితాల్లో వెలుగు నింపింది. చివరికి సొంత ఇల్లుకూడా లేక ఈ లోకాన్ని విడిచింది. నిస్వార్థంగా ఉండాలి అని అనుకోవటం వేరు, అలా జీవించటం వేరు. అలాంటి జీవనం సాగించింది అమ్మ. అందుకే అమ్మను మించిన దైవం లేదన్నారు. నేను ఎంత స్థాయికి వెళ్ళినా స్నేహితులు, హితులు ఎంత మంది ఉన్నా ప్రతి క్షణం నా గురించి, నా శ్రేయసు పరితపించిన మా అమ్మ లేదే అని బాధ వెంటాడుతూనే ఉంటుంది. ఈ లోకంలో ఆమె లేకపోయినా, ఆమె ఆశించిన విధంగా డాక్టరేట్ సంపాదించి ఆ డిగ్రీని భౌతికంగా ఇవ్వాలని, సోంపాప (అమ్మ పేరు) కొడుకు డాక్టర్ శ్రీరాం అని గర్వంగా చెప్పాలని నా చదువుని పునఃప్రారంభించాను. శ్రీరాదే (నేను, అమ్మ నమ్మే దైవం) దయవల్ల అతి త్వరలో అది సాధించి అమ్మ ఆశయాన్ని నెరవేరుస్తాను.

అమ్మ చూపిన మంచితనం, అభిమానమే ఈ రోజు నన్ను ఇంత ఉన్నత స్థాయికి చేర్చటానికి కారణాలు అవుతున్నాయి.

అందుకే అంటారు "మాతృదేవోభవ"



శ్రీరాం కుమార్ భాగవతుల పుట్టి పెరిగింది విశాఖ జిల్లా. ఎమ్.ఎ(హిందీ), ఎమ్.ఎస్సి(కంప్యూటర్ సైన్సు) చేసి మూడు సంవత్సరాలు రైల్వేలో ఉద్యోగం చేసారు. తరువాత పైచదువులకై ఆస్ట్రియాలో క్లాగెంఫుర్ట్ అనే యూనివర్సిటీలో డాక్టరేట్ చేస్తున్నారు. పుస్తకాలు చదవడం, కథలు, పాటలు, కవిత్వం రాయడం హాబీలు. ఒక బ్లాగ్ http://sreerambhagavatula.blogspot.com ద్వారా వారి రచనలు అందిస్తున్నారు.

## లలిత చిట్టే

సంతోషమైనా దుఃఖమైనా
నిన్నే నేను తలుచుకుంటాను
అనుక్షణం నీ పేరే నే స్మరిస్తాను
బ్రహ్మకు మారు రూపువు నీవు
కనిపించని దేవతలెందరున్నా
కని పెంచే దేవతవు నువ్వు
అంత అందమైన రూపం
నీకెలా మరిందో?

ఇంత అద్భుతమైన పేరు

నీకు ఎవరు పెట్టారో?

అమ్మా...

నీ ఉనికి లేక నేను లేను

నీ ఆశీస్సులు లేని మనుగడ లేదు

అరుదైన, అందమైన ఈ జన్మనిచ్చిన

నీ ఋణం వేయి జన్మలెత్తినా

నేను తీర్చుకోగలనా?

అమ్మ కోసం నేను రాసిన ఈ కవిత 2002లో ఆంధ్రభూమి వార పత్రికలో ప్రచురింపబడింది.

ఓ చిన్న కవిత ద్వారా... అమ్మ గురించి, ఏదో నాకు తెలిసింది కొంత కవిత రూపంలో చెపితే, అది పబ్లిష్ అయితే, గర్వంగా అమ్మకు చూపించి చదివించిన క్షణాన అమ్మ కన్నుల్లో మెరిసే మెరుపు, హృదయం నిండిన సంతోషం... మాటల్లో వర్ణించలేనిది.

అమ్మ ప్రేమను పొందిన వారు ఎంతో అదృష్టవంతులు. కానీ - ఇద్దరమ్మల ప్రేమను, ఆప్యాయతను, అనురాగాన్నీ పొందిన మాదెంత అదృష్టమో కదా!



పెద్దమ్మ

మా నాన్న శ్రీ చిట్టే తిరుపాలయ్యగారు. మా అమ్మని 1970లో వివాహం చేసుకున్నారు. మా అమ్మ శాంతమ్మ మా నాన్నకు రెండవ భార్య. కానీ మా నాన్న పెద్ద భార్య గంగమ్మ. మా పెద్ద 'అమ్మ' గురించి ముఖ్యంగా ఇక్కడ చెప్పాలి.

కీర్తిశేషురాలైన శ్రీమతి గంగమ్మ, మా నాన్నని వివాహమాడి పన్నెండు సంవత్సరాలు గడిచినా... పిల్లలు పుట్టలేదు. ఆమే పట్టుదలగా మానాన్నని ఒప్పించి, పిల్లలు లేని ఇల్లు ఇల్లు కాదని సర్ది చెప్పి... మా అమ్మని పెళ్ళి చేసుకునేట్లు చేసింది.

ఒకే ఇంట్లో ఇద్దరు భార్యలు కలిసి కాపురం చేస్తూ అన్యోన్యంగా ఉండటం ఎక్కడా చూడలేము. ప్రొద్దున్నే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని మా అమ్మకు జాగ్రత్తలు చెప్పి పొలానికి వెళ్ళేది మా పెద్దమ్మ. ఆరెకరాల మాగాణి పొలంలో ప్రతి చెట్టూ, పుట్టా, తిరిగే పక్షీ ఆమెకు బాగా తెలుసు. పొలం పనులు, కూలీల వ్యవహారాలు చూసుకుని తోటలో కాసిన కాయలూ, పూలూ త్రెంపుకుని గంపలో నింపుకుని సాయంత్రానికి ఇల్లు చేరేది పెద్దమ్మ. మా చేనులో పండ్ల మొక్కలు, పూల మొక్కలు చాలా ఉండేవి. వీటిని నాటడం, పెంచడం, మా అమ్మవంతు. కాపలా కాయడం మా పెద్దమ్మ వంతు.

బడినుండి వచ్చిన పిల్లలమంతా సాయంత్రమయేటప్పటికి మా పెద్దమ్మ కోసం ఎదురు చూసేవాళ్ళం. పొలం నుండి వచ్చిన మా పెద్దమ్మ పండ్లు పంచి పెట్టేది. పూలన్నీ అల్లి మా జడలో తురిమేది. తరువాత దుకాణానికి తీసుకెళ్ళి తినుబండారాలు కొని పెట్టేది. మా అమ్మ ఒక్కొక్కరిని కడుపున మోసి జన్మనిస్తుంటే మా పెద్దమ్మ ప్రేమతో మమ్మల్ని పెంచేది. బయట వ్యవహారాలు వ్యాపార లావాదేవీలు మా నాన్న చూసుకుంటే.. పొలం పనులన్నీ మా పెద్దమ్మే స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించేది.

మొదటి అమ్మకు సంతానం లేక, రెండవ అమ్మకు ఎన్నో పూజలలో మ్రొక్కులతో పుట్టిన దాన్ని నేను కావడంతో నన్ను చాలా గారాబంగా పెంచారు. తలకోన సిద్దేశ్వరుని కాలినడకతో చేరి శివరాత్రినాడు తడి బట్టలతో మ్రొక్కిన మా అమ్మకు అదే నెలలో నేను కడుపున పడ్డాను.

మా పెద్దమ్మ నన్ను అనుక్షణం కంటికి రెప్పలా కాపాడేది. బయట ప్రపంచం తెలియకుండా పెరిగాను. ఎప్పుడైనా ఆమె కన్నుగప్పి ఆడుకోవటానికి బయటకు వెళితేచాలు, మరునిముషంలో వెనకనే ప్రత్యక్షమయ్యేది. చేయి పట్టి లాక్కుని ఇంట్లోకి తీసుకుని వచ్చేది. మనకి ఇంత పెద్ద ఇల్లుంది కదా! ఇల్లంతా ఆడుకో. స్వర్ణ చెల్లితో ఆడుకో, నాతో ఆడుకో అనేది. బయట మట్టిలో ఆడుకోవటం, పిల్లల స్నేహాలు చేయడం, ఇరుగు పొరుగు వారి ఇంటికి వెళ్ళడం ఆమెకు అసలు ఇష్టం ఉండేది కాదు.

ఆమెతో కలిసి కూర్చుని భోంచెయ్యడం, ఆమె పక్కలో పడుకోవడం. ఆమె కళ్ళముందు ఉండాలి పిల్లలు. లేకపోతే ఒప్పుకోదు.

మీ అమ్మంటే ఇష్టమా? పెద్దమ్మ అంటే ఇష్టమా అని ఎవరైనా అడిగితే మా అమ్మ మనస్సు ఎంత బాధపడేదో ఆ వయసులో మాకు అర్థం అయేది కాదు, కానీ పిల్లలం ఠక్కున మా పెద్దమ్మంటే ఇష్టం అని చెప్పేవాళ్ళం. పిల్లలు లేని మా పెద్దమ్మ ఆ మాట విని గర్వంతో పొంగిపోయేది. పండుగలకు బట్టల దుకాణానికి మమ్మల్ని స్వయంగా తీసుకెళ్ళి నచ్చిన బట్టలు కొనిపించేది. దర్జీ దగ్గర ఉండి తొందరగా కుట్టించి తీసుకుని వచ్చేది.

సంక్రాంతి పండుగలో భోగిమంట ఆమే వేసి పిల్లలు దగ్గరికి రాకుండా కాపలా ఉండేది. దీపావళి అయితే, టపాకాయలు దగ్గర ఉండి కాల్పించేది. ప్రతి పనినీ ఒళ్ళంతా కళ్ళుగా చూసి జాగ్రత్త పడేది. ఆమె ఆరాటం వెనుక పిల్లల క్షేమంగా ఉండాలనే ప్రేమ దాగి ఉండేది. ఆమె లేనపుడు కాంపౌండ్ వాల్ గేటుకు గడియ వేసి ఇంట్లోనే ఉండమని జాగ్రత్తలు చెప్పేది.

సంక్రాంతి నెలలో మా ఊర్లో గొబ్బెమ్మను కొలువు పెట్టి అమ్మాయిలంతా కూడి పాటలు పాడి గొబ్బెమ్మలు తడతారు (ఆడతారు)

ఎన్నోసార్లు మా పెద్దమ్మ కన్నుగప్పి వెళ్ళి అమ్మాయిల గుంపులో చేరి గొబ్బెమ్మ ఆడాలని ప్రయత్నించాను. కానీ.. ఎన్నడూ... కనీసం ఒక వరుసైనా ఆడకముందే మా పెద్దమ్మ వెనకే ప్రత్యక్షం అయేది. ఇంటిలోనికి లాక్కుని వచ్చి. ఇంట్లో గొబ్బెమ్మను పెట్టి ఆడి పాడుకోమనేది. నాకు ఎంత కోపం వచ్చేదో ఆ సమయాన. ఇప్పటికీ గొబ్బెమ్మ ఆడాలనే కోరిక నాకు తీరలేదు.

ఏ రోజూ కూడా మా అమ్మ, పెద్దమ్మ పోట్లాడుకోవడం, మాట పరుషంగా మాట్లాడుకోవడం మేము వినలేదు.

మా అమ్మ చిన్న వయసులోనే పెళ్ళిచేసుకుని మా ఇంటికి రావడంతో, అన్ని పనులూ చేతనయేవి కావు. వంటలు కూడా బాగా కుదిరేవి కావు. పండుగలపుడు మా పెద్దమ్మే దగ్గరుండి పిండి వంటలు చేసేది. వంటలు ఇద్దరూ కలిసి చేసుకునేవారు.

ఒక్కోసారి కోతలపుడు, పంట చేతికి వచ్చినపుడు యాభై అరవైమంది కూలీలు పనుల కోసం వచ్చేవారు. వారందరికీ ప్రొద్దుటే సద్ది, ఊరగాయ పచ్చడి, మధ్యాహ్నం రాగి సంకటి ముద్దలు, కూరలు మా పెద్దమ్మే మా అమ్మ సహాయంతో చేసి గంపల కెత్తి మనుషుల సహాయంతో పొలానికి తీసుకెళ్ళేది. వేళకు వారికి వడ్డించి పనులు చేయించేది.

ఇరుగు పొరుగు వారికి ఏదైనా అవసరం పడి సహాయం అడగాలన్నా మా పెద్దమ్మ ఇంట్లో ఉంటే రావటానికి భయపడేవారు. కానీ మా అమ్మ అందరికీ లేదనకుండా సహాయం చేసేది. కూరలు, అన్నాలు, పాలు, పెరుగు, కాయలు, పాతబట్టలు పేదవారికి గుర్తుపెట్టుకుని మా అమ్మ ఇచ్చేది. మా పెద్దమ్మను అడగాలన్నా ఇంట్లోకి రావాలన్నా అందరికీ భయమే. చాలా స్ట్రిక్ట్‌గా ఉండేది.

పంపు నీళ్ళ దగ్గర ఎవరైనా మా అమ్మతో గొడవపడినా, లేదా నీళ్ళు వంతు ఇవ్వలేదని తెలిసినా మా పెద్దమ్మ వెంటనే వెళ్ళి వాళ్ళతో పోట్లాడేది. దగ్గరుండి నీళ్ళు కొట్టించి వచ్చేది. పిల్లల్ని కానీ మా అమ్మను కానీ, నాన్నను కానీ ఎవరు ఏమన్నా ఒప్పుకునేది కాదు.

ఎండనక, వాననక కూలీలతో పాటు రెక్కలు ముక్కలు చేసుకునేది. రాత్రి పూట కూడా భయపడక పొలంలో ధాన్యానికి కాపలా ఉండేది. ఎవరికీ భయపడేది కాదు. పొలం వైపు కన్నెత్తి చూడాలన్నా, అడుగు పెట్టాలన్నా భయపడేవారు. ‘చిట్టే గంగమ్మ మగవాడురా, పులిలాంటిది‘ అనిఊర్లో వాళ్ళు గొప్పగా చెప్పుకునేవారు.

ఆమె చదువుకోకపోయినా... మాకు ఎంతో సంస్కారం, మంచిమాటలు నేర్పించేది. ఒకసారి ప్రక్కపొలంలో మామిడికాయలు విరగకాసి ఉన్నాయి. మాకు ఎన్నో చెట్లు ఉన్నా ఆ రకం కాయలంటే నాకిష్టం. నేను వెళ్ళి ఓ కాయ కోసుకుని వస్తాను, తినాలనుంది అని మా పెద్దమ్మతో చెప్పాను. మా పెద్దమ్మ.. 'తప్పు అలా వెళ్ళకూడదు. వాళ్ళని అడకుండా అలా కాయలు కోయకూడదు. వాళ్ళు లేనప్పుడు ఎడమ కాలు కూడా వేరే వారి పొలంలో పెట్టకూడదు' అని చెప్పింది. తరువాత వారిని అడిగి నాలుగు కాయలు తెచ్చి ఇచ్చింది నాకు. రాత్రిపూట ఎన్నో కథలు చెప్పేది. అందులో నీటి అంతర్లీనంగా దాగి ఉండేది. సాయంత్రం పూట తీరిగ్గా వరండాలో కూర్చుని రామాయణ, భారత, భాగవతాలు నన్ను చదవమనేది. రాగయుక్తంగా నేను చదివి వినిపిస్తుంటే చుట్టు ప్రక్కల వారిని రమ్మని వినమని ఆహ్వానించేది. మా 'సిద్ధ లలితమ్మ' చదివినట్లు స్పష్టంగా, వినసొంపుగా ఎవరూ చదవలేరు అంటూ పొగిడేది తలకోన సిద్దేశ్వరుని వరప్రసాదాన నేను జన్మించినందున నా జన్మ నక్షత్ర ప్రకారం లలిత పేరు పెట్టినా,దేవుని పేరు కలిసి వుంటే మంచిది అంటూ ముందు 'సిద్ధ' జత కలిపి బడిలో నా పేరు రాయించింది.

స్కూల్లో టీచర్లు తిట్టినా, కొట్టినా, భయపెట్టినా (తిట్టడం, కొట్టడం చాలా అరుదు) వెంటనే వెళ్ళి వారితో - మా బిడ్డల్ని మేము ఒక దెబ్బ వేయకుండా అపురూపంగా పెంచాము. మీరు కూడా ప్రేమతో చదువు చెప్పండి అనేది. ఇలాంటి సమయంలో ఆమె వాడే ఓ పదం ఇప్పటికీ నాకు గుర్తు. " మా బిడ్డల్ని క్రిందపెడితే మట్టి అంటుకుంటుందని, పైన పెడితే గద్ద ఎత్తుకు పోతుందని, అరచేతుల్లో మేము పెంచాము. మీరు తిట్టి కొట్టకండి అనేది." యాభై సంవత్సరాలకే, ఆరోగ్యం బాగోక, గర్భసంచి పాడయి, షుగర్ వ్యాధి ముదిరి 1993 జనవరిలో ఆమె పరమపదించి స్వర్గానికి చేరింది. ఎంతచెప్పినా మా పెద్దమ్మ గురించి తక్కువే. మా హృదయాల్లో పెద్ద'అమ్మ'గా ఆమె స్థానం ఎల్లప్పటికీ పదిలం. ఆమె మాకోసం పడిన కష్టం. తాపత్రయం ఎల్లప్పుడూ మా కళ్ళముందు కదలలాడుతుంది. ప్రతి సందర్భంలోనూ ఆమె జ్ఞాపకం మా కబుర్లలో పాలుపంచుకుంటుంది.

ఇలాంటి 'అమ్మ' ప్రపంచంలో కొందరికే అరుదుగా ఉంటుంది. ఆమె ప్రేమను పొందిన మేము ఎంతో అదృష్టవంతులం. మా పెద్దమ్మ ఇప్పటి వరకూ బ్రతికే ఉంటే పిల్లల చదువులను, ఉన్నతిని చూసి గర్వపడేది. చాలా సంతోషించి ఉండేది. ఆమె ఆశీస్సులే మాకు అండగా నిలబడి మా ఉన్నతికి తోడ్పడ్డాయి అనటంలో సందేహం లేదు. ఎంత చెప్పినా తరగని గని మా పెద్దమ్మ గురించి చెపుతూ ఉంటే... మా అమ్మ గురించి చెప్పడానికి మిగలకపోవచ్చు. కానీ.. అమ్మగురించి చెప్పక పోతే ఈ 'మాతృదేవోభవ' అసంపూర్తిగా మిగిలిపోతుంది.




బండారు వెంకట సుబ్బయ్య, అచ్చమ్మ దంపతులకు 1954 లో జనించిన మా అమ్మ ఆరవ తరగతి వరకు చదువుకుంది. మా అమ్మకు సృజనాత్మకత ఎక్కువ. ఎల్లప్పుడూ ఏదో ఒక పని చేస్తూ ఉండాలని, అందులో ఆనందాన్ని పొందాలని అనుకుంటుంది.

ఎక్కడ ఏ కొత్త ఎంబ్రాయిడరీ, అల్లికలు, డిజైన్లు చూసినా వెంటనే నేర్చుకుని ఇంటిని కళాత్మకంగా అలంకరించేది. డోర్ కర్టెన్స్, టేబుల్ క్లాత్స్ గౌన్లు, సాదా చీరలు ఆమె డిజైన్లతో క్రొత్తజీవం పోసుకునేవి.

మా నాన్న పంచెలకి, కండువాలకి సైతం ఓ మూలన ఓ చిన్న కుట్టు వేసేది. చాకలి వాడు గుర్తుపట్టి మన బట్టల్ని సులభంగా తెస్తాడు అనేది. సాయంత్రం వేళల్లో పూలమొక్కలు కూరగాయ మొక్కలు నాటడం, నీళ్ళు పోయడం పూలు త్రెంపడం చేసేది. నాటిన ప్రతి మొక్క చిగురించి, పూలు పూసి, కాయలు కాస్తుంటే చూసిన మా అమ్మ సంతోషం మాటల్లో వర్ణించలేనిది. మల్లె, జాజి, మందార గులాబి, పూలమొక్కలు, సీతాఫలం, రామా ఫలం

సపోటా, జామ మొదలైన రకరకాల పళ్ళ మొక్కలు మా అమ్మ చేతుల్లో జీవం పోసుకునేది వాకిట్లో ముగ్గుకి మా అమ్మ వేయడం వల్లే అంత అందం వచ్చేది. మల్లె పూలకి మా అమ్మ దండ గుచ్చడం వల్లే అంత సువాసన వచ్చేది. ఆమె పెంచిన మొక్కలు కూరలు, వండితే కలిగే రుచి మాటల్లో వర్ణించలేనిది. ఎంతో ఇష్టంతో ఆమె చేసే పని. పద్ధతి వల్ల ఇదంతా సాధ్యం అయేది.

పని చేసుకుంటూ.. కూనిరాగాలు తీసే మా అమ్మ పాటలు కూడా చాలా బాగా పాడుతుంది. ఆమెకు రాని పాత పాటలు లేవు. ఇప్పటికీ తోట పనిలో ఉన్నప్పుడు, వంట చేస్తున్నప్పుడూ పాటలు మనసారా పాడుకుంటుంది.

ఇంట్లో అందరికీ బట్టలు మా అమ్మే కుడుతుంది. బయట టైలర్ దగ్గరకి వెళ్ళాల్సిన అవసరం రాదు. తగిన విధంగా కట్ చేసి విన్నూత్నంగా అమరేట్లు కుడుతుంది. కానీ చేతులు పొడవుగా, మెడ చిన్నదిగా పెట్టి కుడతాను అంటుంది. ఇప్పుడు ఫ్యాషన్ అలా కాదమ్మా అంటే.. ఫ్యాషన్ అనుకుంటే ఎలా? ఎండకు వీపు, చేతులు మాడి నల్లగా అవుతాయి అంటుంది. తల్లి బిడ్డల గురించి జాగ్రత్త పడుతుంది కానీ ఈ కాలం పిల్లలు (మా చెల్లెళ్ళు) వింటారా? లేటేస్ట్ ఫ్యాషన్ ఫాలో అవుతారు కానీ..

ఆర్నెల్ల క్రితం ఇండియా వెళ్ళినపుడు నా హ్యాండ్ బాగ్ కున్న రెండు జిప్పులు ఊడిపోయాయి. అది నాకు ఎంతో ఇష్టమయిన నచ్చిన బాగ్. ఇక పనికిరాదేమో, పడేయాల్సిందే అనుకుంటూ నేను, మా నాలుగో చెల్లి భార్గవి అరగంట వరకూ ప్రయత్నించాము. కానీ జిప్పులు సరిచేయటం కుదరలేదు. ఇంతలో వంటింట్లో నుండి వచ్చిన మా అమ్మ ఇటివ్వండి అని బాగ్‌ను తీసుకుని మాజిక్‌లాగా ఐదు నిముషాల్లో సరిచేసి, మరలా జారి విడిపోకుండా అడ్డంగా సూదితో కుట్లు వేసి పదిలంగా నాకు అందించింది. నాకెంతో ఆశ్చర్యం కలిగింది. అంత టాలెంట్ కలది మా అమ్మ.

వయసులో ఎంతో అందంగా సావిత్రిలా ఉన్న మా అమ్మ ఇపుడు చాలా బలహీనంగా తయారయింది. ఆరుగురు పిల్లల్ని కని, పెంచి వారికి వేళకు అన్నీ అమర్చి, బిడ్డలకి పని చెప్పకుండా వారినీ భర్తని సంతోష పెట్టాలని అన్ని వేళలా ఆరాటపడే మా అమ్మ ఇప్పటికీ యంత్రంలా కష్టపడుతుంది. ఓ క్షణం విశ్రాంతి తీసుకోదు.

అమ్మా... ఎందుకు అంత కష్టపడతావు. పనిమనిషిని పెట్టుకో. అంటే ఆ.. ఎందుకులే ఎంత పని మన ఇంట్లో పని మనం చేసుకోక పోతే ఎలా? పనిమనుషులు మనలాగా శుభ్రంగా పనిచేస్తారా? వారి వెనక తిరిగి పదిసార్లు చెప్పి చేయించుకోవడం, బాగా చెయ్యకపోతే బాధపడటం కన్నా మనమే శుభ్రంగా పనిచేసుకోవడం బెస్ట్ అంటుంది. ఇంకేం మాట్లాడగలను నేను.


మనవరాలితో అమ్మ

ఇంటికి ఫోను చేసినపుడు అమ్మా ఆరోగ్యం ఎలా ఉంది అని అడిగితే మేను బాగున్నాము ఇంటిపట్టున ఉండి బాగా తింటూన్నాము. మీరు ఆఫీసు పని చేసేవాళ్ళు. దూరదేశంలో ఉన్నారు. మీరు వేళకు తిని ఆరోగ్యం బాగా చూసుకోండి అంటుంది. ప్రక్కనే ఉన్న మా చెల్లి స్వర్ణ అందుకుని లేదక్కా అమ్మకి ఈ మధ్య ఆరోగ్యం అంతగా బాలేదు. చాలా వీక్‌గా ఉంది అంటుంది. వెంటనే మా అమ్మ, ఎక్కడో కంటికి కానరాని దేశంలో దూరంగా ఉన్న వాళ్ళకి (నేను మా తమ్ముడు సుదర్శన్ కువైట్‌లో, మా రెండో చెల్లెలు ‘రమ‘ కతార్‌లో) ఆరోగ్యం బాగాలేదని చెపితే బాధపడతారు. రావాలన్నా వెంటనే రాలేరు కదా? వాళ్ళకి చెప్పి బాధ పెట్టడం ఎందుకు అంటుంది. బిడ్డలు బాధపడకూడదనే తల్లి ప్రేమ, తాపత్రయం ఆ మాటల్లో ద్యోతకమవుతుంది.

మా అమ్మ చాలా అమాయకురాలు. మా నాన్న మాటకు ఎన్నడూ బదులు ఇచ్చి ఎరుగదు. పతి సేవే పరమార్థం అని భావించే ఉత్తమ ఇల్లాలు. తన భర్త, బిడ్డలు ఇల్లు తన ప్రపంచంగా మలుచుకుంది. బయట ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని ఎన్నడూ మా అమ్మ తాపత్రయ పడలేదు.

వంట సరిగా కుదరి రోజు మా నాన్న ఇంకెపుడు నేర్చుకుంటావే వంట చేయడం? ఇంక ఈ జన్మలో నేర్చుకోలేవేమో అనేవారు.

మా అమ్మ బదులుగా నీ కూతుర్లు పెద్దవాళ్ళయినారుగా... వాళ్ళే చేసి పెడతారులే రుచిగా. ఇంకా నేనెందుకు చేసి పెట్టడం అనేది. నేను రెస్ట్ తీసుకుంటాను. వాళ్ళు వండి పెడతారు అంటే... మా నాన్న నవ్వుతూ శాంతమ్మా నువ్వు అన్నం వడ్డిస్తేనే.. తింటే కడుపు నిండుతుంది. ఎవరు వడ్డించినా తిన్నట్టు ఉండదు నాకు అంటారు. అది నిజం కూడా.

ఈ టీవీ 2 న్యూస్ రీడర్‌గా పని చేసే మా ఆఖరు చెల్లి ప్రతిభ అంటే మా అమ్మకు ఎక్కువ ప్రేమ. హైదరాబాద్‌లో ఎలా ఉందో? ఎలా తింటుందో అని బాధపడుతుంటుంది. టీవీలో వార్తలు వచ్చే టైముకి టీవీ ఎదురుగా కూర్చుని మా చెల్లి ప్రతిభను కనులారా మనసారా చూసుకుని వార్తలు విని, బిడ్డ ఎంత చిక్కిపోయిందో? కష్టపడి వార్తలన్నీ చదవాలి కదా? అంటుంది.

గారాబంగా పెరిగిన మా చిట్టి (ప్రతిభ) ముద్దు ముద్దుగా మాట్లాడేది ఇంట్లో. మా అమ్మ చూడండి వార్తలు ఎంత బాగా చెబుతుందో స్పష్టంగా అని చెప్పి మురిసిపోతుంది. అక్కడే ఉన్న మా నాలుగో చెల్లి భార్గవి అమ్మా నీకు ఎంతైనా నీ ఆఖరి కూతురిపైనే ప్రేమ ఎక్కువ. మా పైన లేదు అంటుంది కినుకగా. లేదు లేమ్మా నాకు అందరిపైనా ప్రేమే చిన్న బిడ్డ కదా... మొన్న పుట్టినట్లుంది చూడు... ప్రపంచం అంతా వినేట్లు వార్తలు చదువుతోంది నా బిడ్డ అంటుంది గర్వంగా.

బిడ్డలు ఉన్నతంగా ఎదిగినపుడు, వారిని చూసి తల్లి ఎంతగా మురిసిపోతుందో కదా? అంతకన్నా తల్లికోరుకునేది ఏముంటుంది? కూతుర్లకే కాక ముగ్గురు మనవరాళ్ళకు కూడా సేవలు చేస్తూ ప్రేమను పంచే మా అమ్మ నిజంగా భూమిపై వెలసిన దేవత. పేరుకు తగినట్లు శాంత స్వభావురాలు మా అమ్మ. అమ్మ లేని జీవితం బిడ్డలు ఊహించుకోలేరు. అమ్మ లేని ప్రపంచంబోసి పోతుంది. జీవం కోల్పోతుంది. అమ్మ జీవిగా భూమి పై ఉన్నంత వరకే మనం ఊపిరి హాయిగా పీల్చుకోగలం. ఆమె ఆశీస్సులున్నంత వరకూ... జీవితం చల్లని వెన్నెల్లో సేదతీరినట్లు ఉంటుంది. ఒడిదుడుకులు లేక గమ్యం వైపు సాగిపోతుంది. 'అమ్మ' విలువ తెలిసిన బిడ్డలు ధన్యులు.

మా అమ్మ అక్క కూతురికి, రెండోసారి కడుపులో మరలా ఆడపిల్ల ఉందని స్కానింగ్‌లో తెలిసినపుడు, వాళ్ళు ఏం ఆడపిల్ల? ఎందుకు... అనవసరం అంటుంటే, మా అమ్మ విని ఎన్నడూ నోరెత్తి పరుషంగా మాట్లాడని అమ్మ వారితో 'నోరుముయ్యండి - ఆడపిల్ల అయితే ఊరికినే వచ్చిందా? దేవుడు కడుపులో వేస్తేనే కదా వచ్చింది. ఏ బిడ్డ అయితే ఏమి? పసి బిడ్డలు దేవునితో సమానం అలా మాట్లాడకండి. నేను ఐదుగురు ఆడపిల్లల్ని కని, చదివించి, పెంచి పెద్ద చేయలేదా? వాళ్ళు నేను గర్వపడేట్లు జీవితంలో ఎదగలేదా? సిగ్గులేదా అలా మాట్లాడటానికి' అని గద్దించిన మా అమ్మలో ఎంతో విశాల భావాలు ఉన్నతమైన సంస్కారం చూసాను.

చీర కట్టుకుని దూరప్రయాణాలు చేస్తుంటే 'వద్దమ్మా ఆడపిల్లలు, ప్రయాణం చేసేటప్పుడు చుడీదారు వేసుకుంటే సౌకర్యంగా ఉంటుంది పరిగెత్తి బస్సు అందుకోవాలన్నాజారి పడినా బట్టలు వంటినిండా ఉంటాయి' అని జాగ్రత్తలు చెప్పే మా అమ్మలో ఎన్నో ఆధునిక భావాలు చూసాను.

ఎంత చెప్పినా తక్కువే అమ్మ గురించి ఎంత పొగడినా, రాసినా.. ఆమె ఋణం జన్మలో తీర్చుకోగలమా?...

'మాతృదేవోభవ' లో మా ఇద్దరు అమ్మల గురించిన విశేషలను పంచుకునే అవకాశం ఇచ్చిన శ్రీ కిరణ్ ప్రభగారికి, కౌముది పత్రికకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

ప్రతి ఒక్కరూ.. తమ తల్లిదండ్రులను భారంగా ఎంచి, వారిని ఓల్డేజ్ హోమ్‌లలో ఉంచక.. బిడ్డలగా తమ ప్రేమను వారికి పంచి, వారిని గౌరవించి, తమ కర్తవ్యాన్ని బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలనీ తల్లిదండ్రుల ఆశీస్సులు పొందాలనీ కౌముది పత్రికా ముఖంగా కోరుకుంటున్నాను. కన్న బిడ్డల ఆదరణకు, ప్రేమకు నోచుకోక, ఓల్డేజ్ హోమ్‌లలో నిస్సహాయంగా జీవిస్తున్న తల్లులందరికీ ఈ మాతృదేవోభవ అంకితం..



లలిత చిట్టే గారు కువైట్‌లోని జె.డబ్ల్యు మేరియట్ హోటల్లో గెస్ట్ రిలేషన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీరికి సాహిత్యంమీద మిక్కిలి అభిలాష

# అచ్యుతవల్లి



నా పేరు అచ్యుతవల్లి. మాది ఆంధ్రా. ఒరిస్సా సరిహద్దులో ఒకప్పటి శ్రీకాకుళం. ఇప్పుడు విజయనగరం జిల్లాలోని ఓ మోస్తరు పట్టణం. పార్వతీపురం. నాన్నగారు శ్రీ పంతుల సీతాపతిరావుగారు. అక్కడే పుట్టి, పెరిగి సుమారు 40 సంవత్సరాలపాటు అక్కడి ఆర్.సి.యమ్. సెయింట్ జాన్స్ బాలుర పాఠశాలలో సైన్సు అసిస్టెంటుగా పనిచేసి, ఇపుడు విశాఖపట్నంలో స్థిరపడి బి.వి.కె విద్యా సంస్థలకు ఆనరరీ కరస్పాండెంట్‌గా 2000 సంవత్సరం నుంచీ సేవలు అందిస్తున్నారు. అమ్మ మురళీ అన్నపూర్ణ. నాన్నగారి మేనకోడలు. అర్ధాంగిగా 1964 లో అత్తవారింట ఇంట అడుగుపెట్టిన నాటి నుండీ నేటి వరకూ జీవితాన్ని పరిపూర్ణంగా ఆస్వాదిస్తున్న సాధ్వీమణి. అటు పాత తరానికి, క్రొత్త తరానికి ఒక వారధి. అప్పటి విలువలకు, నేటి సౌకర్యాలకూ ప్రత్యక్ష సాక్షి. ఎప్పటికప్పుడు తనను తాను కాలానుగుణంగా మార్చుకుంటున్న నవీన మహిళ. నాన్నగారు ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్ర ప్రభుత్వ పురస్కార గ్రహీత, ప్రవృత్తి రీత్యా స్నేహ స్వభావుడు, కవి. ఎప్పుడూ బంధుమిత్రుల రాకపోకలతో, శిష్యబృందాలతో మా ఇల్లు కళకళలాడుతూ ఉండేది. నాన్నగారికి ఆనాటినుండీ నేటి వరకూ అన్నిటా కుడి ఎడమగా, కుటుంబంలో ఒక చుక్కానిలా మాకు విలువలు నేర్పిన మా అమ్మ గురించి మీతో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

అమ్మ పేరు తలుచుకుంటే పులకరించని మనస్సు ఈ సృష్టిలో ఏదీ ఉండదేమో. అయినా ప్రతి ఒక్కరికీ వారి అమ్మ ప్రత్యేకమే. అలాగే నాకు కూడా అమ్మ. పేరులాగానే నాన్నగారికి మురళి. మాకందరికీ అన్నపూర్ణ స్వరూపం. పదమూడు, పధ్నాలుగు సంవత్సరాల వయస్సులో మా ఇంటికి కోడలుగా అడుగుపెట్టిన నాటినుంచీ నేటి వరకూ ఆమె జీవితంలో ప్రతీ పేజీ ఒక అద్భుతమే. అత్తగారు, మామగార్లు అయిన ఆమె అమ్మమ్మ, తాతయ్యలకు చేసిన సేవలు, వచ్చే పోయే బావగార్లు, తోడికోడళ్ళు, ఆడపడుచులు, మేనల్లుళ్ళు,

మేనకోడళ్ళు కాలం నుంచీ నేడు కూతుళ్ళు, అల్లుళ్ళు, కోడలు, మనుమలదాకా వచ్చేపోయేవారితో అమ్మ నిత్యం ఆ అన్నపూర్ణను మరిపిస్తూనే ఉంది. చదువుల కోసమో, ఉద్యోగాల రీత్యానో ఉండే పర్మినెంటు మెంబర్లు కొందరు, చుట్టపు చూపుగా కొందరు.. నిత్యమూ మా ఇల్లు ఒక కాశీనగరాన్ని గుర్తుకు తెచ్చేది. మా ఇంట పెద్ద తరానికి చిన్న దిక్కు, చిన్నతరానికి పెద్ద దిక్కు అమ్మ. మా కుటుంబంలో ఇంచుమించు 1960ల నుంచి నేటివరకూ నాన్నగారి మొట్టికాయలు, అమ్మ చేతిముద్దలూ తినకుండా ఎవ్వరూ పదవతరగతి పాసయిన దాఖలాలే లేవు. ఆ మాటకొస్తే మా ఊరిలో 1998 లో నాన్నగారి కుటుంబం వదిలేసి విశాఖపట్టణం వచ్చేవరకు జరిగిన అన్ని పదవతరగతి పరీక్షలలోనూ లెఖ్ఖలు, సైన్సు ఫస్ట్ వచ్చిన వారు ఎవరైనా ఉన్నారంటే వారు సీతాపతి మేష్టారి పాఠాలతో పాటు, అమ్మగారి చేతి చలువ కూడా పొందినవారే.

కోర్టుపనుల మీద వచ్చిన పెద పెదనాన్నగారు (పంతుల రామలింగేశ్వర రావు గారు) వెళ్ళిపోతానంటే అమ్మ వేసే మంత్రం "మామయ్యా, రేపటికి దోసల పిండి రుబ్బాను." ఆ రాత్రి పెదనాన్నగారి నోటినుంచీ వెలువడే కాళహస్తీశ్వర శతక పద్యాలు. పాండవ ఉద్యోగ విజయాలు నట్టింట నాట్యమాడుతూ బోసినవ్వుతో ఆయన "మీ అమ్మకి మంత్రాలు వచ్చే" అంటుంటే మాకు సంతోషం ఆగేది కాదు. చిన్న పెదనాన్నగారు (పంతుల విశ్వనాథ రావు గారు. 1960 ప్రాంతాల్లో 'భారతి' పత్రికలో విరివిగా వ్రాస్తుండే వారు) వస్తే మరో మంత్రం. ఆ రాత్రి మొదటి ప్రపంచ యుద్ధం నుంచీ శ్రీకాకుళ నక్సలైట్ ఉద్యమం దాకా అర్ధరాత్రి వరకూ చర్చ. ఊరిలో ఏ సాహితీ సమావేశాలకు ఎవ్వరు వచ్చినా మా ఇంట ఆతిథ్యం ఉండేది. అలాగే ఒకసారి 1981 లోనో, 82లోనో శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు మా ఊరికి వచ్చి మాతో గడపడం ఒక చల్లని జ్ఞాపకం. ఎప్పుడు నిద్రపోయేదో తెలిసేదే కాదు. అయినా రోజంతా తాజాదనమే.

నాన్నగారికి స్కూలు ఇనస్పెక్షనుకు వచ్చిన డి.యి.వోలు, ఎం.యి.వోలూ హోటల్స్‌లో భోజనం చేసే నాగరికత ఇంకా రాని రోజులవి. కబురయినా లేకుండానే వారు అకస్మాత్తుగా వస్తుండేవారు. అమ్మ మీద ఎంత నమ్మకముండేదో మరి. ఇక, నాన్నగారి తోటి టీచర్లందరికీ అమ్మ చిట్టి స్నేహితురాలే. లంచవర్లో వారానికి రెండుసార్లయినా కూర్చుని వెళ్ళవలసిందే మా అందరికీ వైద్యం చేసే డాక్టరు మామ డా. సాహూగారు, తన కథలు మొట్టమొదటిగా అమ్మకి చూడమని ఇచ్చే తెలుగు మామ శ్రీ పి.వి.బి. శ్రీ రామమూర్తి మేష్టారు మా ఇంటికి రెగ్యులర్ విజిటర్లు. వీరందరి ప్రభావమూ మా బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసింది.



వారందరితోపాటు కొంచెం ఎక్కువగా మేము నలుగురం. ముగ్గురు అక్క చెల్లెళ్ళు, మా అందరికీ ఒక ముద్దుల తమ్ముడు. సాయంత్రం స్కూలు నుంచీ ఇంటికి వచ్చేసరికి ఏదో ఒక చిరుతిండి. తరువాత చదువులు. మాతోపాటు ఎనిమిదవ తరగతి దాకా ప్రతీ ఒక్క సబ్జెక్ట్ తను కూడా చదివింది. టైం లేదు అని ఇవాళ మేమెవరైనా అంటే ఒక్కసారి అమ్మ గుర్తుకు వస్తుంది. పెద్దల పట్ల వినయం, సమవయస్కుల పట్ల సహృద్భావం, చిన్నల పట్ల అనురాగం చూపించుకుంటే జీవితంలో ఎటువంటి సమస్యలూ రావు.

"ఇగో లేని జీవితం ఇంపైన జీవితం" అన్న విషయాలను ఆచరించి మాకు చూపెట్టిన మేనేజ్‌మెంటు గురు, రోల్ మోడల్ మా అమ్మ.

వీటన్నిటితో పాటు తన స్నేహితురాళ్ళతో కలిసి మహిళా, డ్యాన్సు క్లాసులూ, మేము ప్రోగ్రాములు ఇస్తున్నామంటే సందడే సందడి. కట్టుకునే డ్రస్సు నుంచీ, పెట్టుకునే క్లిప్పుదాకా అన్నీ తనే దగ్గరుండి చూసుకునేది. పండుగలు వస్తున్నాయంటే విధిగా బజార్లలో

క్రొత్త క్రొత్త మోడల్ డ్రస్సులు చూచి వచ్చి ఇంటిలో రకరకాల గౌనులు కుట్టడం, వాటికి లేసులు అల్లడం, స్వెట్టర్లు అల్లడం ఒకటేమిటి... అన్నీ తను సరదా పడుతూ చేసి మమ్మల్ని సరదా పెట్టేది. ఇవి రోజు వారీ దినచర్యలు.

ఇవికాక స్పెషల్ అకేషన్స్ వస్తూ ఉంటాయి. ఉన్న కాస్త పొలాన్ని చూసుకునే రైతులు వచ్చి "మురళమ్మా, బుగత లేడా" అంటు వస్తే వాళ్ళ బాగోగులు, ధాన్యం బళ్ళు గాదెకి చేరే రోజు వాళ్ళతో పాటు మాకూ పండుగే. ఆ వేడి వేడి అన్నంలో ముద్దపప్పూ, ముక్కల పులుసూ, వంకాయ కూరల ఘుమఘుమలు ఏ స్టార్ హోటల్లో ఛీఫ్ చెఫ్‌కు కూడా రావని ఘంటాపథంగా చెప్పగలను. సీజన్లో ఏ శిష్యుడో వేయించిన చింత పండు బస్తాలు విప్పుదీయించి పిక్కలు తీయించి మాకు కావలసినంత ఉంచి, అయినవారికి వంతుల వారీగా బస్సులెక్కించి పంపడం, కందుల బస్తా వస్తే మనిషితో పాటు తనూ కూర్చుని ఎర్రమన్ను వ్రాసి, కడిగి, ఎండబెట్టి కందిపప్పు రూపంలో తీసుకురావడానికి అమ్మ పడిన శ్రమ ఏ షాపింగ్ మాల్ లోనో కందిపప్పు పాకెట్ చూసినప్పుడల్లా గుర్తుకు వస్తూనే ఉంటుంది.

ఇక వేసవి కాలమంతా మరో హడావిడి. గుండలుకొట్టీ, మామిడి కాయల ముక్కలు తరిగీ పచ్చి ఆవకాయ, ఎండు ఆవకాయ, తొక్కుడు పచ్చళ్ళూ అవి రోజూ ఎండబెట్టి తీయడానికి మేము వంతులు, వీటితో పాటు పేలాలు వేయించీ, ఏరీ, పేలాల ఒడియాలూ, గుమ్మడికాయ వడియాలు. మాకిష్టమని సగ్గుబియ్యం ఒడియాలు. వీటన్నిటితో వేసవి సెలవులు ఎలా గడిచిపోతాయో అర్థం అయ్యేదీ కాదు. ఇలా ఎన్నని తలుచుకోను?

ఉత్తరాంధ్ర మొత్తానికి మొట్ట మొదటిసారిగా 1986 లో నాకు స్టేట్ ర్యాంకు టెంత్ క్లాసులో రావడానికి నాన్నగారి కఠోర శిక్షణ, అమ్మ పడిన శ్రమా రెండూ కారణమే. ఆ రోజు పెద్ద కూతురునైన నన్ను చూసి ఎంత గర్వపడిందో ఏనాడూ తన గురించి పట్టించుకోలేదు. తనకేమి కావాలో ఇప్పటికీ మాకు తెలియదు. కొంచెం ఆఫీసు పని, ఇద్దరు పిల్లల సంరక్షణకే ఎంతో హడావిడి పడుతూ ఉంటే ఒక్కసారి అనిపిస్తుంది అమ్మకి కూడా ఆ భగవంతుడు రెండు చేతులూ, 24 గంటల టైమే ఇచ్చాడు అని.

అమ్మ కార్యక్రమాల ముందు శత సహస్రావధానాలు కూడా బలాదూరే. ఎందుకంటే అవి ఎప్పుడో ఒక్కసారే చేస్తారు. అమ్మకి అవి రోజూ అలవాటే అటువంటి అమ్మకి కూతురిగా మళ్ళీ మళ్ళీ పుట్టాలనుకోవడం స్వార్థమే. అందుకే వచ్చే జన్మలో అయినా తల్లిగా పుట్టి కొంచెం ఋణం తీర్చుకునే అదృష్టాన్ని ఇమ్మని ఆ భగవంతుని వేడుకుంటున్నాను.



**అచ్యుతవల్లి** గారి స్వస్థలం పార్వతీపురం. విజయనగరంలో బి.ఎస్సీ చదివాక ఎల్.ఐ.సిలో అసిస్టెంటుగా చేరి, అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం నెల్లూరు డివిజనల్ ఆఫీసులో ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. గత సంవత్సరమే ఆంధ్రా యూనివర్సిటీ నుంచీ సైకాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ కూడా పొందారు. వీరి భర్త శ్రీ విశ్వనాథ బి.వి. సత్యనారాయణ మూర్తి. కుమారులు శరవణ్ శౌరి, సాకేత్.

## సుధ నాగళ్ళ

**అమ్మ! ఈ ప్రపంచంలో అమ్మ లేని మనిషి లేడు.** అమ్మ లేకుండా మనిషే లేడు. అమ్మ అంటే నిస్వార్థం. అమ్మ అంటే సదా పిల్లల క్షేమం కోరే దేవత. నేను ఇంతకు ముందెప్పుడూ ఏమీ రాయకపోయినా కౌముదిలో మాతృదేవోభవ శీర్షిక సంవత్సరం పైగా చదివి అమ్మ మీద ఏమైనా రాయాలనిపించింది.

మా అమ్మ పేరు బాలా త్రిపుర సుందరి. కాలానుగుణంగా సుందరమ్మగా రూపాంతరం చెందింది. నాన్నపేరు వెంకటప్పారావు. అమ్మ 1928 జనవరిలో పుట్టిందట. అప్పట్లో పుట్టిన తేదీ సమయం రికార్డు చేసి గుర్తుంచుకునే అలవాట్లు లేని మధ్యతరగతి కుటుంబం తనది. అమ్మ పుట్టింది గుంటూరు జిల్లాలోని వెల్లటూరు. నాన్నది అనంతవరం. పెళ్ళయ్యాక కొంతకాలం పెనుమూడిలో ఉండి, దాదాపు శేషజీవితం అంతా రేపల్లెలోనే గడిపారు.

అమ్మమ్మ జన్మనిచ్చిన పదిమందిలో అమ్మ ఆఖరి సంతానం. అమ్మ జన్మనిచ్చిన పదిమందిలో నేను ఆఖరుదాన్ని. ఆఖర్న పుట్టానని అమ్మ ఎందులోనూ నాకు తక్కువచేయలేదు. తను చదువుకోకపోయినా తన పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని తపన పడింది. ఒక వైపు పిల్లల్ని కంటూ, పెంచుతూనే నాన్నకి వ్యాపారంలో చేదోడు వాదోడుగా నిలిచింది. ఏ రోజూ తన సుఖంకోసం తాపత్రయపడలేదు. పిల్లల సుఖమే తనసుఖం అనుకుంది.

మొదట్లో నాన్నకి సినిమా హాల్లో కేంటీన్ ఉండేది. మా రెండో అక్క పుట్టాక రేపల్లె ఊళ్ళో సొంతంగా టిఫిన్ సెంటర్ ప్రారంభించారు. తరువాత అన్నయ్యలు ఆ వ్యాపారాన్ని బాగా విస్తరించి పలుచోట్ల టిఫిన్ సెంటర్‌లు మొదలుపెట్టారు. ఆ సెంటర్‌లకి కావల్సిన ఇడ్లీ, దోసె, వడ లాంటివన్నీ ఇంట్లోనే చేసి ఇచ్చేది అమ్మ. ఎప్పుడూ ఐదారు గేదెలకి తగ్గకుండా చూసుకుంటూ పాలు కూడా



తనే పెతికి హోటళ్ళకి ఏమాత్రం ఇబ్బంది లేకుండా చూసుకునేది. నా చిన్నప్పుడు అమ్మ ఆ విధంగా నిరంతరం క్షణమైనా విశ్రాంతి తీసుకోకుండా పనిచేయడం ఇంకా నా కళ్ళముందు నిన్నా మొన్నటిలా కదులుతుంది. అమ్మకి ఎప్పుడైనా విశ్రాంతి తీసుకోవడమంటే సినిమాకి వెళ్ళడమే.!

కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనవలు, మనవరాళ్ళు, ముని మనవలు, ముని మనవరాళ్ళు ఎప్పుడూ సుఖంగా సంతోషంగా ఉండాలని కోరుకుంటుంది. సంతోషకరమైన వార్త వింటే పొంగి పోతుంది. దుఃఖం అయితే పంచుకుని ఓదార్చుతుంది.

ఉద్యోగరీత్యా మా అమ్మాయిని డేకేర్ లో పెట్టటం ఇష్టం లేక 'అమ్మా నాకు సాయం చెయ్యి ' అంటే ఎప్పుడూ వదిలి రాని తన ఇంటిని వదిలి నాతో మూడు సంవత్సరాలు ఉంది, మా అమ్మాయిని చూసుకుంటూ. పెంచిన మమకారమేమో మనవరాలి గొంతు ఫోనులో వారం వారం వినాలని తహతహ లాడుతుంది. అందుకే మా అమ్మాయి తెలుగు మరిచిపోకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాం.

చుట్టాలందరు అనేవారు అమ్మ గురించి - కూతుళ్ళని, కోడళ్ళని ఒకేలా చూస్తుందని. కూతుళ్ళే అనుకునే వారు అమ్మకి కోడళ్ళంటే ఇష్టం అని. అంత పెద్ద సంసారాన్ని ఎంతో ఓర్పుతో, బాధ్యతతో నెట్టుకొచ్చింది. తన మరుదుల్ని కూడా తన పిల్లలే అనుకుని పెళ్ళిళ్ళు చేసి, వాళ్ళ భార్యలకి పురుళ్ళు పోసింది. నాయనమ్మ పక్షవాతంతో చూపు పోగొట్టుకుని మంచంలో ఉంటే కన్న తల్లిలా సాకింది. నేనే ఎందుకు చూడాలని ఎప్పుడూ వంతులు వేసుకోలేదు.

నాన్న ప్రత్యక్షంగా అమ్మని పొగడక పోయినా మాతో అనేవారు మీ అమ్మకి ఇందిరాగాంధీకి ఉన్నంత తెలివి ఉందిరా అని. మేము కాలిక్యులేటర్లతో వేసిన దానికన్నా వేగంగా తను మెదడులోనే లెక్కలు చేయగలిగేది. ఇప్పుడు వయసుతో వచ్చిన మార్పువల్ల వేగం తగ్గింది. అమ్మ వయసు ఇప్పుడు 81 సంవత్సరాలు. తన కుటుంబమే కాకుండా తన బంధువులు, తెలిసిన వాళ్ళు చుట్టుపక్కలవాళ్ళు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అనుకుంటుంది. మా బాబాయి కొడుకు తన మేనమామ కూతుర్ని ప్రేమించి ఆమెని పెళ్ళి చేసుకోకపోతే చచ్చిపోతాను పెద్దమ్మా అంటే, వాళ్ళ పెళ్ళి మా ఇంట్లో సినిమా తరహాలో దండలపెళ్ళి చేసి పెళ్ళికూతురి తల్లిదండ్రులకి శత్రువు అయ్యింది. తన దగ్గర ఉన్నది ఎవరికైనా పెట్టాలనుకుంటుంది కానీ తనకి అవసరం అవుతుందేమో అనుకోదు.

మా నాలుగో అక్క 1980 లోనూ, నాన్న 1987 లోనూ, మూడో అన్నయ్య 2005 లోనూ చనిపోయారు. ఈ నిష్క్రమణలన్నీ మానసికంగా అమ్మ మీద చాలా ప్రభావం చూపించాయి. వీటిని తట్టుకుంటూ మిగిలిన పిల్లల బాగోగులు చూసుకుంటూ జీవన యాత్రని కత్తిమీద సాములా నడిపించుకుంటూ వచ్చింది. ఐనా ఏరోజూ ఎవరికి ఏలోటూ రాకుండా చూసిన అమ్మ నేర్పు, ఓర్పు ఇప్పటికీ నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది.



నాన్న చనిపోయాక నన్ను పై చదువులు చదివించడం తనకి భారమైనా నాన్న ఆఖరికోర్కె తీర్చడం కోసం నన్ను కష్టపడి చదివించింది. ఈ రోజున నా ఈ స్థితికి అమ్మే కారణం అంటే ఏ మాత్రం ఒప్పుకోదు. నీ చదువు నేనేమైనా చదివానా అంటుంది. అంతంటి నిరాడంబరురాలు అమ్మ.

అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆ అమ్మకి కూతురిగా పుట్టినందుకు గర్వపడుతున్నాను. జన్మజన్మలకూ ఈ అమ్మకే కూతురిగా పుట్టాలని కోరుకుంటున్నాను. 'అమ్మ' అనే పదానికి అసలైన నిర్వచనం మా అమ్మ అని ఎప్పుడూ అనుకుంటూ ఉంటాను.

సుధగారు న్యూయర్క్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు సాహిత్యం అంటే చాలా ఇష్టం. భర్తా, కుమార్తెలతో న్యూజెర్సీలో నివాసం.

# రమ శేషాద్రి



సృష్టిలో తీయనైనది "అమ్మ" అనే పిలుపు. "అమ్మా" అని పిలిపించుకోవడం ఎంత మధురమో, 'అమ్మా' అని పిలవడము అంతే మధురం, అదృష్టమూను.

ప్రేమ, శాంతం, సహనం, త్యాగం - వీటికి మరో రూపమే అమ్మ.

ప్రతి వ్యక్తి తమ తల్లిని గురించి చెప్పేదే ఇది. నా అభిప్రాయం కూడా ఇదే కాకపోతే ఒకొక్క మాతృమూర్తి ఒక్కొక్క పరిస్థితిలో, ఒక్కొక్క విధంగా ఆ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన రీతిలో రూపాంతరం చెందుతుంది.

ఈ సందర్భంలో నేను మా అమ్మగారిని గురించిన కొన్ని విశేషాలను 'కౌముది' ద్వారా మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

మా అమ్మగారి పేరు శ్రీదేవి. స్వాతంత్ర్య సమరయోధులు, కాంగ్రెస్ మహాసభలకు ఆంధ్రదేశం నుంచి లక్నో వరకు పాదయాత్ర సాగించిన ధీరుడైన శ్రీ సూరంపూడి శ్రీహరిరావుగారు, సూరంపూడి రమణమ్మ గార్ల రెండవ కుమార్తె ఈవిడ. 1937 వ సంవత్సరంలో కాకినాడలో జన్మించారు.

బాల్యం - సుమారు పన్నెండు సంవత్సరాలవరకు ఆవిడ తన జీవితాన్ని కాకినాడ, రాజమండ్రి, రామచంద్రాపురం, మండపేటలలో గడిపారు. ఈ పన్నెండు సంవత్సరములు స్నేహితురాళ్ళతో తొక్కుడు బిళ్ళలు ఆడుకోవటం, పొలాలమ్మట, గట్లమ్మట తిరగడం, జామకాయలు, రేగుపళ్ళు కోసుకుని తినడం, ఇష్టం ఉంటే బడికి వెళ్ళడం లేకపోతే లేదు. ఇది ఆవిడ దినచర్య. తండ్రి స్వాతంత్రోద్యమంలో ఊరూరు తిరుగుతూ ఉండేవారు. దానితో ఆవిడకి సరియైన చదువు, క్రమశిక్షణ లేకుండా పోయింది. పదమూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన మా అమ్మగారిని, పిన్నిని తీసుకుని మా అమ్మమ్మగారు, తాతగారు హైదరాబాద్ వెళ్ళడం జరిగింది. స్నేహితుల ఇంట్లో దిగారు కొన్ని రోజుల పాటు ఉండడానికి. అక్కడ కూడా చెల్లెల్ని, మరికొందరు స్నేహితులని పోగేసుకుని ఆవిడ యధాప్రకారం హాయిగా, చీకూ చింత లేకుండా ఆడుకుంటూ ఉండేది.

అలాగే ఒక రోజు సాయంత్రం గోటీ బిళ్ళలు ఆడుకుంటూ ఉండగా వాళ్ళ అమ్మగారు వాకిట్లోకి వచ్చి, 'ఇంటికి చుట్టాలు వచ్చారు. లోపలికి రా!' అని తీసుకుని వెళ్ళి మొహం కాళ్ళు, చేతులు కడిగించి గబగబా ముస్తాబు చేయించి కూర్చోబెట్టారట. కారణం ఏమిటో కూడా ఆలోచించలేని వయసు, అమాయకత్వం. మర్నాటికి ఆవిడకి తెలిసిన విషయం - వచ్చేవారం ఈ పాటికి తనకి పెళ్ళి అయిపోతుంది. జీవితం అంటే హాయిగా ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ, తుళ్ళుతూ గడపడమే అనుకునే అమాయకపు దశలోనే మూడు ముళ్ళు పడిపోయాయి. పదిమంది ఉన్న ఉమ్మడి కుటుంబంలోకి కోడలుగా వెళ్ళింది. షరా మామూలే.. తెల్లవారి లేవడం, పనిపాటలు చేసుకోవడం, వండి వార్చడం. తరువాత రెండు సంవత్సరాలకి ఒకరు చొప్పున ఐదుగురు సంతానం. నేనే ఆఖరి సంతానం. నేను పుట్టేసరికి మా అమ్మగారి వయస్సు 23 సంవత్సరాలు.

కుటుంబం పెరిగే సరికి ఆర్థిక ఇబ్బందులు. అసలే పురుషాధిఖ్య సమాజం. దానికి తోడు కోపధారి భర్త. పర్యవసానం భార్య వీపు విమానం మోత మోగిపోవడం, ఏడుపులు, పెడబొబ్బలు. ఇది ఆనాటి ఆవిడ పరిస్థితి. ప్రతి నిమిషం ఆత్మాభిమానం చంపుకుని జీవించడం, జీవించవద్దు అనుకోవడానికి లేకుండా ఐదుగురు పసిపిల్లల బాధ్యత. అప్పటికే ఆవిడ తండ్రిగారు - అంటే మా తాతగారు

కాలం చేశారు. అన్నదమ్ములు లేరు.. ముగ్గురు ఆడపిల్లలే. దిక్కుతోచని స్థితి. అప్పుడే ఆవిడలో ఆలోచించటం అన్నది మొదలైంది. అసలు ఇలాంటి స్థితికి కారణం ఎవరు. తనే! తనకి సరైన విద్యాభ్యాసం, ఆర్థిక స్వాతంత్ర్యం ఇవన్నీ లేకపోబట్టే కదా ఈ పరిస్థితులు ఎదురవడం, తను చదువుకుంటే, ఉద్యోగం చేస్తే తన పిల్లలకి చదువు చెప్పుకోగలుతుంది, ఆర్థిక పరిస్థితి మెరుగు పడతాయి. తన భర్త నుంచి గౌరవ మర్యాదలు లభిస్తాయి. కనక తను చదువుకోవాలి అనే బీజం మొలకెత్తింది ఆవిడ మనసులో.

ఈ అభిప్రాయాలని స్నేహితురాలు సీతమ్మగారితో పంచుకుంది. అన్నీ విన్న ఆవిడ 'అవును మనం మాత్రం ఎందుకు చదువుకోకూడదు, కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదు, మనసుంటే మార్గం అదే ఏర్పడుతుంది. కృషి చేస్తే దైవానుగ్రహం. తప్పకుండా ఉంటుంది. మనం మన భర్తల నడిగి చదువు మొదలు పెడదాం' అన్నారు. మా అమ్మగారి మనసులో మొలకెత్తిన బీజానికి ఆవిడ మాటలు  తొలకరి జల్లులే అయాయి.

ఆ విషయమే మా నాన్నగారితో సంప్రదించగా - 'అయ్యో ఐదుగురు పిల్లలతో నాకే భారంగా ఉంటే ఇప్పుడూ నీకు చదువా? నువ్వేమైనా ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్ళు ఏలాలా?' అన్నారుట. దానికి ఆవిడ 'మీరు ఒప్పుకుంటే చాలు. డబ్బు ఏర్పాటుకి నేను మా అమ్మని, అక్కని అడిగి సహాయం తీసుకుంటాను. మిమ్మల్ని విసిగించను' అన్నారట. దానికి ఆయన 'సరే' అన్నారు. మనసులో గట్టి నమ్మకం. ఇది నిజంగా చదవాలా, ఉద్ధరించాలా అని.

అప్పటికి ఇంకా కరెంటు లేదు. కిరోసిన్  దీపాలు పెట్టుకుని పిల్లలందరూ చదువుకునే పరిస్థితులు. ఇంటికి దగ్గరలోనే ఉన్న ఒక ట్యుటోరియల్ కాలేజీలో, సాయంత్రపు కళాశాలలో ఆంధ్రామెట్రిక్‌లో చేరి, వాళ్ళని, వీళ్ళని అడిగి పుస్తకాలు తెచ్చుకుని, క్లాసుకి వెళ్ళి వచ్చి, రాత్రి అందరి భోజనాలు, పిల్లల చదువులు అయ్యాక ఆ లాంతరు తను తీసుకుని అర్ధరాత్రి వరకు చదువుకుని, తిరిగి యధాప్రకారం తెల్లవారే లేచి తన దినచర్యలో ఎలాంటి లోపం లేకుండా, అతిధి మర్యాదలకి ఆటంకం లేకుండా, సంవత్సరమంతా కష్టపడి, పరిక్ష సెంటర్ గుంటూరులో ఇవ్వగా పదిహేను రోజులు ఆ క్రొత్త ఊరిలో ఉండి పరీక్షలు వ్రాసి, మొదటి ప్రయత్నంలోనే ఆంధ్రా మెట్రిక్ పాస్ అయ్యారు. ఆర్థిక సహాయంలోనే కాక, చదువు చెప్పడంలో కూడా మా అమ్మమ్మగారు మా అమ్మకి సహాయపడేవారు. ఆ రోజుల్లోనే మా అమ్మమ్మగారు "సూరంపూడి రమణమ్మగారు" ఇంగ్లీషు, గణితంలో దిట్ట.

ఒకసారి విద్య రుచి చూసిన వారికి విడవడానికి మనసురాదు. మా అమ్మగారి పరిస్థితి అదే  వేడిలో ఉండగానే ఈ చదువు కొన సాగించాలనుకుని పి.యు.సి లో చేరి నిర్విరామంగా కృషి చేసి అలాగే మొదటిసారిలోనే పరీక్షల్లో ఉత్తీర్ణురాలయ్యారు. అది చూచి మా నాన్నగారిలో మార్పు వచ్చింది. ఆవిణ్ణి చూసి గర్వపడేవారు. ఆ తరువాత కష్టమో, నిష్టూరమో ఆవిడ చదువుకి ఆయనే తోడ్పడ్డారు.

'ఈ చదువుతో నాకు తప్పని సరిగా జాబ్ దొరుకుతుంది. నాకు ఎక్కడైనా ఉద్యోగానికి ప్రయత్నించండి' అని ఆయనకి చెప్పి, ట్యుటోరియల్ క్లాస్‌మేట్స్‌తో కలిసి వెళ్ళి ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో పేరు రిజిష్టర్ చేయించుకుని వచ్చారు.

అనుకోకుండా ఒకరోజున - మే నెల, ఊరగాయల రోజులు, ప్రతి సంవత్సరంలాగే ఆ సంవత్సరం ఊరగాయల హడావిడిలో ఉన్న ఆవిడ పేరిట పోస్ట్ వచ్చింది, ఉద్యోగానికి ఇంటర్వ్యూకి రమ్మని.. విద్యుత్ సౌధ (ఎలక్ట్రిసిటీ బోర్డు)లో! ఆవిడ ఆనందానికి పట్టపగ్గాలు లేవు. మా నాన్నగారు దగ్గర్నుండి ఆవిడని ఇంటర్వ్యూకి తీసుకెళ్ళారు. ఆవిడకి అందులో ఉద్యోగం వచ్చింది. రాసిన రెండు పరీక్షలు మొదటిసారిలోనే పాస్ అవడం, మొట్టమొదటి ఇంటర్వ్యూ లోనే సెలెక్ట్ అయి ఉద్యోగం రావటం ఇవన్నీ దైవానుగ్రహమనే నమ్ముతారు మా అమ్మగారు ఈ నాటికీ కూడా.

ఉద్యోగంలో చేరి, ఆర్థిక ఇబ్బందుల్లో మా నాన్నగారికి చేదోడుగా ఉండి, మా అందరి చదువు సంధ్యలు చూసుకుంటూ ఇంట బయట ఆవిడ జీవనపోరాటం సాగిస్తూ వచ్చారు. ఇలా కొంత కాలం సాగగానే విధిలీలలు విచిత్రం అన్నట్టుగా హఠాత్తుగా ఆఫీసులో ఒక జీ.వో వచ్చింది. డిగ్రీ పట్టభద్రులైన వారికే ఈ ఉద్యోగం నిలుస్తుంది లేని వారిని తీసెయ్యమని. దిక్కు తోచని పరిస్థితి. అయినా సరే లేని

ధైర్యాన్ని కూడ గట్టుకుని, కావలసిన ఇన్‌ఫర్‌మేషన్ సేకరించుకుని, కాలేజీలో చేరితే ఉద్యోగం చెయ్యడం కష్టమని, ప్రయివేటుగా ఉస్మానియా యూనివర్శిటీ నుంచి బి.ఏ. మూడు సంవత్సరాల పరీక్షలకి ఫీజు కట్టి మరొకసారి తన దీక్షని సాగించారు. మూడు సంవత్సరాల నిరంతర కృషి, మా చదువుల భారం పెరిగింది. ఈ నేపధ్యంలో మా పెద్దక్క వివాహం కూడా జరిగిపోయింది కాస్త చిన్న వయసులోనే. మా అమ్మగారి బి.ఏ. ఫైనల్ ఎగ్జామ్స్ నాటికి మా అక్కయ్యకి పురిటి రోజులు. అలాంటి పరిస్థితులలో ఆవిడ చదువుకునే వైనం చూసి అందరూ ముగ్ధులయ్యేవారు, చుట్టు పక్కల ఎవరి ఇంట్లోనైనా పిల్లలు చదువుకోకపోతే ఆవిడని చూసి బుద్ధి తెచ్చుకోండి. ఈ వయసులో ఐదుగురు పిల్లల బాధ్యతలతో ఆవిడ ఎలా చదువుకుంటోందో అని మందలించేవారు. మా అమ్మగారి దీక్షా, పట్టుదల, అచంచల విశ్వాసం వీటికి ముగ్ధులైన ఒక రిటైర్డ్ లాయర్ ఆ మూడు సంవత్సరాలు ప్రతి రోజూ వచ్చి చదువు చెప్పేవారు. ఆ వృద్ధ గురువు గురుదక్షిణ ఏమిటంటే శీతాకాలం, వర్షాకాలం అయితే ఒక కప్పు కాఫీ, వేసవికాలం అయితే ఒక గ్లాసు మజ్జిగ. అపూర్వమైన గురుశిష్యులు. ఆ నిర్విరామ, నిరాటంక కృషి ఫలితంగా 3 సంవత్సరాలలో బి.ఏ డిగ్రీని పొంది, తన ఉద్యోగం స్థిర పరుచుకుని ఆ తరువాత మరో ముప్ఫై సంవత్సరాలు అక్కడే ఉద్యోగం చేసి ఈ మధ్యలో డిపార్ట్ మెంట్ ఎగ్జామ్స్ కి చదివి పాస్ అయి చివరికి జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా రిటైర్ అయ్యారు. హైదరాబాద్ లోని స్వగృహంలో ఉంటున్నారు. మధ్యలో మా నాన్నగారు పోయినప్పటికి ఆనాడు చేపట్టిన కుటుంబ భారం ఇప్పటి వరకు సక్రమంగా నిర్వహించి మా బంధువర్గంలో ఒక ఆదర్శ స్త్రీ మూర్తిగా పేరు తెచ్చుకుని ఆ తరువాత ఎందరో స్త్రీలకి ఆవిడ మార్గదర్శకం అయ్యారు.

ఆవిడలో ఉన్న దీక్ష, సహనం, ఆత్మవిశ్వాసం, నిద్రాహారాలని త్యాగం చేసి చదువుకోవడం ఇవన్నీ ఆవిడ విజయానికి ఒక్కొక్క దశలో ఒక్కొక్క మెట్టు. ఆవిడని మా అమ్మగా మీ అందరికి "కౌముది" ముఖంగా పరిచయం చేసే అవకాశం కలిగినందుకు నేనెంతో గర్విస్తున్నాను.

నా జీవితంలో నేను ఎన్నో సమస్యలని అధిగమించడానికి స్ఫూర్తిదాయకం మా అమ్మగారే.



రమశేషాద్రి గారు ఎం.ఎ. తెలుగు సాహిత్యంలో పట్టభద్రులు. 15 సంవత్సరాలు విశాఖపట్నం, హైదరాబాదులలో కాలేజీ లెక్చరర్‌గా పనిచేసి, గత 7 సంవత్సరాలుగా కెనడా, టొరాంటో సిటీలో వుంటున్నారు. మంచి రచనలు చదవడం తన హాబీ అంటున్న రమగారు 'కౌముది' కి రెగ్యులర్ పాఠకులు.

## ప్రమీలా చంద్రమోహన్



'అమ్మ' అనేదే ఒక తీయని కమ్మని మాట. ఒక కమ్మని కావ్యం. ఏ భాషలో అయినా 'అమ్మా' అనే శబ్దం ఒకేలాగా పలుకుతుంది. పిల్లలు గాని, పెద్దలు గానీ సంతోషమయినా, బాధ అయినా పలికించడానికి వాడే పదం 'అమ్మ'. 'ఎవరు రాయగలరూ అమ్మ కన్న చల్లని మాట, ఎవరు పాడగలరూ అమ్మ కన్న కమ్మని పాట.

మా అమ్మ శ్రీమతి మద్దూరి లీలావతి దేవి. ఆ రోజుల్లోనే (1946) బి.ఎ. గణిత శాస్త్ర పట్టభద్రురాలయి అందరి చేతా ముక్కుమీద వేళ్ళు వేయించుకుంది. అలనాటి గణితశాస్త్ర విశారద అయిన ఆ 'లీలావతి'లాగే పేరుగాంచింది. చదువు తప్ప పనిపాటల అవసరం లేని పెద్ద కుటుంబం నుంచి వచ్చి,

చెన్నపట్నం చేరిన ముద్దరాలు. రకరకాల వంటలు నేర్చుకుని భర్తని, పిల్లలనే కాక అతిధి, అభ్యాగతులను, బంధు బలగాన్ని ఆదరించిన ఇల్లాలు.

*చక్కని గృహిణి*

ఒక మంచి ఇల్లాలిగా తన భర్త ఉన్నత శిఖరాలనధిరోహించడానికి కావాల్సిన తోడ్పాటు, చాపకింది నీరులా అందించింది. దేశ, విదేశాల్లో ఖ్యాతి నార్జించుకుంటున్న భర్తకు ఇంట్లో శాంతి, సౌఖ్యాలను అందించటమే కాని, ఇంటి బాధ్యత, పిల్లల బాధ్యతను ఎన్నడూ ఆయన భుజస్కంధాల మీద పెట్టలేదు. ఎన్నో చిన్న, చిన్న చీకాకులను తనే అధిగమించేది. ఇంటికి వచ్చిపోయే చుట్టాలు, ఇంట్లోనే ఉండే బంధువులు అతిధి, అభ్యాగతులు, వారి మర్యాదలు వారి వారి ఈతిబాధలు, హాస్పిటల్ చుట్టూ తిరగటాలు అన్నీ తనే చూచుకునేది. భర్తకి కావలసిన, పిల్లలకు కావలసిన సరంజామాయే కాదు, ఇంటికి కావలసిన బట్టలు, పాత్రలు అన్నీ తనే చూడవలసి వచ్చేది. ఒక్కనాడు కూడా విసుగు దరిచేరనిచ్చేది కాదు. అందరికీ అన్నివిధాల సుఖాన్నిచ్చేందుకే శ్రమించేది. ఎంతోమంది, ఎవ్వరింటికీ రాని ప్రముఖులు వస్తే చక్కని ఆతిథ్యమందించేది. ఉన్నది నలుగురు పిల్లలయినా నలుగురు నాలుగురకాల వంటలడిగేవారు. అందరికి చేసిపెట్టేది. ఒకే కూర (వంకాయ) నాలుగురకాలుగా చేస్తేగాని తృప్తిపడని పిల్లలు, ఎల్లవేళలా ఇంకో ఎక్స్ట్రా విస్తరి వేస్తేకాని కుదరని ఇల్లు, ఎల్లవేళలా చిరుతిండి అడిగే భర్త, పిల్లలు, ఎప్పుడు లేచేదో, ఎప్పుడు చేసేదో ఎవరికీ తెలియదు. ఒక్క పని మనిషి తప్ప చేతికింద సాయంలేదు. అయినా చక్కని గృహిణిగా పేరు తెచ్చుకుంది.

*తల్లి, గురువు, దైవం*

ఆమెకి చాల చిన్నతనంలోనే పెళ్ళయిన మూడేళ్ళకి, అయిదేళ్ళ వారలో నలుగురు పిల్లలు. ఆ పిల్లలని అందర్నీ పైకి తీసుకురావటానికి ఎంత శ్రమించేదో భగవంతుడికే తెలుసు. పిల్లలకు రోగమొచ్చినా, నెప్పి వచ్చినా ఏమి వచ్చినా అంతా తనే చూడాలి. రోగిని కనిపెట్టుకోవటమే కాక, కాలు వచ్చిన మిగతా పిల్లలు అల్లరి చేయకుండా, బయటికి పారిపోకుండా పట్టుకోవాలి. వాళ్ళ చదువు, సంధ్యలు చూడాలి, చక్కని బడిలో వేయటమే కాక, వాళ్ళ చదువుల పర్యవేక్షణ. చదువులో, పిల్లలు ప్రధమ శ్రేణిలోనే ఉండాలి. వాళ్ళకి ఆటపాటల్తో చదువు చెప్పాలి. పిల్లలకి చిన్న తనంలో నిద్రపుచ్చటానికి కథలు, పద్యాలు చెప్పాలి. ఇంట్లో బంధువులను చూడాలి. మద్రాసు లాంటి మహా నగరంలో దుండగుల మోసాలకు గురికాకుండా తన కుటుంబాన్ని రక్షించాలి. అంతే కాకుండా ముఖ్యమైన వన్నీ చూపించాలి. క్వీన్ ఎలిజిబెత్ మద్రాసుకు వస్తే ఆమెను చూపించాలి. హార్బర్, ఎయిర్ పోర్ట్ బయట నుంచి చూపటమే కాక ప్లేన్ లోపలికి, షిప్‌లోకి తీసుకెళ్ళాలి. సినిమా షూటింగ్స్ చూపాలి. మంచి విజ్ఞాన చిత్రాలు చూపాలి. కేవలం చదువేకాక ఎక్స్ట్రా కరిక్యులం యాక్టివిటీస్‌లో పిల్లలు పాల్గొనాలి. ప్రపంచంలో వంటరిగా మనగలగాలి. లోకజ్ఞానం తెలియాలి. ఇలా నలుగురి పిల్లలను పోస్ట్ గ్రాడ్యుయేట్స్‌ని చేయించిందంటే ఆమె శ్రమ ఎంతో ఎవరికి తెలుసు!? తను పట్టభద్రురాలయినా ఎం.ఎ లో కూడా పిల్లలకి అవసరమైతే నోట్స్ రాసిపెట్టేది. వాళ్ళు అర్ధరాత్రి దాకా మేలుకుంటే, నేనూ మీతో మెలుకువగా ఉంటాననేది. తెల్లవారు ఝూమున లేపాల్సివస్తే లేపేది. వారికి ఏ టైములో ఏది కావాల్సివచ్చినా చేసి పెట్టేది. పిల్లలకు ఏ రోగమయినా వస్తే ఇంటిపనులు ఎప్పుడూ చేసుకునేదో తెలియకుండా ఆమె ఆరోగిని అహర్నిశలూ కనిపెట్టుకుని ఉండేది. పిల్లలకు ఎవరిలో నయినా మంచిని మాత్రం చూపటము నేర్పింది. వాళ్ళలో చెడ్డతనాన్ని పాయింటవుట్ చేస్తే, మనవైపు మూడువేళ్ళు చూపిస్తాయి. అందరూ పర్ఫెక్ట్ కాదు. మంచే చూడమని నొక్కి వక్కాణించేది. ఈ రోజు నలుగురు పిల్లలు పై వచ్చి పేరుగాంచారంటే ఆ అమ్మ చలవే. ముఖ్యంగా ఈ రోజు ఆమె పోయి పదేళ్ళు అయినా నల్గురు పిల్లల మధ్య ప్రేమానురాగాలు ఉండి, కష్టసుఖాలు పంచుకుంటున్నారంటే ఆ తల్లి నేర్పిన క్రమశిక్షణాను రాగాలే కారణం..

*ఆమె ప్రయోజకత్వం*

చిన్న, చిన్న పిల్లలతో మూడు నెల్లకొకసారి పుట్టింటికి, అత్తింటికి పిల్లలు స్కూల్లో చేరకముందు వంటరి ప్రయాణాలు చేయటము ఆ రోజుల్లో ఎవరూ, కనీ, వినీ ఎరుగరు. మద్రాసులాంటి మహానగరాల్లో, రకరకాల మోసాలు. అందులో భర్త సగం రోజులు ఊర్లో ఉండరు. ఉన్నా ఎప్పుడో పొద్దున వెళ్ళి, ఏ రాత్రికో వస్తారు. ఇది జగమెరిగిన సత్యం. అయినా ఏమీ తెలియని అమాయకురాలుగా పెరిగిన ఆమె ఒంటరిగా ఎన్నో ఏళ్ళు నిభాయించుకొచ్చేది. డాక్టర్లు, మందుల షాపులు, బట్టల షాపులు, కిరాణా కొట్లు హాస్పిటల్స్ అన్నీ తను ఒక్కత్తే తిరగాల్సి వచ్చేది. ఇవిగాక భర్తకి, భర్తపోయాక కొడుక్కి ఆఫీస్ అకౌంట్స్ చూడాల్సి వచ్చేది. ఇంట్లో గృహిణి సేవేగాక భర్తతో పార్టీలు, ఫంక్షన్స్‌కి అటెండ్ కావాల్సి వచ్చేది. మధ్య, మధ్యలో భర్త సరదా టూర్స్ అంటే పిల్లల్ని వదలలేక, భర్తతో పోలేక ఇబ్బంది పడేది. చిన్నతనంలో మహిళా మండలిలో వాలంటరీగా టీచింగ్ చేసేది. రేడియో టాక్స్ ఇచ్చేది. తర్వాత అన్నీ వదిలేసుకుని పిల్లల పెంపకము బాధ్యత చేపట్టింది. పిల్లలు పెద్ద వాళ్ళయ్యాక ఫిలిం సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా చేసింది.

ఇట్టి బహుముఖ ప్రజ్ఞాశీలి మా అమ్మ. ఆమెకి నీరాజనమే ఈ వ్యాసం రాసింది ఒకరయినా వ్రాయించింది నలుగురు పిల్లలు, వరస క్రమంలో వారి పేర్లు ప్రమీల, మీనా, రఘు, రాజ్ ఇవి నలుగురి భావాలు.



శ్రీమతి ప్రమీలా చంద్రమోహన్ గారు , ఎమెస్కో పబ్లికేషన్స్ స్థాపకులు శ్రీ ఎమ్.ఎన్. రావు గారి పెద్దకుమార్తె.
భర్త , రిటైర్డ్ ప్రొఫెసర్, శ్రీ చంద్రమోహన్ గారితో తిరుపతిలో నివాసం.

## డా. దీప్తి కనుపర్తి



**అమ్మకి నిర్వచనం** - అర్థం నేను అమ్మనైనా పూర్తిగా అంతు చిక్కలేదు కాని, అమ్మ అని ఎక్కడ ఎప్పుడు విన్నా మా అమ్మ కళ్ళలో కదులుతుంది గుండెల్లో మెదులుతుంది. మా అమ్మ పేరు విజయలక్ష్మి కనుపర్తి, విజయ బక్ష్‌గా స్నేహితులకి పాఠకులకు సుపరిచితురాలు. తెలుగు రీడర్‌గా పని చేసి క్రిందటి సంవత్సరమే పదవీ విరమణ చేసారు. అధ్యాపకురాలిగా, వక్తగా, రచయిత్రిగా మా అమ్మ గుణగణాలు ప్రాముఖ్యం. నా కన్నా తన విద్యార్థినీ విద్యార్థులు, సహోపాధ్యాయులు బాగా చెప్పగలరు. నేను మాత్రం అమ్మను అమ్మగానే మీకు పరిచయం చేస్తాను.

చిన్నతనంలో అన్నయ్యకు నాకు అన్నం తినిపిస్తూ రామాయణం భారతంతో పాటు, గాంధీ, అల్లూరి సీతారామరాజు కథలు మరెన్నో స్వాతంత్ర్య పోరాట గాథలు వినిపించేది. ఈ రోజుకూ దేశభక్తి గీతం వింటే నా వెంట్రుకలు నిక్కపొడుచుకోవడానికి కారణం అమ్మే! ట్రిపుల్ 'ఏ'లు నాకు చాలా ఇష్టం అంటూ అశోకుడు, అక్బర్, అలగ్జాండర్ చరిత్రలు కథలు కథలుగా కళ్ళకు కట్టినట్లు చెప్పేది. తన చిన్నతనం - చదువు - ఆటపాటలు మాతో పంచుకుంటూ మేము పుట్టక ముందు జీవితాన్ని కూడా మా ముందు

ఆవిష్కరించింది మా ఆయుష్షు పెంచేసింది. ఇవన్నీ రోజు తను ఉద్యోగం చేసి వచ్చి ఇంట్లో ఎలా చేసేదా అని ఇప్పటికీ నాకు ఆశ్చర్యంగా ఉంటుంది.

ఒక స్నేహితురాలిగా, గురువుగా, మార్గదర్శిగా, విమర్శకురాలిగా, అభిమానిగా నా జీవితంలోని ప్రతి మలుపులో తనదైన ముద్రవేసింది అమ్మ.

"When character is lost Everything is lost" అన్న గాంధీజీ సిద్ధాంతం నరనరాల్లో నాటుకుని పోయేలా చేసింది. వీరేశలింగం గారి వీరాభిమాని. అమ్మ కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో తన ఉద్యోగ జీవితం ప్రారంభించింది.

"చిరిగిన చొక్కా అయినా తొడుక్కో మంచి పుస్తకం కొనుక్కో" అన్న ఆయన మాట అమ్మకు శిరోధార్యం. ఆరవతరగతి పరీక్షలు అవగానే నాకు మంచి మంచి నవలలు ఇచ్చి చదవమని నన్ను ప్రోత్సహించింది. నాలోని పాఠకురాలికి జన్మనిచ్చింది.

ఎప్పుడూ కళకళలాడుతూ, నవ్వుతూ, చకచకా పనులు చేసే అమ్మని చూసి నేను బాగా చిన్నగా ఉన్నప్పుడు "కులుకులమ్మ కన్నకూతురా? మెరుపులమ్మ మేనకోడలా?" అని పాడాను. ఇప్పటికీ ఆ విషయం గుర్తుకు వచ్చినప్పుడు ఇద్దరి పెదవులపై నవ్వు మెరుస్తుంది.

మాకు ఊహ తెలిసి ఏనాడు సినిమాలపై ఆసక్తి చూపని అమ్మ మాకు ఒక పూట బడి ఉన్నప్పుడు ఒక మధ్యాహ్నం మేట్నీకి బయలుదేర తీసింది. అప్పుడు నా వయస్సు పదకొండు, పన్నెండు సంవత్సరాలు ఉండి ఉంటాయి. 'నర్తనశాల' సినిమా ఎస్.వి.రంగారావుగారి నటనా వైశిష్ఠాన్ని మేము గుర్తించాలని తన తపన. సైరంధ్రిని చూసిన ఆయన ఆవేశాన్ని అర్థం చేసుకునే వయసు అప్పుడు నాకు లేదు. కాని తర్వాత ఎప్పుడు అది చూసినా అమ్మ పడిన శ్రమ - తపన ఒక మధుర స్మృతి నాకు.

స్త్రీల ఆత్మాభిమానం, స్వయం ఉపాధి, సాధికారతను బలంగా నమ్మే అమ్మ వాటిని రక్షణ కవచాలుగా వాడాలి తప్ప అస్త్రాలుగా వాడకూడదు అని చెప్పింది. చేసి చూపించింది. ఎప్పుడూ భార్యా భర్తల మధ్య 'నీ' డబ్బు 'నా' డబ్బు అనే ప్రస్తావన తీసుకురాకూడదు అని సలహా ఇచ్చింది. ఇటువంటి సలహాలు ఎన్నో నా జీవితాన్ని స్వయంగా తీర్చిదిద్దుకోవడానికి సహకరించాయి.

అమ్మా నాన్నలది ప్రేమ వివాహం. వారికి ఒకరి పట్ల ఒకరికి ఉన్న ప్రేమ కంటే నా ప్రేమ తీసిపోదని నా ఉక్రోషం "మీరిద్దరూ లేకుండా మాకు 20 సంవత్సరాల జీవితం ఉంది కాని మీరు లేని నా జీవితం లేదు తెలుసా" అనేదాన్ని. అన్నయ్య, నేను పుట్టగానే ఎం.ఫిల్, పి.హెచ్.డి చేసిన అమ్మ ఏ రోజూ ఒత్తిడికి లోనై మాకు ఏ లోపం చేయలేదు. ఈ విషయంలో మా నాన్నగారు సిద్ధార్థ బక్ష్ గారి సహకారం మాటల్లో చెప్పలేనిది. చక్కని సంగీతం - సాహిత్యం ఆస్వాదించడం అమ్మకి ఎంతో ఇష్టం. మహేంద్ర కపూర్ పాట వస్తుంటే "ఎక్కడినుండి వస్తుంది?" అని అడిగేది. నేను "రేడియోలో.. " అంటే "కాదు గాలిలో తేలుతూ వస్తుంది గంధర్వగానం కదా" అని చమత్కరించేది.

అధ్యాపకురాలిగా, రచయిత్రిగా ఎందరినో ప్రభావితం చేసిన అమ్మే నాకు ప్రేరణ.

తెలిసి ఎదుటివారిని బాధించడం, పరుషంగా మాట్లాడడం ఎన్నడూ అమ్మలో చూడలేదు. అమ్మకీ నాకూ ఉన్న అనుబంధం చెప్పలేనిది. మేము తెలిసిన వారెవరైనా తల్లీ బిడ్డలు ఆత్మీయంగా ఉంటే మీలాగే ఉంటారు వాళ్ళు కూడా అని ఉదహరిస్తారు. మేము పొంగిపోతాము. నా బాధ అమ్మకు చెప్పకుండానే తెలిసిపోతుంది. అమ్మ ఏ విషయానికైనా మధనపడితే నాకు అంతే.

ఎంత చెప్పినా తక్కువే ఏమి చెప్పినా తక్కువే

తను కొవ్వొత్తిలా కరిగి మా జీవితానికి వెలుగునిచ్చింది

తను సమిధై మా జీవితాలకు పునాది వేసింది

బాల్యంలో తొలి గురువై, కౌమారంలో హెచ్చరిస్తూ యవ్వనంలో ఇష్ట సఖియై అమ్మ నా జీవితాన్ని మలిచింది.

అమ్మ మనసు వెన్న. ఆమె పలకరింపు, స్పర్శ, వాత్సల్యం, పరిమళం అన్నీ మధురం.



బయోటెక్ కంపెనీలో అసోసియేట్ సైంటిస్టుగా పనిచేస్తున్న దీప్తిగారు, భర్త ఫిరోజ్ గోరా, కుమార్తెలు స్మేరా, అమేయ లతో మెసాచుసెట్స్, కేంబ్రిడ్జిలో నివాసం. వ్రాయడం, చదవడం, ట్రావెలింగ్ హాబీలు

## విజయ చావలి



అమ్మ,నాన్న

సృష్టిలో తీయనిది అమ్మ. అమ్మ అంటే ప్రేమ, అనురాగం, ఆప్యాయత, సహనం, త్యాగం, దగ్గరితనం అన్నీ గుర్తుకొస్తాయి.

"అ" అంటే అమ్మని ఉన్న మొదటి తరగతి తెలుగు వాచకంలో మొదటి పేజీలో మొదటి అక్షరం వత్తి "అమ్మ" అని వత్తి గట్టిగా పలికినప్పుడు నాకు తెలియలేదు, అమ్మకి అక్షర క్రమంలో ఎందుకు ప్రాధాన్యతనిచ్చారో?? రాను రాను తెలిసింది సృష్టిలో ప్రేమమూర్తీ, అనురాగమయి, త్యాగశీలి, సహనవర్తి, ఆప్యాయతల అమృతవల్లి, అనుబంధాలకు ఆది తల్లి ముమ్మాటికీ అమ్మే అని.

ఈ శరీరాన్నిచ్చి రూపాన్నిచ్చింది అమ్మ. ప్రేమతో పాలిచ్చింది, పాలించింది, పెంచింది, పెద్ద చేసింది. చిన్నప్పుడు ముద్దులాడింది లాలించింది అమ్మ.

మా అమ్మ పేరు గండికోట సత్యవతి. వారి ఊరు చోడవరం. చోడవరానికి నేతలాంటి మా తాతగారు దుర్వాసుల సీతారామమ్మూర్తిగారు పెద్ద ప్లీడరు. వారిది పెద్ద కుటుంబం. వారి రెండవ కుమార్తె మా అమ్మ. మా తాతగారిని మేమెపుడు చూడకపోయినా చిన్నతనం రోజులు వ్యవహారాలు వివిధ సందర్భాలలో వింటూ ఉండేవాళ్ళం. మధ్య మధ్యలో కునుకులు తీస్తూ ఉండే వంట మనిషికి వండి వార్చడమే పని. ఇంటికి ఎవరు ఎప్పుడు వచ్చినా విస్తట్లో భోజనం చేయకుండా లేచేవారు కాదట. గుర్రం బండిలో రోజూ కోర్టుకి వెళ్ళే తాతగారు చేతికి ఎముక లేకుండా ఎవరికైనా ఏ సహాయమైనా కాదనకుండా చేసేవారట. పండగలొస్తే ప్రతివారికి నలుగులు పెట్టి తలస్నానాలు చేసే కార్యక్రమాలు.. వాటి మధ్య పండగ సంబరాలు.. అమ్మ ద్వారా ఆశ్చర్యంగా వింటూ ఉండేవాళ్ళం.

ఆమె పాసైంది స్కూల్ ఫైనల్. కాని నేర్చింది బి.ఏ అంత చదువు. అక్కడ అప్పట్లో హైస్కూలు వరకే ఉంది. చదువుకోవడం ఆడుకోవడం తప్ప ఏమీ తెలీని అమ్మకి నాన్నగారితో పంతొమ్మిదో ఏటనే వివాహమయింది.

నాన్నగారు గండికోట విశ్వనాథం గారు. విద్యారీత్యా లాయరు చదువు చదివినా, వృత్తి రీత్యా సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అయినా, ప్రవృత్తి రీత్యా తెలుగు సాహిత్యాభిలాషులు.

ఇక మామ్మ చిట్టెమ్మకి చాలామంది పిల్లలు పుట్టి పోగా మిగిలినవారు ముగ్గురమ్మాయిలు ఒక్క కొడుకు. తండ్రి లేని లోటు తెలియకుండా వ్యవహారాల్లో, పొదుపరితనంతో అప్రమత్తంగా ఉంటూ తెలివితేటలతో నిర్దుష్ట వైఖరితో మా నాన్నగారిని గారాబంగా పెంచారు. అమ్మాయిలకి పెళ్ళిళ్ళు చేయడం, పురుళ్ళు పోయడంతో పాటు నాన్నగారిని చదివించడం ఒక చిన్న ఇల్లు అనకాపల్లిలో ఏర్పాటు చేయడానికి ఎన్నో కష్టాల కోర్చింది. అటువంటి మామ్మ దగ్గిర మడిగా వంటలు చేయడం, పూజలు వ్రతాలు పద్ధతిగా నేర్చుకోవడంతోపాటు నలుగురి పిల్లల సంరక్షణ తెలుసుకుంటూ సరిదీటైన కోడలిగా ఎదుగుతూ అత్తగారి దగ్గర మన్ననలందుకుంది మా అమ్మ. వచ్చిపోయే ఆడపడచులు, అన్నగార్లను ఆదరిస్తూ ప్రేమాభిమానాలు సంపాదించింది.

ఏది వండినా ఒక స్పెషల్ ఐటం ఎక్కువగ కొడుక్కి మాత్రం చేసేదట మామ్మ. వయసులోనే ఉన్న అమ్మకిది అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టిందట. సాయంత్రం కాగానే భారత భాగవతాలు చుట్టుపక్కల వారికి వినిపించమని అత్తగారి ఆజ్ఞ అయితే రాగయుక్తంగా చదవడం కోడలి పని.

చుట్టుపక్కల అమ్మలక్కలు నలుగురి పిల్లల తల్లి అయినా చీర కొనుక్కోవడానికి అత్తగారిని ఎందుకు అడగాలని అమ్మకి సలహాలు చెప్పినా, తిరిగి అదే విషయం అత్తగారికి చెప్పి తనేం అలా అనుకోవటం లేదని అమాయకంగా చెప్పిందట అమ్మ.

మామ్మ ఆశీర్వాదాల వలనే మనమింత వృద్ధిలోకి వచ్చామంటుంది అమ్మ. అమ్మ చెప్పే ఇంకో విషయం: ఎండలో పెట్టిన వస్తువుకి, అత్తగారి దగ్గర మసలిన కోడలికి చెడడం ఉండదని.

మేం నలుగురం పిల్లలం. ఇద్దరు అబ్బాయిలు. ఇద్దరు అమ్మాయిలు. అన్నయ్య మామ్మ దగ్గరే ఏడేళ్ళవరకు పెరిగాడు. మిగిలిన మా అందరికి మామ్మవి చిరుజ్ఞాపకాలు మాత్రమే. మామ్మ పోయినపుడు అందరికంటే ఎక్కువ బాధపడింది అమ్మే. మామ్మ దగ్గిర అమ్మకు సహనం, త్యాగం, పొసెసివ్‌నెస్, పూజలు, మడి చాదస్తాలు అలవడ్డాయి.

నాన్నగారు లా చదువుతున్నప్పుడు కంటికి దెబ్బ తగిలి చదవలేకపోతుంటే అమ్మ ఇంగ్లీషులో చదివి వినిపిస్తే ఆ వాక్యాలు మళ్ళీ పలికి పరీక్ష వ్రాసి పాసయానని తన ఏకసంధాగ్రాహి లక్షణాన్ని చెపుతూ ఉంటారు.

మా నలుగురి పైన మా తలిదండ్రులిద్దరి ప్రభావం చాలా ఉంది. అమ్మతో చనువుగా ఏదైనా మాట్లాడగలం. మా నాన్నగారి దగ్గర అందరికి భక్తి భయం గౌరవం ఉన్నాయి. యుక్త వయసు వచ్చే వరకు నాన్నగారి ప్రేమ తీరు ప్రేమ అర్థం తెలియలేదు ఎందుకంటే నాన్న ప్రేమని చేష్టలలో చూపిస్తారు కాని మాటలలో చూపరు. ఎదురుగా ప్రేమగా మాట్లాడకపోయినా మా కోసం ఆయన పడే తపన, తిట్టినా దాని అంతరార్థం మా అమ్మ విడమర్చి చెప్పేది. అందువలన మా అందరికి ఒకరినొకరు ప్రేమించుకోవడం, సహరించుకోవడం అలవాటయ్యాయి. కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండడం ఆడదాని చేతిలోనే ఉంటుందంటే అతిశయోక్తి కాదు.

అమ్మ నాకు లెక్కలు పదవతరగతి వరకు చెప్పేది. రోజూ కాసేపు ఇచ్చిన లెక్కలు చేయకపోతే ఊరుకునేది కాదు. నాకు లెక్కలలో మంచి మార్కులు రావటానికి అమ్మే కారణం. రోజూ లెక్కలు నేలమీద చాక్పీస్‌తో చేయాలి. నాకు బాగా గుర్తు. వర్గ మూలాలు చెపుతున్నప్పుడు కేవలం ఎక్కాల జ్ఞానంతో దగ్గరే ఉన్న మా అత్త తిరిగి చెప్పగలిగారు...

ఇక పండగలొస్తే సాంప్రదాయానుసారం యధావిధిగా అన్నీ పొద్దున్నే చేయల్సిందే ఆ అలవాటులన్ని ఇప్పుడు నేను సంతృప్తితో పాటిస్తున్నాను. వరలక్ష్మి వ్రతం, వినాయక చవితి, దసరా పండగలలో నేను చెల్లెలు అమ్మ వెనకే వంటలో సాయం చేసేవారం.

నా బలహీనత పుస్తకాలు చదవడం. ఎలాంటి పుస్తకమైనా కనపడితే చదవకుండా తోచదు. నాన్నగారిని ఒప్పించి సెలవుల్లో విధిగా గ్రంధాలయాలు (ఇంటికి వచ్చేవారు) నుండి నాకు కావల్సినవి ఏరుకోనిచ్చేది.

ఇక ఒక్క క్షణం తీరిగ్గా కూర్చోకుండా పిల్లల కిష్టమైనవి ఏదో ఒకటి చేస్తూ ఉండేది. వెంటనే మిగిలిన వారు నీ ముద్దుల కొడుక్కి చేసావా, ముద్దుల కూతురికి చేసావా అనేవాళ్ళు. పిల్లలని కోపగించుకోగా ఒక్కనాడు చూడలేదు.

మా నాన్నగారికి రెండూ లేదా మూడేళ్ళలోసారి ట్రాన్స్‌ఫర్ అయి ఊళ్ళు మారల్సి వచ్చేది. ఏ ఊరికి వెళ్ళినా అక్కడ కొత్త వారితో పరిచయాల వలన మా కందరికి కూడ ఎక్కడికక్కడ సరిపెట్టుకునే అనగా ఎడ్జస్టబుల్ టెంపరమెంట్ అలవడింది.

ఇక నాన్నగారి సాహిత్యాభిలాషతో వ్రాసే పద్యాలు కవితలు మా అందరితో పంచుకుంటూ ఉండడం వలన నేను చెల్లెలు ఎం.ఏ తెలుగు చదవడమే కాక కవితాధోరణులు అలవడ్డాయి.

వృత్తిరీత్యా కూడ ఎదగడానికి ఎంతో సహకరించింది.

రిటైరైనాక నాన్నగారు భద్రాద్రి సీతాపతి శతకం, మారుతి శతకం వ్రాసారు. మా నాన్నగారి ప్రోత్సాహంతో సప్తగిరి టి.విలో పద్యాల అంత్యాక్షరి - పద్యాల తోరణంలో అమ్మ పాల్గొని ప్రథమ బహుమతి గెలుచుకుంది. తన ప్రథమ సంపాదన అని గర్వంగా చెపుతుంది. ఇక ఇంకా భక్తి టి.విలో తరతరాల తెలుగు పద్యం పోటీకి వరసలో ఉంది.

మా నలుగురి పిల్లలకి మాత్రమే కాక మా పిల్లలకి కూడ ఏది సాధించాలన్నా వయసేమి అడ్డం కాదని, వృద్ధాప్యంలో హాబీలుండాలని వారిద్దరు స్ఫూర్తి కలిగిస్తున్నారు. ఇక ఇప్పుడు కాలనీలో లలిత విష్ణు సహస్రనామ పూజలలో, వ్రతాలలో ముఖ్యపాత్ర వహిస్తూ ఉంటుంది.

నాకు మంచి కవితలు చదివి స్పందించినపుడు భక్తి విషయాలు ఆస్వాదించినపుడు నన్ను పెంచిన తలితండ్రులని తలుచుకుని గర్వపడతాను ఎందుకంటే వారి పెంపకం వలనే నాకీ అదృష్టం కలిగిందని భావిస్తాను.

ఇటీవల శ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారు సిడ్నీ వచ్చినపుడు లలిత వైభవం ప్రస్తావిస్తూ అమ్మ గురించి చెప్పారు. అమ్మ అంటే "ఒక చీర కట్టుకున్న ఆడది" అని ఎంతమంది అంగీకరిస్తారు అనడిగారు. అమ్మ వివిధ రూపాలు లలన, ప్రేమతో కడుపునిండా భోజనం పెట్టేటపుడు, ప్రోత్సాహంతో మెచ్చుకునేటపుడు, బాధను పంచుకునేటపుడు, చెడు పనులు చేసినపుడు కోపగించుకునేటపుడు, ఇంటికిరానివారికోసం ఎదురుచూసేటపుడు, బేలగా మాట్లాడేటపుడు, విడమర్చి చెప్పారు. ఇవన్నీ అమ్మరూపాలుగా అనుభవంలోకి రాని వ్యక్తి ఎవరూ ఉండరని నేను నమ్ముతాను. ఆయన చెప్పిన ప్రవచనాలు విని ఆస్వాదించగలిగినపుడు నా అనుభూతి వర్ణనాతీతం. వారిపై చిన్న కవిత వ్రాసి అందరితో పంచుకోకుండా ఉండలేకపోయాను. అదే సందర్భంలో నిజంగా ఇలాటి అనుభూతి కలగడానికి కారణం నా కుటుంబమే అనిపించి వెంటనే అమ్మ నాన్నకి ఫోన్ చేసి చెప్పాను.

ప్రేమ ఆప్యాయతలు పంచిపెట్టి
మంచి చెడులు వివరించి
అవకాశాలు అందించి
జీవన విలువలు బోధించి
బలహీనతలు భరించి
బాధ్యతలను వరించి
మంచి తోడు వెదికిచ్చి
సహకారం మాకిచ్చి ప్రగతి సాధనకు వయసేమి అడ్డం కాదని
నిరూపించిన పద్యధారణ ద్వయాలు అమ్మా నాన్నలు.
ఏభై వసంతాలు వివాహమహోత్సవం
ఇటీవలే జరుపుకున్న అమ్మా నాన్నలకి
శుభాభినందనలు

స్ఫూర్తి కలిగించే ఈ శీర్షికలో పాలుపంచుకునే అవకాశం నాకిచ్చిన కిరణ్‌ప్రభ గారికి కృతజ్ఞతలు.



విజయగారు గత పదిహేడేళ్ళుగా సిడ్నీలో భర్త శివప్రసాద్, పిల్లలు శరత్, సంజయ్ లతో నివాసం. చదివింది సైన్సు బి.యి.డి., తెలుగులో డిగ్రీ. చేసేది గవర్నమెంటాఫీసులో ఉద్యోగం. అడపాదడపా సిడ్నీ పత్రిక వాహినిలో రచనలు ప్రచురితమౌతుంటాయి.

# ఆనందరావు పట్నాయక్

**మాది మధ్యతరగతి** కుటుంబం. పదిమంది పిల్లలం, అమ్మా, నాన్న, అమ్మమ్మ ఉండే పెద్ద ఫ్యామిలి. కలిమి పోయింది - లేమిని చవి చూసాం. నా నిఘంటువులో ఆకలి, అనిద్ర సర్వసాధారణమైన విషయాలు. దరిద్రాన్ని మించి దరిద్రం లేదు. అయితే వీటన్నిటికి అతీతంగా ఉండేది ఒకటుండేది. అరుదుగా ఉండేది ఒకటుండేది. అదే మా అమ్మ ప్రేమ. అరుదుగా పూసే సంపెంగపూవులాంటిది ఆ ప్రేమ. పువ్వు మనకు కనిపించకపోవచ్చు. దాని సౌరభం ఎక్కడ ఉన్నా మనల్ని తట్టి పలకరిస్తూనే ఉంటుంది.



ఆరు దశాబ్దాల క్రితం ఒరిస్సా రాష్ట్రం రాయగడలో పుట్టిన నాకు నామకరణం జరిగింది. దేవుళ్ళ పేరు పెట్టమని అమ్మమ్మ, తాతగారి పేరు పెట్టమని నాన్నగారు, ఇంకా ఇలా ఏవేవో పేర్లు పెట్టమని స్నేహితులు సలహా ఇచ్చారు. నవీనత, నాగరికత ఉండే పేరు నా కొడుక్కి పెడతానని అంది మా అమ్మ అమ్మాజమ్మ. ఆ రోజుల్లోనే పెద్దలని ఎదిరించిన వీర వనిత మా అమ్మ - ఆమెకు నా జోహార్లు. ఆస్తులు, అంతస్తులు, వారసత్వంగా రాలేదు కాని ధైర్యసాహసాలు నా కబ్బాయి.

అప్పట్లో ఆంధ్ర పత్రిక, చందమామ లాంటి పత్రికలు ఇంటికి వచ్చేవి. పావలా ఉండేది పత్రిక. అవి చదివి వాటిలోని కథలు చెప్పేది మా అమ్మ. అప్పుడు ఆమె పెట్టిన భిక్ష నేడు నాకు శ్రీరామ రక్షయింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నా కథలకు బహుమతులు రావడం ఆ అమృతమూర్తి ఘనత మాత్రమే. అందుకే అందెశ్రీ అంటాడు.

కొమ్మ చెక్కితే బొమ్మరా.. కొలిచి మొక్కితే అమ్మరా

ఆడికే పాదురా.. కాదంటే ఏదీ లేదురా

మా నాన్నగారు చెయిన్ స్మోకరు. చుట్ట, బీడి, సిగరెట్టు.. ప్రాణాలకు అవి గొడ్డలిపెట్టు అనేది అమ్మ. ఇప్పటికీ మా తరం, మా తరువాతి తరం పొగత్రాగం 'పొగ తాగితే పోయేదేముంది, ప్రాణం తప్ప'. నా చిన్నప్పుడు తలనొప్పి వస్తే శొంఠికొమ్ము అరగదీసి ఆ గంధం తలకు పట్టించి వేడి టీ ఇచ్చి కళ్ళుమూసుకుని తాగేయ్ నాన్నా! తగ్గిపోతుంది' అనేది. గుండె భగ్గుమనేది. అందులోని అల్లం ఘాటుకి తలనొప్పి మాయం. అప్పటి నుండి ఇప్పటివరకు మందులు మాకు తెలియవు. ఆపరేషన్స్ అయినప్పుడు తప్ప. 'చల్లగా ఒడినిండి తల్లివైనపుడు నిదురన్న మాటే నినుజేరారాదు' అంటూ కవితాత్మకంగా చెప్పాడో కవి. అలాగని అమ్మ విసుక్కోదు, కసురుకోదు అని అనుకోనక్కరలేదు. ఆ విసుర్లూ, కసుర్లూ కూడా కమ్మగానే ఉంటాయి.



నాన్న పెద్ద మనుషుల్తో సీరియస్ విషయాలు మాట్లాడుతున్నారు. పిల్లలు ముగ్గురమూ అక్కడే కూర్చుని ఆడుకుంటున్నాం. అమ్మ వంటింట్లో పని చేసుకుంటోంది. పిల్లలం అల్లరి చేయకుండా బుద్ధిగా ఆడుకుంటున్నాం 'మీ పిల్లలు చాలా బుద్ధిమంతుల్లా ఉన్నారే. అసలు అల్లరి చేయడం లేదు' అన్నారు పెద్ద మనుషులలో ఒకరు.

'అవునండీ, మా పెద్ద వాడికి (అంటే నేను) ఒకసారి చెబితే చాలు. అర్థమౌతుంది అల్లరి చేయడు. రెండోవాడికి రెండుసార్లు చెప్పాల్సి ఉంటుంది. ఇహ మూడోవాడి సంగతి.. ' అంటున్న ఆయన మాటలకు వంటింట్లో నుంచే ఆవిడ అడ్డుపడింది.

'వాడి సంగతేం అడుగుతార్లెండి. అచ్చు వాళ్ళ నాన్న పోలిక ఎన్నిసార్లు చెప్పినా అర్థంకాదు. వాడి ధోరణి వాడిది. ఎవరు చెప్పినా వినిపించుకునేది లేదు..' అంది. ఆ మాటలకు మొదట్లో కోపం తెప్పించినా తర్వాత అందరూ నవ్వేశారు పెద్ద మనుషులతో సహా. పదమూడేళ్ళకే పెళ్ళాడి వెళ్ళిపోయింది మా అక్కయ్య. మరో ఆడపిల్ల పుడుతుందేమోనని వరుసగా పదిమంది మగపిల్లల్ని కన్నది మా సంతాన లక్ష్మి.

'మగబిడ్డ కలిగెనని మురిసిపోబోకు

కోడలా వచ్చెనంటే వేసెను గోడకుర్చీలు నీకు' అని హాస్యం పట్టించేవారు అమ్మలక్కలు. పదిమంది మగపిల్లలలో ఏడుగురం బతికి ఉన్నాం. ఏడుగురు కోడళ్ళకి అమ్మమాటలే

ఒంటికి పసుపు రాసుకుని, నుదుట ఇంత బొట్టు పెట్టుకుని ముక్కుపుడుక, దుద్దులు, మెడలో పలకల సేర్లు వేసుకుని అమ్మ వెళుతుంటే మా ఇంటి లచ్చిమి లాగ ఉండేది ఆమె. వి.కె.పాణి గారి అన్న అవినీతి ఆఫీసర్ మీద నేను పోరు సలిపితే నన్ను కేసుల్లో ఇరికించాడు ఆ నీచమానవుడు. ఆ రెండేళ్ళు నాకు మానసిక స్థైర్యాన్ని ఇచ్చిన మరో మహిళ నా మాతృమూర్తి.

పుణ్యక్షేత్రాలు దర్శించడం, బీదాబిక్కిని ఆదుకోవడం మా అమ్మకు ఇష్టమైన పనులు. ఎక్కడి నుంచి ఆ సువాసన వస్తుందో తెలియక అడవంతా వెతుకుతుందట కస్తూరి మృగం. ఆ పరిమళం తనదేనని తెలుసుకోలేక పోతుంది. మేం అంతే, ఈనాడు మేమంతా

పిల్లా పాపతో పచ్చగా ఉన్నామంటే అమ్మ చేసిన పూజాఫలాలేకదూ! పంచే కొద్దీ తరిగేది డబ్బు, పంచేకొద్దీ పెరిగేది విద్య అనేది మాకు నేర్పింది అమ్మే.

తేదీ ఇరవై ఎనిమిది, మార్చి, 2004 మా జీవితాల్లో బ్లాక్ డే ఏక్సిడెంటులో అమ్మ, నాన్నను వెతుక్కుంటూ పోయింది. అమ్మా! నీ జ్ఞాపకాలు బాధించవు, నన్ను బతికిస్తాయి. 'ఏరు పారినా పోదు, ఏటి మీది ఇసుక తలుచుకున్న పోదు తల్లిపై మరులు..' అంటూ హృద్యంగా చెప్పారో జానపదగీతం



ఆంగ్లభాషలో కొన్ని లక్షల పదాలున్నాయి. అయితే అన్నిటికన్నా 'అమ్మ' అని అర్థం వచ్చే 'మదర్' అన్న మాటే అత్యంత సుందరమైనదని ఓ సర్వేలో తేలింది. మానవ సంబంధాలను తెలిపే మాటల్లో 'అమ్మ' ఒక్కటే వారు సేకరించిన 70 పదాల్లో చోటు చేసుకోవటం, అది మొదటి స్థానంలో ఉండడం నిర్వాహకులకు ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కలిగించింది. తండ్రి అని అర్థం వచ్చే 'ఫాదర్' అన్న మాటకి అసలు స్థానమే లభించకపోవటం గమనించడం విశేషం.

# శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

**" నగాధిరాజః , హిమాలయోనామః , పృథివ్యాః, మానదండః ఇవ స్థితః, .."**

చదువుతున్న సంస్కృతం మేష్టారికి ఆనందంతో కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి, అక్షరాలు మసకగా కనిపిస్తున్నాయి. . ఇంక ఆగలేక ప్రధానోపాధ్యాయుల గదికి పరుగు పరుగున వెళ్ళారు, ఆ ఆన్సరుపేపరు పుచ్చుకుని. **"సంస్కృత పద్యాన్ని ఇంత చక్కగా అర్థవంతంగా విడమరచి రాసిన ఆ పిల్లని అభినందించాలో, నేర్పిన మిమ్మల్ని మెచ్చుకోవాలో తెలియటంలేదు . అయినా అందరూ కేవలం తెలుగులో తాత్పర్యం రాసేసి చేతులుదులిపేసుకుని పూర్తి మార్కులు పుచ్చేసుకుంటుంటే, ఈ పిల్ల చూడండి, ఎంత కుదురుగా, సంస్కృతంలోనే భావాన్ని చెప్పడానికి ప్రయత్నించిందో.. భలే, రేపు ఓ సారి కృష్ణమూర్తిగారిని స్కూలుకి రమ్మని కబురుపెట్టండి, అప్పుడే ఆ పిల్లకేమీ చెప్పకండి.."** అన్నారు ప్రధానోపాధ్యాయులు గారు. ఏనుగునెక్కినంత సంబరంతో స్టాఫు రూముకి వెళిపోయారు సంస్కృతం మేష్టారు.

" నాన్నా, ఇవాళ మిమ్మల్ని స్కూలుకి రమ్మన్నారు మా సంస్కృతం మేష్టారు.." చెప్పింది బాల.

" ఇవాళ వీలుపడదేమోనే అమ్మలూ, అయినా ఏవిటిట సంగతి? " అడిగారు కృష్ణమూర్తిగారు. "తెలీదు నాన్నా, ఏమీ చెప్పలేదు, వీలైతే మీ నాన్నగారిని ఓ మాటు తీసుకురా రేపు అన్నారంతే.." అంది బాల.

"సరేలే..మధ్యాన్నం వచ్చి కలుస్తాను.." సైకిలెక్కేసి వెళ్ళిపోయారు.



వచ్చి కలిసారు, అన్నట్టుగానే. ఆ విషయం బాలకి తెలీదు. రాత్రి భోయనాలయ్యాకా, నాన్నకి మజ్జిగ కలుపుతోంది బాల. వెనకాలేవచ్చిన నాన్న అడిగారు, "అమ్మలూ, సంస్కృతం పేపరు బాగా రాసావుటగా, మీ మేష్టారు చాలా ముచ్చట పడ్డారు పేపరు చూపించి. ఇల్లాగే బాగా చదువుకోతల్లీ.." అంటూ నెత్తిమీద చెయ్యివేసి నిమిరారు.

"నాన్నా, నేను సంస్కృతం నేర్చుకోనా?" అడిగింది బాల. అప్పట్లో సంస్కృతం పాఠ్యాంశంగా నేర్చుకోవడమే తప్ప విడిగా పరీక్షలు కట్టడం వంటివి అంత ప్రచారంలోకి రాలేదు. అందుకే బాల చేత దక్షిణ భారత హిందీ ప్రచార సమితివాళ్ళ హిందీ పరీక్షలకి కట్టించారు కృష్ణమూర్తి గారు. భాషవేరైనా లిపి సుమారుగా ఒక్కటే, అని సరిపెట్టుకుంది బాల. అది బాల చేసుకున్న మొదటి కాంప్రమైజేమో అని నాకనిపిస్తుంది.

"ఒరేయ్ సుబ్బారావన్నయ్యా, ఇంక నీ కుళ్ళు సాక్సులు ఉతకటం నావల్లకాదు, రేపట్నించీ నువ్వే ఉతుక్కో.." అనేది బాల.

" చచ్చుపిల్లా, నీకు హిందీ పాఠం చెప్పనంతే, ఈ సారి ప్రాథమిక గుడ్డెక్కేస్తుంది.."
అనేవాడు సుబ్బారావన్నయ్య.

సుబ్బారావన్నయ్య ఎన్.సీ.సీ లో ఉండేవాడు. బేడ్మింటన్ ఆడేవాడు. కాస్త హిందీ తడువుకుంటూ చదివివేవాడు. అతని హిందీ పాఠం వింటే హిందీ పండిట్లంతా ఉపవాసాలుండాల్సిందే

"యే క్యా హై?"
" యే గుర్రం హై"
"మై గుర్రం ఎక్కాన్ హై..."

ఇల్లా బాలని ఉడికిస్తూ, ఏడిపిస్తూ, వచ్చీరాని పాఠం చెప్పేవాడు. ఇంకవిసుగొచ్చి, బాలే కష్టపడి, నేర్చుకుని రాష్ట్ర పరీక్ష కూడా పాసయ్యింది. వీణ నేర్చుకుంటానంది. ఇంట్లో వున్న ఫిడేలు నేర్చుకోమన్నారు, కాంతాలత్తయ్య ఇంట్లో భజనలు పాడేప్పుడు పనికొస్తుందని. పెద్దన్నయ్య (అబ్బాయి) ఒక ఫొటో కూడా తీసేసాడు ఫిడేలు, కమాను చేతిలో పెట్టి. అయినా ఎందుకో ఆ ఫిడేలు నాదంలో పలికే విషాదఛ్ఛాయలు బాలకి నచ్చలేదు. నేర్చుకుందామనుకున్నా, మేష్టారు రెండుక్లాసులు చెప్పేసరికి ఆయనకి మరో ఊరు బదిలీ అయిపోయింది. బాల సంగీతం ఆగిపోయింది. అప్పుడు తీసిన ఫొటో పెళ్ళిఫొటో అయిపోయింది. అమలాపురం సోమయాజులు మావయ్య గారి అరుగుమీద నించుని, దూరంగా సైకిలెక్కి బజారెళ్ళే కుర్రాణ్ణి చూపించి, **"ఆయనేనమ్మా.."** అన్నారు కృష్ణమూర్తిగారు. పెళ్ళికుదిరింది. బాల తనకి తెలియకుండానే ప్రౌఢ అయిపోయింది. చలాకీతనం కాస్త తగ్గింది. పెద్దకుటుంబంలోకి పంపిస్తున్నానన్న తృప్తి కృష్ణమూర్తిగారిది. నాన్నని వదిలివెళ్ళాలన్న బెంగ బాలది. **" మన హైస్కూలు దగ్గర బస్సెక్కితే, మీ వూరి బస్టాండుకి సరిగ్గా గెంట. అక్కడ్నించి రిక్షా చేసుకుంటే మీయింటికి మరో పావుగెంట. దీనికింత బెంగెందుకే అమ్మడూ.."** అన్నారు కృష్ణమూర్తిగారు. కానీ ఆ గెంటంపావు లెఖ్ఖ ఎంత తప్పో పెళ్ళయ్యాకా తెలిసింది బాలకి. పెళ్ళాయ్యాకా దూరాన్ని గెంటలలోనో, కిలోమీటర్లలోనో కొలవకూడదు, **"సందర్భాలలో"** కొలవాలి. తండ్రి బిడ్డని చూడాలంటే సందర్భం కావాలి, బిడ్డ పుట్టింటి కెళ్ళాలంటే సందర్భం కావాలి, పెళ్ళైన అందరు ఆడపిల్లలదీ ఇదే కథ అప్పట్లో. సరే, ఓ ఏడాదికి ఆ సందర్భం రానే వచ్చింది మళ్ళీపుట్టిన మాతాతగారు రామభద్రుడిగారి రూపేణా. బాల అమ్మ అయ్యింది. మరో రెండేళ్ళకి నాకు కూడా అమ్మ అయ్యింది.

నాన్నగారి నైట్ కాలేజీ చదువు పూర్తయ్యి ఉద్యోగం వచ్చింది.వారవంతా బైటఊళ్ళలో ఉద్యోగం. శని ఆదివారాలు ఇంటికి రావడం. ఇంట్లో మా నానమ్మకి అమ్మఉండేవారు. ఇంటినిండా వచ్చేపోయే చుట్టాలు. చేబదుళ్ళకోసం వచ్చే అద్దెవాటాల్లో ఉండే అద్దె అత్తలూ, పిన్నిగార్లూ, మామ్మలూ, అరవ మామీలు . ఒక్క జీతంతో ఎల్లాకాలక్షేపం చేసుకొచ్చేదో దేవుడికే ఎరుక. చిన్నప్పుడు అన్నకి బాగా దగ్గు వచ్చేది. ఒక్కోసారి జ్వరం కూడా వచ్చేసేది. నోరూరుకోని చుట్టాలు "వీడు బతికి బట్టకట్టడం మనం చూస్తామా..?" అని అంటూ ఉంటే, తనలో తను బాధపడేదే తప్ప వాళ్ళని పల్లెత్తు మాట అనేది కాదు. రాత్రిళ్ళు అన్నకి ఆయుర్వేదం మందువేసి, గుండెలకి అమృతాంజనం రాసి, వాడు పడుకున్నాకా వాడి చెయ్యిపట్టుకుని, పక్కనేకూర్చుని **"నీకేవీ కాదు నాన్నా. . నాకు తెలుసు, నువ్వు పెద్దమావయ్యంతబాగా చదువుకుంటావు, గొప్పవాడివౌతావు, బంగారుతండ్రివి.."** అని తను నిద్రపోకుండా పక్కనే కూర్చునేది పడుకున్న అన్నకేసే చూస్తూ. నాకు నిద్రలో మెలకువ వచ్చి ఇదంతా చూస్తూ.. మెల్లిగా అమ్మవొళ్ళోకి పాక్కుంటూ వెళ్ళి పడుక్కునేవాణ్ణి. కుడిచేత్తో నాతల నిమురుతూ, ఎడంచేత్తో అన్న చెయ్యి పట్టుకుంటూ, అలా అమ్మ ఎప్పుడు పడుక్కునేదో. పొద్దున్నే మళ్ళీ మేం లేచేవేళకి పూజకూడా పూర్తిచేసుకుని ఉండేది. నిజంగానే అమ్మకి మంత్రాలొచ్చనిపించేది అప్పుడు.

జ్వరమొచ్చినా, జల ప్రళయమొచ్చినా స్కూలు మానేవాడు కాదు అన్న. ఎల్లుండి తుమ్మొస్తుందంటే ఇవాళ స్కూలు మానేసే రకాన్ని నేను . మాయిద్దరినీ సంభాళించుకుని, వాణ్ణి ఎత్తుకుని నన్ను పట్టుకుని చెరువుగట్టమ్మట్ట వెళ్ళి, శిశువిహార్ లో దింపివచ్చిన రోజులు ఇప్పటికీ కళ్ళముందు కదులుతున్నాయి. హైస్కూల్లో పరీక్షలప్పుడు, మండుటెండలో, రెండుమైళ్ళు నడిచొచ్చి, ఫ్లాస్కులో హార్లిక్సూ, చేతిలో లంచి బాక్సూ పుచ్చుకుని పొద్దుటి పరీక్ష అయ్యేదాకా ఉండి, భోజనం తినిపించి, పాలు తాగించి, మధ్యాహ్నం పరీక్షకి మమ్మల్ని మానసికంగా ప్రిపేర్ చేసి, మాకు ఉత్సాహం కలిగించి, పరీక్షహాల్లోకి పంపి, మళ్ళీ రెండుమైళ్ళు నడిచి ఇంటికెళ్ళి అప్పుడు అన్నంతినేది. ఏ తల్లి చేస్తుంది ? సహనానికీ, ఓర్పుకీ పెట్టింది పేరుగా భూమాతని చెబుతారు, కానీ నేనొప్పుకోను.

నాన్నగారితో పాటు అన్ని వూళ్ళకీ వెడితే మా చదువులు పాడవుతాయని చెప్పి అమలాపురంలోనే ఉండిపోయింది. చింతలూరు ఆయుర్వేదం మందు గురించి తెలుసుకుని నాన్నగారిచేత తెప్పించుకుంది. అన్నకి శ్రద్ధగా , వేళతప్పకుండా ఇచ్చేది. మరి మూడేళ్ళకి అన్న దగ్గు

ఆగిపోయింది. ఆరోగ్యం కుదుటపడింది. అమ్మ సంతోషానికి అవధులు లేవు.

కొన్నేళ్ళకి తమ్ముడు పుట్టాడు. అంతకు ముందే వెళ్ళిపోయిన తాతగారి జ్ఞాపకంగా వాడికి కృష్ణుడని పేరుపెట్టుకుంది. నాన్నగారు మా చదువులకోసం మా భవిష్యత్తుకోసం కోసం, తన సీనియారిటీని వదిలేసుకుని హైదరాబాదొచ్చేసి, మళ్ళీ మొదటిగడిలోంచి కెరీరు మొదలుపెట్టాకా, కేవలం రెండుగదుల్లో ఆరేళ్ళు నడుపుకొచ్చింది. ఏరోజూ మాకు తిండికీ, గుడ్డకీ లోటులేదు. అసలు దేనికీ లోటు లేదు. చింతలూ, కష్టాలూ వాళ్ళు దాచుకుని మాకు కేవలం **చదువు, ఆటలు, అల్లరీ..** ఇదే జీవితమేమో అనిపించేట్లుగా పెంచారు మా అమ్మానాన్నా.

అన్న ఒక్క అంగలో రెండు మెట్లెక్కేస్తున్నాడు చదువులో. పడుతూ లేస్తూ వాణ్ణి అనుసరిస్తున్నాను నేను. తమ్ముడి కోసం ఆల్‌రెడీ ఒక రోల్ మోడలూ, ఒక రోల్డుగోల్డు మోడలూ సిద్ధంగా ఉన్నాయి. నాకు తెలిసి అమ్మకి ఎప్పుడూ జ్వరం రాలేదు. కనీసం జలుబు కూడా వచ్చినట్లు నాకు గుర్తులేదు.కానీ ఇప్పుడాలోచిస్తే అనిపిస్తుంది, జ్వరం వచ్చినా, ఏ కష్టం వొచ్చినా మాకు తెలియనియ్యలేదని. పదోతరగతిలో నాకు ఏంచేసుకోవాలో తెలియనన్ని మార్కులొచ్చేసరికి అమ్మ ఆనందం వర్ణనాతీతం. పుట్టి బుద్ధెరిగాకా, నా చదువుల విషయమ్మై స్వీట్లు పంచడం అదే మొదటిసారి. పిల్లలు దారిలోపడితే తల్లిదండ్రులు ఎంత సంతోషిస్తారో ఆరోజు నేను ప్రత్యక్షంగా చూసాను.

ఆనక సొంతిల్లు కట్టుకుని అక్కడికి మారాం. బాలకాస్తా బాలమ్మగా మారిపోయింది చుట్టాలందరికీ. పూలంటే ప్రాణం అమ్మకి. అమలాపురంలో మల్లెతోట, బంతి తోట పెంచేది. హైదరాబాదొచ్చాకా, సన్నజాజీ, విరజాజీ పందిళ్ళు వేసింది. లిల్లీలు, మల్లెలు, డిసెంబరాలు, కనకాంబరాలు, ఎన్నో. అలా మాకు ప్రకృతిని ప్రేమించటం నేర్పింది, మాలో సున్నితత్వానికీ, సృజనకీ పాదుపెట్టి పందిళ్ళువేసింది. చదువులు పూర్తయ్యి మేము దేశాలనేలడం మొదలెట్టాకా, మా పెళ్ళిళ్ళు చేసింది. వద్దన్నా ఇప్పటికీ ఆవకాయలూ, పిండి వడియాలూ పెడుతూనే ఉంటుంది.

మాకు చదువు నేర్పింది, ఆటుపోట్లకి తట్టుకునే ఆత్మస్థైర్యం నేర్పింది. గెలవడం నేర్పింది, సాటిమనిషికి సాయం చెయ్యడం నేర్పింది, సంస్కారం నేర్పింది. ఉన్నంతలో తృప్తిగా బతకడం నేర్పింది.. ఇన్ని నేర్పిన అమ్మకి ఏమిచ్చాను ?నాతో నీరసవొచ్చేదాకా అరిచీ, అరిచీ హోంవర్కులుచేయించీ, పాఠాలు నేర్పించిన అమ్మకి , నా చదువుపూర్తయేసరికి నేనిచ్చిన బహుమానం - **హై బీ.పీ,** చదువులకనీ, పెళ్ళిళ్ళకనీ తిప్పీ, తిప్పీ రప్పించిన **మోకాళ్ళ నొప్పులూ.** అందుకే అనిపిస్తుంది, ఈ సృష్టిలో న్యాయం లేదని.

**రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గారి భార్య** అంటారు కొందరు, **బాలమ్మ** అంటారు చుట్టాలు, **అమ్మా** అంటాం మేము, **నానమ్మా** అంటున్నారు మనవలూ, మనవరాళ్ళూ , **ఏమే..**అంటారు నాన్న ఎప్పటిలాగే.

ఎవరేవన్నా, నేను మాత్రం ఇప్పుడు నేను చూస్తున్న మా అమ్మలో, అప్పుడెప్పుడో నేను పుట్టకముందే ఉన్న **ధవళేశ్వరం బాలని,** మా తాతగారి **"అమ్మలు"**ని ఊహించడానికి ప్రయత్నిస్తాను, ఆ ఏకాగ్రత, చదువుమీద ఆసక్తి, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనే మనస్థైర్యం, ఆత్మగౌరవం, సేవాభావం, ఆ ఆప్యాయతా, ఆ ఓరిమీ, సహనం - అన్నీ తలుచుకుంటే అనిపిస్తుంది,

మా అమ్మలాంటివాళ్ళు పుట్టాలంటే ఉపాసన చెయ్యాలి, మాతాతగారు చేసారట,

అందుకనే మా అమ్మ నిజంగా **బాలాత్రిపురసుందరి.**

# స్వర్ణబాల గంటి



**"సమర్థ్, మాతృదేవోభవ** శీర్షికకి అమ్మమ్మ గురించి వ్రాయాలిరా" అన్నాను మా అబ్బాయితో.

"అమ్మో నీ వల్ల అయ్యే పనేనా!! అయినా ఒక పుస్తకం తయారవుతుంది, వాళ్ళంత వేస్తారేంటీ!!" అంటూ కొంటెగా కళ్ళెగరేసాడు. నా కూతురేమో "అయ్యబాబోయ్! నువ్వెక్కడ రాయగలవ్, చాలా టఫ్ మామ్" అనేసింది. వాళ్ళకి వాళ్ళ అమ్మమ్మ ఓ ఐకానిక్ ఫిగర్ మరి. అమెరికాలోని మా చెల్లెలు మాత్రం "బావుంటుంది. అమ్మ మొక్కలు పెంచటం, సెల్ఫ్‌లెస్‌గా సర్వీస్ చేయటం, సంగీత పాఠాలూ, యోగా విశేషాలు టైప్ క్లాసులూలాటివన్నీ మళ్ళీ గుర్తు చేసుకోవచ్చును" అంది ఉత్సాహంగా.

మా ఆయన మాత్రం "ప్రయత్నం చెయ్యి, అయినా క్లుప్తంగా వ్రాయటం మన వల్ల కాదుకదా!" అంటూ నన్ను ఎగతాళి పట్టించారు. దాంతో చాలా బింకంగా మొదలెట్టాను. గతంలో నేను జపాన్‌లో ఉండగా "ఓషిన్" అనే సీరియల్ చూసి, ప్రభావితమై ఆ కాసెట్‌తో రాసిన పేపర్లు తీసాను. అందులో అమ్మమ్మ, తన మనవడికి తన జీవితం ఫ్లాష్‌బాక్‌లో అప్పటి ఆచార వ్యవహారాలూ, సామాజిక ప్రజాభిప్రాయాలూ, కట్టుబాట్లు మొదలగు విశేషాలు చెబుతుంది. అది చదువుతుంటే ఓ దిశానిర్దేశం ఏర్పడి మొదలెట్టాను, మరి చూద్దాం, ఎలా వస్తుందో!!

అమ్మ గురించి వ్రాయమంటే మాటలా, ఎంతో, మరెంతో ఉంది. ఏమిరాయాలో, ఎలా రాయాలో, ఎక్కడ మొదలెట్టాలో కూడా తెలీటం లేదు. అయితే అతిశయోక్తి కాని ఒక విశేషం ఏమిటంటే - అంత ధైర్యంగా, అంతటి ఆత్మ విశ్వాసంతో, ఏదీ లెక్క చేయకుండా ఒడుదుడుకులు దాటుతూ సముద్రపుటలల్లాటి జీవితపు పరిమాణాల్ని మలుచుకుంటూ అకుంఠిత దీక్షతో ఒడ్డుకు చేరుకున్న ఆనాటి కొందరిలో ఒకరు మా అమ్మ.



అమ్మ పుట్టింది స్వాతంత్ర్యానికి ముందు. అప్పుడు స్త్రీలకు బాల్య వివాహాలూ, విద్యాబుద్దులు చెప్పించకపోవటం, ఘోషాల్లాంటి పరిస్థితులు గోదావరి లోని "ఆరుగొలను" అనే ఊళ్ళో కరణంగారి ఐదవ కుమార్తెగా

పుట్టింది - ఇద్దరు అన్నలు, నలుగురు అక్కలు, నలుగురు చెల్లెళ్ళ మధ్యన. ఆమె మూడవ ఏట, ఆమె పెదతల్లిగారైన "పూళ్ళ సుందరమ్మగారు" తనకు పిల్లలు లేనందున ఎండాకాలం సెలవుల్లో పిల్లలందరూ కూర్చుని పద్యాలు, శతకాలు వల్లెవేస్తుంటే పోటీలు పడుతున్న వేళ "నాతో ఎవరొస్తారు? సంగీతం చెప్పిస్తాను, బాగా చదువు చెప్పించి, కాలేజీలో జేరుస్తాను, చక్కగా చూసుకుంటాను" అన్నదట.

అందరిలోకీ చలాకీగా ఉండి, బొద్దుగా, తెల్లగా ఉండే మా అమ్మ "మంగమాంబ" ముందుగా చేయి ఎత్తిందట "నేను" అంటూ. అంతే .... మా తాతగారికి, అమ్మమ్మకి గుండె జారిందట. సరే పంపక తప్పింది కాదు, అది వేరే సమస్య.

అలా చెప్పి తీసుకెళ్ళిన అమ్మమ్మ ఒక పట్టాన వదలక, నదరక, బెదరక తన వాగ్దానాన్ని పూర్తి చేసుకున్న ధీరవనిత చదువుకోవాలన్న తన కోరికని ఈ విధంగా అమ్మద్వారా తీర్చుకుని అమ్మ 5వ ఏట వాళ్ళ ఊరుకి గాంధీగారు వస్తున్నారని పిల్లలందరి చేతా పాటలు పాడిస్తూ ఊరంతా తిప్పారంట. అప్పటికి సంగీతం - అద్దెకున్న మాష్టారు వద్దా, అమ్మమ్మ వద్ద నేర్చుకుందేమో, వరుసలో ముందుండి పాడిందట.

"నూలు వడికే విధము తెలియండీ జనులారా

మీరా విధము తెలుసుకు లాభమొందండీ" అనే పాట

"మా కొద్దీ తెల్ల దొరతనమూ....." అంటూ మరోపాట

"కొల్లాయి గట్టితేనేమీ మా గాంధి కోమటై

పుట్టితే నేమీ...." అంటూ ఇలా ఎన్నో మరెన్నో పాటలు పాడుతూ లీడ్ చేసిందట అమ్మ. అమ్మమ్మ వద్ద తరిగొండ వెంగమాంబ రచనల్లోని ఎన్నో గీతాలూ, ఆమె జీవితచరిత్ర, ఆధ్యాత్మిక రామాయణ కీర్తనలూ, అన్నమయ్య, త్యాగయ్య, కీర్తనలూ నేర్చుకుందట. మంచం దిగితే కాళ్ళకి మట్టి అవుతుందని పాలేరు ఎత్తుకుని తిప్పేవాడట. వెన్నముద్దలు, ఆవుపాలులాటివి తినిపిస్తూ, సున్నిపిండితో స్నానాలు చేయిస్తూ అల్లారు ముద్దుగా పెంచిందట అమ్మమ్మ.

"పూళ్ళ"లోని స్కూల్లో అయిదవ తరగతివరకే కావటంతో చేసేది లేక అదే క్లాసు పుస్తకాలు పదే పదే చదువుకునేదట. 7 - 10 రికగ్నైజేషన్ కోసం డి.ఇ.వో గారు వస్తే తనే అన్నిప్రశ్నలకీ సమాధానాలు చెప్పిందట. పైట వేసిన ఆడపిల్లని బయటకి పంపని రోజులు, అయినా సరే పాలేరునిచ్చి పంపేదట అమ్మమ్మ.

హైస్కూల్ తర్వాత మంచి జమిందారీ సంబంధం తెచ్చారట తాతగారువాళ్ళు. అమ్మమ్మ అదిరించీ, బెదిరించీ "ఇందుకేనే పూళ్ళ తీసుకెళ్ళాను, వీల్లేదు, హైదరాబాదు వెళ్ళి చదువు చెప్పిస్తాను, కాలేజీలో వేస్తాను" అని తీసుకొచ్చేసిందట. హైదరాబాదులో "నిజామ్" పరిపాలన కదూ!! ఆంధ్రా రూపాయి మార్చితే సరుకులన్నీ కొనుక్కోగా తిరిగి రెండణాలు ఇచ్చేవారంట. అన్నీ ఎంతో చవగ్గా దొరికేవట, ముత్యాలతో సహా, మెడిసిన్‌లో సీటు వస్తే అన్నేళ్ళు చదివించలేను అందట అమ్మమ్మ. దాంతో B.Sc చేసి M.Sc లో జాయిన్ అయిందట. అప్పుడే పక్కన అద్దెకున్న బి.కాం, ఎల్.ఎల్.బి చేసిన గంటి శ్రీరామారావుతో పరిచయం, ప్రణయం, పెళ్ళి వెనువెంటనే జరిగిపోయాయట. కాపురం "ఊట్‌పల్లి" అనే ఊళ్ళో మా తాతగారు నిజామ్ షుగర్ ఫ్యాక్టరీలో ఆఫీసర్. అప్ప కూడా అక్కడే జాబ్‌లో జాయిన్ అయ్యారట. ఖాకీ చొక్కా వేసుకుని, చిన్న టిఫిన్ డబ్బాపట్టుకుని వెళ్ళేవారట. ఓ సంవత్సరం గడిచాక "ఇలా అయితే లాభం లేదు, మీరు ప్రాక్టీస్ పెట్టండి, నేను ఎమ్మెస్సి పూర్తి చేసి జాబ్‌లో జాయిన్ అవుతాను" అందట. అంతే నలుగురు బాబాయిలూ, ఇద్దరు అత్తలని తీసుకుని, అప్పుడు మేమిద్దరం హైదరాబాదులో, చిక్కడపల్లికి మకాం మార్చారంట.

"ఇంత తెలివైన వాళ్ళు కదా, వీళ్ళందరూ కూడా బాగా చదువుకుని సెటిల్ అవ్వాలి, మనకు లేని వసతులు కూడా వీళ్ళకి కల్పించాలి" అని అనుకుని మరుదులూ, ఆడపడుచులూ అనుకోకుండా తన తోబుట్టువులే అయినట్లుగా వాళ్ళకి వండి, వార్చటమే

కాకుండా సపర్యలు చేసి, చదువులు చెప్పి, పరీక్షలురాయించి, పదే పదే ప్రేరణ ఇస్తూ, చూసుకుందట. మరారోజుల్లో కట్టెల పొయ్యిలు, బొగ్గుపొయ్యిలూ, నూలు వస్త్రాలులాటివే కదా. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొందట. తనే కనుక "నేను, మా ఆయన, నా పిల్లలూ" అని అనుకుని ఉంటే వారికి ఇప్పుడింత చక్కని జీవితాలు ఉండకపోయేవేమో!! తెలీదు. ఇది మాత్రం ఖచ్చితంగా ఆమె సాధించిన గొప్ప ఘనతే మరి!!

"If a woman is educated, a family is educated" అనటానికి నిదర్శనం.

మా చిన్నతనంలో, 1996 - 76 మధ్యన మా మజలీలు ఫత్తర్ గట్టిలోని "చీకటించి"నుంచి, "సింహాలింటికి," అక్కడి నుంచి "తారాబాయి" ఇంటికి వచ్చేసరికి మేము నలుగురు, అమ్మ, అప్ప అయ్యాం. అక్కడి నుంచి మలక్ పేటలోని జడ్జెస్ కాలనీలోకి మారటం జరిగింది. అమ్మ అగర్వాల్ ఈవినింగ్ సైన్స్ కాలేజ్, ఉస్మానియా యూనివర్శిటీలో కెమిస్ట్రీ రీడర్‌గా పని చేసి, 1994లో రిటైర్ అయింది.

వాళ్ళంతా సెటిల్ అయ్యేసరికి మేము నలుగురం పెద్దవాళ్ళయ్యాం. అప్ప హైకోర్ట్‌లో ప్రాక్టీస్‌లో సెటిల్ అయ్యేవరకు కూడా అమ్మ ఎంతో సమర్ధవంతంగా ఇల్లు నడిపింది. విసుగూ విరామం లేకుండా వాళ్ళందరికీ కాదు మాకు కూడా భుజం తట్టి చక్కని చదువులు చెప్పించింది.

తెల్లవారు ఝామునే లేచి యోగా చేసి టైప్ క్లాసులకి వెళ్ళేవాళ్ళం. "చదువులు రాకపోతే కనీసం టైపిస్ట్‌లుగానైనా బ్రతవచ్చును" అంటూ మమ్మల్ని లేపేసేది. అమ్మ కోఠీలోని "గాంధీ జ్ఞానమందిర్" లో యోగా క్లాసులకి Minocha &family తో కలిసి వెళ్ళి నేర్చుకుని వచ్చింది. ఓ 7-8 ఏళ్ళు అందరినీ ఉదయాన్నే నాలిగింటికి లేపి మేడ మీద చేయించేది. పరగడుపున గోరువెచ్చని నీళ్ళల్లో నిమ్మరసం, ఉప్పువేసి, 2-3 గ్లాసులు త్రాగి మరీ చేసేవాళ్ళం, మినోఛాస్‌తో సహా. అప్పట్లో చాలా ఏళ్ళు అమ్మ అక్టోబర్ 2 నాడు గాంధీ జయింతికి ఉపవాసం చేసేది. ఆయన మీద గౌరవంతో, ఆ త్యాగానికి "మరేం ఇవ్వాలి తెలీదు" అనుకుంటూ.

మా చదువులతో పాటు తనూ B.Ed / M.Ed కూడా చేసింది నేను ఇంటర్ లో ఉండగా. గోల్డ్ మెడల్ వచ్చింది Science methodology for school children లో.

నాతో అంది "అప్పని, బాబుని నువ్వు చూసుకో; నేను చెల్లిని తీసుకుని ఆస్ట్రేలియా వెడతాను" అంటూ. నాకు కుక్కర్ పెట్టటం, వంట చేసుకుని ఇల్లు సర్దుకోవటంలాటివన్నీ నేర్పింది. వెళ్ళలేదనుకోండి. నేను M. Sc, తను Ph.D కెమిస్ట్రీ ఒకేసారి చేసాం. "నిరంతరా" డిపాజిట్‌లు వేసేది, నలుగురి పేరునా, నెలకి పదిరూపాయల చొప్పున. 1980 లో దాంతోనే "అంజంతా - ఎల్లోరా"లు చూసాం. అదొక్కటే మేము అందరం కలిసి వెళ్ళిన ట్రిప్.

మా కందరికీ కూడా హార్మోనియం మీద సంగీతం, గొంతెత్తి పాడటం నేర్పేది.

అమ్మమ్మకి గుండెపోటు వస్తే నిజామ్స్‌లో చికిత్సచేయించింది. ఆమె "ఏలూరుకే వెళ్ళిపోతాను" అంటే "నాకింత చేసింది, నేనే తనకేం చేయలేకపోయాను" అని ఎంతో బాధపడింది.



ఎప్పుడు కూడా అమ్మ తానొక్కతే బాగుండాలి అనుకోలేదు చాతనయిన సహాయం చేస్తూనే ఉండేది. వాళ్ళ చిన్న అక్కయ్య భర్త, కరణంగారు పోయినప్పుడు, వాళ్ళ ఊరు వెళ్ళి, నాలుగురోజులు ఉండి, మూడవ తరగతి మాత్రమే చదివిన ఆమెకి అక్షరాలు, అంకెలూ నేర్పి, ఆ ఊరివాళ్ళతో మాట్లాడి, పిల్లలు కూడా లేని ఆమెకి "పోస్ట్ ఆఫీస్" పని ఇప్పించి మరీ వచ్చింది.

మరో అక్కయ్యగారి ఊళ్ళో "గోబర్ గాస్" పెట్టటంలో

సాయం చేసింది. ఒక పిన్ని భర్త ఎటో వెళ్ళిపోయాడంటే, తీసుకువచ్చి చదువు చెప్పించి, ఉద్యోగం చేసుకునే ధైర్యాన్ని నింపింది. వ్యర్థాల నుంచి రకరకాల వస్తువులు చేయటంలాటివి అందరూ చేస్తారు. నేను జపాన్ వెళ్ళినప్పుడు నా పిల్లలిద్దరికీ పేపర్ నానేసి, ఆ గుజ్జుతో రకరకాల బొమ్మలు చేసి, చేయించింది. మా చెల్లి దగ్గరికి అమెరికా వెళ్ళినప్పుడు బంకమన్నుతో ఎన్నో వినాయకుడి విగ్రహాలు చేసిందట చవితికి. ఎక్కడెక్కడినుంచో వచ్చి తీసుకువెళ్ళారట. పెద్దమ్మలు, పిన్నిలు కూడా ఎన్నో రకాలు వూలుతో పనులు, పాత బట్టలతో కాళ్ళు తుడుచుకునే పట్టాలూ, కొయ్యబొమ్మలూ, వూలు బొమ్మలూ, మట్టి బొమ్మలూ, తాటాకు బొమ్మలూ చేస్తూనే ఉంటారు. ఒక పిన్ని పద్యాలూ, వ్యాసాలూ, కథలూ రాస్తుంటుంది. అవన్నీ లోకల్‌గా మాగ్ జైన్స్ లో ప్రచురణ అవుతుంటాయి. అమ్మకూడా ఎన్నో మరెన్నో చిన్న చిన్న పద్యాలు వ్రాసి, మా తమ్ముళ్ళకీ, చెల్లికీ నేర్పిస్తే, నేను వాళ్ళందరినీ వేసుకుని ఆదివారం రేడియోలో "బాలానందం"కి తీసుకెళ్ళేదాన్ని. "నువ్వెప్పుడూ, కొత్త కొత్తవి తెస్తావు, ఏదీ ఇలా తీసుకురా వాళ్ళని" అని, ముగ్గురికీ ఛాన్స్ ఇచ్చేవారు శారదా శ్రీనివాసన్ గారు. రచయిత్రి కాకని కమల, ఎన్.రాజేశ్వరి, అమ్మ పెద్దన్నయ్యగారి కుమార్తెలు. ప్రఖ్యాతి గాంచిన రచయిత శ్రీ కొండేపూడి సుబ్బారావుగారు, వైజాగ్, అమ్మ పెద్ద బావగారు. మా చినమామయ్య, తల్లాప్రగడ శంకరంగారు కూడా చాలా రచనలు చేసినవారే. అమ్మ కూడా "అక్షరమాలలు - పద్యతోరణములు" అనే పద్యసంకలనాన్ని ఇటీవలనే ప్రచురించటమైనది. ఇంకా శతకాలన్నింటినీ కూడా అక్షరక్రమంలో కూర్చే కార్యక్రమ్మలో బిజీగా ఉందిప్పుడు.

నా పెళ్ళి తరువాత మేమంతా తిరుపతి, షిరిడీ, పోచంపల్లి, నాగార్జు సాగర్, శ్రీశైలం, మంత్రాలయం, బాసర, రాజమండ్రి, కాకినాడ (కడియంలో మొక్కలు), ధవళేశ్వరం, కాటన్ దొర మ్యూజియంలాటి ప్రదేశాలెన్నో తిరిగాం. ముఖ్యంగా మా కాశీ యాత్ర చాలా మరుపురానిది. ఓ నలభై మందిమి వెళ్ళాం. రైలు బోగీ నిండింది. ఎంతో సరదాగా ఆ విశ్వేశ్వరుణ్ణి కొలిచాం. అమ్మ అక్కడ అందరిచేత "లింగాష్టకం" చేయించింది. అలహాబాదు, మరి చుట్టూ ఎన్నో ప్రదేశాలు తిరిగాం. హైదరాబాదులోని రామోజీ ఫిలిం సిటీ, శిల్పారామంలో సంక్రాంతికి "పతంగ్"ల పోటీకి వెళ్ళాం. జపాన్ నుంచి తెచ్చిన రంగు రంగుల "పతంగ్"లతో మా పిల్లలూ, ఇతర దేశాలనుంచి వచ్చిన పోటీ దారులతో ఎంతో ఎంజాయ్ చేసాం.

అమ్మ మొక్కలు మాత్రం ఎంతో ప్రాణంగా పెంచేది. తను కుండీల్లో రకరకాల రంగుల్లోని మందారాలు, గ్రీన్ గులాబీలాంటివి ప్రత్యేకమైన శ్రద్ధతో పెంచేది. పెంచుతోంది కూడా. అంత బాగా నర్సరీ వాళ్ళు కూడా పెంచరేమో!! మా ఆయన సరదాగా ఆటపట్టిస్తూ...



"అత్తయ్యగారు కూర్చోబెట్టి తలమీద కుండీ పెట్టి ఓ మొక్క వేసేస్తారు, జాగ్రత్త" అంటూ ఉండేవారు తను ఇంటినిండా మొక్కలు వేసేస్తుందని, పాత ప్లాస్టిక్ బక్కెట్స్‌తో సహా, కుండిలే కాకుండా. అప్ప ఆదివారం వస్తే చాలు ప్రొద్దున్నే అన్నీ మానేసి మొక్కల్లో దూరిపోయే అమ్మని ఉద్దేశించి "మంగా! ఆకలేస్తోంది, ఏదేనా వండటానికి లోపలికి వస్తావా! రావా!" అని కూకలేసేవారు. ఆఖరుకి, అమెరికాలో కూడా రేర్ వెరైటీస్ ఏవేనా కనిపిస్తే గబుక్కున చిన్ని సిజర్స్ తో చిన్న ముక్క కట్ చేసి బాగ్‌లో పెట్టేసుకుని ఇంటికి తెచ్చి నాటేసేదట, చిన్నపిల్లమాదిరి. అంత ఇంట్రెస్ట్ మొక్కలంటే.

నేను పూనా యూనివర్శిటీకి లెక్చరర్‌గా వెళ్ళినప్పుడు, ఆ తరువాత జపాన్, తైవాన్ వెళ్ళటానికి అమ్మే కారణం. అమ్మ, అప్ప వచ్చి మా ఇంట్లో

ఉండి మా పిల్లల్ని, మా వారిని చూసిపెట్టారు.

"నేను రిటైర్ అయ్యాను కదా, మీ ఇంట్లో వచ్చి ఉంటాను నువ్వు వెళ్ళి రా" అని ప్రోత్సహించి, అందరినీ కన్విన్స్ చేసింది. మా పిల్లల్ని ఎంతో ముద్దుమురిపాలతో పెంచారిద్దరూ. నేను ఎన్నటికీ అమ్మకి ఋణపడే ఉంటాను ఈ విషయంగా! అయితే ఇది కూడా తను సాధించిన మరో ఘనతే!!

ఇలా చెబుతూ పోతే ఎన్నో విశేషాలు. అస్సలు విసుగూ, విరామం లేకుండా అలా నవయవ్వనిలా పనిచేస్తూనే ఉండే మా అమ్మగారు అందరికి కూడా చాలా ఉత్సాహాన్ని, ప్రేరణనూ కలిగిస్తూ ఉంటుంది. "క్వాలిటీ కాంప్రమైజ్" కాదు. అందుకే ఆ మన్నన, గౌరవం తనకి. "ఎవరో ఏదో అనుకుంటారని కాదు మనం కరెక్ట్ అనుకుంటే, ధైర్యంగా చేయాలి" అని అంటుంది, ఆచరిస్తుంది. మా అందరిళ్ళల్లో, కుటుంబాల్లో అమ్మది ఒక ప్రత్యేక స్థానం, ప్రేరణ, ఒక iconic figure అమ్మ.

ఇప్పుడు 73 ఏళ్ళ వయస్సులో Harmony-casio వాయిస్తూ చిన్నపిల్లలకి కర్ణాటక సంగీతం, పెద్దలకి భజనలూ, కీర్తనలూ ఎంతో ప్రేరణోపేతంగా తన "జ్ఞాన సుందరి సంగీత పాఠశాల" లో నేర్పుతోంది. ముంబాయ్ లో మా తమ్ముడు వాళ్ళదగ్గర. వాళ్ళ పిల్లలిద్దరూ, అమ్మ మొన్న జరిగిన "అన్నమయ్య లక్షగళాలు " గిన్నీస్ రికార్డ్‌కి వచ్చి పాడి వెళ్ళారు. అందుకే తను చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా కూడా ఉంటోంది.

అమ్మంటే ప్రేమని పంచి, సహనం చూపేదే కాదనీ, దారి చూపి, సూచనలిచ్చి, స్ఫూర్తినింపి, ప్రేరణ కలిగించేదని చాటిన మహోన్నత వ్యక్తిత్వం ఆమెది. ఇలా కౌముది ద్వారా తలచుకోవటం నా అదృష్టం!



రసాయన శాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకున్న స్వర్ణబాల గారు, ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. వివిధ సంస్థలకి క్వాలిటీ డాక్యుమెంటేషన్ చేస్తుంటారు. లూసిడ్ ల్యాబ్స్‌లో క్వాలిటీ మేనేజర్‌గా కూడా ఉన్నారు. తెలుగు సాహిత్యం అంటే మక్కువ. కూచిపూడి నృత్యంలో డిప్లమో చేశారు.